అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 25-02-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 55

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

14 పేజీలు వెల : 6.50

మండే..



రూ.4 లక్షల కోట్ల సంపద ఆవిరి

మార్కెట్లలో ఆరని ట్రంప్ కుంపటి

సెన్సెక్స్ 856 పాయింట్ల పతనం

ముంబయి : ట్రంప్ టారిఫ్‌ల కుంపటి భారత స్టాక్ మార్కెట్లను మండేలా చేస్తూనే ఉంది. ఎఫ్ఐఐలు తరలిపోవడం, ఐటీ, టెలికం, లోహ షేర్లలో ఒత్తిడితో సోమవారం సెషన్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 856.65 ...13లో

మోగిన ఎమ్మెల్సీ ఎన్నికల నగారా

మార్చి 20న ఎలక్షన్.. అదే రోజు ఫలితాలు

తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో చెరో ఐదు స్థానాలకు పోరు : కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. మార్చి 20న ఎన్నిక జరగగా అదే రోజు ఫలితాలు వెల్లడవుతాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలంగాణలో ఐదు, ఆంధ్రప్రదేశ్‌లో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలో మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, సెరి సుభాష్ రెడ్డి, మల్లేశం యాగీ, మీర్జా రియాజుల్ హసన్ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. ఏపీలో జంగా కృష్ణమూర్తి (2024 మే 15 నుంచి ఖాళీ), దువ్వారపు రామారావు, పర్చూరి అశోక్ బాబు, బి. తిరుమల నాయుడు, యనమల రామకృష్ణుడు పదవీ కాలం ...13లో

ఉపాధికి కేంద్రం షాక్

అదనపు నిధుల విడుదలకు మోడీ సర్కారు నో



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) కోసం 2025 ఆర్థిక సంవత్సరానికి అదనపు నిధులను విడుదల చేయకూడదని కేంద్రం నిర్ణయించి ంది. ఈ నిర్ణయం వెనుక కారణం ఏమిటంటే.. ప్రభుత్వం రూ. 86 వేల కోట్ల వ్యయం ఏడాదికి సరిపోతుందని చెప్తున్నది. ఈ ఏడాది కేటాయింపు నుంచి దాదాపు రూ. 7,500 కోట్ల ఖర్చు చేయని మొత్తం మిగిలిన కాలాన్ని కవర్ చేస్తుందని ...6లో



బరిలో ఎందుకులేరు?

బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

ఫోన్‌ట్యాపింగ్‌లో కేసీఆర్, కేటీఆర్‌ను కాపాడుతుంది బీజేపీనే..

రాష్ట్రానికి మోడీ ఇచ్చిందేమీ లేదు..8 మంది ఎంపీలు ఉండి దండగే

- ఉప ఎన్నికల కోసం బీఆర్ఎస్ కలలు
- ఫామ్‌హౌస్ నుంచి కుట్రలు
- పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందం
- రాష్ట్రానికి నిధులు రాకుండా అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి
- భావోద్వేగాలు రెచ్చగొట్టి వీధినాటకాలు ఆడటమే బీజేపీ పని
- చెప్పిన పనులు చేశాం.. చేస్తున్నాం ప్రజా సంక్షేమమే మా లక్ష్యం : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్/కంఠేశ్వర్/ఆదిలాబాద్, కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధులు/మంచిర్యాల

'ఉపఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయం అని కేటీఆర్, హరీశ్‌రావు అంటున్నారు. అసలు ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు పోటీలో లేరో చెప్పాలి. ఉన్న ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉప ఎన్నికల కోసం బీఆర్ఎస్ కలలు కంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ప్రభుత్వం కూలింది. పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ తరపున నిలబెట్టేందుకు అభ్యర్థులే కరువయ్యారు. అసలు మీ ఉద్దెర పంచాయితీ ఏంటీ..? ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని అంటున్నారు.. ఎవరికి ఓటు వేయాలని చెప్తారు. బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందమేంటో ప్రజలందరికీ తెలుసు.. ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్ కుట్రలకు దిగుతున్నారు..' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం నిజామాబాద్, కరీంనగర్, మంచిర్యాలలో పర్యటించారు. ఆయా సభల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను కోరారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంలో పట్టభద్రులు, నిరుద్యోగులు, విద్యార్థులు ముందుండి ఉద్యమాన్ని నడిపించారు. కానీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి పదేండ్ల కాలంలో వారికి చేసిందేమీ లేదు. పదేండ్ల కాలంలో వారు 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలే. నిరుద్యోగులంతా అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో కోచింగ్ సెంటర్ల చుట్టూ అనాథల లెక్క తిరిగారు. అయినా గత ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేయలే. ఒకవేళ వేసినా.. కోర్టులో వారే కేసులు పెట్టుకుంటూ ఉద్యోగాల భర్తీని అడ్డుకుంటుండే. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలం లోనే 50 వేల ఉద్యోగాలు కల్పించాం. 11 వేల టీచర్ పోస్టులు, 15 వేల పోలీస్ కొలువులు, 6 వేల వైద్య సిబ్బంది నియామకం చేపట్టాం. అనేక డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగాల భర్తీ చేపట్టాం. ఉద్యోగాలు భర్తీ చేసినట్టయితేనే కాంగ్రెస్‌కు ...5లో

లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్

పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అనుకూలం : అమ్జెన్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి 6లో..

టన్నెల్‌లో స్నిపర్ డాగ్‌ల సేవలు

రంగంలోకి ర్యాట్ హోల్‌మైనర్స్



దెబ్బతిన్న కన్వర్‌కు మరమ్మతులు

ఎస్ఎల్‌బీసీ వద్ద కొనసాగుతున్న హైటెన్షన్

సిబ్బందిని రక్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు

తోడిన కొద్దీ వస్తున్న ఊట

సొరంగంలోకి నేవీ, ఆర్మీ, హైడ్రా టీమ్‌లు

ప్రమాదంపై కేటీఆర్ చిల్లర మాటలు మానుకోవాలి : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

"ఆధునిక టెక్నాలజీతో టన్నెల్‌లో ఇరుక్కున్న నలుగురు కార్మికులు, ఇద్దరు సైట్ ఇంజినీర్లు, ఇద్దరు ఆపరేటర్లను కాపాడటానికి ప్రయత్నం చేస్తున్నాం.. తోడిన కొద్దీ ఊట నీరు, ఒండ్రు మట్టి రావడంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. ప్రాణాలను ఫణంగా పెట్టి రక్షణ సిబ్బంది టన్నెల్‌లో సహాయక చర్యలు తీసుకుంటున్నారు" అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు జానారెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఆయన టన్నెల్ ప్రమాద తీవ్రతను పరిశీలించారు. అధికారులు, సాంకేతిక సిబ్బందితో సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఎస్-ఎల్‌బీసీ సొరంగ మార్గంలో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటికి తీసేందుకు కేంద్ర, రాష్ట్ర విపత్తు బృందాలతో పాటు నేవీ, ఆర్మీ, సింగరేణి, కేంద్ర ప్రభుత్వ రహదారుల విభాగం జేపీ నవయుగాకు చెందిన ఉన్నతాధికారుల బృందం ఇప్పటి వరకు ఏడు సార్లు టన్నెల్‌లో పరిశీలించింది. అక్కడ హైటెన్షన్ నెలకొంది. వారి వెంట 584 మంది నిపుణులైన సిబ్బంది ఉన్నారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన ...6లో

నర్సిరెడ్డి - అశోక్ కుమార్‌ను ఎమ్మెల్సీలుగా గెలిపించండి





ఓటర్ల ఆత్మగౌరవాన్ని కాపాడండి : ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల సంయుక్త ప్రకటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 27న జరగబోతున్న శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్న వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్ యర్రగుంటను మొదటి ప్రాధాన్యత ఓట్లతో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు కోరాయి. ఈ ఎన్నికల్లో ఓటర్ల ఆత్మగౌరవాన్ని కాపాడాలనీ, ప్రలోభాలకు లోనుకావొద్దని విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులు చావ రవి, ఎ వెంకట్ (టీఎస్‌యూటీఎఫ్), సిహెచ్ అనిల్ కుమార్, ఎస్ తిరుపతి (టీపీటీఎఫ్), కొప్పిశెట్టి సురేష్, వస్కుల శ్రీనివాస్ (టీజీజేఎల్ఏ), మామిడి నారాయణ (గురుకుల జేఏసీ), ఎం రామేశ్వర్ రావు, శ్రీధర్ కుమార్ లోధ్ (టీఏయూసీటీఏ), జి భాస్కర్, టి నవీన్ (టీపీఎల్ఏ), బి కొండయ్య, ఎస్ మహేశ్ (టీఎస్ఎంఎస్‌టీఎఫ్), ఎస్ శ్యామ్ కుమార్, ఎన్ ముత్తయ్య (టీ గురుకులం), శాగ కైలాసం, చింతా రమేష్ (ఎస్సీ,ఎస్టీటీయూ), జాదవ్ వెంకట్రావు, దూడ రాజనర్సు బాబు (ఎస్సీ,ఎస్టీటీఏ), జాడి రాజన్న, మేడి చరణ్ దాస్ (ఎస్సీ,ఎస్టీటీఎఫ్), మహమ్మద్ మసూద్ అహ్మద్, ముజీబుర్ రహమాన్ (టీయూటీఏ), కె సంజీవ్, ఎ పద్మ (టీఆర్ఈఐటీఏ), డి ఎల్లయ్య, ఎస్ శశిధర్ (సోషల్ వెల్ఫేర్), బి సురేంద్ర, వి హరీందర్ రెడ్డి (ట్రైబల్ వెల్ఫేర్), జి రాంబాబు, ఎం మహేష్ (మైనార్టీ వెల్ఫేర్), ...13లో

మిర్చి రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి

క్వింటాల్‌కు రూ. 25వేలతో కొనుగోలు చేయాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి • వరంగల్‌లోని ఎనుమాముల మార్కెట్ సందర్శన • సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ



నవతెలంగాణ-కాశిబుగ్గ

మిర్చి మార్కెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని మార్క్ ఫెడ్ ద్వారా క్వింటాకు రూ. 25వేలతో కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డును నాయకులు ఇసంపల్లి బాబు, గాదె ప్రభాకర్ రెడ్డి, ఎం. చుక్కయ్య, ఎండీ బషీర్‌తో కలిసి ఆయన సందర్శించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. మిర్చి పంట పండించేందుకు ఎకరానికి సుమారు రూ. లక్షా 50వేలు ఖర్చు వస్తుండగా దిగుబడి మాత్రం 10 నుంచి 20 క్వింటాళ్ల మాత్రమే వస్తుందని అన్నారు. మిర్చి ధర మాత్రం రూ. 10వేల నుంచి రూ.12వేలు మాత్రమే పలుకుతుందని తెలిపారు. ముందు రోజు కంటే సోమవారం వ్యాపారులు దాదాపు రూ.1500 ధర తగ్గించారని ...6లో

విదేశీ సాయంపై కాషాయ నేతల గగ్గోలు

పరస్పర ఆరోపణల్లో పాలక ప్రతిపక్షాలు

యూఎస్ ఎయిడ్ సంస్థ విదేశాలకు అందిస్తున్న ఆర్థిక సాయంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిషేధం విధించిన నేపథ్యంలో దేశంలో మొదలైన రాజకీయ తుపాను ఇంకా శాంతించలేదు. భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు యూఎస్ ఎయిడ్ నిధులు ఇస్తోందని ట్రంప్ ఆరోపించిన విషయం తెలిసిందే. అంతేకాక ఆ సంస్థకు ఇస్తున్న గ్రాంట్లను ఆయన నిలిపివేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో విజయం కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విదేశీ సాయం కోరిందంటూ బీజేపీ తీవ్రమైన ఆరోపణలు చేస్తోంది. బీజేపీ చేసిన తాజా ఆరోపణలపై కాంగ్రెస్ దీటుగానే స్పందించింది. గతంలో ప్రభుత్వాలను అస్థిరపరచేందుకు బీజేపీ విదేశీ నిధులను వాడిందంటూ ప్రత్యారోపణ చేసింది. ఈ వ్యవహారంపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తోంది.



యూఎస్ ఎయిడ్ నుంచి కేంద్రం, బీజేపీ పాలిత రాష్ట్రాలకు సాయం

స్వచ్ఛ భారత్‌కూ నిధులిచ్చిన అమెరికా సంస్థ

వాస్తవాలు కప్పిపుచ్చి ప్రతిపక్షాలపై బురద చల్లే ప్రయత్నం

న్యూఢిల్లీ : ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలకు ఇప్పుడో ఆయుధం దొరికింది. అయితే యూఎస్ ఎయిడ్ నిధులను నిలిపివేయడంతో దేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతాయని నిపుణులు హెచ్చరించారు. గర్భిణులు, శిశువుల ఆరోగ్య పరిరక్షణ, టీబీ నివారణ, కుటుంబ నియంత్రణ, హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై పోరు వంటి అనేక ముఖ్యమైన ప్రాజెక్టులకు యూఎస్ ఎయిడ్ నిధులు ఉపయోగపడుతున్నాయని రికార్డులు చెబుతున్నాయి. అంతేకాక దేశంలో విద్య, వాతావరణ మార్పులు వంటి అంశాల్లో ప్రభుత్వం చేపడుతున్న పలు చర్యలకు కూడా ఆ సంస్థ సాయపడుతోంది. ఈ ప్రాజెక్టులు, చర్యలు బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు కేంద్రంలోనూ అమలవుతున్నాయి. అయినప్పటికీ బీజేపీ నేతలు మాత్రం ఈ వాస్తవాలను చెప్పకుండా 'విదేశీ జోక్యం' అంటూ గగ్గోలు పెడుతున్నారు.

ఆరోగ్య ప్రాజెక్టుపై ప్రభావం

యూఎస్ ఎయిడ్ నిధుల నిలిపివేత దేశంలో అమలవుతున్న ఆరోగ్య ప్రాజెక్టులపై ప్రభావం చూపుతుందని స్టాప్ టీబీ పార్టనర్‌షిప్ బోర్డు సభ్యుడు సుబ్రత్ మొహంతి ఆందోళన ...5లో




యూఎస్ ఎయిడ్ ఉద్యోగులపై ట్రంప్ వేటు

1600 మంది ఇంటికి

మరి కొందరికి నిరవధిక వేతన సెలవు

వాషింగ్టన్ : ట్రంప్ ప్రభుత్వం యూఎస్ ఎయిడ్ సంస్థపై కక్ష కట్టినట్టు కన్పిస్తోంది. ఆ సంస్థ అందిస్తున్న విదేశీ సాయాన్ని ఇప్పటికే నిలిపివేసిన ప్రభుత్వం...తాజాగా ఉద్యోగులపై వేటు వేసింది. 1,600 మందిని ఇంటికి సాగనంపింది. అమెరికా వెలుపల పనిచేస్తున్న కొందరికి నిరవధిక వేతన సెలవు మంజూరు చేసింది. ఇప్పుడు ఆ కార్యాలయంలో కీలక విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మాత్రమే మిగిలారు. సిబ్బందిని కుదించాలన్న చర్య కారణంగా ...5లో



విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జూన్ 26న దేశవ్యాప్త సమ్మె

నాగ్‌పూర్ విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్ల జాతీయ సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ : విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జూన్ 26న ఉద్యమించాలని నాగ్‌పూర్‌లో జరిగిన విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్ల జాతీయ సమావేశం నిర్ణయం తీసుకున్నది. పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా ...13లో

అపరిష్కృత సమస్యలు వెంటనే పరిష్కరించాలి



రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల ఆందోళన

కలెక్టరేట్ల వద్ద నిరసన

హైదరాబాద్‌లో సమాచారభవన్ వద్ద కార్డులతో టీడబ్ల్యూజేఎఫ్ ప్రదర్శన

కమిషనర్‌కు ఫెడరేషన్ నేతల వినతి 13లో

కృష్ణా నీటివాటాలపై కేఆర్ఎంబీలో చర్చ

ప్రత్యేకంగా ఇరు రాష్ట్రాల ఈఎన్సీల భేటీ

కమిటీ సైతం ఏర్పాటు

శ్రీశైలం నీళ్లు తెలంగాణకే దక్కాలన్న ఈఎన్సీ

రేపు ఎన్ఎస్‌పీకి వెళ్లనున్న ఏపీ ఈఎన్సీ

ఎల్లుండి మళ్లీ కేఆర్ఎంబి సమావేశం 13లో..





భగత్‌సింగ్ త్యాగం యువతకు ఆదర్శం

మార్చి 23 వరకు భగత్‌సింగ్ యువజన ఉత్సవాలు : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ త్యాగం దేశంలోని యువతకు ఆదర్శమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు అన్నారు. ఈనెల 23న ప్రారంభమైన భగత్‌సింగ్ యువజన ఉత్సవాలు వచ్చేనెల 23 వరకు జరుగుతాయనీ, వాటిని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ-డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ యువజన ఉత్సవాల జయ ప్రదం కోసం సోమవారం హైదరా బాద్‌లో ఆహ్వానసంఘం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయమని అన్నారు. విద్యార్థులు, యువకులు ఆద ర్శంగా తీసుకోవాలని కోరారు. విద్యా ర్థులు, యువత గంజాయి, డ్రగ్స్ నిర్మూ లన కోసం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ చేసే పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ యువజన ఉత్సవాల సందర్భంగా నెలరోజులపాటు సదస్సులు, క్రీడలు, బహుముఖ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు.

ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ యువజన ఉత్సవాల ఆహ్వాన సంఘాన్ని ఎన్నుకున్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా డీవైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి జెకె శ్రీనివాస్, చైర్మెన్‌గా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ జావేద్, కోశాధికారిగా అశోక్‌రెడ్డిలతో పాటు మహేందర్, శ్రీనివాసరావు, ఎం వెంకటేష్, టి మహేందర్, వీరయ్య, లెనిన్, హస్మిబాబు, రమ్య, హస్మిత, శ్రీమాన్, స్టాలిన్, నాగేందర్, దేవేందర్, రాజయ్య, ప్రశాంత్, సహన తదితరులని ఆహ్వాన కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

నేటినుంచి ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ

తుది గడువు ఏప్రిల్ 4

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో మంగళవారం సాయంత్రం 4.45 గంటల నుంచి ప్రారంభం కానుంది. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు తుది గడువు ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఉన్నది. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయి. ఇతర వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. ఈనెల 20న ఎప్‌సెట్ నోటిఫికేషన్‌ను కన్వీనర్ బి డీన్‌కుమార్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులు దరఖాస్తు ఫీజు రూ.500, ఇతరులు రూ.900 చెల్లించాల్సి ఉంటుంది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రెండు పరీక్షలకూ హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులు రూ.వెయ్యి, ఇతరులు రూ.1,800 చెల్లించాలి. ఆలస్య రుసుం రూ.250తో ఏప్రిల్ తొమ్మిది వరకు, రూ.500తో అదేనెల 14 వరకు, రూ.2,500తో ఏప్రిల్ 18 వరకు, రూ.ఐదు వేలతో అదేనెల 24 వరకు దరఖాస్తులను సమర్పించేందుకు అవకాశమున్నది. రూ.2,500, రూ.ఐదు వేల ఆలస్య రుసుం చెల్లించే అభ్యర్థులకు హైదరాబాద్‌లోని జోన్-4లోని పరీక్షా కేంద్రాలను కేటాయిస్తారు. పరీక్షా కేంద్రాలుండే జోన్లు తెలంగాణలో 16, ఆంధ్రప్రదేశ్‌లో రెండు కలిపి మొత్తం 18 ఉన్నాయి. ఏపీలో విజయవాడ, కర్నూల్ జోన్లలో ఎప్‌సెట్ పరీక్షా కేంద్రాలుంటాయి.

ఏఐ సిటీలో పెట్టుబడులు పెట్టండి

క్వీన్స్‌లాండ్ ప్రతినిధులకు మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయబోతున్న 'ఏఐ సిటీ'లో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా - క్వీన్స్ లాండ్ ప్రభుత్వ ప్రతినిధులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఆ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి 'రాసిన్ బేట్స్' ఆధ్వర్యంలోని బృందం సోమవారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ఆయనను కలిసింది. ఈ సందర్భంగా 'తెలంగాణ-క్వీన్స్‌లాండ్' మధ్య ప్రాధాన్య రంగాల్లో సంబంధాలను మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చలు జరిపారు.

జీవ విజ్ఞానం, ఔషధ తయారీ రంగంలో అగ్రగామిగా ఉన్న తెలంగాణతో కలిసి పని చేసేందుకు ప్రతినిధుల బృందం ఆసక్తి వ్యక్తం చేసిందని శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే క్రీడా విశ్వ విద్యాలయానికి సహకరించాలని కోరగా అంగీకరించారని చెప్పారు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటును ప్రత్యేకంగా అభినందించారనీ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన కోర్సులపై వారు ఆసక్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు.

విద్య, ఆర్అండ్‌డీ, వ్యవసాయం తదితర అంశాల్లో కలిసి పని చేయాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో క్వీన్స్ లాండ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సీఈవో జస్టిన్ మెక్ గవాన్, ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ హిల్లరీ మెక్ గెచీ, పాలసీ రీసెర్చ్ అసోసియేట్ కృతికా సుబ్రహ్మణ్యన్, ట్రేడ్ కమిషనర్ అభినవ్ భాట్ల, మనీష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే బీఆర్ఎస్ స్కాంలన్నీ సీబీఐకి అప్పగించండి


చీకటి ఒప్పందాలు చేసుకుని మాపై బురద చల్లుతారా? : కేంద్ర మంత్రి బండి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దమ్ముంటే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కామ్‌లన్నింటినీ సీబీఐకి అప్పగించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ సవాల్ విసిరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ రాష్ట్ర ప్రభుత్వం చేయిస్తున్నదనీ, దోషులను కేంద్ర ప్రభుత్వం ఎలా అరెస్టు చేస్తుంది? అని ప్రశ్నించారు. సీబీఐకి కేసులను అప్పగిస్తే దోషులను బొక్కలో వేయించే బాధ్యత తమదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతున్నామనే భావన సీఎం రేవంత్‌రెడ్డిలో స్పష్టంగా కనిపిస్తున్నదని విమర్శించారు. సర్వేలన్నీ కాంగ్రెస్ కు 3వ స్థానమేనని తేల్చేశాయని పేర్కొన్నారు. రాష్ట్ర సర్కార్ కు ధోకా లేకుంటే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి ఎందుకొచ్చినట్టు అని ప్రశ్నించారు. 51 శాతమున్న బీసీలను 46 శాతానికి తగ్గించి బుకాయిస్తారా? అని నిలదీశారు. బీసీ జాబితాలో ముస్లింలందరినీ కలిపి బీసీలకు అన్యాయం చేస్తూ కూడా మేలు చేసినట్టు అబద్దాలాడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలన్నీ అబద్దాలు, అర్ధ సత్యాలు అని కొట్టిపడేశారు. చరిత్రలో ఇంతవరకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఏ ముఖ్యమంత్రి కూడా పాల్గొన్న దాఖలాలు లేవని గుర్తుచేశారు. ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్, గొర్రెల స్కాంలపై సీఎం మాట్లాడిన వ్యాఖ్యలు చూస్తే... ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నారా? లేక మేము ఉన్నామా? అనే అనుమానం వస్తోందని తెలిపారు.

ఆధార్ చూపిస్తేనే వైద్యం అందజేయడంపై హైకోర్టు విచారణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో ఆధార్ చూపిస్తేనే వైద్యం అందజేస్తున్నారనే పిల్‌ను హైకోర్టు సోమవారం విచారించింది. లాయర్ బి శ్రీనివాస్‌రెడ్డి వేసిన పిల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. ఒక మహిళ ఉస్మానియా ఆస్పత్రికి వెళ్తే ఆధార్ కార్డు చూపలేదంటూ వైద్యం చేయలేదని లాయర్ వివరించారు. భర్త చనిపోవడంతో చిన్న కుమార్తెతో ఆస్పత్రికి వెళ్లిన ప్రమీలకు వైద్యం అందజేయలేదన్నారు. ఈ వాదనను రాష్ట్ర ప్రభుత్వం ఖండించింది. ఆధార్ లేకపోయినా ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించింది. వివరాలు తెలుసుకుని చెప్పాలని కోరిన హైకోర్టు విచారణను వచ్చేనెల రెండో తేదీకి వాయిదా వేసింది.

హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా ఈర్లపల్లిలో భూ వివాదంపై చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయనతోపాటు కుటుంబసభ్యులు కూడా వేసిన పిటిషన్‌ను జస్టిస్ లక్ష్మణ్ సోమవారం విచారించారు. ఈ కేసును కొట్టేయాలనే పిటిషన్‌ను ఇటీవల హైకోర్టు డిస్మిస్ చేసింది. దీంతో ఆశన్నగారి జీవన్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. పోలీసుల వివరణ నిమిత్తం విచారణను వచ్చే నెల మూడో తేదీకి వాయిదా పడింది.

తీర్పు రిజర్వు

మేడిగడ్డ కుంగుబాటుకు నాటి సీఎం కేసీఆర్, నాటి ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు, ఇతరులు కారణమంటూ దాఖలైన ప్రయివేటు ఫిర్యాదుపై కింది కోర్టు విచారణను కొట్టేయాలంటూ వాళ్లిద్దరూ వేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. వాదనలు పూర్తి కావడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ కె లక్ష్మణ్ చెప్పారు. రాజలింగమూర్తి అనే వ్యక్తి చేసిన ఫిర్యాదును భూపాలపల్లి మెజిస్ట్రేట్ కోర్టు కొట్టేయడంతో జయశంకర్ భూపాలపల్లి ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి కోర్టులో రివిజన్ పిటిషన్ వేశారు. జిల్లా జడ్జి విచారణ చేస్తామని చెప్పి కేసీఆర్, హరీష్‌లకు నోటీసులు ఇచ్చారు. వాటిని కేసీఆర్, హరీష్ సవాల్ చేసి పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేస్తుండగానే రాజలింగమూర్తి మరణించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి లేనప్పుడు కేసు విచారణ చేయాలో లేదో అనే అంశంపై హైకోర్టు తీర్పు చెప్పనుంది.

కాంగ్రెస్ పాలనలో మళ్లీ యూరియా కష్టాలు

మాజీ మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా విమర్శించారు. "మొన్న మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేస్తే.. నేడు జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన పరిస్థితి. ఉమ్మడి రాష్ట్రంలోని రైతుల కన్నీళ్ల కడగండ్లను కాంగ్రెస్ సర్కార్ పునరావృతం చేస్తున్నది. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. రైతు డిక్లరేషన్, రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్ పేరుతో మోసం చేసారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు పెట్టిస్తున్నరు. ఇప్పటికైనా కండ్లు తెరిచి రైతాంగానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

సాక్షుల వాంగ్మూలాలే చార్జిషీట్ !

నిర్దిష్ట ఆధారాలు సేకరించలేకపోయిన పోలీసులు

ఐదు సంవత్సరాల క్రితం దేశ రాజధాని న్యూఢిల్లీలో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారి 53 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వీరిలో మూడింట రెండు వంతుల మందికి పైగా ముస్లింలే. ఇదో పెద్ద కుట్ర కేసు అని ఢిల్లీ పోలీసులు చెప్పుకొచ్చారు. 30 వేల పేజీలతో ఐదు చార్జిషీట్లు దాఖలు చేశారు. వాటిని 'స్క్రోల్' పోర్టల్ నిశితంగా పరిశీలించింది. ఎనిమిది మంది డిఫెన్స్ లాయర్లను ఇంటర్వ్యూ చేసి వారి అభిప్రాయాలు సేకరించింది. సాక్షులిచ్చిన స్టేట్‌మెంట్లలో తేడాలు ఉన్నాయని గుర్తించింది. పేలవమైన ఆధారాలతో నిరసనలకు దురుద్దేశాలు ఆపాదించి, అమాయకులను కేసులో ఇరికించారని తేల్చింది.

ఏం జరిగింది?

నేటికీ ప్రారంభం కాని విచారణ
జైలులోనే మగ్గిపోతున్న నిందితులు
ఢిల్లీ అల్లర్ల కేసుకు ఐదేండ్లు

న్యూఢిల్లీ : 2020 ఫిబ్రవరి 24న ఈశాన్య ఢిల్లీలో మతపరమైన హింసాకాండ చెలరేగింది. పౌర సత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకించే వారికి, మద్దతు ఇచ్చే వారికి మధ్య ఘర్షణలు జరిగాయి. చట్టాన్ని వ్యతిరేకించిన వారిని ఉద్దేశించి అధికార బీజేపీకి చెందిన కొందరు నేతలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేశారని, దీంతో అల్లర్లు మొదలయ్యాయని కొందరు ఆరోపించారు. బీజేపీ నాయకులు అనురాగ్ ఠాకూర్, కపిల్ మిశ్రా, పర్వేష్ వర్మ, అభయ్ వర్మ...ఈ నలుగురూ విద్వేష ప్రసం గాలు చేశారని 2020 ఫిబ్రవరి 26న ఢిల్లీ హైకోర్టు జడ్జి ఒకరు వ్యాఖ్యానిం చారు. అయితే ఢిల్లీ పోలీసులు వారిని వదిలేసి 20 మందిపై అత్యంత క్రూరమైన చట్ట వ్యతిరేక కార్య కలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేసులు పెట్టారు. ఈ 20 మందిని వివిధ సందర్భాలలో అరెస్ట్ చేశారు. ఇది జరిగి ఐదు సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా వీరిలో 12 మంది (అందరూ ముస్లింలే) ఇప్పటికీ జైలులో ఊచలు లెక్కబెడుతూనే ఉన్నారు. వీరిపై విచారణ నేటికీ ప్రారంభం కాలేదు.

ఇవేం చార్జిషీట్లు ?

క్షేత్ర స్థాయి వాస్తవాలతో నిమిత్తం లేకుండా నిందితులపై పోలీసులు చార్జిషీట్లు దాఖలు చేశారు. ఎలాంటి ప్రాతిపదికలు కానీ, ఆధారాలు కానీ లేకుండా అభియోగాలు మోపారు. చట్టబద్ధమైన నిరసనలకు, ఉగ్రవాదానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చెరిపేశారు. వాట్సప్, ఫేస్‌బుక్‌లో నిందితులు పెట్టిన పోస్టులనే పోలీసులు ఆధారాలుగా చూపడం గమనార్హం. కొందరు సాక్షుల వాంగ్మూలాల పైనే ప్రాసిక్యూషన్ ఎక్కువగా ఆధారపడింది. అయితే వారెవరో బహిర్గతం చేయలేదు. హింసకు సంబంధించి నిందితులపై ఎలాంటి ప్రత్యక్ష ఆధారాలను ప్రాసిక్యూషన్ సంపాదించలేకపోయింది. కేవలం ఊహాజనితంగా ఓ పెద్ద కుట్ర జరిగిపోయిందంటూ ఆరోపణలు మాత్రం చేసింది. కొందరు సాక్షులు చేసిన మౌఖిక ఆరోపణల ఆధారంగానే నిందితులపై కేసులు మోపారని పలువురు న్యాయవాదులు తెలిపారు. కేసుకు బలం చేకూర్చే ఎలాంటి నిర్దిష్ట ఆధారాలు లేవు. ఏ ఒక్క నిందితుడి నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకోలేదు. హింస జరిగిన ప్రాంతాలలో ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తే వాటిలో నిందితులెవ్వరూ కన్పించలేదు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిందితులు ప్రదర్శనలు ఏర్పాటు చేశారని, నిరసన తెలిపారని మాత్రమే ప్రాసిక్యూషన్ ఆధారాలతో సహా చెప్పగలిగింది. వాట్సాప్ గ్రూపుల మధ్య జరిగిన చాటింగులు, సోషల్ మీడియా పోస్టులను గమనిస్తే అసలు నిరసనలకు హింసారూపం ఇవ్వాలన్న యోచన ఏదీ ఆందోళనకారుల్లో కన్పించలేదు. చార్జిషీట్ ఓ కథనంలా సాగిందే తప్ప స్పష్టమైన ఆధారాలతో ముగింపు ఇచ్చే విధంగా లేదని ఓ న్యాయవాది వ్యాఖ్యానించారు. నిర్దిష్ట ఆధారాలేవీ లభించకపోవడంతో ప్రాసిక్యూషన్ సాక్షుల వాంగ్మూలాల పైనే ఎక్కువగా ఆధారపడింది. అయితే అవి నిందితులను అరెస్ట్ చేసిన నెలల తర్వాత నమోదు చేసినవి. నిరసనకారులకు క్రిమినల్ ఉద్దేశాలు ఆపాదించేందుకు వాటిని ఉపయోగించుకున్నారు. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమంటే సాక్షుల వాంగ్మూలాలలో అనేక వ్యత్యాసాలు కన్పిస్తున్నాయి. వారి సాక్ష్యాల మధ్య పొంతనే కన్పించలేదు. ఇలాంటి సాక్ష్యాలను కుట్ర అభియోగాలకు ప్రాసిక్యూషన్ ప్రాతిపదికగా తీసుకుంది.

డిఫెన్స్ న్యాయవాదులు ఏమన్నారంటే...



పోలీసులే వాంగ్మూలాలను తయారు చేసి సాక్షులతో చెప్పించారని డిఫెన్స్ న్యాయవాదులు ఆరోపించారు. చార్జిషీట్లను 'పేలవమైన స్క్రిప్టులు'గా వారు అభివర్ణించారు. ప్రాసిక్యూషన్ చాలా గొప్ప వాదనలు చేసిందని, కానీ వాటికి మద్దతుగా ఎలాంటి ఆధారాలు చూపలేకపోయిందని చెప్పారు. 'నిరసన ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, నిర్వహించడం పౌరుల ప్రాథమిక హక్కు.అలాంటి వాటిని కుట్రకు ఆధారాలుగా చూపారు' అని ఎద్దేవా చేశారు. నిరసనకారులను అల్లరిమూకగా చూపారని ఓ డిఫెన్స్ న్యాయవాది తెలిపారు. నిందితులు జైలు గోడల నుండి బయటికి రాకుండా చేయడానికే ఉపా చట్టాన్ని ఓ ఆయుధంగా వాడుతున్నారని న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఆరోపణలే ఎదుర్కొంటున్న నిందితులపై ఉపా యేతర కేసులు పెట్టినప్పుడు వారు సులభంగా బెయిల్ పొందుతున్నారు. కానీ ఉపా కింద అదే తరహా కేసులు ఎదుర్కొంటున్న వారు మాత్రం బెయిల్ పొందలేకపోతున్నారు. ఈ కేసులో 12 మంది నిందితులపై ఇంకా అభియోగాలు మోపనేలేదు. వారు ఐదేళ్లుగా జైలులో మగ్గిపోతూనే ఉన్నారు.

కొందరు నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లు మూడు సంవత్సరాలుగా హైకోర్టులో పెండింగ్‌లో ఉండడం గమనార్హం. కొందరు మాత్రం వేర్వేరు కారణాలతో బెయిల్ పొంది జైలు నుంచి బయటపడ్డారు.

ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు

- హర్యానాలో అధికం
- తర్వాత స్థానంలో మణిపూర్

రెండు రాష్ట్రాల్లో 1700 గంటల పాటు అంతరాయం :ఎస్ఎఫ్ఎల్‌సీ నివేదిక

న్యూఢిల్లీ : భారత్‌లో గతేడాది హర్యానాలో అత్యధిక సంఖ్యలో ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు జరిగాయి. ఈశాన్య రాష్ట్రం మణిపూర్ ఆ తర్వాతి స్థానంలో ఉన్న ది. సాఫ్ట్‌ఫ్రీడమ్ లా సెంటర్ (ఎస్ఎఫ్ఎల్‌సీ), ఇండియా కొత్త నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. 20 24 ఏడాదికి సంబంధించిన సమాచారాన్ని లెట్ ది నెట్‌వర్క్ 2.ఓ పేరుతో ఈ నివేదికను విడుదల చేశారు.

మణిపూర్‌లో 1104 గంటలు.. హర్యానాలో 589 గంటలు


ఈ నివేదిక సమాచారం ప్రకారం.. హర్యానాలో ఇంటర్నెట్ షట్‌డౌన్ 12 సార్లు జరిగింది. మణిపూర్‌లో 11 సార్లు ఇంటర్నెట్ నిలిపివేత జరిగింది. మొత్తంగా హర్యానాలో 589 గంటలు, మణిపూర్‌లో 1104 గంటల మేర ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు జరిగాయి. 2023తో పోలిస్తే 2024లో షట్‌డౌన్‌ల సంఖ్య వ్యవధి తగ్గింది. 2024లో మొత్తం 3381 గంటలతో 60 ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు జరగగా.. 2023లో ఇది 6841 గంటలతో 96 ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు జరిగాయి. 2012 నుంచి భారత్‌లో ప్రభుత్వం విధించిన ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు 849గా నమోదయ్యాయి. రైతు నిరసనలు, జాతి సంఘర్షణల సమయంలో హర్యానా, మణిపూర్‌లలో ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు రికార్డయ్యాయి.

రైతు నిరసనలు, జాతి హింస కారణం

గతేడాది హర్యానాలో విధించిన 12 ఇంటర్నెట్ షట్‌డౌన్‌లలో పది రైతు నిరసనల కారణంగా జరిగాయి. మణిపూర్‌లో జాతి హింస కారణంగా 11 సార్లు ఇంటర్నెట్ అంతరాయం కలిగింది. 2023లో మణిపూర్ 4374 గంటలతో 36 ఇంటర్నెట్ షట్‌డౌన్‌లను చూసింది. "దీర్ఘకాలిక ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు పౌర అశాంతిని తీవ్రతరం చేశాయి. ముఖ్యమైన మానవ సౌకర్యాలకు అంతరాయం కలిగించాయి" అని నివేదిక పేర్కొన్నది. ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు హింస, పౌర అశాంతిని పెంచుతాయని ఒక జర్నలిస్ట్ అభిప్రాయపడ్డారు.

14 రాష్ట్రాలకు పెరిగిన నిలిపివేతలు

దేశంలో ఇంటర్నెట్ షట్‌డౌన్‌ల సంఖ్య తగ్గినప్పటికీ.. వాటిని విధించిన రాష్ట్రాల సంఖ్య పెరిగింది. **2023లో 11 రాష్ట్రాలు ఇంటర్నెట్ బ్లాక్‌లు విధించగా.. 2024లో ఆ సంఖ్య 14కు చేరింది. 2024లో హర్యానా, మణిపూర్, రాజస్తాన్, పంజాబ్, ఒడిశా రాష్ట్రాలు మొత్తం 3381 గంటలకు గానూ 2452 గంటలు ఇంటర్నెట్ నిలిపివేతను నమోదు చేశాయి. అంటే, మిగిలిన 9 రాష్ట్రాలు 929 గంటల పాటు మాత్రమే ఇంటర్నెట్ షట్‌డౌన్‌ను చూశాయి. 2023లో ఈ ఐదు రాష్ట్రాల వాటా 77 శాతంగా ఉన్నది. అంటే.. మొత్తం 6841 గంటల అంతరాయంలో 5908 గంటలు ఈ ఐదు రాష్ట్రాల నుంచే నమోదైంది.**



షట్‌డౌన్‌లతో జాగ్రత్త

ఒక్కసారి కూడా విధించని రాష్ట్రాలు

గత రెండేండ్లలో ఒక్క ఇంటర్నెట్ బ్లాక్‌డౌన్‌ను కూడా విధించని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల(యూటీ)లో కేరళ, ఏపీ, తమిళనాడు, కర్నాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మేఘాలయ, ఢిల్లీ, చండీగఢ్‌లు ఉన్నాయి.

రాష్ట్రాలు విధించే ఇంటర్నెట్ షట్‌డౌన్‌లలో లోపాలను ఎస్ఎల్ఎఫ్‌సీ నివేదిక హైలెట్ చేసింది. గతేడాది సెప్టెంబర్ నుంచి అక్టోబర్ వరకు జైనూర్‌లో మొబైల్ ఇంటర్నెట్ యాక్సెస్‌ను నిలిపివేసినపుడు.. తెలంగాణ ప్రభుత్వం సస్పెన్షన్ ఆర్డర్‌ను కూడా ప్రచురించలేదని నివేదిక పేర్కొన్నది. నిర్మాణాత్మక పర్యవేక్షణ యంత్రాంగం లేకపోవటం దుర్వినియోగ ప్రమాదాన్ని పెంచుతుందని వివరించింది. చట్టబద్ధమైన భద్రతా సమస్యలకు మించి ప్రయోజనాల కోసం షట్‌డౌన్‌లను ఉపయోగించుకునే అవకాశమున్నదని నివేదిక హెచ్చరించింది. 2023లో విడుదలైన మరో నివేదిక ప్రకారం.. భారత్ ఆరేండ్లు ప్రపంచవ్యాప్తంగా గరిష్ట సంఖ్యలో ఇంటర్నెట్ షట్‌డౌన్‌లను విధించటం గమనార్హం.

సోషల్ మీడియాపై యూపీ సర్కారు ఉక్కుపాదం

కుంభమేళా వేళ 140 ఖాతాలపై 13 ఎఫ్ఐఆర్‌లు



లక్నో : యూపీలో కుంభమేళా కొనసాగుతున్న వేళ యోగి సర్కారు సోషల్ మీడియాపై ఉక్కుపాదం మోపుతున్నది. తప్పుదోవ పట్టించే సమా చారాన్ని వ్యాప్తి చేస్తున్నారంటూ 140 సోషల్ మీడియా హ్యాండిల్స్‌పై 13 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ విషయాన్ని మహా కుంభ్ డీఐజీ వైభవ్ కృష్ణ ధ్రువీకరించారు. కాగా, 26న మహాశివరాత్రి సందర్భంగా తగిన అన్ని ఏర్పాట్లనూ చేసినట్టు వివరించారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారమంటూ పోలీసులు ప్రత్యేకించి కొందరిపై కేసులు బనాయిస్తున్నారంటూ సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహాకుంభమేళాను కవర్ చేయటం, అక్కడికి వెళ్తున్న భక్తులు సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతుండటం, తొక్కిసలాటలు వంటి ఘటనలను ప్రధాన స్రవంతి మీడియాతో పాటు కొందరు ఔత్సాహికులు సామాజిక మాధ్యమాల ద్వారా వాస్తవాలను బయటకు తీసుకొస్తున్నారని అన్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను బయటకు తీసుకువస్తున్న కారణంగానే సోషల్ మీడియాపై యోగి సర్కారు ఇలాంటి ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నదని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ముగిసిన లక్ష్మమ్మ అంత్యక్రియలు

పాల్గొన్న నవతెలంగాణ సీజీఎం, జీఎంలు, ఇతర సిబ్బంది

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

'నవతెలంగాణ' రంగారెడ్డి రీజియన్ మేనేజర్ మహేందర్‌రెడ్డి తల్లి లక్ష్మమ్మ అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. హైదరాబాద్ అంబర్‌పేటలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు ఆమె మృతదేహానికి నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్, జీఎంలు, ఇతర సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంత్యక్రియల్లో జనరల్ మేనేజర్లు, మేనేజర్లు, ఎడిటోరియల్ బోర్డు సభ్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వారు వ్యవసాయ భూమిని కొనలేరు

రాష్ట్రేతరులపై ఉత్తరాఖండ్ సర్కారు ఆంక్షలు

చట్టంలో కఠిన సవరణలు తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో రాష్ట్రేతరులు వ్యవసాయ భూములు కొనే అవకాశం లేకుండా అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ఈ మేరకు రాష్ట్రంలోని భూచట్టానికి కఠిన సరవణలు చేసింది. దీనికి ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దీని ప్రకారం.. రాష్ట్రంలోని 13 జిల్లాలకు గానూ 11 జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యావన భూములను రాష్ట్రేతరులు కొనుగోలు చేయకుండా చట్టం నిషేధం విధిస్తుంది. ఉత్తరాఖండ్ (ఉత్తరప్రదేశ్ జమీందారీ నిరోధక, భూ సంస్కరణల చట్టం, 1950) సవరణ బిల్లు, 2025.. రాష్ట్రంలోని హరిద్వార్, ఉధమ్‌సింగ్ నగర్ జిల్లాల్లో అమలు కాదు.

భూమి అమ్మకానికి సంబంధించి జిల్లాస్థాయి అధికార యంత్రాంగానికి బదులు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి అవసరం ఉంటుంది. సవరించిన చట్టం ప్రకారం.. రాష్ట్రేతరులు నివాస ఉపయోగం కోసం 250 చదరపు మీటర్ల కంటే తక్కువ భూమినే కొనుగోలు చేసే విధానం కొనసాగనున్నది. దీనికి సంబంధించి రాష్ట్రంలో మరెక్కడా తాము కానీ, తమ కుటుంబం కానీ నివాసభూమిని కొనుగోలు చేయలేదని వారు ఒక అఫిడవిట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. వీటితో పాటు టూరిజం, పరిశ్రమ, వ్యవసాయం, ఇతర ఉపయోగాల కోసం ఇతరులకు 12.5 ఎకరాల కంటే ఎక్కువ భూమిని బదిలీ చేయటానికి అనుమతించే ఒరిజనల్ చట్టంలోని నిబంధనను తాజా సవరణతో తొలగించారు.

పరిశ్రమలు, టూరిజం, విద్య, ఆరోగ్యసంరక్ష, వ్యవసాయం, హార్టీకల్చర్ కోసం 2018 నుంచి మొత్తం 1883 భూకొనుగోలు ఒప్పందాలు ఆమోదం పొందాయని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ తెలిపారు. ఇందులో 599 ఒప్పందాలు ఉల్లంఘనల్లో ఉన్నాయని వివరించారు. 572 కేసుల్లో న్యాయపరమై చర్యలు ప్రారంభమయ్యాయని ఆయన చెప్పారు. 16 విషయాల్లో ప్రొసీడింగ్స్ షురూ అయ్యాయని తెలిపారు. ఫలితంగా.. రాష్ట్ర ప్రభుత్వానికి 9.4 హెక్టార్ల భూమి తిరిగి వచ్చిందని వివరించారు.



పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులు విడుదల

- పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం
- బీహార్‌లో ప్రధాని మోడీ పర్యటన

పాట్నా : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యొక్క 19వ విడత నిధులను సోమవారం విడుదల చేశారు. బీహార్‌లోని భగల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోడీ ఈ నిధులను విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 9.8 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి మొత్తంగా సుమారు రూ.22 వేల కోట్లను జమ చేశారు. అలాగే ఇదే కార్యక్రమంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. కాంగ్రెస్, ఆర్జేడీ నేతృత్వంలోని ప్రభుత్వాలు వ్యవసాయానికి తగినంత బడ్జెట్లు కేటాయించలేదని చెప్పారు. కానీ తమ ఎన్డీఏ ప్రభుత్వం నిరంతరం రైతులకు గణనీయమైన నిధులను విడుదల చేస్తోందని మోడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీహార్ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, కేంద్ర మంత్రులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు రైతుల గురించి మోడీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'భారతదేశపు అన్నదాతలను చూసి ప్రభుత్వం గర్విస్తుంది. వారి జీవితాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని తెలిపారు.

నలుగురు ఎంపీలున్నా.. నాలుగు పైసలు తేలే!

ఉత్తర తెలంగాణ ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదానికీ నిధులు సాధించలే..

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజేపీని గెలిపిస్తే ఆ అసమర్థతను సమర్థించినట్టే!

శ్రామిక వర్గంపై పెరిగిన బీజేపీ మతోన్మాద పాలకుల దాడులు

ఈ ఎన్నికలు సహా వచ్చే స్థానిక సంస్థల్లోనూ ఆ పార్టీని నిలువరించాలి

అందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలి :

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ఉత్తర తెలంగాణాలోనే నలుగురు ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. కనీసం ఈ ప్రాంతంలోని పెండింగ్ ప్రాజెక్టుల కోసంగానీ, కొత్త పరిశ్రమలకు అవకాశం ఉన్న చోటగానీ, ఇది వరకే హామీలిచ్చిన వాటికి గానీ నాలుగు పైసలు తేలేకపోయారు. గత ఐదేండ్లలోనూ ఆ ఎంపీలే ఉన్నా.. ఈ ప్రాంతానికి గుండు సున్నానే తెచ్చారు. ఎంతసేపు మతోన్మాద చర్యలతో ప్రజల మనోభావాల తో ఓట్లు కొల్లగొడుతూ ప్రజాభివృద్ధికి పాటుపడని ఈ పార్టీని రాబోయే ఏ ఎన్నికల్లో ఆదరించినా.. వారి అసమర్ధతతను సమర్థించినట్టే అవుతుంది. పైగా శ్రామికవర్గంపైనే దాడులు చేస్తూ వారి కష్టాన్ని దోచుకునేలానే పాలిస్తున్న వారిని నిలువరించాల్సిందే!' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్ అన్నారు. ఈనెల 27న జరగబోయే ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించేందుకు కాంగ్రెస్ అభ్యర్థి వుట్కూరి నరేందర్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని పిలుపునిచ్చారు. అందుకుగాను ఈ స్థానం పరిధిలోని 13 జిల్లాల పార్టీ కార్యదర్శులతో కలిసి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని ఓడించగల శక్తి ఉన్న కాంగ్రెస్ అభ్యర్థినే గెలిపించాలని పిలుపునిచ్చారు. ఉత్తర తెలంగాణలోనే ఆదిలాబాద్‌లో సిమెంట్ పరిశ్రమ మొదలు సీసీఐకి కేంద్రం నుంచి ఇక్కడి బీజేపీ ఎంపీలు రూపాయి తేలేకపోయారని అన్నారు. నిజామాబాద్‌లో పసుపుబోర్డు పేరుతో ఐదేండ్లు ఎంపీగా చేసిన అరవింద్, ఇప్పుడు మళ్లీ గెలిచి బోర్డు తెచ్చినట్టు ప్రకటించారని అన్నారు. ప్రకటించిన పసుపు బోర్డుకు మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో రూపాయి కేటాయించలేకపోయారని వివరించారు. ఆదిలాబాద్ టూ బీదర్ రైల్వేలైన్, ఉత్తర, దక్షిణ భారతదేశాలను కలిపే కాజీపేటలో అదనపు రైల్వేలైన్, ఈ ప్రాంతంలో పెద్దఎత్తున బీడీ పరిశ్రమపై ఆధారపడిన కార్మికుల సంక్షేమం ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాజెక్టుల కోసం కొట్లాడకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇవేగాక కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ సైతం కనీసం ఒక్క సైనిక్ స్కూల్‌గానీ, నవోదయ పాఠశాలగానీ తేలేకపోయారన్నారు. మెదక్ బీజేపీ ఎంపీగా ఉన్న రఘునందన్‌రావు సైతం ఆ ప్రాంత అభివృద్ధికి కనీసం ప్రయత్నం చేయడం లేదన్నారు. పక్కరాష్ట్రంలో మిర్చి రైతుల కోసం ఎన్డీఏ ప్రభుత్వంలోని అక్కడి సీఎం చంద్రబాబునాయుడు కేంద్రంతో మాట్లాడుతుంటే ఇక్కడి బీజేపీ ఎంపీలకు తెలంగాణ మిర్చి రైతులు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కనీసం పక్క రాష్ట్రాన్ని చూసి అయినా సోయి లేదా?అంటూ ఘాటుగా విమర్శించారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఈ ప్రాంత ప్రజల ఓట్లతో గెలిచిన బీజేపీని ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఆదరిస్తే మాత్రం వారి అసమర్థతను సమర్థించినవాళ్లమే అవుతామని అన్నారు. దానికితోడు మతోన్మాద రాజకీయాలకు మరింత బీజం వేసినవాళ్లం అవుతామని చెప్పుకొచ్చారు. ఈ పార్టీని నిలువరించేందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే బుద్ధిచెప్పాలని, అందుకు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న వి.నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ నిర్ణయాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలోనే చేశామని, పార్టీ నిర్ణయం మేరకు తాము ప్రకటిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కరీంనగర్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల,జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.



సంపాదకీయం

ద్వేష భాషణం



పాలన తామనుకున్నట్టుగా సాగాలంటే ఏలినవారు ఎప్పుడూ ప్రజల్లో ఏదో ఒక అశాంతిని రగిలించాలన్న 'సూత్రం' బీజేపీకి బాగా వంట బట్టినట్టున్నది. 'మందిరాలు - మసీదులు' మొదలు 'హిజాబ్ - హలాల్', 'మణిపూర్' వరకూ అవి సృష్టించిన మంటలు చల్లారనే లేదు, ఇప్పుడు సరికొత్తగా 'మహా కుంభమేళా'లో వరుసగా చోటుచేసుకున్న ఘటనలపట్ల ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై స్వయంగా ప్రధానే ఎదురుదాడికి దిగుతున్నారు. 'హిందూ విశ్వాసాన్ని ద్వేషించేవారు శతాబ్దాలుగా అక్కడక్కడా ఉంటూనే ఉన్నారు. వీరికి మద్దతివ్వడం ద్వారా విదేశీశక్తులు కూడా మన దేశాన్ని, మతాన్ని బలహీనపరచాలని చూస్తున్నాయి. సమాజాన్ని విభజించి ఐక్యతను బద్దలు కొట్టడమే వారి ఎజెండా' అని మోడీ విమర్శలను లంకించుకున్నారు. ప్రధాని ఏ రాష్ట్ర పర్యటనకు వెళ్లినా అక్కడ వల్లించే ప్రవచనాలు వారి రాజకీయ ప్రయోజనాలనే తప్ప, ప్రజా ప్రయోజ నాలను ప్రతిబింబించకపోవడం గర్హనీయం. నిన్నటికి నిన్న మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్‌లో బాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శంకుస్థాపన కార్యక్రమంలో పై విమర్శలు చేయడం గమనార్హం.

> ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరిన యాత్రికులు ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకున్న తొక్కిసలాటలో పద్దెనిమిది మంది మరణించడం వాస్తవం కాదా? ఇంకా కొందరి పరిస్థితి విషమంగానే ఉందనే వార్తలు ఆందోళన కలిగిస్తుంటే వారిని పట్టించుకోకుండా ప్రతిపక్షాలు హిందుమతంపై దాడి చేస్తున్నాయనడం ప్రధాని స్థాయి వ్యక్తికి తగునా? ప్రయాగ్‌రాజ్‌లో నీరు కలుషితం అయిందని, సాన్నానికి కూడా ఆ నీరు పనికి రాదని కేంద్రప్రభుత్వ సంస్థ ఇచ్చిన నివేదికనే తమరి ముఖ్యమంత్రి తప్పుపట్టారు. దాన్ని ఏమంటారు? తమ ప్రభుత్వంపై దాడి అంటారా?

మనకు విశ్వాసాలు అనేకం. ఆధ్యాత్మికతలో, భక్తిలో ఉండేది విశ్వాసమే. ఇందులో విద్వేషానికి, విధ్వంసానికి, వైరుధ్యాలకు తావేవుండదు. కానీ కాల ప్రవాహంలో ఆధిపత్య, రాజకీయశక్తులు తమ ప్రయోజనాల నిమిత్తం విశ్వాసాలను విద్వేషాలుగా మార్చి జనాన్ని విభజనకు గురి చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నాయి. అందులో ఒక అడుగు ముందుండేది కాషాయ పరివారమే. జన సమూహాల్లో ఉన్న భక్తిభావానికి, మత పరమైన విద్వేష చర్యలకు ఎలాంటి సంబంధమూ లేదు. ఏ మతావలంబకులైనా మనుషులే కదా! విధ్వంసక మూకలకు ఇవన్నీ వినిపించవు. ఉద్వేగాలను రెచ్చగొట్టి విద్వేషాల మంటల్ని విస్తరింపజేసున్న ఉన్మత్త ఆధిపత్య వర్గాలకు, నిజమైన ప్రజల జీవన విధానము ఏమిటో ఎలా తెలుస్తుంది! నిత్యం మతవైరుధ్యాలను పెంచేవారు భక్తి ఎలా ఉంటుందో చూడగలుగుతారా! లేదు కదా!

అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో గత దశాబ్ద కాలంగా మనుషుల్ని విభజించే, భయాన్ని సృష్టించే, మన సమాజంలోని పెద్ద సెక్షన్‌ను వేరు చేసే విద్వేష రాజకీయాలను చూస్తున్నాం. సామాజిక జీవనంలో మత విద్వేషం బుసలు కొడుతున్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని 'ప్యూ రీసెర్చ్ సెంటర్' తాజా నివేదిక వెల్లడించింది. అందులోనూ మోడీ,షా,యోగిలే ముందు వరుసలో ఉన్నారని కూడా అది స్పష్టం చేసింది. ముస్లింల ఇండ్లను బుల్డోజర్లతో కూల్చేయడం, సైద్ధాంతికంగా, రాజకీయపరంగా విమర్శించిన ప్రొఫెసర్లు, యూని వర్సిటీ విద్యార్థులపై దేశద్రోహ కేసులు బనాయించడం, హలాల్, నమాజ్, మసీద్-మందిరం.. ఇలా విద్వేషాలను రెచ్చగొట్టే ఘటనలన్నింటికి కారకులెవరూ? మహమ్మద్ ప్రవక్తను తూలనాడుతూ బీజేపీ నేతలు నూపుర్ శర్మ, నవీన్ జిందాల్ చేసిన హేయమైన వ్యాఖ్యలపై అంతర్జాతీయ సమాజం దుమ్మెత్తిపోసిన సంగతి ప్రధానికి గుర్తు లేదా?

తమకు తామే హిందూ మతానికి ప్రతినిధులుగా ప్రకటించేసుకుని, మైనారిటీలపై విద్వేషాన్ని కురిపిస్తూ... తమ రాజకీయ అధికారానికి బాటలు వేసుకున్న పార్టీ బీజేపీ. వీరి కార్ఖానాల్లో తయారయ్యే విద్వేషం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం. త్రివేణి సంగమంలో మహా కుంభమేళా ప్రారంభమైన నాటి నుంచి, ఆ పేరిట జరిగిన వరుస ప్రమాదాల్లో ఎంతమంది అసువులు బాసారో లెక్కలేదు. మౌని అమావాస్య నాటి ఘటనలో ముప్పై మంది మృతి చెందారని తెలిపారు. కానీ, అంతకు కొన్ని రెట్ల మంది మరణించారని, క్షతగాత్రులయ్యారని ప్రతిపక్షాలు, ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అవి నిజం కాదా? లేదంటే ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరిన యాత్రికులు ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకున్న తొక్కిసలాటలో పద్దెనిమిదిమంది మరణించడం వాస్తవం కాదా? ఇంకా కొందరి పరిస్థితి విషమంగానే ఉందనే వార్తలు ఆందోళన కలిగిస్తుంటే వారిని పట్టించుకోకుండా ప్రతిపక్షాలు హిందుమతంపై దాడి చేస్తున్నాయనడం ప్రధాని స్థాయి వ్యక్తికి తగునా? ప్రయాగ్‌రాజ్‌లో నీరు కలుషితం అయిందని, సాన్నానికి కూడా ఆ నీరు పనికి రాదని కేంద్రప్రభుత్వ సంస్థ ఇచ్చిన నివేదికనే తమరి ముఖ్యమంత్రి తప్పుపట్టారు. దాన్ని ఏమంటారు? తమ ప్రభుత్వంపై దాడి అంటారా?

మైనారిటీల పట్ల, ప్రశ్నించేవారి పట్ల విద్వేషం పెంచుకున్న తర్వాత ప్రజాస్వామిక పాలన ఎలా చేయగలుగుతారు? విద్వేషాలను రెచ్చగొడుతూ మత వైషమ్యాలకు కారణమైతే అది ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది? విద్వేషాలను రెచ్చగొట్టడం జాతీయ సమైక్యత, సమగ్రతలకు పెను ప్రమాదం. అలాంటి మతోన్మాద శక్తులు, వాటిని ప్రోత్సహించేవారు దేశానికి ప్రమాదకరం. ఏ మాటల వెనుక ఎలాంటి అర్థాలు దాగు న్నాయో తెలియనంతకాలం జనం మళ్లీ మళ్లీ మోసపోతూనే ఉంటారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రధాని ఇలాంటి మతపరమైన వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

జర్మనీ ఎన్నికల్లో ఏఎఫ్‌డి ఘోర పరాజయం
ఎలన్ మస్క్ రాజీనామా!

ఎలన్ మస్కంటే ఎవరు? జీవితంలో ఓటమి మాటే తెలియనివాడు. అటువంటి మస్క్‌కు గూబగుభేల్ మనేటట్టు, కళ్లు బైర్లు కమ్మేటట్టు ఓటమిదెబ్బ తగిలింది. ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఏఎఫ్‌డి) గెలుపు కోసం ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తే, చివరికి జరిగిందేమిటి? చాలా రాష్ట్రాల్లో మెజారిటీ ఓటర్లు ఏఎఫ్‌డిని ఓడించారు.

'నన్ను క్షమించండి.ఈ క్షమాపణ ఎందుకంటున్నారా? కేవలం ఇరవై శాతం ఓట్ల కోసం ట్విట్టర్‌ని ఫాలో అయ్యే ఇరవైరెండు కోట్ల మంది ముందు నేను 'ఫూల్'ని అయ్యాను. బడాయిపోయే ఏఎఫ్‌డి నాయకురాలు వీడెల్‌తో ట్విట్టర్ ఇంటర్వ్యూలో ఎన్ని మాట్లాడాము? జర్మనీని రక్షించే పార్టీ ఏఎఫ్‌డి తప్ప ఇంకోటి లేదన్నాం. కమ్యూనిస్టులను తిట్టిపోశాం. అయినా, ఎన్ని ఆపసోపాలు పడినా వచ్చింది ఇరవై శాతం



ఓట్లు మాత్రమే. అదైనా అంతకుముందు పోలీస్‌స్టేషన్‌కి రాని జర్మన్లు, ఏదో ఉద్ధరిస్తుందని నమ్మి ఏఎఫ్‌డికి ఓట్లు వేసినందుకు ఆ మాత్రమైనా వచ్చాయి. జర్మనీలో చేసిన పనే అమెరికాలో చేసి ఎంత గొప్ప విజయం సాధించాం. నేను సపోర్ట్ చేసిన డోనాల్డ్ ట్రంప్ గెలిచి ప్రపంచమంతా ఎంత హంగామా, హడావుడి సృష్టిస్తున్నాడు. మీరు చూస్తున్నారు కదా! కానీ జర్మనీలో ఏమిటీ,ఇలా?'

ఈ ఫలితం చూసి ట్రంప్ ఏమనుకుంటాడు? మస్క్ పొరపాటు చేయడనే కదా ట్రంప్ ఇప్పటిదాకా అనుకుంటున్నది. జర్మనీలో మస్క్ నేరుగా మద్దతు ఇచ్చిన ఏఎఫ్‌డి ఓడిపోతే, వీడెల్ ఛాన్సలర్ కాలేకపోతే శ్వేత సౌధాలో మస్క్ ముఖం ఎలా చూపించగలడు. ' ఈ ఓటమి మూలంగా కచ్చితంగా ఈ మొహం పెట్టుకొని వైట్‌హౌస్‌లో తిరగలేను.'

ఏఎఫ్‌డి గనక గెలిస్తే, హెలిగోల్యాండ్, బవేరియాలోని పెద్ద భూభాగం అమెరికా ఆధీనం చేయిస్తానని ఇప్పటికే ట్రంప్‌కు మస్క్ హామీ ఇచ్చి ఉన్నాడు. 'ఇప్పుడు చూడండి, ఎంతటి దయనీయమైన పరిస్థితి ఏర్పడింది? ' మహా అయితే, వాక్స్ వాగన్ గోల్ఫ్ కార్లకు, గోల్ఫ్ ఆఫ్ అమెరికా పెట్టగలడేమో. ఎంత నామోషీ?

అందుచేత, ఎలన్‌మస్క్ రాజీనామా చేయడానికే నిశ్చయించుకున్నాడు. తన వ్యాపార సామ్రాజ్యాన్ని తక్షణమే తన కొడుకుకి బదలా యిస్తున్నట్టు కూడా ప్రకటించాడు. అయితే ఈ బదలాయింపువల్ల తన 'ఎక్స్'ను ఉపయోగించే వారికి ఏమాత్రం ఇబ్బంది కలగనివ్వనని, ఇది మునపటి ప్రమాణాలతోనే తన నాలుగేళ్ల కొడుకు తగిన అర్హత, నైపుణ్యాలతో కొనసాగిస్తాడని మస్క్ ప్రపంచ పౌరులకు హామీ ఇచ్చాడు.

ఇది ఇట్లా ఉండగా, తనకు తను ఆత్మ పరిశీలన చేసుకోగా, జర్మనీ ఎన్నికల్లో ఎక్కడ తప్పు జరిగిందో మస్క్‌కు తెలిసి వచ్చింది. ఏ ఎఫ్ డి ఎన్నికల ప్రచారంలో తన కొడుకును జోక్యం చేసుకోనివ్వకపోవడం అతిపెద్ద తప్పు అని టెస్లా కార్ల కంపెనీ బాస్ అంతిమ నిర్ణయానికి వచ్చాడు.

'నాకు బాగా అర్థమైంది ఒకటి ఉంది. నాకంటే నా నాలుగేళ్ల కొడుకుకే జర్మనీ గురించి బాగా తెలుసు.'

ఏది ఏమైనా అప్పటికీ, రాజీనామా చేశాక, తనకు బోలెడంత సమయం అందుబాటులో ఉంటుంది కనుక, ఒక సాధారణ పౌరుడిగా తన అలవాట్లు కొనసాగించడానికి అవకాశం ఉంది.'

'ఎందుకంటే, నా గురించి అనవసరమైన ఊహాగానాలు చాలా వస్తున్నాయి. అటువంటి వాటన్నిటికీ ముగింపు పలకటానికి ఈ విషయం వెల్లడిస్తున్నాను. ఈ ఖాళీ సమయంలో నా పర్సనల్ శిక్షకుడి నుంచి హిట్లర్ సెల్యూట్ ఎంత కచ్చితంగా చేయాలో నేర్చుకుంటాను.'

- కర్లపాలెం భాస్కర్‌రావు

(ఈ వ్యంగ్యం జర్మనీ దినపత్రికలో ప్రచురితమైనది)

శ్రామిక జనావళిపై ప్రపంచవ్యాప్తంగా దౌర్జన్యం



ప్రభాత్ పట్నాయక్

ప్రస్తుతం మలిదశలో ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రామిక ప్రజానీకం మీద జరుగుతున్న దౌర్జన్యాలు పెట్టుబడిదారీ వ్యవస్థ తొలిదశ నాటి దౌర్జన్యాలను తలపిస్తున్నాయి. ఈ దౌర్జన్యం కేవలం మూడవ ప్రపంచ దేశాల శ్రామికుల మీద మాత్రమే కాక, సంపన్న పశ్చిమ దేశాల్లో సైతం సాగుతోంది. ఈ దౌర్జన్యం మూడు స్థాయిల్లో-ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక స్థాయిల్లో- ఉంది.

ఆర్థికంగా సాగుతున్న దౌర్జన్యం గురించి ఎక్కువగానే చర్చిస్తున్నాం. ద్రవ్యోల్బణం వేగంగా పెరిగిపోవడం, నిరుద్యోగం చాలా ఎక్కువ స్థాయికి చేరుకోవడం ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థను బలంగా పీడిస్తున్నాయి. ప్రత్యే కించి అమెరికాలోని బడా పెట్టుబడిదారీ వర్గం ఎవరికి వారుగా తమ లాభాల వాటాలను పెంచుకోడానికి పూను కోవడంతో మొదలై, తర్వాత యావత్ పెట్టుబడిదారీ ప్రపంచానికీ ఆ ధోరణి విస్తరించినందువలన దాని పర్యవ సానంగా ద్రవ్యోల్బణం మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచాన్ని ఆవరించింది. (ఈ క్రమాన్ని నేను మరో వ్యాసంలో తర్వాత వివరిస్తాను) ద్రవ్యోల్బణం కారణంగా నిరుద్యోగం పెరిగింది. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి పెట్టుబడి దారీ ప్రభుత్వాలు ఉద్యోగాలమీద వేటు వేయడానికి పూనుకున్నాయి. దానివలన కూడా నిరుద్యోగం మరింత పెరిగి పోతోంది. నిరుద్యోగం పెరిగితే, అప్పుడు పెరిగే ధరలకు అనుగుణంగా తమ వేతనాలను పెంచమని పోరాడేందుకు కార్మికులవద్ద శక్తి ఉండదని, వేతనాలపై చేయవలసిన ఖర్చు తగ్గిపోతే ద్రవ్యోల్బణం దానికదే అదుపులోకి వస్తుందన్నదే ప్రభుత్వాల ఆశ.

బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవంగా అభివర్ధించే తొలిదశలోని పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదరికం బాగా పెరిగిపోవడం ఒక ప్రధాన లక్షణంగా ఉందని ఎరిక్ హాబ్స్‌బామ్ వంటి ప్రముఖ చరిత్రకారులు వివరించారు. అదే మాదిరిగా మలిదశలో కూడా శ్రామిక ప్రజానీకపు పేదరికస్థాయి తీవ్రమౌతోంది. 1968 నాటి వేతనాల స్థాయితో పోల్చితే అంతకన్నా 2011లోని అమెరికన్ కార్మికుల వేతనాల స్థాయి తక్కువగా ఉందని జోసెఫ్ స్టిగ్‌లిట్జ్ బలంగా వాదించారు. 2011తో పోల్చితే ద్రవ్యోల్బణం ఇంకా ఎక్కువగా పెరిగిపోయింది. కాబట్టి ప్రస్తుత నిజ వేతనాల స్థాయి 2011 నాటికన్నా ఇంకా దిగజారిపోయిందని చెప్పవచ్చు. 1968తో పోల్చితే ఇప్పుడు అమెరికాలో నిరుద్యోగం ఇంకా ఎక్కువగా ఉంది. అందుచేత అప్పటికన్నా ఇప్పుడు అమెరికన్ కార్మికవర్గం మరింత పేదరికంలోకి దిగజారారని స్పష్ట మవుతోంది. ఐతే, అధికారిక గణాంకాలు ఈ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోవు. నిరుద్యోగం తీవ్రగా పెరుగుతున్న కారణంగా ఉత్పత్తి ప్రక్రియలో కార్మికుల భాగస్వామ్యం తగ్గుతోందన్న వాస్తవాన్ని వారు లెక్కలోకి తీసుకోరు. అమెరి కాలో ఉన్న మాదిరిగానే తక్కిన సంపన్న దేశాలలో కూడా శ్రామికవర్గం పరిస్థితి ఉంది. భారతదేశం, ఇతర మూడవ ప్రపంచదేశాల్లో ప్రజానీకం పొందుతున్న పౌష్టికాహారస్థాయి పడిపోయిందని స్పష్టమైన ఆధారాలు వెల్లడిస్తున్నాయి. తలసరి ఆహారధాన్యాల వినియోగం తగ్గిపోవడం చూస్తున్నాం. మాంసాహార వినియోగంలో మార్పులు వచ్చినందునే ఇలా కనిపిస్తోందని అధికార వర్గాలు సమర్ధించుకుంటున్నాయి. కాని, కోళ్లు, పశువుల మేతకు వినియోగించే ఆహార ధాన్యాలను కూడా మానవ వినియోగం కిందనే లెక్కవేసి చూసినా, తలసరి ఆహారధాన్యాల వినియోగం తగ్గిపోయింది.అందుచేత నిస్సందేహంగా శ్రామిక ప్రజానీకపు పేదరిక స్థాయి మరింత దిగజారిపోయిందన్నది స్పష్టమవు తోంది. అంటే, శ్రామికవర్గం మీద, ప్రత్యేకించి పేద శ్రామిక ప్రజానీకం మీద పెట్టుబడిదారీ వ్యవస్థ సాగించే దౌర్జన్యం మరింత పెరిగిందన్నది నిర్వివాదం.

ఈ మాదిరిగా శ్రామిక వర్గం మీద ఆర్థికంగా దౌర్జన్యం నిరాటంకంగా కొనసాగాలంటే ఆ శ్రామిక ప్రజా నీకపు రాజకీయ హక్కులను కట్టడి చేయడం తప్పనిసరి. అంటే ఆర్థిక దౌర్జన్యంతోబాటు శ్రామిక వర్గం మీద రాజ కీయ దౌర్జన్యం కూడా కొనసాగాలి. ఈ రాజకీయ దౌర్జన్యం నేడు నయా ఫాసిజం రూపాన్ని తీసుకుంది. అందుకే పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తంగా నయా ఫాసిజం ముందుకొచ్చింది. అనేక దేశాల్లో ప్రభుత్వాలు ఇప్పుడు నయా ఫాసిస్టు నాయకుల చేతుల్లో ఉన్నాయి. అర్జెంటీనాలో మిలెయ్, ఇటలీలో మెలొని, అమెరికాలో ట్రంప్, భారతదేశంలో మోడీ, హంగెరీలో ఆర్బన్, టర్కీలో ఎర్డొగాన్, ఇజ్రాయిల్‌లో నెతన్యాహు - ఇటువంటి నేతలే. ఇంకా పలుదేశాల్లో నయా ఫాసిస్టు నేతలు అధికారం చేజిక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. జర్మనీలోని ఎఎఫ్‌డి పార్టీ, ఫ్రాన్స్‌లో లీ పెన్ ఇటువంటివారిలో ఉన్నారు.

ఈ నయా ఫాసిస్టు శక్తులు తమ దాడిని నేరుగా కార్మికులమీద, కార్మిక సంఘాల మీద ఎక్కుపెడుతూ వారి ఉద్యమాలను అణగదొక్కడమే గాక, చట్టపరంగా కార్మికుల హక్కులను కూడా కుదించివేస్తున్నారు. మైనారిటీలుగా ఉండే కొంతమంది నిస్సహాయ సమూహాలపై 'వీళ్ళు మనవాళ్ళు కాదు' అన్న ముద్ర వేస్తూ వారి యెడల మెజారిటీ గా ఉండే కార్మికులలో శత్రుభావాన్ని రెచ్చగొడుతున్నారు. తద్వారా కార్మికుల నడుమ జరగవలసిన చర్చను పక్కదోవ పట్టిస్తున్నారు. దీని వలన శ్రామికవర్గం తమ దైనందిన, భౌతిక జీవితపు వాస్తవ సమస్యలమీద తగిన చర్చ చేయడం సాధ్యపడకుండా పోతోంది. అంతే గాక ఈ శ్రామిక వర్గం మత పరంగానో, వివిధ జాతుల పరంగానో చీలిపోయి, తమపై పెట్టుబడిదారీ వర్గం సాగించే దాడులను ప్రతిఘటించలేని నిస్సహాయ స్థితిలోకి పోతున్నది.

ఆర్థిక, రాజకీయ దౌర్జన్యాలతోబాటు ఇప్పుడు సైద్ధాంతిక దౌర్జన్యం కూడా కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. ఎవరో ఒకరో , కొద్దిమందో వ్యక్తులు అప్పుడప్పుడూ చేసే వ్యాఖ్యానాలకే ఈ దాడి పరిమితమై లేదు. ప్రపంచ వ్యాప్త ంగా శ్రామికవర్గానికి వ్యతిరేకంగా వ్యాఖ్యానాలు నిరంతరాయంగా వెలువడుతూనేవున్నాయి. శ్రామిక వర్గం మీద సైద్ధాంతిక దౌర్జన్యం పెరుగుతోందనడానికి ఇవి సూచికలు.

భారతదేశంలో పెరుగుతున్న పేదరికం నేపథ్యంలో అనేక రాజకీయ పార్టీలు, కూటములు అధికారం కోసం పోటీ పడుతున్నాయి. ఈ వ్యవస్థ పెద్ద స్థాయిలో ఉపాధిని కల్పించడానికి అవకాశం ఇవ్వదు. అందుచేత ప్రజలకు రక రకాల పథకాల పేరుతో సహాయాన్ని అందిస్తామని ఈ పార్టీలు ముందుకొస్తున్నాయి. ఈ పథకాల ద్వారా ఒనగూడే ప్రయోజనాలు శ్రామికప్రజల పేదరికాన్ని తొలగించడానికి ఏ మాత్రమూ సరిపోవు. ఒకవేళ సరిపోయి వుంటే, శ్రామిక ప్రజల్లో ఇంతగా పౌష్టికాహార లోపం తలెత్తేది కాదు. కాని, ఈ పథకాలకు పాలకవర్గ నయా ఫాసిస్టులు " ఉచితాలు" అని పేరు పెట్టి వాటిని అమలు చేయడాన్ని తప్పుపడుతున్నారు. ప్రధాని నరేంద్రమోడీ సైతం ఇదే మాట్లాడుతున్నారు. ఐతే ఎన్నికల అవసరాల రీత్యా ఆ పాలకపార్టీలు కూడా సంక్షేమ పథకాలను చేపట్టక తప్పలేదు. అందుచేత ఇప్పుడు ఈ సంక్షేమ పథకాలమీద సైద్ధాంతిక దాడిని తక్కిన వ్యాపార వర్గాలవారు మొదలుపెట్టారు. కార్మికులు వారానికి తొంభై గంటలపాటు పని చేయాలని ఈ మధ్య ఒక బడా వ్యాపారవేత్త ప్రకటించారు. 'ఉచితాలు' ప్రజలను సోమరిపోతులుగా చేస్తాయని ఈసడించాడు. ఇప్పుడు ఏకంగా ఒక సుప్రీంకోర్టు న్యాయమూర్తి కూడా ఇదే పాట అందుకున్నారు. సంక్షేమ పథకాలు ఉన్నందువలన ప్రజలు పనీ పాటూ లేకుండా ఇండ్ల దగ్గరే కాలక్షేపంచేస్తూ, వారి ఉచితాల'ను' పొందుతున్నారని ఆయన అన్నారు. ప్రజలందరికీ మంచి ఉద్యోగాలను కల్పించి వారందరినీ పనుల్లోకి దింపి, ఆ పైన ఈ సంక్షేమ పథకాలను ఎత్తివేయాలని ఆ న్యాయమూర్తి ప్రభుత్వానికి సూచించివుంటే బాగుండేది. కాని ఆయనగారు కేవలం సంక్షేమ పథకాలమీద తన దాడిని ఎక్కుపెట్టారే తప్ప మంచి ఉద్యోగాలను కల్పించాలన్న అంశాన్ని మొత్తంగా విస్మరించారు.



> శ్రామిక వర్గం మీద ఆర్థికంగా దౌర్జన్యం నిరాటంకంగా కొనసాగాలంటే ఆ శ్రామిక ప్రజా నీకపు రాజకీయ హక్కులను కట్టడి చేయడం తప్పనిసరి. అంటే ఆర్థిక దౌర్జన్యంతోబాటు శ్రామిక వర్గం మీద రాజ కీయ దౌర్జన్యం కూడా కొనసాగాలి. ఈ రాజకీయ దౌర్జన్యం నేడు నయా ఫాసిజం రూపాన్ని తీసుకుంది. అందుకే పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తంగా నయా ఫాసిజం ముందుకొచ్చింది. అనేక దేశాల్లో ప్రభుత్వాలు ఇప్పుడు నయా ఫాసిస్టు నాయకుల చేతుల్లో ఉన్నాయి. అర్జెంటీనాలో మిలెయ్, ఇటలీలో మెలొని, అమెరికాలో ట్రంప్, భారతదేశంలో మోడీ, హంగెరీలో ఆర్బన్, టర్కీలో ఎర్డొగాన్, ఇజ్రాయిల్‌లో నెతన్యాహు - ఇటువంటి నేతలే. ఇంకా పలుదేశాల్లో నయా ఫాసిస్టు నేతలు అధికారం చేజిక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. జర్మనీలోని ఎఎఫ్‌డి పార్టీ, ఫ్రాన్స్‌లో లీ పెన్ ఇటువంటివారిలో ఉన్నారు.

ఉద్యోగాలు కావలసినన్ని ఉన్నాయని, కష్టపడి పని చేయకుండా 'ఉచితాలను' అందిస్తూంటే ఎవరు పని చేయడానికి ముందుకొస్తారని ఇటువంటి పెద్దమనుషులు వాదిస్తూంటారు. కాని వారి వాదనను సమర్థించే వాస్తవిక ఆధారాలను మాత్రం చూపలేరు. నిజానికి చాలా ఉద్యోగాలు ఉన్నాయని వారు చెప్పేవన్నీ 'అడుక్కు తినే స్థాయి కన్నా హీనంగా ' వేతనాలు చెల్లించేవే. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) భారతదేశంలో మంచి ఉద్యోగాలకు చాలా తీవ్రమైన కొరత ఉందని గుర్తించింది. ప్రభుత్వం చూపే ఉపాధి లెక్కలు తప్పుల తడకలుగా ఉన్నాయి. మహిళలు ఇళ్ళవద్ద, బయట కూడా చేసే శ్రమలో కూలి పొందకుండా చేసే శ్రమ పాలు చాలా ఎక్కువగా ఉంది. (గృహ పరిశ్రమలు, వ్యవసాయం, చేతివృత్తులు వగైరా) ఇది రాను రానూ మరింత పెరుగుతోంది కూడా. ఈ శ్రమకు చెల్లించ వలసిన కూలిని మహిళలకు చెల్లించకపోయినా, ఆ శ్రమ ద్వారా ఉత్పత్తి ఔతున్న సంపదను మాత్రం లెక్కిస్తున్నారు. సంపదలో పెరుగుదల ఉంది కాబట్టి ఆ మహిళలకు తగిన వేతనాలు ముడుతున్నట్టేనని ప్రకటించేస్తున్నారు. ఇటువంటి ప్రతిఫలం లేని పనుల్లో మహిళలు కుదురుకుంటున్నారంటే, దానికి కారణం వారికి వేరే ఎక్కడా సరైన ప్రతిఫలం ముట్టే పనులు దొరకకపోవడమేనని ప్రభుత్వం గమనించడం లేదు. ఆర్థిక వేత్తలు 'ప్రచ్ఛన్న నిరుద్యోగం' అని వర్ణించేది దీని గురించే.

సరిగ్గా ఇటువంటి సైద్ధాంతిక దాడినే అమెరికాలోని శ్రామిక వర్గం ఎదుర్కుంటోంది. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ-డిఒజిఇ (ప్రభుత్వ సామర్థ్యాన్ని పర్యవేక్షించే విభాగం) అనే విభాగాన్ని ట్రంప్ ఏర్పాటు చేశాడు. దానికి ఎలన్ మస్క్ ముఖ్య అధికారిగా ఉన్నాడు. అతను చేసిన వ్యాఖ్యానాలను జాగ్రత్తగా పరిశీలిస్తే వైద్య సహాయం, సాంఘిక భద్రత పథకాలు వంటి సహాయాలకు కోతలు పడనున్నాయని అర్థమౌతుంది. సెనేటర్ బెర్నీ శాండర్స్ ఇటీవల చెప్పినది చూస్తే ఈ కోతల ద్వారా మిగిల్చిన సొమ్మును సంపన్న వర్గాలకు పన్ను రాయితీలు ఇవ్వ డానికి మళ్లించబోతున్నారని తెలుస్తోంది. ఇలా రాయితీలను పొందేవారిలో జెఫ్ బెజోస్, మార్క్ జుకర్‌బర్గ్ వంటి తిమింగలాలతోబాటు ఎలన్‌మస్క్ కూడా ఉంటాడు.

ఇది కార్మికవర్గం మీద సైద్ధాంతికంగా సాగించే ప్రతీకారదాడిగా చెప్పవచ్చు. గతంలో జాన్ కెన్నెత్ గేల్బ్రియత్ అనే ఉదారవాద ఆర్థికవేత్త " ఎంత ఎక్కువగా సంపన్నులకు లాభాలు కల్పిస్తే వారు అంత ఎక్కువగా కష్టపడతారని, ఎంత తక్కువగా కూలి చెల్లిస్తే అంత ఎక్కువగా పేదలు కష్టపడతార"ని సిద్ధాంతీకరించాడు. ఇప్పుడు ట్రంప్, మస్క్ వంటి వాళ్లు దాన్ని తలకెత్తుకున్నారు.

అయితే ఈ సిద్ధాంతంలో ఒక అపసవ్యత ఉంది. పేదలనుండి కొల్లగొట్టి సంపన్నులకు కట్టబెట్టడాన్ని సమర్థించడానికి రూపొందిన ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో పెడితే దాని ఫలితంగా పెట్టుబడిదారీ సంక్షోభం మరింత ముదిరిపోతుంది. పేదవారికి వచ్చే ప్రతీ రూపాయినీ వారు ఖర్చు చేస్తారు. అదే సంన్నులకు వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని మాత్రమే వారు వినిమయం కోసం ఖర్చు చేస్తారు. పేదలకు కోతపెట్టి సంపన్నులకు కట్టబెడితే, మొత్తంగా స్థూల వినిమయం తగ్గిపోతుంది. మార్కెట్ లో తగినంత డిమాండ్ ఉన్నప్పుడే పెట్టుబడిదారులు పెట్టుబడులతో ముందుకొస్తారు. స్థూల వినిమయం తగ్గుతున్నప్పుడు వారు పెట్టుబడులు అదనంగా పెట్టడానికి ముందుకు రారు. దాని వలన సంక్షోభం మరింత ముదిరిపోతుంది. 1930 దశకానికి చెందిన ప్రముఖ ఆర్థిక వేత్త జాన్ మేనార్డ్ కీన్స్ పెట్టుబడిదారీ వ్యవస్థకు సమర్ధకుడు. ఈ సంక్షోభం ముదిరితే అది పెట్టుబడిదారీ వ్యవస్థనే కూల్చివేసే బోల్షివిక్ విప్లవం తరహా తిరుగుబాట్లకు దారి తీయవచ్చునని ఆయన భయపడ్డాడు. పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడు కోవాలంటే స్థూల డిమాండ్‌ను పెంచాల్సిందేనని, అందుకు ప్రభుత్వాలే పూనుకోవాలని సూచించాడు. కాని ప్రస్తుత పెట్టుబడిదారీ ప్రపంచంలో సరిగ్గా కీన్స్ చెప్పినదానికి భిన్నమైన దిశగా జరుగుతోంది. దీని రాజకీయ పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉండబోతున్నాయి.

(స్వేచ్ఛానుసరణ)

ట్రంప్ దర్బారులో మోకరిల్లిన మోడీ

ఫిబ్రవరి 13న వైట్‌హౌస్‌కు ప్రధాని మోడీ పర్యటన ఆయనకు తన మిత్రుడు డోనాల్డ్ ట్రంప్ ఎంత సన్నిహితమో ప్రదర్శించడానికీ, ఆ సందర్భంలో తీసుకున్న ఫొటోలను గొప్పగా చూపించు కోవడానికీ ఉద్దేశించింది. తీరా జరిగింది వేరే. వాషింగ్టన్‌కు మోడీ జరిపిన స్వల్ప కాల సందర్శన ఆయన హయాంలో భారతదేశ హోదా ఎంత కిందకు దిగజారిపోయిందో ప్రస్ఫుటం చేసింది. వాస్తవానికి అధ్యక్షుడు ట్రంప్‌తో అధికార సమావేశం కోసం భారత ప్రధాని అంత ఆగమేఘాల మీద పరిగెత్తి వెళ్లవలసినంత హడావుడి ఏమీ లేదు. జనవరి 20న ఆయన ప్రమాణ స్వీకారోత్సవానికి మోడీకి ఆహ్వానం పొందడంలో విఫలమైన పరిస్థితి. కనుక శ్వేత సౌధంలో ట్రంప్ ఎలా కుదురుకుంటాడో, ఆయన విధానాలు ఏ విధంగా విచ్చుకుంటాయో చూడవలసింది. ఆ విధానాల్లో అనేకం అంత ర్జాతీయ సంబంధాల్లో ప్రకంపనలకు కారణమవుతాయని భావిస్తున్నారు. అయితే మోడీ, బీజేపీ స్వతస్సిద్ధ లక్షణాలు వేరు. తాము అమెరికాకు ఎంత సన్నిహితులమో చూపించుకోవడం వారికి కీలకం. భారతదేశం ప్రపంచ శక్తిగా తయారైందనే దానికి అది తిరుగులేని సూచిక అని వారి భావన. అందుకనే మోడీ ట్రంప్ అధ్యక్ష పదవి స్వీకరించిన నెలలోగానే కలుసుకున్న నాలుగో విదేశీ నేత అయ్యారు. అలా కలుసుకున్న మిగిలిన ముగ్గురూ ఇజ్రాయిల్, జపాన్, జోర్డాన్‌ల నేతలు ముగ్గురూ అమెరికాకు ఆప్తమిత్రులే.

ట్రంప్ మాటే వేదంగా

భారత దేశంతో సహా అన్ని దేశాల మీద పోటా పోటీగా వాణిజ్య సుంకాలు విధించడం జరుగుతుందని ట్రంప్ ప్రకటించిన కొద్ది గంటలలోనే మోడీ ఆయనతో శ్వేత సౌధంలో అధికారికంగా భేటీ అయ్యారు. ఏ దేశమైనా అమెరికా సరుకుల మీద ఎంత సుంకాలు విధి స్తుందో తాము కూడా అంతే సమానంగా విధిస్తామని ఈ ప్రకటనతో ట్రంప్ చెప్పేశాడు. ఈ సమావేశం తర్వాత మోడీతో జరిపిన సంయుక్త పత్రికా గోష్టిలో ట్రంప్ ఇండియా అత్యధిక సుంకాలు విధించే దేశంగా వుందని నొక్కి మరీ చెప్పారు.భారత అమెరికాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల అంశాల్లో తన డిమాండ్లనూ సమస్యలనూ ముందుకు నెట్టడంలో ట్రంప్ కృతకృత్యుడైనాడని సమావేశం తర్వాత వెలువడిన సంయుక్త ప్రకటన స్పష్టం చేస్తున్నది. ఇరు దేశాల మధ్య వ్యాపారం 13వేల కోట్ల డాలర్లయితే అందులో అమెరికా లోటు 457 కోట్ల డాలర్లు వుంది. అమెరికా నుంచి ఇండియా చమురు, సహజ వాయువు దిగుమతి చేసుకోవడానికీ, అమెరికా రక్షణ సామగ్రి మరింతగా కొనుగోలు చేసేందుకు ట్రంప్ ఒప్పించగలిగారు. రక్షణ వాణిజ్యం వేగవంతం చేయడం, రక్షణ పరికరాలు సేవల కొనుగోలు వ్యవస్థలను మరింత బాగా సమన్వయం చేసుకోవడం గురించి సంయుక్త ప్రకటన పేర్కొన్నది.ట్రంప్‌ను సంతోష పెట్టడం కోసం భారత దేశం అమెరికా నుంచి మరింత ఖరీదైన చమురు, సహజ వాయువు కొనుగోలు చేయవలసి వుంటుంది. దానివల్ల మన చమురు భారం పెరిగిపోతుంది. ఇప్పుడు మనం చేస్తున్నట్టే రష్యా చమురు, సహజ వాయువు కొనుక్కోవడం మరింత చౌకగా వుంటుంది. ఇరాన్ నుంచి మరింత నాణ్యమైన ముడి చమురు కొనుగోలు చేసే అవకాశం వున్నా అమెరికా హుకుంల వల్లనే ఇండియా దాన్ని కొనుక్కోవడం నిలుపు చేసింది.



వాణిజ్య, రక్షణ కొనుగోళ్లు

ఇప్పుడు ట్రంప్ ప్రభుత్వం భారత దేశాన్ని రక్షణ పరికరాల కొనుగోలుకు సంబంధించిన పది సంవత్సరాల ఒప్పందంపై చర్చకు కట్టుబడి వుండేలా ఒప్పించింది. ఇది వ్యూహాత్మకంగానూ సైనికంగానూ భారత దేశాన్ని అమెరికాతో ముడివేస్తుంది. భారత దేశానికి ఎఫ్-35 గూఢచారి విమానాలు విక్రయిస్తామని అమెరికా సంసిద్ధత తెల్పడంపై మోడీ ప్రభుత్వం దిగులు పడాల్సిన విషయం. అవి భరించలేనంత ఖరీదైనవే గాక వాటి నిర్వహణ కోసం మొత్తం మన రక్షణ బడ్జెట్‌తో సాధ్యమయ్యేది కాదు. కానీ ఆ ప్రతిపాదనను నిరాకరించడం మోడీ వల్ల కుదిరేది కాదు. వందల కోట్ల డాలర్ల విలువైన అమ్మకాలు జరుగుతాయని ట్రంప్ సంయుక్త పత్రికాగోష్టిలో ప్రకటించారు.క్వాడ్ కూటమికీ, ఇండో పసిఫిక్ వ్యూహాలకూ ట్రంప్ ఇచ్చే ప్రాధాన్యత కొనసాగేలా చూడటమనేది మోడీ ప్రభుత్వ ఆందోళనల్లో ఒకటి. ఢిల్లీలో క్వాడ్ నాయకుల శిఖరాగ్ర సభకు అధ్యక్షుడు ట్రంప్‌కు ఆతిథ్యమివ్వాలనే అంశం సంయుక్త ప్రకటనలో ప్రస్తావించబడింది. ఇది మోడీ ఎంతగానో తాపత్రయ పడుతున్న ఆకాంక్ష.

వాణిజ్య సంబంధాలను సమీక్షించి ద్వైపాక్షిక వ్యాపార ఒప్పందంలో మొదటి విడతకు సంబంధించిన అవగాహనకు రావాలని అమెరికా, ఇండియాలు భావించాయి. కానీ ఇది భారత దేశానికి సంబంధించినంత వరకూ అటూ ఇటూ రెండు వైపులా పదునున్న కత్తి వంటిది. ట్రంప్ పాలనా యంత్రాంగం పెట్టుబడులు, వాణిజ్యానికి సంబంధించిన అన్ని అంశాల లోతుల్లోకి వెళు తుంది. భారత దేశ డేటా పరిరక్షణ నిబంధనలు, సబ్సిడీలు, పన్నుల వ్యవస్థ, నియంత్రణా చర్యలు అన్నీ ఈ చర్చలోకి వస్తాయి. మామూలుగా ఇవి విదేశీ వ్యాపారుల కన్నా దేశీయ వ్యాపారానికి అనుకూలంగా వుంటాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ చుట్టూ రక్షణ కుడ్యం ఏర్పాటు చేసుకుని భారతీయ ఆర్థిక వ్యవస్థపై మాత్రం ఆమెరికా సరుకులను రుద్దడం ట్రంప్ ఉద్దేశంగా వుంటుంది.

అణు విపత్తు సవాలు

అణు రియాక్టర్లను కొనుగోలు చేయాలని అమెరికా నుంచి ఒత్తిడి వస్తుందని ఊహించబట్టే మోడీ ప్రభుత్వం పౌర అణు విపత్తుల బాధ్యత చట్టం ఇప్పటికే ప్రకటించింది, భారత దేశానికి వెస్టింగ్‌హౌస్ తయారు చేసిన అరడజను అణు రియాక్టర్ల అమ్మకాన్ని వేగవంతం చేయాలంటున్నది సంయుక్త ప్రకటన. ఈ విషయంలోనూ మోడీ సర్కారు ఏవైనా ప్రమాదాలు జరిగితే అణు రియాక్టర్ల సరఫరా దారులపై భారం లేకుండా చేస్తున్నది. ఆ విధంగా భారతీయుల ప్రాణాలకూ భద్రతకూ ద్రోహం తలపెడుతున్నది. అక్రమంగా ప్రవేశించిన భారతీయులను అమెరికా నుంచి పంపేయడంలో న్యాయమైన, మానవీయమైన పద్ధతులను అమలు పర్చేలా చేయడంలో విఫలత కూడా మోడీ పర్యటనలో కొట్టవస్తున్నట్టు కనిపించే లోపం. ఇలాంటి తొలి భారతీయుల బృందంలో వారికి సంకెళ్లు వేసి కాళ్లు కట్టేసి సైనిక విమానంలో వెనక్కు పంపేసినప్పుడు దేశంలో నిరసన పెల్లుబికింది. కానీ విదేశాంగ మంత్రి జైశంకర్ మాత్రం ఇది అమెరికా అధికారులు మామూలుగా అనుసరించే ప్రక్రియ ప్రకారమే జరిగిందని పార్లమెంటులో సిగ్గు లేకుండా మాట్లాడారు. మోడీ ఈ విషయాన్ని ట్రంప్ దగ్గర లేవనెత్తుతారని భావించబడింది. ఒకవేళ ఆయన ఆ పని చేశారా అనేది సందేహమే అయినా దాని ప్రభావం మాత్రం ఏమీ లేదు. మోడీ తిరిగి వచ్చాక అలా పంపేయబడిన వారు మరో రెండు విమానా లలో చేతులకు సంకెళ్లు, కాళ్లకు బంధనాల తోనే అమృత్‌సర్ చేరుకున్నారు. ఈ విషయంలో కొలంబి యా, మెక్సికో దేశాల అధ్యక్షులు అనుసరిం చిన ఆత్మాభిమాన పూరితమైన దృఢవైఖరికీ దీనికి పోలికే లేదు.

ముగ్గురూ మితవాద పక్షులే

చివరగా చెప్పాలంటే పచ్చి మితవాద విధానాలతో దుందుడుకు సామ్రాజ్యవాదంతో సాగు తున్న ట్రంప్ భావ తరంగాలకు మోడీ కూడా సమభావంతోనే వున్నారనేందుకు వాషింగ్టన్ పర్యటన ఒక సంకేతం. తాము గాజాను హస్తగతం చేసుకుని అక్కడున్న పాలస్తీనియన్లందరినీ తొలగించి అభివృద్ధి పర్చాలని చేసిన ప్రకటనపై భారత ప్రభుత్వం స్పందించలేదు. నెతన్యాహుతో జరిపిన ఉమ్మడి పత్రికా గోష్టిలో ట్రంప్ చేసిన ఈ ప్రకటన నెతన్యాహుకు మహానందం కలిగించింది. అందువల్ల ఇది అంతర్జాతీయ చట్టాలను ఘోరంగా ఉల్లంఘించడమే అవుతుందని మోడీ ట్రంప్ దగ్గర ఎలాంటి అనామోదం చెప్పే ప్రసక్తి వుండదు. ఎందుకంటే ఏది ఏమైనా ట్రంప్, నెతన్యాహు, మోడీ అందరూ భావజాల పరంగా ఒకే గూటి పక్షులుగా ఒకే జాతి ఈకలు కలిగిన వారే.

('పీపుల్స్ డెమోక్రసీ' ఫిబ్రవరి 19 సంపాదకీయం)

బడ్జెట్‌లో పింఛన్ పెంపు కోసం నిధులు కేటాయించాలి

- స్థానిక సంస్థల్లో వికలాంగులను నామినేట్ చేయాలి
- వచ్చేనెల ఒకటి నుంచి 30వరకు గ్రామాల్లో సంతకాల సేకరణ : ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ సమావేశంలో తీర్మానం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో పింఛన్ల పెంపు కోసం నిధులు కేటాయించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆర్ వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేస్తూ ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 1నుంచి 30వరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో సంతకాల సేకరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా ఉద్యమాలను నిర్వహించాలనీ, వాటిని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున ఏఐసీసీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేయాలనీ, వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ రూ. ఆరు వేలకు పెంచేందుకు 2025-26 బడ్జెట్‌లో నిధులు కేటాయించాలనీ, ఉచిత బస్సుల సౌకర్యాన్ని అమలు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ యాజమాన్యం నడుపుతున్న అన్ని రకాల బస్సుల్లో వికలాంగుల రాయితీ పాసులను అనుమతించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ప్రతి వికలాంగునికీ జాబ్ కార్డు ఇచ్చి 150రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. సదరం సర్టిఫికెట్ ఉన్న ప్రతి వికలాంగునికి యూనిక్ డిసెబుల్డ్ ఐడీ కార్డు జారీ చేయాలనీ, 21రకాల వైకల్యాల వారికి కార్డులు జారీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒంటరి వికలాంగులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయమ్మ, జె రాజు, యశోద, స్వామి, ఉపేందర్, అరిఫా, సహాయ కార్యదర్శులు దశరథ్, గంగాధర్, నాగలక్ష్మి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాల దరఖాస్తు గడువు

- మార్చి 10 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాలతోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసే గడువును ఈనెల 28 నుంచి వచ్చేనెల పదో తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని తెలిపారు. ఆరో తరగతిలో ప్రతి పాఠశాలలో వంద సీట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీ సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు. ఇప్పటి వరు 25,921 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. ఏప్రిల్ 13వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతి, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏడు నుంచి పదో తరగతి వరకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు రాతపరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్థానిక మండలాల్లోనే పరీక్షా కేంద్రాలుంటాయని వివరించారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, వికలాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125, ఓసీలు రూ.200 దరఖాస్తు ఫీజు చెల్లించాలని కోరారు. ఇతర వివరాల కోసం http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ తీర్పుపై స్టేటస్‌కో

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకుల క్రమబద్ధీకరణకు సంబంధించి జీవో నెంబర్ 16పై గతేడాది నవంబర్ 19న హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు బెంచ్ స్టేటస్‌కో విధించింది. ఈ మేరకు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల్‌ఏ-475) రాష్ట్ర అధ్యక్షులు వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టులో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం హైకోర్టు ఇచ్చిన తీర్పును విచారణ చేపట్టిందని తెలిపారు. 16 జీవోకు సంబంధించి ఇప్పటికే క్రమబద్ధీకరణ చేసిన వాళ్లను కొనసాగించొచ్చనీ, భవిష్యత్తులో కొత్తగా ఎవరినీ రెగ్యులరైజ్ చేయొద్దంటూ హైకోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. 16 జీవోను కొట్టేసిందని తెలిపారు. దీనిపై పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. 16 జీవోను కొనసాగించాలనీ, వివిధ కారణాలతో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తూ క్రమబద్ధీకరణ కాని వారిని రెగ్యులరైజ్ చేయాలని సుప్రీంకోర్టును కోరారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టేటస్‌కో విధించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఇంకా వివిధ కారణాలతో క్రమబద్ధీకరణకాని వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

మిర్చికి కనీస మద్దతు ధర రూ.25 వేలు ఇవ్వాలి

- సీఎంకు ప్రజాపాలనపై సోయి లేదు : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ-మహబూబాబాద్

ఆరుగాలం శ్రమించి మిర్చి పండించిన రైతులకు కనీస మద్దతు ధర రాక ఇబ్బందులు పడుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి కేంద్రంతో మాట్లాడి మిర్చికి కనీస మద్దతు ధర రూ.25వేలు ఇవ్వాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాకు వచ్చిన ఆమె బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. లక్షలు ఖర్చుపెట్టి సాగు చేసిన మిర్చి పంటకు కనీసం గిట్టుబాటు కాక రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారన్నారు. అటు నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో పసుపు రైతులకు కూడా ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మిర్చికి గిట్టుబాటు ధర కోసం సీఎం చంద్రబాబునాయుడు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రితో మాట్లాడి అధికారులను ఉరుకులు పరుగులు పెట్టించి మిర్చి కొనుగోలు చేయించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ సీఎంకు రైతాంగం, ప్రజలపై సోయే లేదని ఎద్దేవా చేశారు. మరోపక్క శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం జరిగి కార్మికులు చిక్కుకుపోయారని, అక్కడికి కూడా వెళ్లకుండా సీఎం ఎన్నికల ప్రచారం కోసం నిజామాబాద్ వెళ్లడం శోచనీయమని అన్నారు. ముఖ్యమంత్రి మైక్ పట్టుకుంటే కేసీఆర్‌ను విమర్శించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు తప్ప ప్రజల కోసం పనిచేయడం లేదని విమర్శించారు. మహబూబాబాద్ జిల్లాకు అనేక హామీలిచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు, సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు డిఎస్ రెడ్యానాయక్, శంకర్ నాయక్, చంద్రావతి, జెడ్పీ మాజీ చైర్మెన్ బిందు, నాయకులు మారినేని వెంకన్న, పరకాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకిచ్చిన మాటను సీఎం నిలబెట్టుకోవాలి

- పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలి : సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య
- సీఐటీయూ ఆధ్వర్యంలో రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల సమయంలో మధ్యాహ్న భోజన కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కాంగ్రెస్ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూల నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ డిమాండ్ల కూడిన ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ.. నిరసన వ్యక్తం చేశారు. 'కనీస వేతనం అమలు చేయాలి, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలి, గుడ్డుకు రూ.9 ఇవ్వాలి, సకాలంలో బిల్లులు చెల్లించాలి, సబ్సిడీ గ్యాస్ ఇవ్వాలి' అనే నినాదాలతో హోరెత్తించారు. తమకు న్యాయం చేసే వరకూ అక్కడి నుంచి కదిలేదీ లేదని కార్మికులు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు ప్రతినిధి బృందం వెళ్లగా.. ఆ సమయంలో కలెక్టర్ లేకపోవడంతో డీఈవోకు వినతిపత్రం అందజేసి, తమ సమస్యలను విన్నవించారు. అంతకుముందు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు స్వప్న అధ్యక్షత జరిగిన ఈ ధర్నాలో పగడాల యాదయ్య మాట్లాడారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు సమ్మె చేస్తుంటే.. ప్రస్తుతం అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కార్మికుల సమ్మెలో పాల్గొని కాంగ్రెస్ అధికారంలో వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని.. తమను గెలిపించాలని కార్మికులను కోరినట్టు గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ తమ మ్యానిఫెస్టోలో మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు రూ.10 వేల వేతనం ఇస్తానని ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావొస్తున్నా.. కార్మికుల వేతనాల గురించి మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. కనీసం పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి కార్మికులు ఆందోళన చేస్తుంటే వారికి సమాధానం చెప్పడానికి కలెక్టర్, జిల్లా యంత్రాంగం లేకపోవడం దారుణమని అన్నారు. ఎండలో కార్మికులు గొంతు ఎండేలా అరిచినా పట్టించుకునే దిక్కులేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము గేటు దగ్గరకు వచ్చి కార్మికులతో మాట్లాడే పరిస్థితిల్లో లేమని అధికారులనడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, బుట్టి బాలరాజు, పెంటయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అలివేలు, జిల్లా నాయకులు గణేష్, అండాలు, సావిత్రి, కవిత, అక్కమ్మ, రాజేష్, నరేందర్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుంభామేళా నుంచి తిరిగొస్తూ..

- ప్రయాగ్‌రాజ్ నుంచి కాశీ వెళ్తుండగా రోడ్డు ప్రమాదం
- కారును ఢీకొట్టిన లారీ
- సంగారెడ్డి వాసులు నలుగురు మృతి
- మృతుల్లో జహీరాబాద్ ఇరిగేషన్ డీఈ వెంకట్‌రెడ్డి, ఆయన భార్య





(ఫైల్)

నవతెలంగాణ-జహీరాబాద్ /నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయాగరాజ్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన నలుగురు మృతి చెందారు. మృతుల్లో సంగారెడ్డి ఇరిగేషన్ డీఈతో ఆయన భార్య ఉన్నారు. వారు వెళుతున్న కారును ఓ లారీ ఢీకొట్టడంతో ఈ విషాదకర ఘటన జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని మామిడ్గి గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి జహీరాబాద్ ఇరిగేషన్ శాఖలో డీఈగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే కుటుంబంతో కలిసి తాత్కాలికంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కాలనీలో ఆయన నివాసం ఉంటున్నాడు. కాగా, ఇటీవల వెంకట్‌రెడ్డి(46), ఆయన సతీమణి విలాసిని(40)తో పాటు కాలనీవాసులు కొంతమందితో కలిసి ప్రయాగ్‌రాజ్ వెళ్లారు. ఆదివారం రాత్రి ప్రయాగ్ రాజ్, త్రివేణి సంగమంలో స్నానాలు చేపట్టిన అనంతరం శ్రీ కాశీ విశ్వనాథుని దర్శించుకునేందుకు కారులో బయల్దేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో రాత్రి 10:40 గంటల సమయంలో వారి కారును లారీ ఢీకొట్టింది. దాంతో వెంకట్‌రెడ్డి, విలాసిని దంపతులు, న్యాల్కల్ మండలం మల్గి గ్రామానికి చెందిన కారు డ్రైవర్ మల్‌రెడ్డి(40) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ మరో మహిళను ఆస్పత్రికి తరలించిన తర్వాత చికిత్స పొందుతూ మృతిచెందారు. దైవ దర్శనానికి వెళ్లి.. ఒకే ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో.. వెంకట్‌రెడ్డి స్వగ్రామంతోపాటు.. సంగారెడ్డి ఇరిగేషన్ కాలనీలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. వెంకట్ రెడ్డి మృతి గురించి తెలియగానే జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులతో, ఇరిగేషన్ శాఖ ఉన్నత అధికారులతో మాట్లాడి సమాచారాన్ని తెలుసుకున్నారు.

అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు..

వెంకట్ రెడ్డి కూతురు ఐదో తరగతి, కుమారుడు రెండో తరగతి చదువుతున్నాడు. కుంభమేళాకు వెళ్తుండటంతో.. స్వగ్రామం నుంచి తల్లిదండ్రులను పిలిపించి సంగారెడ్డిలోని తమ ఇంట్లో పిల్లల దగ్గర ఉంచి వారు వెళ్లారు. అలా వెళ్లిన వారు.. ప్రమాదంలో మృతి చెందడంతో పిల్లలతో పాటు ఆ కాలనీలో తీవ్ర విషాదం నెలకొన్నది. వారి ఇద్దరి మృతితో పిల్లలు అనాథలుగా మారారు. కాగా, సంఘటన గురించి తెలియగానే వెంకటరెడ్డి తమ్ముడు శ్రీనివాస్‌రెడ్డి వెంటనే తన మిత్రులతో కలిసి ఫ్లైట్‌లో సంఘటనా స్థలానికి వెళ్లారు.

సీఎం సంతాపం

వారణాసిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా వాసులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స, తక్షణ సహాయక చర్యలను అందించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

యూఎస్ ఎయిడ్ ఉద్యోగులపై ట్రంప్ వేటు

(మొదటిపేజీ తరువాయి)

మీపై ప్రభావం పడుతుందన్న విషయాన్ని తెలియజేసేందుకు విచారిస్తున్నాము' అంటూ సిబ్బందికి ఈ-మెయిల్స్ పంపారు. ఈ సమాచారాన్ని అందుకున్న వారు 24వ తేదీన ప్రభుత్వ సర్వీసును వదిలేయాల్సి ఉంటుందని అందులో తెలియజేశారు. ప్రస్తుతం యూఎస్ ఎయిడ్‌లో నాయకులు, కీలక విధులు నిర్వహిస్తున్న కొందరు సిబ్బంది మాత్రమే మిగిలారు. 'కొన్ని కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తులు, ముఖ్య నాయకులు, నిర్దిష్ట కార్యక్రమాల కోసం ఉద్దేశించిన వారు మినహా యూఎస్ ఎయిడ్ నేరుగా నియమించుకున్న సిబ్బంది మొత్తం పాలనా సంబంధమైన సెలవులో ఉన్నట్లుగా పరిగణిస్తాం' అని యూఎస్ ఎయిడ్ ఉద్యోగులకు పంపిన నోటీసుల్లో తెలిపారు. నిరవధిక వేతన సెలవు లేదా పాలనా సంబంధమైన సెలవు అంటే ఉద్యోగిని తాత్కాలికంగా విధుల నుండి తప్పించడం అన్న మాట. అయితే వేతనాలు మాత్రం చెల్లిస్తూ ఉంటారు.

వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన సన్నిహితుడు ఎలన్ మస్క్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. వాటిలో తాజా నిర్ణయం కూడా ఒకటి. గత ఆరు దశాబ్దాలుగా యూఎస్ ఎయిడ్ సంస్థ విదేశాలకు అందిస్తున్న సాయానికి వీరిద్దరూ ఇప్పటికే బ్రేక్ వేశారు. గత నెల 20న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన వెంటనే యూఎస్ ఎయిడ్ విదేశీ సాయంపై ట్రంప్ 90 రోజుల పాటు నిషేధాన్ని విధించారు. ఆకలి, ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతున్న పలు పేద దేశాలకు యూఎస్ ఎయిడ్ ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. అంతేకాదు...ప్రపంచవ్యాప్తంగా నిరాశ్రయులైన లక్షలాది మందికి ఆశ్రయం కల్పిస్తోంది. ట్రంప్ దెబ్బకు ఈ సహాయ కార్యక్రమాలన్నీ నిలిచిపోయాయి.

అమెరికాతో పాటు వివిధ దేశాల్లో పనిచేస్తున్న వేలాది మంది యుఎస్ ఎయిడ్ ఉద్యోగులను తొలగించడానికి ఫెడరల్ జడ్జి శుక్రవారం ప్రభుత్వాన్ని అనుమతించారు. ఆ వెంటనే బుష్ ప్రభుత్వం ఉద్యోగులపై వేటు వేసింది. ప్రభుత్వ చర్యకు తాత్కాలికంగా అయినా బ్రేక్ వేయాలని ఉద్యోగులు మొర పెట్టుకున్నా అమెరికా జిల్లా జడ్జి కార్ల్ నికోల్స్ ససేమిరా అన్నారు.

ఉద్యమాలతోనే రాజ్యాంగ రక్షణ

- వచ్చే నెల ఒకటి నుంచి నాలుగు వరకు ఎన్‌ఏపీఎం జాతీయ సభలు
- పోస్టర్ ఆవిష్కరించిన ప్రజాఉద్యమాల జాతీయ వేదిక నేతలు : ప్రొఫెసర్ హరగోపాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉద్యమాలతోనే రాజ్యాంగాన్ని రక్షించుకోగలుగుతామని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ప్రజాఉద్యమాల వేదిక(ఎన్ఏపీఎం) ఆధ్వర్యంలో వచ్చే నెల ఒకటి నుంచి నాలుగు వరకు ఆ వేదిక జాతీయ సభలు హైదరాబాద్‌లో జరగనున్నాయని సోమవారం హైదరాబాద్ లోని ప్రెస్‌క్లబ్‌లో అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎన్ఏపీఎం నేతలు ఆవిష్కరించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవటం అత్యంత ఆవశ్యకత అన్నారు. ప్రజాస్వామ్యం అంటే అదో జీవన విధానమని తెలిపారు. పాలకుల అప్రజాస్వామిక చర్యలకు నిరసనగా దేశంలో, రాష్ట్రంలో వందలాది ప్రజాసంఘాలు పనిచేస్తున్నాయన్నారు. సహజ వనరులు, ప్రజల హక్కులకోసం పోరాటాలు లేకపోతే ఈ మాత్రం స్వేచ్ఛ కూడా ఉండదన్నారు. ఇప్పటికే లౌకిక, సామాజిక, ఆర్థికన్యాయం ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక సభలు జరుపుకోవటం ఆహ్వానించదగిందన్నారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ వి సంధ్య, ఎన్ఏపీఎం జాతీయ కన్వీనర్ మీరా సంఘమిత్ర, విస్సాకిరణ్‌కుమార్, కన్నెగంటి రవి,ఖలీదాపర్వీన్, పి శంకర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. సభల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అభ్యుదయ వాదులు, ప్రొఫెసర్లు, మేధావులు హాజరవుతున్నారని తెలిపారు.

బరిలో ఎందుకులేరు?



(మొదటిపేజీ తరువాయి)

ఓటెయ్యండి. లేకుంటే మిగతా వారికి ఓటు వేయండి' అని కోరారు. భావోద్వేగాలు రెచ్చగొట్టడమే బీజేపీ పని చేసిన పని చెప్పకుండా ప్రజల భావోద్వేగాలు రెచ్చగొట్టి వీధి నాటకాలు ఆడటమే బీజేపీ నాయకుల పని అని సీఎం విమర్శించారు. గుజరాత్ రాష్ట్రంలో 29 శాతం ముస్లింలకు రిజర్వేషన్‌లు అమలు అవుతున్నాయని, అదే విధంగా మధ్రప్రదేశ్, హర్యానా, బీహార్‌లోనూ ముస్లింలకు రిజర్వేషన్‌లు అమలవుతున్నట్టు గుర్తుచేశారు. బీసీల ఆత్మగౌరవం నిలబెట్టాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. బీసీల పట్ల మోడీకి చిత్తశుద్ధి ఉంటే తాము పెట్టిన బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. మోడీ మందకృష్ణ మాదిగను కౌగిలించుకుండు.. ముద్దుపెట్టుకుండు కానీ ఎస్సీ వర్గీకరణ చేయలేదని అన్నారు. 12 ఏండ్లుగా అధికారంలో ఉన్నా.. ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేశామని చెప్పారు.

ప్రభాకర్‌రావును పట్టుకొస్తే 48 గంటల్లో అరెస్ట్

ఫోన్ ట్యాపింగ్ కేసులో అమెరికా పారిపోయిన ప్రభాకర్‌రావును పట్టుకొస్తే 48 గంటల్లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. కానీ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్.. ప్రభాకర్‌రావును ఇండియాకు రప్పించే అవకాశం ఉన్నా.. బీఆర్ఎస్‌తో ఉన్న లోపాయికారి ఒప్పందంతో తీసుకురావడం లేదని అన్నారు. గొర్రెల స్కాం, ఈకార్ రేసులో ఈడీ ఎందుకు కేసు నమోదు చేయడం లేదని, పెద్దమొత్తంలో విదేశాలకు నగదు పంపిన కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. అమెరికా నుంచి పలువురిని బేడీలు వేసి మరీ పంపిస్తున్నారని, మరి ప్రభాకర్‌రావును ఎప్పుడు తీసుకొస్తావని బండి సంజయ్‌ని ప్రశ్నించారు. బీజేపీతో ఒప్పందంలో భాగంగానే బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని బరిలో దించలేదన్నారు.

అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి..

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఢిల్లీలో పరిచయాలు ఉన్నాయని, అయినా నిధులు రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. నిధులు వస్తే ఎక్కడ రేవంత్‌రెడ్డికి పేరు వస్తుందోనని అడ్డుకుంటున్నారని అన్నారు. మెట్రోకు అనుమతి రాకుండా కూడా అడ్డుకుంటున్నారన్నారు. యూపీలో గంగా, ఢిల్లీలో సబర్మతి నదిని ప్రక్షాళన చేస్తున్నారని, మరి హైదరాబాద్‌లోని మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోడీ అన్నారని, కానీ ఇందులో తెలంగాణ రాష్ట్రానికి వచ్చిందేమీ లేదన్నారు. నిరుద్యోగుల ను మోసం చేశారని, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి మాత్రం రెండు ఉద్యోగాలు వచ్చాయని అన్నారు.

పదేండ్లలో రాని ఉప ఎన్నిక ఇప్పుడెందుకు వస్తది..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో రాని ఉప ఎన్నిక ఇప్పుడు ఎందుకు వస్తదని సీఎం ప్రశ్నించారు. గతంలో ఉన్న కోర్టులే ఇప్పుడూ ఉన్నాయని, గతంలో ఉన్నట్టే స్పీకర్ ఇప్పుడూ ఉన్నారని తెలిపారు. అటు మోడీతో ఇటు కేసీఆర్‌తో కొట్లాడుతున్నానని, తమకు మనోధైర్యం పెరగాలి అంటే అండగా నిలబడాలని కోరారు. నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అన్ని సమస్యలు పరిష్కరించినట్టు చెప్పట్లేదని, కానీ పరిష్కరించే అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్టు తెలిపారు.

విదేశీ సాయంపై కాషాయ నేతల గగ్గోలు

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. 'ఉదాహరణకు టీబీనే తీసుకోండి. ఈ వ్యాధి నివారణలో రోగ నిర్ధారణ, చికిత్స అనేది ఓ భాగం. అయితే పేదలను, మారుమూల ప్రాంతాలను చేరుకొని అక్కడి వారికి టీబీపై అవగాహన కల్పించడం, వారు పరీక్షలు చేయించుకునేలా చేయడం, ఆ తర్వాత చికిత్స అందించడం... వీటన్నింటిలోనూ యూఎస్ ఎయిడ్ మద్దతు ఉంది' అని వివరించారు. తాను నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ముఖ్య సంస్థల్లో యుఎస్ ఎయిడ్ ఒకటని ఆయన చెప్పారు. యూఎస్ ఎయిడ్ అందిస్తున్న నిధులను క్షేత్ర స్థాయిలో ఉన్న సంస్థలకు పంపిణీ చేస్తామని, అవి టీబీ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నాయని తెలిపారు. యూఎస్ ఎయిడ్ సాయం లేనిదే ఈ పనులేవీ కొనసాగబోవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యం, విద్య రంగాల్లో యూఎస్ ఎయిడ్ అందిస్తున్న మద్దతును ఆయన ప్రశంసిస్తూ ఇప్పుడు ఆ నిధులు నిలిచిపోవడంతో దేశంలోని పేదలు, దుర్బలురు ఇబ్బందులు పడతారని చెప్పారు.



ఆదాయ లోటు ఉన్న రాష్ట్రాలకు నష్టం

మొహంతి అభిప్రాయాలతో అంతర్జాతీయ అభివృద్ధి నిపుణుడు బీరజ్ స్వైన్ ఏకీభవించారు. ఆదాయ లోటు ఉన్న రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆయన అన్నారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం కింద ఇప్పటికే పలు ముఖ్య సంస్థల రిజిస్ట్రేషన్ రద్దయిందని ఆమె గుర్తు చేశారు. యూఎస్ ఎయిడ్ సంస్థ ద్వారా దేశానికి అందుతున్న సాంకేతిక నైపుణ్యానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నదని చెప్పారు. ఆరోగ్యం, విద్య రంగాల్లో యుఎస్ ఎయిడ్ సంస్థ ఎనలేని కృషి చేసిందని తెలిపారు. కాగా యూఎస్ ఎయిడ్ 26 జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలతో కలిసి దేశంలోని 582 జిల్లాల్లో 41 ప్రాజెక్టులను నిర్వహిస్తోంది. వీటిలో చాలా వరకూ ఆరోగ్య సంబంధ ప్రాజెక్టులే.

1950వ దశకం నుంచే...

మన దేశంలో యూఎస్ ఎయిడ్ కార్యకలాపాలు ఈ నాటివి కావు. 1950వ దశకం ప్రారంభం నుంచే అవి నడుస్తున్నాయి. దేశం తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంటున్న సమయంలో ఆ సంస్థ ఆపన్న హస్తాన్ని అందించింది. అప్పటి నుంచి సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆహార సాయం, ఆరోగ్యం, విద్య రంగాలకు చేయూత ఇస్తోంది. ప్రపంచ శ్రేణి పరిశోధనా సామర్థ్యంతో దేశంలో ఎనిమిది వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు సహకరించింది. దేశంలో తొలి ఐఐటీతో పాటు 14 ప్రాంతీయ ఇంజినీరింగ్ కాలేజీల ఏర్పాటుకు సాయం చేసింది. స్టాక్ ఎక్స్ఛేంజీలలో పరిపాలన, ధరల పారదర్శకతను మెరుగుపరచేందుకు క్యాపిటల్ మార్కెట్ అభివృద్ధికి మద్దతు ఇచ్చింది. కనీసం దేశంలో దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ యూఎస్ ఎయిడ్ మద్దతుతో నడుస్తున్న ఒక్క ప్రాజెక్టు అయినా ఉంది. జార్ఖండ్‌లో 24, అస్సాంలో 22, ఒడిశాలో 22, గుజరాత్‌లో 16, ఉత్తరప్రదేశ్‌లో 7 ప్రాజెక్టులు ఆ సంస్థ సాయంతోనే నడుస్తున్నాయి. భారత్, అమెరికా మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందం కారణంగా యూఎస్ ఎయిడ్ మద్దతుతో దేశంలో పలు ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. కేంద్రం, యూఎస్ ఎయిడ్ మధ్య కూడా గత కొన్ని సంవత్సరాలుగా పలు ఒప్పందాలు కుదిరాయి. ఇంధన సమర్థత పరిష్కారాలపై 2023 జులైలో యూఎస్ ఎయిడ్, రైల్వేల మధ్య ఎంఓయూ కుదిరింది. ఆరోగ్య రంగానికి సంబంధించి 2022 ఫిబ్రవరిలో యూఎస్ ఎయిడ్‌తో నిటి ఆయోగ్ ఒప్పందం కుదుర్చుకుంది. అనేక ప్రభుత్వ రంగ సంస్థలు కూడా యూఎస్ ఎయిడ్‌తో కలిసి పనిచేస్తున్నాయి. అంతెందుకు? స్వచ్ఛ భారత్‌కూ యూఎస్ ఎయిడ్ నుంచి నిధులు అందాయి.

ఆ సొమ్ము చేరింది బంగ్లాదేశ్‌కే

మోడీ ప్రభుత్వమే కాదు...గతంలో కేంద్రాన్ని పాలించిన ప్రభుత్వాలు కూడా యూఎస్ ఎయిడ్‌తో కలిసి పనిచేసినవే. అయినా బీజేపీ నేతలు మాత్రం తమ రాజకీయ లబ్ది కోసం కాంగ్రెస్‌పై బురద చల్లుతున్నారు. భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి యూఎస్ ఎయిడ్ 21 మిలియన్ డాలర్ల సాయం ఇచ్చిందని ఎలన్ మస్క్ నేతృత్వంలోని అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ ప్రకటించడం వివాదానికి కారణమైంది. దీనికి ట్రంప్ ఆజ్యం పోస్తూ భారత్‌లో ఎవరినో గెలిపించేందుకు జో బైడెన్ ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. అయితే ఈ సాయం బంగ్లాదేశ్‌కు ఉద్దేశించిందే కానీ భారత్‌కు కాదని అమెరికా ప్రభుత్వ వ్యయ సమాచారం చెబుతోంది. ఆ సొమ్మును బంగ్లాదేశ్‌లోని 'అమర్ ఓట్ అమర్' (మై ఓట్ ఇన్ మైన్) ప్రాజెక్టు కోసం 2022లో కేటాయించారని, అందులో 13.4 మిలియన్ డాలర్లను ఇప్పటికే ఇవ్వడం జరిగిందని ఓ విశ్లేషణలో తేలింది.

మిర్చి రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

రైతులు తమ దృష్టికి తీసుకువచ్చినట్టు చెప్పారు. ప్రభుత్వం మిర్చి రైతులను వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీద వదిలిపెట్టిందని విమర్శించారు. రైతు లేనిదే రాజ్యం లేదని.. గొప్పలు చెప్పుకునే పాలకులు నేడు అదే రైతులు మార్కెట్‌లో నిలువు దోపిడీకి గురవుతుంటే పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌కు వస్తే గిట్టుబాటు ధర రాక రైతులు అనేక అవస్థలు పడుతుంటే ప్రజల సంక్షేమం కోసం రైతుల హక్కుల కోసం నిలబడతామని హామీలిచ్చిన ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం మార్కెట్‌ను సందర్శించి రైతులకు భరోసా కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మిర్చి క్వింటాకు రూ.25వేలు చెల్లించి కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంతో పోలిస్తే మిర్చి సాగు తగ్గినప్పటికీ ధర విపరీతంగా తగ్గడం దుర్మార్గమని ఇది ప్రభుత్వం అసమర్థత, అలసత్వానికి నిదర్శనమని అన్నారు. నాణ్యతా ప్రమాణాల పేరుతో మిర్చి ధరల్లో విపరీతమైన వ్యత్యాసం ఉందని, జెండా పాట పాడి మిగతా కోట్లకు రేటు వేలకు వేలు తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి నాణ్యతను కొలిచే యంత్రాలను వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు అధైర్య పడకుండా ఐక్యంగా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అట్మాల్ పాషా, గన్నారపు ప్రభాకర్, దార కుమారస్వామి, లక్కరాజు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి క్వింటాల్‌కు రూ.25 వేలు గిట్టుబాటు ధర కల్పించాలి

- రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సీఎం రేవంత్‌రెడ్డికి జూలకంటి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మిర్చి క్వింటాల్‌కు రూ.25 వేలు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు. మార్క్‌ఫెడ్ ఇంటర్వెన్షన్ స్కీం ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం ఆయన లేఖ రాశారు. వరంగల్ గ్రేన్ మార్కెట్‌ను సందర్శించామని తెలిపారు. మిర్చి రైతులను కలిసి మాట్లాడామని పేర్కొన్నారు. రెండు నెలల నుంచి మిర్చికి గిట్టుబాటు ధర రాక, పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారని వివరించారు. ఎకరాకు రూ.1.80 లక్షలు పెట్టుబడి పెట్టారని తెలిపారు. వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి క్వింటాల్‌కు రూ.తొమ్మిది వేల నుంచి రూ.13 వేల వరకు అమ్ముకోవాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, ఇతర జిల్లాల్లో గతేడాది మూడు లక్షలా 58 వేల ఎకరాల్లో 70 లక్షల క్వింటాళ్ల మిర్చి దిగుబడి వచ్చిందని వివరించారు. క్వింటాల్‌కు రూ.20 వేల నుంచి రూ.25 వేలు గిట్టుబాటు ధర లభించిందని తెలిపారు. ఈ ఏడాది 2.30 లక్షల ఎకరాల్లో 50 క్వింటాళ్ల మిర్చి దిగుబడి మాత్రమే వచ్చిందని పేర్కొన్నారు. గతేడాది కన్నా విస్తీర్ణం, దిగుబడి తగ్గినా మిర్చి ధర సగానికి పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్టు తెలిసిందని వివరించారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే మార్కెట్ యాజమాన్యం, సంబంధిత ప్రభుత్వ అధికారులు, మంత్రులు మార్కెట్‌కు వెళ్లి గిట్టుబాటు ధర గురించి మాట్లాడకపోవడం బాధాకరమని తెలిపారు. ఒకవైపు రుణమాఫీ, వడ్లకు బోనస్ ఇచ్చామంటూ పదేపదే గొప్పలు చెప్తున్న ప్రభుత్వం మిర్చి పంటకు గిట్టుబాటు ధరపై పట్టించుకోకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం ద్వారా క్వింటాల్ మిర్చికి రూ.25 వేల గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు చేసేందుకు తగు ఆదేశాలిచ్చి మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

'ఉపాధి'కి కేంద్రం షాక్

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు తెలిపారు. కొన్ని రాష్ట్రాలు నిధులను మళ్లించి, అవసరమైన వారికి ఉపాధి కల్పించాలనే దాని అసలు ఉద్దేశ్యం కాకుండా గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా మారుస్తున్నాయని కేంద్రం వివరించింది. "కోవిడ్ సమయంలో రాష్ట్రాలు అత్యధిక మొత్తం దాదాపు రూ. 1.1 లక్షల కోట్లు తీసుకున్నాయి. అప్పుడు గ్రామీణ సంక్షోభం ఉంది. సాధారణ సమయాల్లో రూ. 86,000 కోట్ల కంటే తక్కువగా ఉంది. గ్రామీణ డిమాండ్ బాగానే ఉంది" అని ఒక అధికారి తెలిపారు. ఇప్పటివరకు 2025 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ. 82,684 కోట్లు విడుదల చేసిందనీ, దీని వార్షిక వ్యయం రూ. 86,000 కోట్ల (96 శాతం)ని వివరించారు. అయితే, వాస్తవ వ్యయం దాదాపు రూ. 94,500 కోట్లు, ఇందులో ఈ చట్టంలో గతంలో పొదుపు చేసిన కొంత భాగాన్ని కూడా ఉపయోగించుకున్నారు. ఇటీవల, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ ప్రధాని మోడీకి రాసిన లేఖలో ఆలస్యం చేయకుండా నిధులను విడుదల చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం ఈ పథకానికి రూ. 86,000 కోట్లు కేటాయించింది. 2024-2025 సవరించిన అంచనా ప్రకారం ఈ పథకానికి ఖర్చు చేసిన మొత్తానికి సమానంగా ఉంది. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2024 జులైలో ప్రవేశపెట్టిన 2024-25 కేంద్ర బడ్జెట్‌లో రూ. 86,000 కోట్లు కేటాయించింది. ఇది ఇటీవలి కాలంలో ఈ పథకం కోసం బడ్జెట్‌లో స్తబ్దతను సూచిస్తుండటం గమనార్హం.



లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్

పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అనుకూలం : అమ్జెన్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. అమెరికాలోనే అతి పెద్ద బయో టెక్నాలజీ కంపెనీ అమ్జెన్ హైదరాబాద్‌లోని రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారిన హైదరాబాద్ బ్రాండ్‌ను మరింత పెంచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉండటంతోనే ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ కంపెనీలు ముందు కొస్తున్నాయని గుర్తు చేశారు. అమ్జెన్ భాగస్వామ్యంతో బయో టెక్నాలజీ రంగంలో నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఐటీ, లైఫ్ సైన్సెస్ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలూ కల్పిస్తుందని తెలిపారు. తెలంగాణను నైపుణ్యమున్న మానవ వనరుల హబ్‌గా మార్చేందుకు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. పరిశ్రమల భాగస్వామ్యంతో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా స్థానిక యువతకు ఉద్యోగాలు దక్కేలా కోర్సులను అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఏడాది కిందట అమ్జెన్ యాజమాన్యాన్ని కోరినట్టు వివరించారు. తెలంగాణలోని విశ్వ విద్యాలయాలు, స్టార్టప్‌లు, పరిశోధన సంస్థలతో కలిసి పని చేయాలని అమ్జెన్ ప్రతినిధులను ఈ సందర్భంగా ఆయన కోరారు. విస్తరణలో భాగంగా 2025 నాటికి రూ.200 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.1600 కోట్లు) ఈ సంస్థ పెట్టుబడి పెడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, అమ్జెన్ చైర్మెన్ రాబర్ట్ ఎ.బ్రాడ్‌వే, అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్, అమ్జెన్ ఇండియా ప్రతినిధి సోమ్ చటోపాధ్యాయ, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గుల్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ హాల్‌టికెట్లు విడుదల

విద్యార్థులు కాలేజీల్లో తీసుకోవాలి ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలకు సంబంధించిన విద్యార్థుల హాల్‌టికెట్లను విడుదల చేశామని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. హాల్‌టికెట్లను కళాశాల లాగిన్‌కు అప్‌లోడ్ చేశామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు సంబంధిత కాలేజీల నుంచి హాల్‌టికెట్లను తీసుకోవాలని ఆయన సూచించారు. హాల్‌టికెట్లలో ఏమైనా ఇబ్బందులు, తేడాలు, సవరణలుంటే సంబంధిత కాలేజీ ప్రిన్సిపాళ్లను సంప్రదించాలనీ, వారు బోర్డు దృష్టికి తేవాలని కోరారు. హాల్‌టికెట్లు కూడా తగిన సమయంలో విద్యార్థులకు వ్యక్తిగతంగా పంపబడతాయని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు వచ్చేనెల ఐదో తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలను రాయబోతున్నారని వివరించారు. ఇందుకు సంబంధించి మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు హాల్‌టికెట్లను కాలేజీ లాగిన్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ఏడాది విద్యార్థులకు క్యూఆర్ కోడ్ సహాయంతో వారి పరీక్షా కేంద్రాలకు చేరుకునే సమాచారం హాల్‌టికెట్‌పై ముద్రించామని పేర్కొన్నారు. అతి త్వరలోనే విద్యార్థుల మొబైల్ నెంబర్‌కు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ లింకును పంపిస్తామని వివరించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,88,336 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,07,956 మంది కలిపి 9,96,292 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు దరఖాస్తు చేసినట్టు తెలిసింది.

వలస కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

ఒక్కొక్కరికి కోటి రూపాయల పరిహారమివ్వాలి
తెలంగాణ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో మట్టి కూలి నీటితో నిండిపోయి సొరంగంలో చిక్కుకుపోయిన 8 మంది వలస కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలనీ, ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సహాయక చర్యలను వేగతరం చేయాలని కోరింది. ఘటనపై నిపుణులతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది.

ఈ మేరకు ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు వంగూరు రాములు, అధ్యక్షులు ఎస్.రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజులు ఒక ప్రకటన విడుదల చేశారు. తాము ఘటనాస్థలిని సందర్శించినట్టు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఘటనపై మాట్లాడినట్టు తెలిపారు. 'కృష్ణా జలాల ద్వారా నల్లగొండ జిల్లాకు 3.41 లక్షల ఎకరాలకు సాగునీరు, 200 గ్రామాలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ప్రాజెక్టు 2010 వరకు ప్రాజెక్టు పనులు నడిపి ఈ మధ్యకాలంలో ఆపేశారు. ఈ నెల 18వ తేదీ నుండి తిరిగి పనులను ప్రారంభించారు. ఈనెల 22వ తేదీన పని కోసం ఉదయమే సొరంగమార్గంలోకి 50 మంది కార్మికులు వెళ్లారు. వెళ్లిన 30 నిమిషాల్లోనే సొరంగంలో మట్టిదిమ్మలు కూలిపడి ప్రమాదం జరిగింది. వెళ్లినవారిలో 42 మంది తిరిగివచ్చారు. 8 మంది ఉన్న ప్రాంతంలో చిక్కుకుపోయారు. ఇద్దరు ఇంజినీర్లు, ఇద్దరు సూపర్‌వైజర్లు, నలుగురు కార్మికులు ఉన్నారు. వారంతా యూపీ, జార్ఖండ్, జమ్మూకాశ్మీర్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన వారు. పది మీటర్ల ఒండ్రు బురద నీరు చేరటంతో వారు మరణించి ఉంటారని ఎన్‌డిఆర్‌ఎస్ అనుమానం వ్యక్తం చేస్తున్నది.

గత ప్రభుత్వం ఈ సొరంగానికి సంబంధించిన నిధులు సకాలంలో ఇవ్వకపోవడంతో అంచనాలు పెరిగి కాలయాపన చేయడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ పని చేస్తున్న కంపెనీలు నిపుణులతో పర్యవేక్షణ చేయకపోవడం, జియోలాజికల్ డిపార్ట్‌మెంట్ తరచుగా పూర్తి సమాచారం ఇవ్వకపోవడం, సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవటం కూడా ఈ ప్రమాదానికి కారణం. ప్రభుత్వం వెంటనే నిపుణుల కమిటీని వేసి ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయించాలి. కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.

42 శాతం బీసీ గణనను సమర్థిస్తున్నాం

అసెంబ్లీలో బిల్లు పెడితే సంపూర్ణ మద్దతు
ఓల్డ్ పెన్షన్ స్కీమ్ తేకుండా ఓట్లు ఎలా అడుగుతున్నావ్ రేవంత్‌రెడ్డి
మేం మూడు ఎమ్మెల్సీ సీట్లలో పోటీచేస్తుంటే కాంగ్రెస్ ఒక్కసీట్లోనేనా? : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

42 శాతం బీసీ గణనను సమర్థిస్తున్నామనీ, అసెంబ్లీలో బిల్లు పెడితే తమ పార్టీ ఎమ్మెల్యేలు సంపూర్ణ మద్దతు ఇస్తారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి నొక్కిచెప్పారు. అయితే, మతపరమైన రిజర్వేషన్లకు పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు. తాము మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీచేస్తుంటే అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటులోనే అభ్యర్థిని నిలిపిందనీ, ఒక్క అభ్యర్థి కోసం బహిరంగ సభ పెట్టి సీఎం ప్రచారానికి రావడాన్ని విమర్శించారు. పోలింగ్‌కు ముందే సీఎం మాటల్లో ఓటమి భయం కనిపిస్తోందన్నారు. బీసీల్లో ముస్లింలను చేర్చడం ముమ్మాటికీ తప్పేనన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీ కోటాలో అధిక మంది కార్పొరేటర్లు ముస్లింలకు వచ్చే అవకాశముందని తెలిపారు. బుజ్జగింపు రాజకీయాలకు అలవాటు పడి మతపరైన రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధపడ్డారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని కోర్టులో పిల్ దాఖలు చేశామన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై చర్యలు తీసుకోని అసమర్థుడు రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి లేఖ ఇస్తే ప్రభాకర్ రావు, శ్రావణ్ రావు ఇండియాకి వస్తారా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆర్ఆర్ఆర్‌ను తానే తెచ్చానని చెప్పారు. సీఎం దిగజారుడు మాటలు మానుకోవాలని సూచించారు. తనకు నైతిక విలువలున్నాయనీ, గంటకో మాట మార్చలేనని చెప్పారు. ఆయనలా తాను కోర్టుల చుట్టూ తిరగలేదన్నారు. తెలంగాణలో 14 నెలలకే రేవంత్‌రెడ్డి కొట్లాట అయిపోయిందని విమర్శించారు. ప్రధానమంత్రిగా మోడీ ఎన్నేండ్ల నుంచి పనిచేస్తున్నారో కూడా సీఎం రేవంత్‌రెడ్డికి తెలియదని దెప్పిపొడిచారు. పది లక్షల ఆరోగ్య బీమా అమలు చేస్తున్నామనేది పచ్చి అబద్ధమన్నారు. ఐదు డీఏలు పెండింగ్‌లోఉండగా ఏం మొహం పెట్టుకుని ఉద్యోగులను ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ఓల్డ్ పెన్షన్ విధానం అమలు చేయకుండా సీఎంకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. జాబ్‌క్యాలెండర్ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ముస్లింలలో రెండు మూడు కులాలు మాత్రమే వెనుకబడి ఉన్నాయన్నారు. పూర్తిగా ముస్లిం వర్గాలను బీసీలో కలిపేందుకు ప్రయత్నం చేయడం సరైంది కాదన్నారు.



బహుముఖ కార్యకలాపాలకు కేంద్రం టీపీఎస్‌కే

అన్ని జిల్లాల్లో సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు : ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్

నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రజా జీవితంలో అన్ని పార్శ్వాలను స్పృశించే బహుముఖ కార్యకలాపాలకు కేంద్రంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం(టీపీఎస్‌కే) పని చేయాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. టీపీఎస్‌కే సమావేశం సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ.. ఆర్థిక, రాజకీయ ఉద్యమాలు ఈ పరిస్థితుల్లో సరిపోవని, సామాజిక, సాంస్కృతిక మేధావులను కూడా ప్రభావితం చేయాలని తెలిపారు. మార్చి 6న 'ఆధ్యాత్మిక రంగం కృషి- భజన కోలాటం కళాకారులు' అనే అంశంపై రాష్ట్ర వర్క్‌షాప్ హైదరాబాద్ ఎంబీ భవన్‌లో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సాంస్కృతిక రంగంలో పనిచేసే వారు జిల్లాకు ముగ్గురు చొప్పున హాజరుకావాలని కోరారు. మార్చి8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీపీఎస్‌కే షీరోస్ అనే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని చెప్పారు. ఈ సమాజంలో హీరోలే కాదు షీరోస్ కూడా ఉన్నారని, పురుషులతోపాటు స్త్రీలు సమానమేనని చాటి చెప్పే కార్యక్రమమని తెలిపారు. మార్చి 23న భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా యువతకు సందేశాత్మక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి నుంచి వారం రోజులు అంబేద్కర్ ఇతర సాంస్కృతిక సంఘాలను కలుపుకొని సాంస్కృతికోత్సవాలు, మేడే సందర్భంగా శ్రామికోత్సవాలు జరపాలని, శ్రమ సంస్కృతిపై చర్చావేదికలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.రాములు, కార్యదర్శి హిమబిందు జి.యాదగిరిరావు, కురు మూర్తి, టి.రమేష్, జి.నరేష్, శ్రీమన్నారాయణ, సాంబరాజు యాదగిరి పాల్గొన్నారు.



టన్నెల్‌లో స్లీపర్ డాగ్‌ల సేవలు

(మొదటిపేజీ తరువాయి)

విపత్తులో ఈ బృందాలు సమర్థవంతంగా పనిచేశాయి. 14 మందితో కూడిన ర్యాట్ మైనర్స్‌ను ప్రభుత్వం రంగంలోకి దించింది. స్లీపర్ డాగ్‌లను సైతం ఇక్కడికి రప్పించామని మంత్రి అన్నారు. లోపల సహాయక చర్యలకు నీళ్లు, మట్టి ఆటంకంగా మారాయి. కార్మికులను రక్షించడానికి ప్రత్యామ్నాయ చర్యలకు సైతం వెనకాడబోమని మంత్రి చెప్పారు. వారు బయటకు సురక్షితంగా రావాలని ప్రార్థిస్తున్నా.. రక్షణ కోసం నాలుగు రోజులుగా ఇక్కడే ఉండి సొరంగంలోకి పోయి పరిస్థితులను పరిశీలిస్తున్నామని వివరించారు. 'ఉత్తరాఖండ్‌లో ఓసారి ఇలాంటి ప్రమాదమే జరిగింది.. 17 రోజుల తర్వాత వాళ్లని సురక్షితంగా బయటికి తీశారు.. ఆ బృందం ఇప్పుడు రెస్క్యూలో పాల్గొంది.. అందుకే వారంతా సురక్షితంగా వస్తారని తమ ఆశ..' అని మంత్రి అన్నారు.

ప్రమాదం విషయంలో కేటీఆర్ చిల్లర మాటలు మానుకోవాలి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయని . ఒక్క ఘటన పట్ల వారు బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని, ఈ ప్రమాదం విషయంలో కేటీఆర్ చిల్లర మాటలు మానుకోవాలని మంత్రి అన్నారు. ఒక్క బాధిత కుటుంబాన్ని అయినా పరామర్శించారా? ఫాంహౌస్ దాటి బయటకు వచ్చారా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి టన్నెల్ వద్దకు వస్తే సెక్యూరిటీ సమస్య, సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుందనే రాలేదని, అందుకే మంత్రులు, ఎమ్మెల్యేలు సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నామని అన్నారు. సీఎం ఆదేశానుసారమే ఇక్కడ పనులు జరుగుతున్నాయని చెప్పారు. కార్మికులను కాపాడే వరకు రాజీలేని విధంగా ముందుకు కదులుతామని అన్నారు.

ముందుకు సాగని సహాయక చర్యలు

ఎస్ఎల్‌బీసీ దోమలపెంట సొరంగం టన్నెల్‌లో ఇరుక్కుపోయిన కార్మికులను రక్షించడానికి చర్యలు తీసుకుంటున్నప్పటికీ ముందుకు సాగడం లేదు. అప్రోచ్ కెనాల్ నుంచి 14 కిలోమీటర్లు సొరంగం ఉంది. చివర 500 మీటర్ల దగ్గర టన్నెల్ రివిట్‌మెంటు కూలి బోరు మిషన్ మీద పడింది. బోరు మిషన్‌కు వెనుక ఉన్న వారు బయటకు వచ్చారు. ముందున్న వారు బయటకు రాకుండా మట్టి చేరింది. మట్టితోపాటు నీరు రావడంతో కార్మికుల పరిస్థితి ఎలా ఉందో అర్థం కావడం లేదు. ఐదు వందల మీటర్ల వరకు బురద, నీరు చేరింది. రెస్క్యూ టీమ్ ముందుకు కదలడానికి ఇది ఆటంకంగా మారుతోంది. మట్టి నీరు తోడనిదే కార్మికులను కాపాడటం కష్టం. అందుకే నూతన టెక్నాలజీని ఉపయోగిస్తే తప్ప కార్మికులను సురక్షితంగా కాపాడటం కష్టమని అధికారులు చెబుతున్నారు.

మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలి

శాసనమండలిలో ఉపాధ్యాయ, అధ్యాపకుల వాణి వినిపిస్తా

వారి హక్కుల కోసం పోరాడుతా : ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి
మహబూబాబాద్, ఇల్లందు ప్రచారంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి



నవతెలంగాణ-భూపాలపల్లి, మహబూబాబాద్, ఇల్లందు

శాసనమండలిలో ఉపాధ్యాయుల వాణి వినిపిస్తూ, వారి హక్కుల కోసం పోరాడుతానని, మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలని వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 మార్చి 22న జరిగిన ఎన్నికల్లో తనను గెలిపించారని, నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయులు, అధ్యాపకుల గొంతుకగా సమస్యలన్నింటిపై శాసన మండలి లోపల, బయట స్పందించి నిరసనలు, ధర్నాలు, దీక్షలు చేపట్టినట్టు చెప్పారు. సీపీఎస్ రద్దుకు జరిగిన అన్ని పోరాటాల్లో తానూ పాల్గొన్నట్టు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం అనేక రకాలుగా ధర్నాలు, నిరసనలు చేపట్టామన్నారు. రాబోయే కాలంలో 2023 డీఎస్సీ ఉపాధ్యాయులతో సహా సెప్టెంబర్ 2004 నుంచి ఉద్యోగాల్లోకి వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేయించి ఓపీఎస్ అమలుకు కృషి చేస్తానన్నారు. మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, డైట్ లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ పోస్టుల్లో ప్రమోషన్స్ అమలు కోసం పనిచేస్తానని తెలిపారు. ఐదు రకాల గురుకులాల సమయ మార్పిడి, హెల్త్ కార్డులు, డిప్యూటీ వార్డెన్ పోస్టుల మంజూరు, 010 ద్వారా జీతాల చెల్లింపు సమస్యల పరిష్కారానికి పోరాడుతానన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా జీతాలు, హెల్త్ కార్డులు, ప్రమోషన్స్ ఇప్పించాలని కోరారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమమ్ బేసిక్ పే, కేర్ టేకర్ పోస్టు మంజూరి, హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత కోసం పాటుపడతానన్నారు. గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్, పీఈటీ పోస్టుల అప్గ్రేడేషన్, సీఆర్లకు మినిమం బేసిక్ పే, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు పోస్టుల మంజూరి, జూనియర్ కళాశాలలకు నిర్వహణ గ్రాంటు మంజూరి, ఇతర సమస్యల పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల అధ్యాపకులకు 7వ కేంద్ర ప్రభుత్వ పీఆర్సీ ఏరియర్స్ ఇప్పించాలన్నారు. యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్, గ్రాంట్స్ పెంపుదల, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్పించడం తదితర అంశాలపైన మండలిలో ప్రస్తావిస్తానని తెలిపారు.

ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పీఎఫ్ అమలు, హెల్త్ స్కీమ్, రిటైర్మెంట్ సందర్భంలో ఎక్స్‌గ్రేషియో చెల్లింపు, అర్హులైన వారికి ప్రభుత్వ గృహ నిర్మాణంలో అవకాశం కల్పించడం కోసం పనిచేస్తానన్నారు. ఎమ్మెల్సీ బాధ్యతను ప్రస్తుతం ఎలా ఉపయోగించానో, అదే పద్ధతిలో మళ్లీ వినియోగిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కొత్త కుమారస్వామి, టీపీటీఎఫ్ కార్యదర్శి రావుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సేవా నాయక్, కార్యదర్శులు గోస్కుల వీరన్న, రఘుపతి రెడ్డి, పెద్దన్న, లక్ష్మి నారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నర్సిరెడ్డిని గెలిపించి ఓటర్ల ఆత్మగౌరవాన్ని కాపాడాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి



ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి కోరారు. సోమవారం మహబూబాబాద్ జిల్లాలోని నలంద డిగ్రీ కాలేజీలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణం సుభాష్ నగర్‌లోని బాలాజీ హాల్లో టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ నేతలతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతిపరులకు, అవకాశవాదులకు ఈ నియోజకవర్గంలో స్థానం లేదని నిరూపించాలన్నారు. నర్సిరెడ్డి మాత్రమే గత ఆరేండ్లుగా నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తనకు మంజూరైన నియోజకవర్గ అభివృద్ధి నిధులను 100శాతం పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి కేటాయించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో , టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, రాష్ట్ర నేత పూర్ణచందర్ రావు, నలంద కళాశాలల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మల్లారెడ్డి, బి.రాజు, ట్రైబల్ వెల్ఫేర్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ డా. బి. సురేందర్, మైనారిటీ వెల్ఫేర్ వింగ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం. మహేష్, టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
మంగళవారం | ఫిబ్రవరి 25, 2025 | www.navatelangana.com

యువతి అదృశ్యం



నవతెలంగాణ- హయత్ నగర్

యువతి అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద అంబర్, సాయి నగర్ కాలనీకి చెందిన 23 ఏండ్ల పిన్నపురాల శ్రీజ సోమవారం ఉదయం పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కూతురు గురించి చుట్టుపక్కల ప్రాంతాలలో బంధువుల దగ్గర వెతికినా ఎటువంటి ఆచూకీ లభించలేదని తల్లిదండ్రులు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

భూగర్భ డ్రయినేజీ పనులను ప్రారంభించాలి

- డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



నవతెలంగాణ- హయత్ నగర్

భూగర్భ డ్రయినేజీ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ జలమండలి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డికి సోమవారం సంబంధిత ఏఈలతో కలిసి జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా మరమ్మత్తుల్లో ఉన్న హ్యాండ్ బోర్లను, టెండర్ అయ్యి శాంక్షన్‌తో ఉన్న భూగర్భ డ్రయినేజీ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. వివిధ కాలనీలలో ప్రెషర్ తక్కువ వస్తున్న మంచినీటి లైన్లను వెంటనే సరి చేయాలన్నారు.

ఓడిన నేతల జోక్యంతో ఆగిన అభివృద్ధి

- నాకు క్యాన్సర్ అని, ఎల్బీనగర్‌లో ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేశారు
- కాంగ్రెస్ ఏజెంట్‌గా జోనల్ కమిషనర్ పని చేస్తున్నారు
- 2 రోజుల్లో పార్కులు ప్రారంభించకపోతే తాళాలు పగలగొట్టి మేమే ప్రారంభిస్తాం
- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నవతెలంగాణ- హయత్ నగర్

ఓడిన నేతల జోక్యం ఎక్కువగా కావడంతో ఎల్బీనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి ఆగిందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కె.బీ.ఆర్ ఫంక్షన్ హాల్లో మాజీ కార్పొరేటర్ కొప్పులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడిచినా ఒక్క రూపాయి కూడా కొత్త నిధులు ఇవ్వలేదని, ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉన్న 23 డివిజన్‌లకు గాను జీహెచ్ఎంసీ పరిధిలో కేవలం రూ.4 కోట్ల నిధులు మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. నగరంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, డివిజన్‌లో బీజేపీ కార్పొరేటర్లు ఉండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని తెలిపారు. ప్రతిదానికి ఇన్‌చార్జి మంత్రి లేదని ఆయన ఉంటేనే పనులు ప్రారంభిస్తామని అవగాహన లేని మాటలు మాట్లాడటం విడ్డురంగా ఉందన్నారు. ఎన్నికల కంటే ముందు నియోజకవర్గంలో ఆరు పార్కుల్లో పనులు ప్రారంభించి అభివృద్ధి చేశామని తెలిపారు. అయితే వాటిని ఇంకా ప్రారంభించలేదని, రెండు రోజుల్లో ప్రారంభించకపోతే బీఆర్ఎస్ కార్యకర్తలతో తాళాలు పగలగొట్టి ప్రజలకు అందుబాటులోకి చేస్తామని హెచ్చరించారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌కు అవగాహన లేకపోవడం, కాంగ్రెస్ పార్టీకి ఏజెంట్‌గా పని చేయడం చాలా బాధగా ఉందన్నారు. రాజకీయ పైత్యం ఎక్కువైతే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో ఆశాభంగం తప్పదని స్థానిక కార్పొరేటర్‌ను ఆయన విమర్శించారు. గత కొంతకాలంగా తనకు క్యాన్సర్ వచ్చిందని, ఎల్బీనగర్ లో బై ఎలక్షన్లు వస్తాయని కొందరు నాయకులు ప్రచారం చేసి పైశాచిక ఆనందం పొందారన్నారు. అయితే తాను ప్రజల ఆశీస్సులతో ఆరోగ్యంగా ఉన్నానని, కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాటం చేస్తానని తెలిపారు. కేసీఆర్ కుటుంబంపై విమర్శలు చేస్తే రేవంత్ రెడ్డి ప్రతిష్ఠ మరింత దిగజారుతుందని, ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు నిలవదని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, యువజన నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి, యాదగిరి, వెంకన్న జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల జారీలో జాప్యం వద్దు

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి
- ప్రజావాణికి 82 విన్నపాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డుల జారీలో జాప్యం చేయరాదని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాల నుండి పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి కమిషనర్ అర్జీలను స్వీకరించారు. పలు సమస్యలకు అప్పటికప్పుడు పరిష్కారం దిశగా సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ఆయా విభాగాలకు సంబంధించి అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డుల జారీలో జాప్యం చేయకుండా త్వరితగతిన కార్డులు జారీ చేయడంపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా విభాగాలకు సంబంధించిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించడంపై దృష్టి సారించాలని తెలిపారు.

ప్రజావాణికి 82 విన్నపాలు

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 82 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 46, శానిటేషన్ విభాగానికి 5, ట్యాక్స్, హెల్త్ విభాగాలకు 4 చొప్పున, ఇంజినీరింగ్ మెయింటెనెన్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు 3 చొప్పున, ఎఫ్.ఎ, ఎలక్ట్రికల్, ల్యాండ్ అక్విజిషన్, సీపీఆర్ఓ, యూబీడీ విభాగాలకు 2 చొప్పున, హౌసింగ్ విభాగానికి ఒక ఫిర్యాదు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 6 ఫిర్యాదులు అందాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 112 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, గీతా రాధిక, పంకజ, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, యాదగిరి రావు, సీసీపీ శ్రీనివాస్, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, సీ.ఎం.హెచ్.ఓ డా.పద్మజ, అడిషనల్ సీసీపీలు ప్రదీప్, గంగాధర్, వెంకన్న, రంజిత్ కుమార్, వాటర్ వర్క్స్ జోనల్ మేనేజర్ సాయి రమణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాములు నాయక్, యూబీడీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, యూసీ డీపీడీ దేవేందర్ రెడ్డి, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, జె.సి రెవెన్యూ మహేష్ కులకర్ణి, డిప్యూటీ సీఈ పనస రెడ్డి ఇరిగేషన్ ఈ ఈ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

- సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26 వేలు, ఎస్ఎఫ్ఏలకు రూ.35 వేలు చెల్లించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్, సర్కిల్ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య, వీరయ్యలతో కలిసి ఆయన మాట్లాడారు. జీహెచ్ఎంసీ పరిధిలో మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎండ తీవ్రత పెరిగినందున కార్మికుల తోఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకే పనిచేయించాలని కమిషనర్‌ను కోరారు. 60 ఏండ్ల వయసు దాటిన, మరణించిన లేదా దీర్ఘకాల అనారోగ్యం కారణాలవల్ల హాజరు కానీ సుమారు 3 వేల మంది కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తక్షణమే పని కల్పించాలని కోరారు. రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు. ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మున్సిపల్ కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జీహెచ్ఎంసీ వర్కర్లకు సబ్బులు, నూనె, కిట్లు, చెప్పులు, డ్రెస్‌లు ఇవ్వక మూడు సంవత్సరాలు గడుస్తున్నాయని, ఇప్పటికైనా వాటిని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు 26,000 మంది పారిశుధ్య కాంటాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ సిబ్బంది 25 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నా పర్మినెంటుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఎలాంటి రక్షణ సదుపాయాలు కల్పించకపోవడంతో పనిచేస్తున్న క్రమంలో ప్రమాదాలు జరిగి అనేకమంది మరణిస్తున్నారని గుర్తు చేశారు. అటువంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం చెల్లించడం లేదన్నారు. 11వ పీఆర్సి నిర్ణయించిన కనీస వేతనం రూ.19000, రూ.22,900, రూ.31,040లను కేటగిరి వారిగా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పారిశుధ్య కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాశ్వతమైన పనులకు శాశ్వతమైన కార్మికులను నియమించాలనిసుప్రీంకోర్టు ఆదేశాల సైతం అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం మనోహర్, నాయకులు పాల్గొన్నారు.



మసీదుల వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంజాన్ మాసంలో మసీదుల వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతూ జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌కు ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జల్ పల్లి మున్సిపాలిటీ కార్య నిర్వాహక అధ్యక్షులు షర్ఫుద్దీన్ హామేద్ మాజీ కౌన్సిలర్ షేక్ అబ్జల్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రతి రంజాన్ మాసంలో ప్రత్యేక నిధులు కేటాయించి మసీదులు ఈద్గాల వద్ద పారిశుధ్య పనులు చేయించేవారన్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం తరపున ఇఫ్తార్ పార్టీలు, పేద ముస్లిం సోదరులకు రంజాన్ ముబారక్ కానుకగా దుస్తులు ఇచ్చేవారని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమన్ని విస్మరించిందన్నారు. కొద్ది రోజుల్లో రంజాన్ మాసం ప్రారంభం కాబోతున్నదని, ప్రభుత్వం తరపున ఎలాంటి ఏర్పాట్లు చేపట్టలేదని విమర్శిం చారు. ఈ రంజాన్ మాసంలో కూడా ముస్లింలకు రంజాన్ ముబారక్ కానుకలు ఇస్తారన్న నమ్మకం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ శ్రీ చైతన్యలో ఘనంగా పాదపూజ మహోత్సవం



నవతెలంగాణ-చంపాపేట్

కర్మన్ ఘాట్ పరిధిలోని శ్రీ చైతన్య పాఠ శాలలో సోమవారం భారతీయ సంస్కతిని సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఘనంగా పాదపూజ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పసిడి కలశాలతో పాదాలు కడిగి వారి దీవెనలు అందుకున్నారు. విద్యార్థులకు నైతిక విలువలు, వినయ విధేయతలను పెంపొందించే విధంగా సంస్కృతి సాంప్రదాయాలకు శ్రీ చైతన్య విద్యా సంస్థలు పెద్దపీట వేశాయని ప్రధానోపాధ్యాయులు ఫణిమాధవి తెలిపారు. బాల్యంలోనే విద్యార్థులు మంచి గుణాలు పెంపొందించుకోవాలి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులకు అభినందనలు, విద్యార్థులకు దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో విజయం సతీష్, ఆర్.ఐ. రవీందర్ రెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ రఘువంశీ, ప్రిన్సిపాల్ ఫణిమాధవి, వైస్ ప్రిన్సిపాల్ సుందర్ సింగ్, డీన్ సతీష్, అధ్యాపక సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూ బాధితులకు పాసు బుక్కులివ్వండి

- సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

మండలంలోని అనాజ్ పూర్ గ్రామ రెవెన్యూ సర్వేనెం. 274, 275,276,277,278,281 సీలింగ్ భూ బాధితులకు పట్టా పాసు బుక్కులు ఇవ్వాలని సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య అన్నారు. అనాజీపూర్ గ్రామానికి చెందిన 125 మంది భూబాధితులు 125 ఎకరాలకు సంబంధించిన పాసుబుక్కులు ఇవ్వాలని ఇవ్వాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ధరణి వచ్చిన తర్వాత, కొత్త పాసు బుక్కులివ్వకుండా, ఆన్ లైన్ నుంచి రైతుల వివరాలు తొలగించి వారి బతుకులు ఆగం చేశారన్నారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా న్యాయం జరగలేదన్నారు. ఇక్కడ ప్రాంతాల్లో ఫిలింసిటీ, సంఘీ పరిశ్రమలు ఉండడం వల్ల ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వం వారికి అప్పజెప్పడం కోసం తహతహలాడుతున్నదన్నారు కానీ అనాజ్ పూర్ సీలింగ్ రైతులకు న్యాయం జరిగే వరకు ఎర్రజెండా పోరాడుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు పట్టా పాసుబుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నరసింహ, మండలం కమిటి సభ్యులు ముత్యాలు, శీను, వర్కాల బాలరాజ్, గుండె శివ, లింగ స్వామి, రైతులు మహేష్ రవి బిక్షపతి,రాములు, శ్రీనివాస్ తో పాటు సుమారుగా వంద మంది రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నూతన టెక్నాలజీని వాడాలి

- సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాస్



నవతెలంగాణ- హయత్ నగర్

వ్యవసాయానికి నూతన టెక్నాలజీని రైతులు వినియోగించుకోవాలని సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. హయత్ నగర్‌లో ఉన్న కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ,ఇస్రో ఆధ్వర్యంలో సోమవారం వ్యవసాయ డ్రోన్‌లను ఉపయోగించడంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. 24 నుంచి 28 వరకు ఉంటుందని ఆయన తెలిపారు. డ్రోన్‌లను ఉపయోగించి వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ఎలా చేసుకోవాలో వివరించారు. రైతులకు ఏ విధంగా ఆధునిక వ్యవసాయంలో ముఖ్యమైనవి డ్రోన్లు, ఐ ఓ టి, సాంకేతిక ఏఐ యాంత్రిక ద్వారా ఎలా వాడుకోవాలో వివరించారు.అదేవిధంగా కూరగాయలు, పండ్ల తోటల్లో డ్రోన్‌ల వినియోగం గురించి తెలిపారు. ట్రైనింగ్ నిర్వహణ అధికారి డాక్టర్ విజయ కుమార్, గోపాలకృష్ణ శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఎం కిసాన్ మేళకు విచ్చేయుచున్న కలెక్టర్

కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన పరిశోధన సంస్థ హయత్ నగర్ లో జరుగుతున్న పీఎం కిసాన్ మేళకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, కేంద్ర వ్యవసాయ శాఖ సైంటిస్టులు విచ్చేయనున్నట్టు అధికారులు తెలిపారు.



విద్యార్థులకు సంస్కారం లేని చదువు వ్యర్థం

- శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మెన్ శ్రీధర్

నవతెలంగాణ-బడంగ్ పేట్

నేటి సమాజంలో విద్యార్థులకు సంస్కారం లేని చదువు వ్యర్థమని శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మెన్ శ్రీధర్ అన్నారు.సోమవారంబడంగ్ పేట్ లో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించిన ఫ్యామిలీ బ్లూ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సంస్కారాన్ని తెలియ చేయాలని కోరారు. విద్యతోనే సమాజంలో ప్రతి ఒక్కరికి మంచి గౌరవం వస్తుందన్నారు. శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ బ్లూ కార్యక్రమంలో విద్యార్థులు తల్లి దండ్రులకు పాదాలకు పూలు వేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఏజీఎం ఖాసిం అలీలు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం మంచి భవిషత్ ఇవ్వగలుగుతుందన్నారు. సంస్కారం లేని చదువు వ్యర్థమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేశారు.పాఠశాల డీన్ మల్లికార్జున్,శ్రీ విద్య, కో ఆర్డినేటర్ రమేష్, వి.ఓ ఉపేంద్ర, సీ బ్యాచ్ ఇంచార్జి శ్రీనివాస్,ప్రైమరి ఇన్ చార్జి మయూరి, శ్వేత ఉపాధ్యాయ బృందం,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

నవతెలంగాణ-హయత్‌నగర్

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలుచోట్ల విద్యుత్ నిలిచిపోతుందని సరూర్‌నగర్ డీఈ రామకృష్ణ ఓ ప్రకటన విడుదల చేశారు. 11 కెవి ఫనిగిరి కాలనీ ఫీడర్. బాబు కాంప్లెక్స్, తెలంగాణ చౌరస్తా, నరసింహ స్వామి టెంపుల్, మారుతి నగర్ రోడ్ నెంబర్ 4,5,6,8,9,10,54, ఎస్వీఎస్ కాలనీ,పరిసర ప్రాంతాల్లో.11 కేవీ పుష్ప గార్డెన్ ఫీడర్.పీ విటీ మార్కెట్, బి సి బి బ్యాంక్, అనుపమ కళ్యాణ మండపం, శ్రీ నగర్ కాలనీ,హుడా కాలనీ, కృష్ణవేణి నగర్, పుష్ప గార్డెన్, మెయిన్ రోడ్, జోనల్ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అధికారులు తెలిపారు.

ఆన్ జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్..



నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం 2024-27 బ్యాచ్ విద్యార్థులకుఆన్ జాబ్ ట్రైనింగ్ సంబంధిత ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మెక్. డోనాల్డ్ కంపెనీ ప్రతినిధులు శ్రీకాంత్, తరుణ్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు. ఈ కార్యక్రమంలో బీబీఏ కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. సుబ్రహ్మణ్యం. డాక్టర్ పి. రమాదేవి, డాక్టర్ బి. నరసింహ, డాక్టర్ ఎస్. శారా దేవి, శ్రీ బాలా నాయక్, మరియాదాస్ పాల్గొన్నారు. మూడు సంవత్సరాల పాటు ఆన్ జాబ్ శిక్షణను విజయవంతంగా ఎలా పూర్తి చేయాలో విద్యార్థులకు నేర్పించారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష

నవతెలంగాణ-హయత్‌నగర్

ఓ మహిళాపై లైంగికదాడి కేసులో నిందితుడికి 20 సంవత్సరాలు జైలు శిక్ష, 5వేల రూపాయల జరిమానను రంగారెడ్డి జిల్లా కోర్టు విధించింది. అలాగే బాధితురాలికి రూ.3 లక్షల నష్టపరిహారం మంజూరు చేయాలని సోమవారం తీర్పు వెలువరించింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పులి మామిడి కు చెందిన తిమ్మగళ్ళ శ్రీనాథ్ 2017లొ లైంగికదాడి కేసులో అరెస్టయ్యాడు. పూర్తి ఆధారాలు పరిశీలించిన కోర్టు.. నిందితుడికి శిక్ష విధిస్తున్నట్టు తీర్పు వెలువరించింది.

అనారోగ్యంతో యువకుడు ఆత్మహత్య



నవతెలంగాణ-హయత్‌నగర్

అనారోగ్యంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వనస్థలిపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఆటో నగర్‌లో నివాసం ఉంటున్న సయ్యద్ అయాన్(20) అనారోగ్య కారణంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా ఏఎల్ఎన్ రావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ -సిటీబ్యూరో

ఎక్స్ఎండబ్ల్యూఎస్ ఎస్సి గ్రౌండ్స్ అంబర్‌పేట్‌లో ఏఎల్ఎన్ రావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం, ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎంతో ఆసక్తికరంగా వివిధ కోర్టులకు సంబంధించిన టీములు పాల్గొన్నాయి. ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ సిటీ సివిల్ కోర్టు, జ్యుడీషియల్ ఎంప్లాయిస్ హైదరాబాద్, రంగారెడ్డి డిస్ట్రిక్ట్ అసోసియేషన్, షాద్నగర్ బార్ అసోసియేషన్, కూకట్‌పల్లి అసోసియేషన్. ఎంసీసీటీపీ (నాంపల్లి). రెంట్ కంట్రోలర్ బార్ అసోసియేషన్. మల్కాజిగిరి కోర్టు బార్ అసోసియేషన్. స్మాల్ కాజ్ కోర్టు జ్యుడీషియల్ ఎంప్లాయిస్ హైదరాబాద్, సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎంప్లాయిస్, దాదాపు 12 టీములు పాల్గొన్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో కార్యక్రమం అత్యంతం ఆసక్తికరంగా జరిగింది. ఎల్బీనగర్ కోర్టు అడ్వకేట్ బార్ అసోసియేషన్ వారు మొదటి స్థానం సాధించి విజేతగా నిలిచారు. రన్నరప్‌గా సిటీ సివిల్ కోర్టు ఎంప్లాయిస్ సిబ్బంది ఉన్నారు. కార్యక్రమాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగేష్ భీమపాక ఎంతో ఆసక్తికరంగా తిలకించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. న్యాయవాదులు జ్యుడీషియల్ ఎంప్లాయిస్ కోర్టు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





లంబాడీ, సుగాలి (బంజారా) వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక

నవతెలంగాణ-చంపాపేట్

లంబాడీ సుగాలి బంజారా వెల్ఫేర్ ట్రస్ట్, పద్మారావు నగర్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బంజారా వివాహ పరిచయ వేదిక అత్యంత వైభవంగా నిర్వహించారు. మొదటగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ కి భోగ్ కార్యక్రమంతో ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి బంజారా అవివాహిత యువతి, యువకులు, వారి కుటుంబ సభ్యులతో హాజరు కావటంతో గొప్ప సంబరంగా పరిచయ వేదిక సాగింది. యువతి, యువకులు ఎంతో ఉత్సాహంగా వారి స్వయం పరిచయంతో వారి అభిరుచులు, అభిప్రాయాలు తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన ట్రస్ట్ వారిని అభినందించారు. భవిష్యత్తులో ట్రస్ట్ వారు ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎం. ఆర్ శంకర్ నాయక్ ఐఏఎస్(రిటైర్డ్), అధ్యక్షులు డి.టి నాయక్ ఐపీఎస్(రిటైర్డ్), జగన్నాథరావు ఐ పీఎస్ (రిటైర్డ్), ఉపాధ్యక్షులు రవీందర్ నాయక్, పాండు రంగా నాయక్, జనరల్ సెక్రెటరీ ఏ. శ్రీమన్నారాయణ, ట్రెజరర్ జి.శంకర్ నాయక్, అడ్వకేట్ జోగ్ రామ్ తేజావత్, హేము నాయక్, హార్టికల్చర్ డిపార్ట్మెంట్ బాబు నాయక్, కృష్ణ నాయక్, హరి రామ్, హమ్ బంజారా రామ్ లక్ష్మణ్, బాబు నాయక్, ట్రస్ట్ ఇతర కార్య వర్గ సభ్యులు పాల్గొన్నారు.

కెనడీ స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటల



నవతెలంగాణ -నాగోల్

ప్రస్తుత తరుణంలో చాలామంది విద్యార్థులు గుండెపోటు గురవుతున్నారని, అదంతా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల నిర్వాహకులు చేసిన ఒత్తిడే కారణమని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. నాగోల్ లో ఉన్న కెనడి హైస్కూల్లో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు సమాజం పట్ల అవగాహన కలిగించేలా పాఠశాల యాజమాన్యాలు హితబోధ చేయాలని కోరారు. విద్యార్థులకు చదువు, క్రీడలు,ఆటా,పాటలు, సాంస్కృతిక, కార్యక్రమాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమం లో మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ కరుణాకర్ రెడ్డి,వైస్ కరస్పాండెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో సహజ సిద్ధ హెర్బల్ ఉత్పత్తుల పాత్ర కీలకం



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆరోగ్య సంరక్షణలో సహజ సిద్ధ హెర్బల్ ఉత్పత్తులు కీలక పాత్ర పోషిస్తాయని ఐఏఎస్ విజయ కుమార్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల బాటనీ, మైక్రోబయాలజీ విభాగాల ఆధ్వర్యంలో సర్వవ్యాపి హెర్బల్ ఉత్పత్తుల వారి సౌజన్యంతో ఔషధ మొక్కలు, వాటి ఉత్పత్తుల తయారీ, ఉపయోగంపైన అవగహన కార్యక్రమం నిర్వహించారు. సర్వ వ్యాపి హెర్బల్ ఉత్పత్తుల సంస్థ అధిపతి రాజేశ్వరి వివిధ హెర్బల్ ఉత్పతులు వాటి తయారీ, లభ్యత, ఆరోగ్య సంరక్షణలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. సహజ ఔషధ ఉత్పత్తి ఆరోగ్యం, ఆర్థికంగా ఎంతో ఎదుగుదలకు ఉపయోగపడుతుందని వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్. విప్లవ దత్ శుక్లా అన్నారు. సహజ ఔషధ ఉత్పత్తులపై అవగహన కల్పించిన ప్రధాన వక్త రాజేశ్వరిని, కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన బాటనీ అధ్యాపకులు డాక్టర్.నాగరాజు, మైక్రోబయాలజీ అధ్యాపకులు డా.రాగ సుధలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డా.యాదయ్య, డా.కృష్ణవేణి, డాక్టర్ సుధారాణి, రమ్య శ్రీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రూ.26వేల వేతనం ఇవ్వాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్/ధూల్‌పేట్

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ గోషామహల్ జోన్ కన్వీనర్ కె.జంగయ్య అన్నారు. సోమవారం గోషామహల్ జీహెచ్ఎంసీ సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్ దుబ్బాక లావణ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దూరప్రాంతాలలో ఉన్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తెల్లవారు జామున 4 గంటలకు నిద్రలేచి డ్యూటీకి వస్తు కాయకష్టం చేస్తున్న మున్సిపల్ కార్మికులకు జీతాలు సరిపడక అష్టకష్టాలు పడుతున్నారని ఆవేని వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ సూపర్‌వైజర్లకు నెలకు రూ.35వేల వేతనం, ప్రతి నెల పెట్రోల్ ఖర్చులు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లలిత, ఈశ్వరమ్మ అమృతమ్మ, సుకన్య ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారులకు 'డబుల్' ఇండ్లను కేటాయించాలి

సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.దశరథ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు దారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని సీపీఐ (ఎం) గ్రేటర్ హైదరా బాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.దశరథ్ రాష్ట్ర ప్రభుత్వంను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం దరఖాస్తు దారులతో సుందర విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం) ముషీరా బాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.దశరథ్ హాజరై మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో సుమారు 40వేల మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని వీరందరికీ మిగిలిపోయి ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించా లని, సొంత జాగాలు ఉన్న వారికి వెంటనే రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సొంత జాగాలు లేనటువంటి వాళ్ళందరికీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్ల నిర్మాణానికి డబ్బులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆలస్యం చేస్తే హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని బస్తీలలో ఇందిరమ్మ ఇండ్ల సాధన కోసం కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని లబ్ధిదారులందరూ ఇండ్లు సాధించేంతవరకు ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సీపీఐ(ఎం)పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గ కార్యదర్శి ఆర్. వెంకటేష్, జోన్ కార్యదర్శివర్గ సభ్యులు కే రమేష్, హెచ్‌సీఎఫ్ నాయకులు వి.విజయకుమార్, ముషీ రాబాద్ జోన్ కమిటీ సభ్యురాలు వెంకటమ్మ, నాయకులు మల్లయ్య, నారాయణమ్మ, రమణమ్మ, రాజు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్టకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- కీసర, ఏడుపాయల, బీరంగూడకు 440 బస్సులు
- నేటి నుంచి 28వరకు ప్రయాణికులకు అందుబాటులో..



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరం నుంచి కీసరగుట్ట, ఏడు పాయల జాతర, ఇతర శైవా క్షేత్రాలకు వెళ్లే ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా నేటి నుంచి కీసరగుట్ట జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. ఇందుకోసం దాదాపు 285 బస్సులను కేటాయించింది. మహాశివ రాత్రి పండుగను పురస్కరించుకొని భక్తులు కీసర గుట్ట జాతరకు అత్యధికంగా తరలివెళ్లే విషయం తెలిసిందే. దీనిని గుర్తించిన ఆర్టీసీ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మహా శివరాత్రి పండుగను తెలంగాణ జిల్లాలతో పాటు ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. మహాశివరాత్రి సందర్భంగా చాలా మంది భక్తులు ఉపవాస దీక్షలు చేపడతారు. మరికొందరు పండుగ సందర్భంగా కీసరగుట్టను సందర్శిస్తారు. ఆ రోజు ప్రత్యేక పూజలు చేయడం వల్ల మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. అందుకే శివరాత్రి నాడు కీసరగుట్టకు చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అక్కడే రాత్రిపూట నిద్రించి మరుసటి రోజు తిరుగు ప్రయాణమవుతారు. అయితే కీసరగుట్ట జాతర ఈనెల 24 నుంచి మార్చి 1వ తేదీ వరకు ఆరు రోజుల పాటు వైభవంగా జరగనుంది. ఇందుకోసం ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గత సంవత్సరం పెద్దసంఖ్యలో ఈ జాతరకు భక్తులు హాజరైనట్టుగా అంచనాకొచ్చిన ఆర్టీసీ అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ పరిధిలోని ప్రధాన కేంద్రాల నుంచి ఆర్టీసీ బస్సులను నడు పనుంది. ఇందులో సికింద్రాబాద్ (రెజిమెంటల్ బజార్), ఈసీఎల్ క్రాస్ రోడ్డు, అమ్ముగూడ, ఉప్పల్ క్రాస్ రోడ్డు నుంచి బస్సులు ప్రారంభ మవుతాయని టీజీఎస్ఆర్టీసీ గ్రేటర్ హైదరా బాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తెలిపారు. ప్రత్యేక బస్సులకు సంబంధించిన సమాచారం కోసం కోఠి బస్ స్టేషన్‌లో 9959226160, సికింద్రాబాద్ రేతిఫైల్ బస్ స్టేషన్‌లో 9959226154 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

బస్సుల సంఖ్య ఇలా..

బయలుదేరు స్థలం	వరకు	బస్సుల సంఖ్య
రెజిమెంటల్ బజార్	కీసరగుట్ట	90
ఈసీఎల్ క్రాస్ రోడ్డు	కీసరగుట్ట	100
అమ్ముగూడ	కీసరగుట్ట	70
ఉప్పల్	కీసరగుట్ట	25
మొత్తం	-	285
సీబీఎస్	ఏడుపాయల	125
పటాన్‌చెరువు	బీరంగూడ	30

ఓపీఎస్ విధానాన్ని పునఃప్రారంభించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పోస్టల్ బిల్లులు, ఎన్‌పీఎస్, యుపీఎస్ విధానాన్ని రద్దు చేస్తూ ఓపీఎస్ విధానాన్ని పునః ప్రారంభించాలని అఖిలభారత తపాల ఉద్యోగుల సంఘం ఏఐపీఈయు నాయకులు ఆర్‌పీ సారంగ్ అన్నారు. సోమవారం అఖిలభారత తపాల ఉద్యోగుల సంఘం పోస్ట్‌మాన్, ఎంటీఎస్ రాష్ట్ర 4వ ద్వైవార్షిక మహాసభలు తెలంగాణ సరస్వత పరిషత్ హ్యాబిట్స్ నందు సీహెచ్ కుమార్ అధ్యక్షతన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఇండిపెండెంట్ డెలివరీ సిస్టం, మేకనైజడ్ బీట్ల కోసం సొంత వాహనాన్ని తీసుకురావాలని ఆలోచన విధానాన్ని రద్దు చేయాలని పోస్టుమెన్ మీద అకౌంట్ల పేరుతో టార్గెట్ల పేరుతో ఇబ్బందికి గురి చేస్తున్నారని దానిని వ్యతిరేకిస్తున్నామని తపాల శాఖను ప్రయివేటీకరణ చే యాలనే ఆలోచన విధానాన్ని తిప్పికొడుతూ మార్చి 3న ఛలో ఢిల్లీ కార్యక్రమం చేస్తున్నామని జంతర్ మంతర్‌లో జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి ఈ మధుసూదన్‌రావు, ఈ.సురేష్ ఆర్ 4 మాజీ అఖిలభారత కార్యదర్శి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎం.నగేష్ ఏఐటీయూసీ రాష్ట్ర నాయ కులు బోస్ కాన్ఫరేషన్ జనరల్ సెక్రెటరీ అజీజ్ పి 3 రాష్ట్ర కార్యదర్శి ఏ.శ్రవణ్ కుమార్ కోఆర్డినేషన్ కమి టీ ఛైర్మెన్ జలాలుద్దీన్ అడ్మిన్ యూనియన్ సర్కిల్ సెక్రటరీ శ్రీకాంత్ , అకౌంట్ సర్కిల్ సెక్రెటరీ సోమేశ్ సీనియర్ జర్నలిస్టు పాపారావు తదితరులున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



- ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రజలకు అవసరాలకు అనుగుణంగా నిర్మించే కమిటీ హాల్ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్ పరిధిలోని ఉన్ని కోటాలో రూ.కోటి10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటీ హాల్ స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్ని కోటాలో దాదాపు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని చిన్న శుభకార్యం జరుపుకోవాలన్న బయటకు వెళ్లాల్సి వస్తుందని ఫంక్షన్ హాల్‌లో చేసుకోవాలంటే రేకారిడితే డొక్కాడని తమలాంటి వారికి భారమవుతుందని అందుకే పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా ఉంటున్న ఇక్కడ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జీ ప్లస్ వన్‌గా నిర్మాణం చేపడుతున్న కమ్యూనిటీ హాల్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి ఆరు నెలల్లో పూర్తి చేసి బస్తీ వాసులందరూ కమ్యూనిటీ హాల్‌ను కాపాడుకోవాలని శుభకార్యాల కోసం వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్, కార్యదర్శి సాయికుమార్, వల్లాల శ్రీనివాస్ యాదవ్. మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, రాజశేఖర్ గౌడ్, చిత్రాల నగర్ శ్రీహరి, వల్లాల రవి యాదవ్, రాజు యాదవ్, రాజేష్, నర్సింగ్, సురేష్, శివ, వెంకటేష్, కొండ్రు మాధవి, రూప, మంజుల, ఉన్ని కోట వాసులు బీఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు

ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు..

- జోనల్ కమిషనర్ టీ. వెంకన్న..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. ఆయన పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫలక్‌నుమా సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణం పై ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. బస్తీ, కాలనీలలో నెలకొన్న సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్విని యోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజా, ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులున్నారు.

'బీసీ పారిశ్రామికవేత్తలను ఏకతాటిపైకి తీసుకొస్తాం'

- రాష్ట్ర అధ్యక్షుడిగా దామోదర చారి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

బీసీ పారిశ్రామికవేత్తలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో పారిశ్రామిక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు జేఏసీ స్టేట్ ఛైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ వెల్లడించారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ పారిశ్రామిక విభాగానికి దామోదర చారిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ బీసీలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఈ విభాగం పని చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఇస్తున్న రాయితీలు, రిజర్వేషన్లు బీసీ పారిశ్రామికవేత్తలకు కూడా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. బీసీ పారిశ్రామికవేత్తలు బీసీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కాప్రా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అధ్యక్షులు యాదయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, జాయింట్ సెక్రటరీ హీరాలాల్, సభ్యులు బాలు, కొండల్‌రావు తదితరులున్నారు.

ఓజేటీసీ ఎంపికైన విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ప్రభు



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీబీఏ విభాగం ఆధ్వర్యంలో బీబీఏ రిటైల్ ఆపరేషన్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మెక్ డోనాల్డ్ కంపెనీ ప్రతినిధులు సోమవారం కళా శాలలో ఆన్ ద జాబ్ ట్రైనింగ్ కి ఇంటర్వ్యూ నిర్వహించడం జరిగింది. ఈ ఇంటర్వ్యూలో 13 మంది విద్యార్థులు సెలక్షన్ అయ్యారు. వీరికి మూడు సంవత్సరాలు కళాశాల విద్యతో పాటు ఇంటర్న్ షిప్ ఉంటుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.కె.ప్రభు అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీబీఏ విభాగాధిపతి విరాల సంతోషితో పాటు అధ్యాపకులు, పాల్గొన్నారు.

మహాశివరాత్రికి మున్సిపల్ కార్మికులకు సెలవు ఇవ్వాలి

- సీఐటీయు నగర ఉపాధ్యక్షులు జి.రాములు



నవతెలంగాణ-అంబర్‌పేట

26న దేశవ్యాప్తంగా మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మున్సిపల్ కార్మికులు ఆ రోజంతా ఉపవాసం, జాగరణ లాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంటారు. 27న ఉదయం హాజరుతో 10 గంటల తర్వాత కార్మికుల పనులకు సెలవు ఇవ్వాలని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయు నగర ఉపాధ్యక్షులు జి.రాములు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నందు పనిచేస్తున్న 18600 మున్సిపల్ సిబ్బందికి 26న దేశవ్యాప్తంగా మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మున్సిపల్ కార్మికులు ఆ రోజంతా ఉపవాసం, జాగరణ లాంటి కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంటూనే పారిశుద్ధ్య పనులు చేస్తారు. పండుగ మరుటి రోజు ఫిబ్రవరి 27న ఉదయం హాజరుతో కార్మికుల పనులు ఉదయం 10 గంటల లోపు పూర్తిచేసుకొని కార్మికులకు సెలవు ఇవ్వడం గత ఆనవాయితీగా వస్తుంది. గతంలో కమిషనర్‌గా ఉన్న ఆమ్రాలి కూడా ఇదే పద్ధతిలో సెలవు ఇచ్చారు. కావున కార్మికుల మనోభావాలు దెబ్బతినకుండా వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మహాశివరాత్రి పండుగ సందర్భంగా 27న సెలవు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జీహెచ్ఎంసీ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుధాకర్, అంజయ్య, మీనా, కిషన్ ,రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించండి

- మెహిదీపట్నం ఏడీఈ బిక్కు



నవతెలంగాణ మెహిదీపట్నం

విద్యుత్ వినియోగదారులు సకాలంలో తమ విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థకు తోడ్పడాలని మెహిదీపట్నం అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రిక్ ఇంజనీర్ ఆర్.బిక్కు విజ్ఞప్తి చేశారు. మాసబ్ ట్యాంక్ లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లిస్తే సంస్థ అభివృద్ధికి ఎంతో తోడ్పాటును అందించినట్లు అవుతుందన్నారు. విద్యుత్ సిబ్బంది బిల్లుల వసూళ్లకు చాలా సమయాన్ని కేటాయించాల్సి వస్తుం దని అయినా బిల్లులు పేరుకపోతున్నాయని తెలిపారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లిస్తే విద్యుత్ సిబ్బందికి ఎంతో సమయం మిగులుతుందని తద్వారా వినియోగదారులకు నాణ్యమైన మరింత మెరుగైన సేవలను అందించడానికి వీలవుతుందన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు 24 గంటలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

గోషామహల్ సర్కిల్ 14 డిప్యూటీ కమిషనర్‌గా దుబ్బాక లావణ్య బాధ్యతలు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జీహెచ్ఎంసీ గోషామహల్ సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్ గా దుబ్బాక లావణ్య ఇటీవలే బాధ్యతలు చేపట్టారు. సోమవారం అబిడ్స్ కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలోని సమస్యలను ప్రజలు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సర్కిల్ పరిధిలోని అపార్ట్‌మెంట్ లో ఉన్న ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేరుగా చేసి తమ అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చే చెత్త సేకరణ ఆటో ట్రాలీలలో వేయాలని అపార్ట్‌మెంట్ వాసులకు సూచిం చారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకొని వారు వార్డు కార్యాల యాలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీసీ కులగనన లో మిస్ అయినా వారు కూడా వార్డు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవా లని సూచించారు. ఆస్తి పన్ను బకాయిదారులు వెంటనే వారి ప్రాపర్టీ పన్నును చెల్లించాలని బకాయిదారులకు కోరారు. తోపుడు బండ్ల నిర్వాహకులు, హొటల్ నిర్వాహకులు, దుకాణ దారులు ప్లాస్టిక్ సంచులు (క్యారీ బ్యాగులు)లు వాడకూడదని అన్నారు. వాడిన వారిపై జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు.

ముషీరాబాద్ సర్కిల్ 15 డీఎంసీ రామానుజుల రెడ్డికి సన్మానం



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ సర్కిల్ 15 డీఎంసీ రామానుజుల రెడ్డిని తన కార్యాలయం లో కలిసి సన్మానించారు. కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు తేజ గౌడ్ ముషీరాబాద్‌లో పారిశుద్ధ సమస్యలు లేకుండా చూడాలని కోరారు. రోడ్ల పైన ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ అవగాహన కల్పిస్తూ ఆదర్శవంతంగా ఉండాలని కోరారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

- సీఎం రేవంత్ రెడ్డికి నివేదిస్తాం
- రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఛైర్మెన్ బక్కి వెంకటయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిం చాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి కమిషన్ తరపున నివేదిక అందజే స్తామని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమీషన్ ఛైర్మెన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15శాతం నిధులు కేటాయించాలని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కె.లక్ష్మీ నారాయణ హాజరై మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ ద్వారా విద్యా హక్కు కల్పించకపోతే దళితులు చదువుకు దూరమయేవారన్నారు. మనువాద భావాజాలం వల్లనే విద్యకు బడ్జెట్ కేటాయించకుండా దళితులను విద్యకు దూరం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. ఎంవీ పౌండేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం 15 శాతం బడ్జె ట్ కేటాయించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. ప్రభుత్వ విద్యాలయంలో నాణ్యమైన, సమాన విద్యను అందించి ప్రభుత్వ విద్య వ్యవస్థను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రాము బాబు నాయక్, పీడీఎస్‌యు రాష్ట్ర నాయకులు నాగరాజు, అనిల్, హరీష్, హైకోర్టు న్యాయ వాదుల సాధిక్, దివాకర్, వివిధ సంఘాల నాయకులు మెట్ల శంకర్ మామిడి నారయణ, నర్సింగరావు, జనార్దన్, రఘునందన్, పులి కల్పన సువర్ణ, బాగ్య చుంచు రాజేందర్, దాసరి ఎగొండ, దుబాషి సంజీవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆటపాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి

- ప్రముఖ విద్యావేత ఫోనిక్స్ గ్రూప్ స్కూల్స్ డైరెక్టర్ మహమ్మద్ ఆసిఫ్ ఖాన్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఫోనిక్స్ ఇంటర్నేషనల్ గ్రూప్స్ ఆఫ్‌కు స్కూల్స్ మాసబ్ ట్యాంక్ బ్రాంచ్ గ్రాండ్ యాన్యువల్ ఫిస్ట్ సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ విద్యావేత గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ మహమ్మద్ ఆసిఫ్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అమోఘమైనటవంటి ప్రతిభ దాగి ఉందన్నారు. విద్యార్థుల ఆటపాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్ని రంగాలలో వారికి శిక్షణ అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోనిక్స్ ఇంటర్నేషనల్ గ్రూప్స్ ఆఫ్‌కు స్కూల్స్ కరస్పాండెంట్ ప్రసన్న, టీచర్‌లు సిబ్బంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి



- మున్సిపల్ ఎంప్లాయిస్ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్

నవతెలంగాణ-ధూల్‌పేట్

పెరుగుతున్న ధరలకనుగుణంగా మున్సిపల్ కార్మికుల కనీస వేతనాలు పెంచాలని మున్సిపల్ ఎంప్లాయి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నర్కిపూల్ బాగ్ జీహెచ్ఎంసీ చార్మినార్‌జోన్ జోన ల్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలకు పెం చాలన్నారు. కార్మికులతో జీహెచ్ఎంసీ అధికారులు వెట్టి చాకిరీ చేయిస్తూ వారి శ్రమను దోచుకొంటున్నారన్నారు. కార్మికుల కష్టార్జితంతో హైదరాబాద్ నగరం సుందరంగా ఉందనేది మరచి పోవద్దన్నారు. ఆదివారం పండుగల సందర్భంగా సగం రోజు పని దినం కల్పించాలని డిమాండ్ చేశారు. 60 ఏండ్లకు పై బడిన కార్మికుల స్థానంలో లాంగ్ ఆబ్సెంట్ ఉన్న వారి స్థానంలో అనారోగ్యంతో పని కి రాని వారి స్థానంలో వెంటనే వారి కుటుంబ సభ్యులకు పని కల్పించాలని కోరారు. ఎండ కాలం రీత్యా పని గంటలలో మార్పు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్, వి. రాంకుమార్, ఎ. కృష్ణ శ్రీను, పరమేష్ నరసింహ, లక్ష్మీ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నిత్య పరిశోధకుడు, బహుభాషా వేత్త నలిమెల భాస్కర్

- సిటీ కాలేజ్ మఖ్దూమ్ పురస్కార సభలో ఆచార్య వెలుదండ నిత్యానందరావు



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆధునిక తెలుగు సాహిత్యంలో పరిశోధకుడిగా బహుభాషా వేత్తగా, అనువాదకుడిగా, రచయితగా విశేషంగా కృషి చేసి డా. నలిమెల భాస్కర్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కార ప్రదాన సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. విభిన్న భాషాల్లో నిరంతరం కృషి చేస్తున్న నలిమెల భాస్కర్‌కి మఖ్దూమ్ పురస్కారం ప్రదానం చేయటం ఎంతో సముచితమైన నిర్ణయమన్నారు. మన తెలంగాణ సంపాదకులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో అభ్యుదయ సాహిత్యానికి కేంద్రబిందువుగా మఖ్దూమ్ వెలుగొందారన్నారు. మఖ్దూమ్ ఆశయాలను, ఆదర్శాలను ఈ తరం కొనసాగించాలన్నారు. ప్రముఖ కవి యాకూబ్ మాట్లాడుతూ.. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రా తృత్వంపై మఖ్దూమ్ చూపిన బాటలో అందరం నడవాల్సిన సందర్భం అన్నారు. పురస్కారాన్ని అందిస్తున్న నిర్వాహకులు, అవార్డు గ్రహీతలు, సిటీ కళాశాల విద్యార్థులు మఖ్దూమ్ తాత్విక వారసత్వాన్ని కొనసాగించాలన్నారు. అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ.. నలిమెల భాస్కర్ చాలా చిన్న వయసు నుండే పద్య కవిత్వంతో పాటు వచన సాహిత్యంలో కూడా మంచి ప్రతిభ కనబరి చారని నవలలు కూడా రాశారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ.. సిటీ కాలేజ్ పూర్వ అధ్యాపకుడైన మఖ్దూమ్ పేరుతో జాతీయ పురస్కారాన్ని ఉత్తమ సాహితీ వేత్తలకు 2019 నుండి పురస్కారం ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ అవార్డు కింద పది వేలు నగదు బహుమతి, జ్ఞాపికను అందజేసి అతిథులు నలిమెల భాస్కర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి అవార్డు కమిటీ కన్వీనర్ డాక్టర్.విప్లవ్ దత్ శుక్లా, సభ్యులు డాక్టర్. యాదయ్య, డాక్టర్. కోయి కోటేశ్వరావులు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వెల్చాల కొండల రావు, తెలంగాణ సాహిత్య అకాడెమీ కార్యదర్శి డాక్టర్.నామోజు బాలాచారి, అడిష నల్ కలెక్టర్ శ్యామ్ లాల్, వాహేద్, కవయిత్రి విమల, కరీం నగర్ సాహితీ సోపతి మిత్రులు డాక్టర్.బూర్ల వెంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, పొన్నం రవిచంద్ర, కందుకూరి అంజయ్య కాలేజ్ అధ్యాపక వర్గం, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయండి



- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవ తెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లోని పలు బస్తీ ఇంజనీరింగ్ విభాగంలోని పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. సోమవారం కార్పొరేటర్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీ.వీ గిరి నగర్, ధోభి ఘాట్, మాల బస్తీ లతో పాటు పలు చోట్ల శబద్ బండల ఏర్పాటు పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన మరిన్ని అభివృద్ధి పనులను అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, ఇంజనీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, పాల్గొన్నారు.

దవాఖానాలను డీఎంహెచ్‌ఓ తనిఖీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరి సోమవారం ప్రైమరీ హెల్త్ సెంటర్, కీసర పరిధిలోని పట్టణ, గ్రామ దవాఖానలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానా రాంపల్లి వద్ద వైద్య అధికారి హాజరు కాలేదని గుర్తించారు. అదనంగా, సంబంధిత వైద్య అధికారి ఫిబ్రవరి 21వ తేదీ నుంచి హాజరు నమోదు చేయలేదు. సెలవు దరఖాస్తు కూడా నమోదు చేయలేదు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన డిఎంహెచ్ ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ప్రైమరీ హెల్త్ సెంటర్, కీసర వైద్య అధికారి నుంచి వివరమైన నివేదిక అందించవలసిందిగా ఆదేశించారు. అనంతరం చీర్యాల పల్లె దవాఖానా కూడా తనిఖీ చేశారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభిపూర్ కార్యాలయంలో సోమవారం దుండిగల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు శివ యాదవ్ జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు ని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియచేశారు.
నవతెలంగాణ-దుండిగల్

పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- వంద శాతం ఉత్తమ ఫలితాల సాధనకు విద్యా బోధన
- మెరుగైన ఫలితాలకోసం టీవీ, మొబైల్, సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలి
- శంషీ గూడ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం.తమ్మల నర్సింహులు





నవతెలంగాణ-కూకట్‌పల్లి

పదవ తరగతి వార్షిక పరీక్షలు మార్చ్ 21 నుంచి ఏప్రిల్ 4 వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో.. విద్యా శాఖ ఇచ్చిన నలభై రోజుల ప్రణాళికలో భాగంగా.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనలు కొనసాగుతున్నాయి. పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా, ప్రణాళికలతో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. స్కూల్ సెకండ రీ బోర్డు ద్వారా విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతోపూర్తి స్థాయిలో ఉపాధ్యాయుల శ్రమతో మంచి ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో, పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు చేపడుతూ.. వారిపై శ్రద్ధ చూపుతున్నారు.

ప్రతి రోజూ ప్రత్యేక తరగతులు..

పదవ తరగతిలో అత్యధిక ఉత్తీర్ణతతో పాటు మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో, ఉదయం,సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే విద్యార్థులకు స్నాక్స్ అందించాలనే ప్రభుత్వ ఆదేశాలతో పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నారను. డిజిటల్ తరగతులతో పాటు, పరీక్షల్లో ఒత్తిడి లేకుండా సిద్ధమయ్యేందుకు, పరీక్ష మోడల్ తరగతులను, పరీక్షలకు సన్నద్ధమయ్యేలా విద్యను బోధిస్తున్నారు. అలాగే పరీక్షలు ముగిసే వరకు టివిలు, మొబైల్, సోషల్ మీడియాల జోలికి వెళ్లకుండా తగు సూచనలు చేస్తూ తగు జాగ్రత్తలు చెప్తున్నారు. విద్యార్థులకు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు జాగ్రత్త వహిస్తూ విద్యాబోధన చేస్తున్నారు.

ప్రణాళికతో విద్యా బోధన..



మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికా బద్ధంగా పదవ తరగతి విద్యాబోధన చేస్తున్నామని శంషి గూడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నర్సింహులు తెలిపారు. అందులో భాగంగా.. ఉదయం, సాయంత్రం ఒక్కో గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామ న్నారు. సబ్జెక్ట్ వారీగా ప్రతి రోజూ రివిజన్లు మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు.

-శంషి గూడ హైస్కూల్ ప్రధానోపాధ్యా యులు నర్సింహులు

పది తర్వాత ఏం చదువుతారు..

- ప్రతి విద్యార్థితో ముచ్చటించిన కలెక్టర్
- ఎల్లమ్మ బండ ఉన్నత పాఠశాలజిల్లా కలెక్టర్ గౌతం పొట్రు తనిఖీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

పదవ తరగతి తరువాత ఏ దిశగా వెళ్లాలనే అంశంపై, విద్యార్థులకు క్షుణ్ణంగా అర్థమయ్యేలా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పొట్రు మార్గనిర్దేశం చేశారు. వారి భవిష్యత్తుకు చేయుతనందించేలా అన్ని పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం కూకట్‌పల్లి మండలం, ఎల్లమ్మబండలోని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టరు తనిఖీ చేసారు. ఈ సందర్భగా కలెక్టరు మాటాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు, పదవ తరగతి తరువాత ఏ కోర్సు తీసుకోవాలి అనే అంశంపై, వారికి క్షుణ్ణంగా వివరించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, మంచి కోర్సులను ఎంచుకొని మంచి భవిష్యత్తులు ఏర్పాటు చేసుకునేలా చూడాలని కలెక్టరు తెలిపారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణతో పదవ తరగతిలో విజయం సాధించి, భవిష్యత్తులో ఏమి చదవాలి అనే లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని తెలిపారు. ఆ దిశగా ముందుకు వెళ్లాలని విద్యార్థులకు తెలిపారు. పదవ తరగతిలోని ప్రతి విద్యార్థితో ముచ్చటించారు. భవిష్యత్తులో ఏమి చదువుతారని, ఏగ్రూపు తీసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తు విద్యకై అవసరమైన సలహాలను కలెక్టరు విద్యార్థులకు వివరించారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. సిలబస్ పూర్తయిందా అని, రివిజన్ ఎలా జరుగుతుందని, స్కూల్లో వసతులు ఎలా ఉన్నాయని, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు రాష్ట్ర విద్యాశాఖ ద్వారా అందజేసే ఎఫ్ఎల్ఎన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్ ద్వారా, పాఠశాలలో భాషా గణిత సామర్థ్యాలలో, వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి ప్రత్యేకమైన టూల్ ద్వారా విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ల్యాబును కలెక్టరు ప్రారంభించారు. ప్రతి విద్యార్థి 20 నిమిషాల నిడివితో పాఠలు వినాలని తప్పనిసరిగా నాలుగురోజులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్యాంప్రకాష్, తహసీల్దారు స్వామి, డిఈఓ విజయ కుమారి, పాఠశాల హెడ్ మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

అక్షయ విద్య కమ్యూనిటీ సెంటర్ ప్రారంభం

- ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు చేతుల మీదుగా అక్షయ విద్య కమ్యూనిటీ లెర్నింగ్ అండ్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ప్రారం భించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజ న్ పరిధిలోని, ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్‌లో, అక్షయ విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో..జీహెచ్ఎంసీ సహకారంతోఅక్షయ విద్య కమ్యూనిటీ లెర్నింగ్ అండ్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభంలో, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ వర్మ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహన్, యూసీడీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, కూకట్‌ప్లి డీసీ గంగాధర్, బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, బాలానగర్ ఏసీపీ హన్మంత రావు, జగద్గిరిగుట్ట ఇన్ స్పెక్టర్ నర్సింహ, కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్‌లతో కలిసి పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అక్షయ విద్య ఫౌండేషన్ ప్రారంభించుకోవడం చాల సంతోషంగా ఉందన్నారు. ఇక్కడి ప్రాంత పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ చక్కటి సదావకాశంను విద్యార్థులు సద్వినియోగపర్చుకొని ఉపాధి అవకాశాలు అందిపుచ్చు కోవాలని పేర్కొన్నారు. అక్షయ విద్య ఫౌండేషన్ సేవలు అమోఘం, పేద విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపే కాంతి రేఖ అక్షయ విద్య ఫౌండేషన్ అంటూ, వారిని ప్రత్యేకంగా అభినందించారు. 12 ఏండ్ల నుంచి అక్షయ విద్య ఫౌండేషన్ బడుగు, బలహీన వర్గాల పేద పిల్లలకు ఉచిత విద్యను అందిస్తుందని కొనియాడారు. ఈ 12 ఏండ్లలో అక్షయ సాధించినటువంటి విజయాలను గుర్తు చేశారు. 500 మంది విద్యార్థులు గురుకుల సీట్లు సాధించారని, విప్రో, గూగుల్, అలాగే ప్రభుత్వ రంగ సంస్థలైన పోస్టల్ డిపార్ట్‌మెంట్, డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారన్నారు. ప్రతిష్టాత్మకమైన ఐఐటీ ఖరగ్పూర్ లాంటి విద్యాసంస్థల్లో సీట్లు, తల్లిదండ్రులు లేని, విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి,వారి ఉన్నత చదువులకి స్కాలర్ షిప్‌ను అందించారు అని తెలిపారు.

సాంకేతిక విద్యా నైపుణ్యాలు మెరుగుపరచడం కొరకు 200 కు పైగా ల్యాప్ టాప్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులు విశాల దృక్పథం, కుతూహలం, కొత్త విషయాలపై ఆసక్తి కలిగివుండాలన్నారు. మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని గాంధీ విద్యార్థులకు తెలియచేశారు. అక్షయ విద్య ఫౌండేషన్ వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని తెలియచేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీబీఏ విద్యార్థులకు ప్లేస్మెంట్ కల్పించాలి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బీబీఏ విద్యార్థులకు ప్లేస్మెంట్ అవకాశాలు కల్పించాలని విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్, శివకృష్ణలు అన్నారు. ప్లేస్మెంట్ ఆఫీసర్‌ను నియమించి, ప్రత్యేకంగా వసతి గృహ సదుపాయాన్ని కల్పించాలని సోమవారం స్టూడెంట్స్ ప్రొడక్షన్ ఫోరమ్ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావుని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్ శివ కృష్ణలు మాట్లాడుతూ యూసీఎంహెచ్ విభాగంలో అవసరమైన సౌకర్యాల కొరత విద్యార్థుల విద్యా, వృత్తిపరమైన వృద్ధిని ప్రభావితం చేస్తోందన్నారు. నిరంతర ప్రయత్నాలు ఉన్నప్పటికీ, కొన్ని సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సరైన ప్లేస్మెంట్ మద్దతు, డిపార్ట్‌మెంట్‌కు నిర్మాణాత్మక ప్లేస్‌మెంట్ సహాయం లేక విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను పొందడం కష్టమవుతుందన్నారు. ప్లేస్‌మెంట్ కార్యాలయం లేకపోవడం నియామక కార్యకలాపాలను సమన్వయం చేయడానికి ప్రత్యేక ప్లేస్‌మెంట్ కార్యాలయం లేదన్నారు. రెగ్యులర్ ఫ్యాకల్టీ లేకపోవడం: శాశ్వత ఫ్యాకల్టీ సభ్యులు లేకపోవడం విద్య నాణ్యత, అభ్యాసంలో కొనసాగింపును ప్రభావితం చేస్తుందన్నారు. బీబీఎ విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ అవసరమన్నారు. ఈ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్లేస్‌మెంట్ సపోర్ట్ను మెరుగుపరచడంలో, ప్లేస్‌మెంట్ ఆఫీస్‌ను ఏర్పాటు చేయడంలో, రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించడంలో, బీబీఎ విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్‌ను అందించడంతో యూసీఎంహెచ్ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ప్రొఫైల్, కాశీనాథ్ రెడ్డి, వర్ధన్, నితిన్, బ్రహ్మం, అరవింద్ కుమార్,ధనుంజయ్, తనుజ్, గగన్, దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్యుమరేటర్లకు వేతనం చెల్లించాలి

- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని 9 మున్సిపాల్టీలు, 4 కార్పొరేషన్లు, 5 మండలాల్లో కుటుంబ సర్వేలో భాగంగా విధులు నిర్వహించిన 2,780 మంది ఎన్యుమరేటర్లు, 270 మంది సూపర్ వైజర్లకు వెంటనే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు వేతనాల కోసం అవస్థలు పడుతున్నారని తెలిపారు. సర్వే పూర్తి చేసి నెలలు గడిచినా ఇప్పటి వరకు వారికి వేతనం చెల్లించకపోవడం సరికాదన్నారు. రోజు వారీ టార్గెట్లు విధించి మరీ లక్ష్యం పూర్తి చేయించుకుని వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఎన్యుమరేటర్లు ఒక్కొక్కరికి రూ. 10వేలు, సూపర్‌వైజర్లు ఒక్కొక్కరికి రూ.12 వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రేపు, మాపు అంటూ కాలం వెల్లదీయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలనీ, లేకపోతే ఎన్యుమరేటర్లతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకోవాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
- ప్రజావాణికి 64 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

దరఖాస్తులను పరిశీలించి త్వరగా చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 64 ఫిర్యాదులు అందాయనీ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల్లో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్
- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-దుండిగల్

జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని, జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయన్నారు. చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్, హెల్త్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి హరి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏండ్ల తరబడి జాప్యం చేస్తున్నాయన్నారు. ఈనేపథ్యంలో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కోశాధికారి బెలిదే అశోక్ మాట్లాడుతూ ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రివ్యూ పిటిషన్ వేసి వాదనలు చేయాన్నారు. జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే కొత్త విధానం ద్వారా ఇండ్లస్థలాలు ఇవ్వాలని కోరారు.కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు.

జిల్లా సహాయ కార్యదర్శి జి.రోజా రాణి మాట్లాడుతూ మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాల యం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలన్నారు. మహిళా జర్నలిస్టులకు భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తదనంతరం ప్రతినిధి వర్గం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పటేల్ నరసింహ యాదవ్, కుత్బుల్లాపూర్ అధ్యక్షులు గడ్డమీద అశోక్, మల్కాజ్గిరి అధ్యక్షులు పబ్బు మల్లేష్ గౌడ్, ఉప్పల్ అధ్యక్షులు గంజి కృష్ణ, కూకట్ పల్లి నాయకులు కట్టెల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లా లోని అన్ని నియోజకవర్గాల నుంచి దాదాపు 120 మంది జర్నలిస్టులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉద్యమ నేత మజ్జి శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ ఉద్యమనేత, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మజ్జి శ్రీనివాస్ రావు (మెట్ల శ్రీను)జన్మదిన వేడుకలు సోమవారం జగద్గిరిగుట్టలోని ఆయన నివాసంలో కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య ఘనంగా జరిగాయి. హాజరైన పలువురు ఆయన చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్,స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌లను నివాస కార్యాలయాల్లో కలిశారు. ఈ సందర్భంగా వారు మజ్జి శ్రీనును శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ఆయన రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మజ్జి శరత్ బాబు, ఎం.సురేందర్, ఎం భవాని నాగమల్లేశ్వర్, ఎం.తనుష్, ఎం.రోషన్, సురేష్, వై.ప్రమోద్, కన్ని, లక్ష్మణ్, తమ్మయ్య, పుప్పాల శ్రీను, గోపాల్ పాల్గొన్న వారిలో ఉన్నారు.

ఫ్యాబ్రికేషన్ కార్మికునికి వేతనం ఇప్పించిన రవిసింగ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం ఇండస్ట్రీ ఏరియాలో "భాష ఖాన్ ఫ్యాబ్రికేషన్" లో ప్రవీణ్, అనే కార్మికుడు ఫ్యాబ్రికేషన్ షాప్ లో గత కొన్ని సంవత్సరల నుంచి ఫ్యాబ్రికేషన్ ఓనర్ భాష ఖాన్ దగ్గర చేసేవారు. కొన్ని అనివార్య కారణాలవల్ల కార్మికుడు ప్రవీణ్ కు రావలసిన వేత్తనం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో .. ఫ్యాబ్రికేషన్ వర్క్ మానేయడం జరిగింది. మొత్తం రావాల్సిన వేతనం రూ.25,000 వేలు ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు ఫ్యాబ్రికేషన్ ఓనర్ ఎండి.భాష ఖాన్‌ను ఎంత అడిగిన నిర్లక్ష్యం వహిస్తూ వచ్చారు. విసుగు చెందిన కార్మికుడు తమకు తెలిసిన తోటి కార్మికుల ద్వారా మనకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని, బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకున్నారు. ఆయన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరిం చారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్.. హుటాహుటిన ఫ్యాబ్రికేషన్ షాప్ దగ్గరికి వెళ్లి ఓనర్ ఎండి. భాషతో పలుమార్లు చర్చించి కార్మికుడికి మొత్తం రావాల్సిన వేతనం వేతనం రూ.25,000 వేలు ఇప్పించారు. ఫ్యాబ్రికేషన్ కార్మికుడు ప్రవీణ్ తనకు న్యాయం చేసిన రవిసింగ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఖైరతాబాద్ మండల రెవెన్యూ ఆఫీసులో సోమవారం బోరబండ డివిజనకు చెందిన 118, రహమత్‌నగర్ డివిజన్‌కు చెందిన 86 షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి 204 చెక్కులను ఒక్కొక్కరికి ఒక లక్ష 116 రూపాయలు చొప్పున, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ఖైరతాబాద్ ఎమ్మార్వో నయీముద్దీన్‌తో కలిసి, రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎస్ రెడ్డి, బోరబండ కార్పొరేటర్ బాబా పసివుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో బోరబండ, రహమత్‌నగర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరితగతిన పరిష్కరిస్తా..



- **కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్**

నవతెలంగాణ-కంటోన్మెంట్

మైత్రి వన్ కాలనీ, రామ్ రెడ్డి, నాగిరెడ్డి కాలనీల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ చెప్పారు. సోమవారం ఆయా కాలనీలలో స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీ వాసులను సమస్యలు అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మురుగు కాలువలు, రోడ్లు వీది దీపాల సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకోచ్చారు. దీంతో స్పందిచిన కార్పొరేటర్ సమస్యలను తొందరలో పరిష్కరిస్తామని, స్థానిక అధికారులకు విషయాన్ని చెప్పి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగన్ రెడ్డి, హనుమంతరావు, మహేష్, సత్తిరెడ్డి, హరీష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు



- **ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

నవతెలంగాణ-బేగంపేట్

ఉచిత వైద్య శిభిరాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని కుర్మబస్తీలో మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో ఎమ్మెల్యే బీపీ పరీక్ష చేయించుకోగా నార్మల్ ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు అధికంగా నివసించే బస్తీలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఏడాది ప్రింటర్స్ డే సందర్భంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్న నిర్వహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్ కుమార్, ఆంజనేయులు, నాగులు, పబ్బా ప్రకాష్, చంద్ర ప్రకాష్, మక్తాల ఫౌండేషన్ నిర్వహకులు జలందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది



- **ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్ వి కర్ణన్**

నవతెలంగాణ-బంజారాహిల్స్

మహిళా ఆరోగ్యం సమాజ శ్రేయస్సు కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ ఐఏఎస్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఎండో మెట్ రియోసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎల్లో రిబ్బన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఆయన ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డా. విమీ బిందారా, ప్రముఖ సినీనటి డా. సాయి కామాక్షి భాస్కరలతో కలిసి ఎల్లో రిబ్బన్ 10కే రన్ నిర్వహిస్తున్న టీ షర్ట్, పోస్టర్, పథకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, ఆడపిల్లల సంరక్షణకు చొరవ తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలో ముందుకు సాగుతుందని తెలిపారు. ఎండో మెట్ రియోసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎల్లో రిబ్బన్ రన్‌లో సుమారు పదిహేను వందల పైచిలుకు రన్నర్‌లు మార్చ్ 2 హైదరాబాద్‌లోని నక్లేస్ రోడ్‌లో 10కే,5కే,3కే, 3 కేటగిరీలలో జరిగే అవగాహన రన్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.ఈ రన్నాలోల్గొనేవారు (https://ifinish.co.in/running/YRR25)లో నమోదు చేసుకోవాలని కోరారు.

విజయ మేరీ స్కూల్ 40వ వార్షికోత్సవం

నవతెలంగాణ-కంటోన్మెంట్



బోయిన్‌పల్లి విజయ మేరీ హై స్కూల్ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెన్స్ కం ప్రిన్సిపల్ లార్డ్ మార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ ఆనంద్ బాబు, బీజేపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఏ పరశురాం, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాతో పాటు పలువురు ప్రముఖు లు హాజరై జ్యోతిని ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ ఆనంద్ బాబు మాట్లాడుతూ.. విజయ్ మేరీ స్కూల్‌కు ఎంతో చరిత్ర ఉన్నదని దాని గురించి అంతగా చెప్పాల్సిన అవసరం లేదని, దాని యొక్క చరిత్ర అందరికీ తెలుసని, పాఠశాలలో చదివిన విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఉన్న స్థాయిలను ఎదిగారని ఆయన పేర్కొన్నారు. బీజేపీ కార్యవర్గ సభ్యుడు పరుశు రాం మాట్లాడుతూ.. స్కూల్ దశ విద్యార్థులకు ఎంతో అపురూపమైనదని, ఎంత పెద్దవారైనప్పటికీ పాఠశాల రోజులు మర్చిపోలేరని అన్నారు. టూరిజం మాజీ చైర్మెన్ గుప్త, బ్రహ్మకుమారి ప్రతినిధి బి కే ఉమా మాట్లాడుతూ.. తమ సంస్థ విద్యార్థుల కోసం అనేక కార్య క్రమాలు చేపడుతోందని ముఖ్యంగా వ్యాయామం ఆరోగ్యం కోసము వ్యాయా మము చదువులపై ఏకాగ్రత వచ్చేందుకు మేరీ టేషన్ లాంటి కార్యక్రమాలు కూడా చేపడుతూ.. శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అల్లరించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని ఆసక్తిగా వారి పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆసక్తికరంగా తిలకించారు.

దాతలు ఇచ్చిన భూములనూ వదలడంలే..

- **పార్కుల కబ్జాలపై ప్రజావాణికి ఫిర్యాదులు**

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించి పలు లే ఔట్లలో కేటాయించిన స్థలాలను అక్కడి కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులే కబ్జాలు చేస్తున్నారని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రాలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 46 ఫిర్యాదులందాయి. కాలనీ రహదారులను కూడా వదలకుండా ముందుకు జరిగి ప్రహరీలు నిర్మిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. ప్రజావసరాలకోసం దాతలు ఇచ్చిన భూములను కూడా వదలడంలేదని పలువురు పేర్కొన్నారు. అందుకు ఇందిరా పార్కు కబ్జాలే నిదర్శనమని వాకర్స్ తెలిపారు. దాదాపు 76 ఎకరాల ఇందిరా పార్కులో పింగళి వెంకట్రామిరెడ్డి విరాళంగా ఇచ్చిన భూమి కొంత ఉందని, విద్యుత్ సబ్ స్టేషన్, చెత్త డంపింగ్ యార్డు, స్నో వరల్డ్‌కు ప్రభుత్వం కొంత భూమిని కేటాయంచగా, మిగతా భూమిని వ్యాపారులు కబ్జా చేస్తున్నారని ఇందిరాపార్కు మార్నింగ్ వాకర్స్ ప్రతినిధులు ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. అలాగే ఎన్‌టీఆర్ గార్డెన్ కూడా నిరుపయోగంగా ఉందని పేర్కొన్నారు.

శ్మశానవాటికనూ...

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసర మండలం అహ్మద్‌గూడ గ్రామంలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ శ్మశానవాటికలో కొంత భాగంతోపాటు, నాలా బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టారని ఆ గ్రామప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇదిలావుండగా శామీర్‌పేట మండలం అంతియాపల్లి గ్రామంలో చెట్టుకుంట చెరువును కబ్జా చేస్తున్నారని, ఆ చెరువును కాపాడాలని ఆ గ్రామప్రజలు హైడ్రాను కోరారు. దుండిగల్ మున్సిపాలిటీ, బహదూర్‌పల్లిలోని గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీలో పార్కులు, పాఠశాలలు, కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలాలు ప్లాట్లుగా మారుతున్నాయని అక్కడి నివాసితులు హైడ్రాను ఆశ్రయించారు.



కోర్టులో ఉన్న అంశాలను ఫిర్యాదులో తప్పనిసరిగా తెలిపాలి

పజావాణి ఫిర్యాదుదారులకు హైడ్రా వినతి

హైడ్రా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తున్నప్పుడు ఆ సమస్యలకు సంబంధించిన అంశాలు సివిల్, హైకోర్టులో పెండింగ్ ఉంటే ఆ వివరాలను సైతం ఫిర్యాదులో తప్పకుండా పేర్కోవాలని హైడ్రా కోరింది. సివిల్, హైకోర్టులో పెండింగ్ కేసుల వివరాలను ఉద్దేశపూర్వకంగా దాచి పెట్టిన పక్షంలో ఫిర్యాదుదారులపై చర్యలుంటాయని హైడ్రా హెచ్చరించింది. వ్యక్తిగత వివాదాలు లేదా ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న సమస్యలను హైడ్రా పరిష్కరించదని, ప్రభుత్వ భూములతో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జాలకు సంబంధించిన అంశాలనే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని హైడ్రా ప్రజలను కోరింది.

సనత్‌నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్‌పేట్

ప్రభుత్వ పాఠశాలలో సరైన సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటేనే విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపగలరని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన సనత్‌నగర్‌లోని నెహ్రూ పార్క్ సమీపంలో గల రౌండ్ టేబుల్ స్కూల్‌ను వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ఈ స్కూల్‌లో ప్రైమరీ, హై స్కూల్‌లకు చెందిన సుమారు 600 మంది వరకు విద్యార్థులు ఉన్నారని, విద్యార్థుల సంఖ్యకు తగినట్టు తరగతి గదులు లేవని ఎమ్మెల్యేకు స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు వివరించారు. సరిపడా తరగతి గదులు లేని కారణంగా చెట్ల క్రింద, షెడ్ల క్రింద విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నట్టు పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు అక్కడి నుండే ఫోన్ చేసి రౌండ్ టేబుల్ స్కూల్‌లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేని కారణంగా ఆరుబయట పాఠాలు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం స్కూల్‌కు సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఈఎస్ఐకి చెందిన స్థలంలో నూతన భవనం నిర్మించి ప్రైమరీ స్కూల్‌ను అందులోనికి మార్చాల్సి ఉంటుందని చెప్పారు. ఇందుకు గాను రూ.40 లక్షలతో ప్రైమరీ స్కూల్ భవన నిర్మాణం పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆయన కోరారు.





రోగుల సంఖ్య ఎక్కువ- హాస్పిటల్లో వసతులు తక్కువ

సనత్‌నగర్‌లోని ఎస్ఆర్‌టీలో అన్ని సౌకర్యాలతో కూడిన నూతన హాస్పిటల్ నిర్మించాల్సిన అవసరం ఉన్నదని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం సనత్‌నగర్‌లో పర్యటించిన సందర్భంగా ఎస్ఆర్‌టీలో ఉన్న డిస్పెన్సరీకి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అందుకు తగిన విధంగా సౌకర్యాలు కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంటనే జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి ఫోన్ చేసి డిస్పెన్సరీకి పక్కనే జీహెచ్ఎంసీకి చెందిన స్థలం ఉన్నదని, ఆ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు కేటాయించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్పిటల్ భవన నిర్మాణంకు అవసరమైన నిధులు రూ.1.43 కోట్లు ఇప్పటికే మంజూరై ఉన్నాయని వివరించారు. నూతన హాస్పిటల్ భవనం నిర్మిస్తే మరింత మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఎమ్మెల్యే వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్, ఎంఈఓ హరిచంద్ర, కార్పొరేటర్ కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ హరి శంకర్, ఏఎంఓహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మచారి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు ఖలీల్, సురేష్ గౌడ్, శేఖర్, ఫాజిల్, జమీర్, పుష్పాలత తదితరులు ఉన్నారు.

సెల్ టవర్ వెంటనే తొలగించాలి ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చిన స్థానికులు...

సనత్‌నగర్‌లోని ఎస్ఆర్‌టీ 707లో నూతనంగా ఏర్పాటు చేసిన సెల్ ఫోన్ టవర్‌ను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. సోమవారం సనత్ నగర్ పర్యటనకు వచ్చిన ఆయనను కాలనీ వాసులు కలిసి వినతిపత్రం అందజేశారు.

తాము మొదటి నుండి కోరుతున్నా అధికారులు పట్టించుకోకుండా సెల్ ఫోన్ టవర్‌ను ఏర్పాటు చేశారని, దీని వలన తాము అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్ళి టవర్ తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

'జీజీజేఏ' మొదటి స్నాతకోత్సవం

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్లోబల్ జెమ్స్ అండ్ జ్యువెలరీ అకాడమీ (జీజీజేఏ) సోమవారం బంజారాహిల్స్‌లోని జీజీజేఏ క్యాంపస్‌లో తన మొదటి వార్షిక స్నాతకోత్సవ వేడుకను ఘనంగా జరుపుకుంది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా రైసన్ జువెల్స్ అండ్ క్రిష్ డైమండ్స్ సీఈఓ అనూప్ అగర్వాల్, రైసన్ జువెల్స్ అండ్ క్రిష్ డైమండ్స్ డైరెక్టర్ జవిన్ కుమార్ అగర్వాల్ గౌరవ అతిథిగా హాజరై గ్రాడ్యుయేట్‌లకు జీజీజేఏ సీఈఓ, డైరెక్టర్ సోనాల్ అగర్వాల్‌తో కలిసి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సోనాల్ అగర్వాల్ మాట్లాడుతూ "అత్యుత్తమ అంకితభావం, శ్రేష్ఠతను ప్రదర్శించిన మా విద్యార్థుల గురించి మేం చాలా గర్విస్తున్నాం. ఈ కాన్వొకేషన్ వారి విజయాల వేడుక, వారు రత్నాలు, ఆభరణాల పరిశ్రమకు విశేషమైన కషిని కొనసాగిస్తారని మేం విశ్వసిస్తున్నాం" అని ఆమె పేర్కొన్నారు.



వదంతులపై ప్రభుత్వ నిర్ణయమేంటో..



- **మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

నవతెలంగాణ-బంజారాహిల్స్

వదంతులపై ప్రభుత్వ నిర్ణయామెంటో వారు ప్రకటిస్తేనే తెలుస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం నెక్లెస్ రోడ్డులోని నీరా కేఫ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో గౌడకులస్తులు ఆత్మ గౌరవంతో పాటు, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కుల వృత్తిలను ప్రోతహించెందుకు నీరా కేఫ్ ఏర్పాటు చేయడం జరిగిందనీ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 50 వేల వృత్తి దారులు ప్రత్యక్షంగా వృత్తి చేస్తూ స్వచ్ఛమైన ప్రకృతి సిద్ధమైన పానీయాన్ని నీరాగా ప్రజల ఆరోగ్యంగా ఉండేందుకు వారు ఆర్థికంగా నిలదొక్కుకొనుటకు గౌడ కులస్తులు మాత్రమే నీరా, గీయాలనీ, అమ్మాలని జీవో అమలు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసి ఓ మంచి ఆలోచనతో ఏర్పాటైన నీరా కేఫ్‌ను కొందరు ప్రయివేట్ వ్యక్తులు వారి స్వలాభం కోసం ప్రభుత్వాన్ని తప్పు దారి పట్టించేలా వార్త కథనాలు ప్రచూరించడం, దీనిపై ప్రభుత్వం స్పందించి నిర్ణయన్నీ ప్రకటించాకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ పన్నాగం ఎవరిదైనా తక్షణమే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వమే విరమింపజేసే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేస్తూ నేడు అన్ని గౌడ సంఘాలతో చర్చించి భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులు అంబల నారాయణ గౌడ్, బబ్బూరు భిక్షపతి గౌడ్, బాను గౌడ్‌లు పాల్గొన్నారు.

పార్ట్ టైం ఆధ్యాపకులను ప్రభుత్వం ఆదుకోవాలి



- **తెలంగాణ పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్**

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్శిటీలలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల అందరికీ 12 నెలల జీతం 50వేలు ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పార్ట్ టైం అధ్యాపకులకు న్యాయం చేయాలని సోమవారం తెలంగాణ విద్యాశాఖ కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి ఐఏఎస్‌ను సభ్యులు ప్రొ. పీఎల్ విశ్వేశ్వరరావు, డా.చారకొండ వెంకటేష్ , జ్యోత్స్న శివారెడ్డి, బషీర్ బాగ్‌లోని విద్యాశాఖ చైర్మెన్ కార్యాలయంలో తెలంగాణ పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్ (టీజీఆప్ట) సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న పార్ట్ టైం లెక్చరర్లుకు వెంటనే కాంగ్రెస్ మేనిఫెస్టో (2023) అమలు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని విద్యాశాఖ కమిషన్ చైర్మెన్, సభ్యులను కోరారు. ఈ వారు సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా చూస్తామని చెప్పినట్టు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఆప్ట వ్యవస్థాపక అధ్యక్షులు డా.బి రవీందర్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు డా. ఎస్. కిరణ్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎర్రం నాగేంద్రం, వైస్ ప్రెసిడెంట్ డా.మరపాల కుమార స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ డా. పి.శ్రీలక్ష్మి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ లు డా. బిక్షమయ్య, డా.మంచాల లింగస్వామి, సైఫాబాద్ కళాశాల అధ్యక్షులు డా. టి శేఖర్ గౌడ్, ఉపాధ్యక్షులు డా.ఎస్ వెంకట్, డా. కాటేపాగ యూగందర్, డా. జి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పురషోత్తం రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల



నవతెలంగాణ-బంజారాహిల్స్

పటిష్టమైన విద్యా వ్యవస్థకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్య ఎన్నికల్లో స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి తలకోల పురుషోత్తం రెడ్డిని బారీ మెజార్టీతో గెలిపించాలని పలువురు విద్యావేత్తలు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లోని మీడియా సమావేశంలో తలకోల పురషోత్తం రెడ్డి తన వ్యక్తిగత ఎన్నికల మేనిఫెస్టో 2030ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ టీచర్ యూనియన్ మాజీ కార్యదర్శి డా.బి.విజయ కుమార్, డా.ఈ. రాజిరెడ్డి, ప్రొఫెసర్ రేఖా రావు, ఐబీసీ ఆర్డర్ చైర్మెన్ ఏచూరి బాస్కర్, రుద్ర రాజేశ్ మాట్లాడారు. మేనిఫెస్టోలో పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ. సీపీఎస్ రద్దు పీఆర్‌సీ ప్రకారం 53శాతం ఫిట్మెంట్ అమలు, డీఏ చెల్లింపు, అవుట్ సోర్స్, ఒప్పంద ఉపాధ్యాయుల ప్రామాణీకరణ, పారదర్శక వర్సిటీ నియామక విధానం, ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ తరగతులు, లైబ్రెరీల స్థాపితం, ప్రయివేట్ ఉపాధ్యాయ సంక్షేమం, కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సంక్షేమ బోర్డు ఏర్పాటు, విద్యార్థులకు ఉచిత విద్య ప్రోత్సాహకాలు, నైపణ్యాభివృద్ధి ఆవశ్యకత ఉందన్నారు. వృత్తిపరమైన శిక్షణ వంటి అంశాలను పురుషోత్తం రెడ్డి తన ఎజెండాలో పొందుపరచడం అభినందనీయమని పేర్కొన్నారు. తాను ఇచ్చిన హామీలను పద్ధతిగా, దశలవారీగా అమలు చేస్తామని పురుషోత్తం రెడ్డి తెలిపారు.

జర్నలిస్టుల న్యాయమైన సమస్యలు పరిష్కారించాలి

- **బీసీ ఉద్యమ నేత లింగంగౌడ్**



నవతెలంగాణ-ఓయూ

జర్నలిస్టుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత కొన్ని ఏండ్లుగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీం, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు, చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు, జర్నలిస్టుల ప్రత్యేక రక్షణ చట్టం డిమాండ్ల కోసం వారు చేయని ప్రయత్నమంటూ లేదు. అన్ని రాజకీయ పార్టీలు రేపు మాపు అని చెప్పి చేతులు దులుపుకుంటున్నాయని అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం అయినా వారి యొక్క సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. తాము అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు.

28న అంతర్జాతీయ మహిళా సదస్సు

నవతెలంగాణ-బంజారాహిల్స్

మహిళా వ్యాపారులకు కొత్త అవకాశాలు అందించడమే లక్ష్యంగా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (సీఓడబ్ల్యుఈ) ఆధ్వర్యంలో ఉమెన్ ఇంటర్నేషనల్ సమిట్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (డబ్ల్యుఐఎస్ఈ), బీ2బీ ఎక్స్‌పోనూ ఈ నెల 28 నుంచి మార్చి 1 వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో నిర్వహించనున్నట్టు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ జాతీయ అధ్యక్షురాలు లలితా ఆలూరి తెలిపారు. సోమవారం హరిత ప్లాజా హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమెతో పాటు కోవ్‌ప (క్రియేటింగ్ ఉమెన్ పవర్) వ్యవస్థాపకురాలు డైరెక్టర్ శైలజా రెడ్డి, ఉమ, సంధ్యారెడ్డి సుమన్ కుమార్, సౌదామిని, కార్యదర్శి జోష్ణ చెరువి నీరజా రెడ్డి ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. వారు మాట్లాడుతూ.. ఈ సదస్సును తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ హాజరు కానున్నారని చెప్పారు. ఇది ఒక విశిష్టమైన కార్యక్రమంగా అభివర్ణిస్తూ, మహిళా పారిశ్రామికవేత్తలకు నెట్‌వర్కింగ్, సహకారానికి ఒక వేదికను అందిస్తుందన్నారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు పరిశ్రమ నిపుణులు, విధాన నిర్ణయాధికారులు, అంతర్జాతీయ వాణిజ్య ప్రతినిధులు, మహిళా వ్యాపారవేత్తలు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సదస్సు ప్రధానంగా వివిధ రంగాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించడం, స్థిరమైన వ్యాపార వృద్ధికి దోహదపడటాన్ని లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఈ సదస్సులో ఫిలిప్పీన్స్ యూకే జెనీవా దేశాల నుంచి పలువురు హాజరై వారి అభిప్రాయాలను వ్యక్తపరిచానున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తి కల్పించడానికి తాము మరికొన్ని అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి పట్టణాలకు తరలివస్తున్న గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆ ప్రాంతంలోని ఉపాధి అవకాశాలు కల్పించేలా ఉచితంగా తాము వివిధ రకాల చేతి వృత్తి కోర్సులతో పాటు చదువుకున్న మహిళలు యువతలకు ప్రత్యేక సాంకేతిక కోర్సులు అందించి స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహిస్తున్నట్టు ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌కు భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వ శాఖ అంతర్జాతీయ సహకార పథకం ద్వారా నిధులు లభించాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంలో మహిళా పారిశ్రామికవేత్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళలు నేతృత్వంలోని సంస్థలు ఎంఎస్ఎంఈ రంగంలో 20 శాతం వాటాను కలిగి ఉన్నారన్నారు. దేశవ్యాప్తంగా 23 శాతం మందికి పైగా ఉద్యోగ అవకాశాలు అందిస్తున్నారని చెప్పారు. దేశ జీడీపీలో 13.5 నుంచి 15 శాతం వరకు వాటాను కలిగి ఉన్నారన్నారు. ఈ ఈవెంట్ థీమ్ 'ఇన్నోవేషన్, సస్టైనబిలిటీ, క్రాస్-బోర్డర్ కోలాబరేషన్' అన్నారు. అత్యాధునిక వ్యాపార విధానాలు అవలంబించడం, పర్యావరణహిత కార్యక్రమాలను ప్రోత్సహించడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను మెరుగుపరచడం తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇది వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపార ప్రపంచంలో మహిళా పారిశ్రామికవేత్తల ఎదుగుదల, విజయానికి మార్గం సుగమం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు చేతన జైన్, సెక్రెటరీ కల్పన రావు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనకు పట్టంకడదాం

- **ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని గెలిపించుకుందాం**
- **ఓయూ విద్యార్థి నాయకులు వలిగొండ నరసింహా**

నవతెలంగాణ-ఓయూ



పట్టభద్రులు, ఉద్యోగులారా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనకి పట్టంకడదామని ఓయూ విద్యార్థి వలిగొండ నరసింహ అన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట జరిగిన విలేఖరుల సమావేశంలో అతను మాట్లాడుతూ.. తెలంగాణ విద్యార్థి నిరుద్యోగుల ఆత్మ బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఆ బాధ్యత గుర్తెరిగి ఉద్యోగాలు ప్రథమ ప్రాధాన్యతగా నియామకాలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేయడం జరిగిందని ఓయూ విద్యార్థి వలిగొండ నరసింహ తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 55 వేల పైచిలుకు ఉద్యోగుల భర్తీతో నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఏడాది పరిపాలనా కాల సమయంలో, వాటికి తోడు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న 24వేల మంది టీచర్ల బదిలీలు, 21వేల మందికి ప్రమోషన్లు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ముఖ్యంగా 2008 డీఎస్సీ బాధితులకు ఉద్యోగ కల్పన వంటి ఎన్నో కార్యక్రమాలను ఈ ప్రభుత్వం తీసుకుంది, నిరుద్యోగులు, ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలపరిచిన కరీంనగర్, ఆదిలాబాద్, నిజాంమాబాద్, మెదక్, ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి ఓట్లు వేసి గెలిపించుకోవాలని పట్టభద్రులకు, ఉద్యోగులకు, టీచర్స్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు చింత వెంకన్న, చెరుకుపల్లి అనిల్, బొజ్జ సుమన్, సీహెచ్ అర్జున్ పాల్గొన్నారు.

బాత్రూంలో గొంతు కోసుకుని వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-ఓయూ

బాత్రూంలో గొంతు కోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నర్సింగరావు ఘట్కేసర్ లోని పవర్ గ్రిడ్ లో చీఫ్ మేనేజర్ గా పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఆత్మహత్య విషయం తెలుసుకున్న చిలకలగూడ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. ఘటనస్థలిని పరిశీలించిన ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ నర్సయ్య ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్ రావు మానసిక పరిస్థితి కూడా బాగాలేదని అదనపు డీసీపీ పేర్కొన్నారు. అయితే భార్య వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని నర్సింగరావు తరపు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాల మూలంగానే ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

జలమండలిలో నలుగురికి కారుణ్య నియామకం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలో నలుగురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులోవున్న సమయంలో మరణించిన నలుగురి ఉద్యోగుల కుటుంబసభ్యులో ఒకరికి వారి విద్యార్హతలను బట్టి, కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పించారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాల్ని ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డి వారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపారు. బాగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సురేష్, ఇతరులు పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- **లేబర్ అడ్డాలు, కార్మికులు పనిచేసే చోట కచ్చితంగా తాగునీరుండాలి...**
- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

నవతెలంగాణ- సిటీబ్యూరో

రానున్న రోజుల్లో వేసవిలో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎండల తీవ్రత, జాగ్రత్త చర్యలపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని రానున్న వేసవిలో కార్మికులు, ప్రజలు ఉష్ణోగ్రతల వల్ల ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. లేబర్ అడ్డాలు, పని ప్రదేశాలను గుర్తించి తాగునీరు అందుబాటులో ఉంచాలని, అన్ని బస్తి, పీహెచ్సీ, సిహెచ్సి లలో అనుకున్న దానికంటే 200 శాతం అధికంగా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను నిల్వ ఉండేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. వైద్య ఆరోగ్య, ఉపాధి , కార్మిక శాఖలు కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

ప్రతి ఆరోగ్య కేంద్రంలో, అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని, కేంద్రాలకు వచ్చే వారికి ఓఆర్ఎస్ ద్రావణం అందించాలని అన్నారు. పీహెచ్సిల వారిగా కన్స్ట్రక్షన్ సైట్స్‌లను గుర్తించాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ వసతి గృహాలలో ఎండ తీవ్రత పై అవగాహన కల్పించాలని,ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందించాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో ప్రజలు ఏమి చేయాలో ఏమి చేయకూడదో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు కదిరవన్ పలని, డాక్టర్ జి ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ వెంకటాచారి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి , జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటజీ, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ రమేష్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



- **అర్హులైన పాత్రికేయులకు ఇండ్ల స్థలాలివ్వాలి**
- **ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా ఆరోగ్య కార్డులివ్వాలి**
- **జర్నలిస్ట్ బీమా పథకం ప్రారంభించాలి**
- **హెచ్‌యూజే నాయకుల డిమాండ్**
- **హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల నిరసన**

నవతెలంగాణ-సిటీబ్యూరో

జర్నలిస్టల సమస్యలను వెంటనే పరిష్కరించాలని హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ పిలుపులో భాగంగా సోమవారం లక్డికాపూల్ వద్ద ఉన్న హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట హెచ్‌యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు బి.అరుణ్ కుమార్, బి.జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, కోశాధికారి బి.రాజశేఖర్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు అనేక సమస్యలతో బాధ పడుతున్నారని చెప్పారు. సకాలంలో అక్రిడిటేషన్ కార్డులూ పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల గడువును మరోసారి పొడిగించకుండా కొత్త కార్డులను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్డులు ఇవ్వడం వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉండబోదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకుని అర్హులైన జర్నలిస్టలకు అక్రిడిటేషన్ కార్డులను ఇవ్వాలని కోరారు. జర్నలిస్టలకు ఇండ్ల స్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. బీపీఎల్ కింద గుర్తించి జర్నలిస్టలకు న్యాయం చేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసి వాదనలను వినిపించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో కొత్త విధానం ద్వారా జర్నలిస్టలకు ఇండ్లస్థలాలు ఇవ్వాలన్నారు. జర్నలిస్ట్ ఆరోగ్య కార్డులు రాష్ట్రంలోని అన్ని ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్ట్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. కేరళతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్టుగా జర్నలిస్టలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టలపై దాడులను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. జర్నలిస్టల రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. మహిళా జర్నలిస్టలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, వారికి భద్రత కల్పించాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం హెచ్‌యూజే ప్రతినిధి బృందం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హెచ్‌యూజే నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాధిక, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు జి.వీరేష్, బి.కాలేబ్, జి.రేణయ్య, సంయుక్త కార్యదర్శులు జె.క్రాంతి, ఎస్. మాధవరెడ్డి, పి.లక్ష్మణ్ రావు, తలారి శ్రీనివాస్ రావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు సీహెచ్ మధుకర్, కార్యవర్గ సభ్యులు కె లలిత, పి విజయ, సంపత్, శ్రీధర్ మురహరి, కె.వెంకటస్వామి, డీఎస్ సుభాష్ కృష్ణ, పి.రాజేష్ కుమార్, బి.ముత్యాలు, సభ్యులు శిల్ప, లహరితో పాటు ఇతర పత్రికలకు చెందిన జర్నలిస్టలు పాల్గొన్నారు.



సమయపాలన పాటించేలా అధికారులు పర్యవేక్షణ చేయాలి



- **జిల్లాలోని అన్ని కార్యాలయాలను ఆకస్మికంగా తనఖీ చేస్తా**
- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
- **ప్రజావాణికి 386 దరఖాస్తులు**

నవతెలంగాణ-సిటీ బ్యూరో

ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ఉద్యోగులు కార్యాలయ విధులకు హాజరుకావాలని, సమయపాలన పాటించని ఉద్యోగుల పై చర్యలు తప్పవని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 386 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. అట్టి అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కారం చేయాలని అధికారులను సూచించారు.ప్రజావాణిలో 275 డబుల్ బెడ్ రూమ్,7 ఇందిరమ్మ ఇండ్లు,51 పింఛన్లు,33 ఇతర శాఖలకు చెందిన దరఖాస్తులు అందాయని ఆయన తెలిపారు. వచ్చే వారంలోగా ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లేకుండా అధికారులు చూడాలని సూచించారు.

అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులు ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి కార్యాలయాలకు చేరుకోవాలని అన్నారు ఉద్యోగులు సరైన సమయానికి విధులకు అవుతున్నారా లేదా అని పర్యవేక్షించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కార్యాలయాలను తాను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని , కార్యాలయ పని వేళల్లో విధులలో లేని సిబ్బంది పై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు కదిరవన్ పలని, డాక్టర్ జి ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ వెంకటాచారి, జిల్లా పరిశ్రమ కేంద్రం జి యం పవన్ కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి , జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటజీ, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ రమేష్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లను ఈడీ తనిఖీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి ఓ అండ్ ఎం డివిజన్-6 ఎస్.ఆర్. నగర్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ పర్యటించారు. డివిజన్ పరిధిలో ట్యాంకర్ డిమాండ్ అధికంగా ఉన్న బంజారాహిల్స్, ఎర్రగడ్డ ఫిల్లింగ్ స్టేషన్లను ఆయన సందర్శించారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి?, ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలు తనిఖీ చేశారు. ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ ఇన్ ఛార్జిలతో మాట్లాడి వివరాలు కనుక్కున్నారు. అక్కడ సౌకర్యాల మెరుగు కోసం కావాల్సిన పనుల్ని మంజూరు చేశారు. బంజారాహిల్స్ ఫిల్లింగ్ స్టేషన్ లో 8 ఫిల్లింగ్ పాయింట్స్, 44 ట్యాంకర్లు ఉండగా.. రోజుకి 300 ట్రిప్పులు డెలివరీ చేస్తున్నారు. ఇక ఎర్రగడ్డ ఫిల్లింగ్ స్టేషన్ లో 4 ఫిల్లింగ్ పాయింట్స్, 29 ట్యాంకర్లు ఉండగా.. రోజుకి 150 ట్రిప్పులు డెలివరీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జీఎం హరిశంకర్, ఇతరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్తు సమస్యలపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి మంగళవారం వినియోగదారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏ ఈ రవీందర్ రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని తుర్కయంజాల్ సబ్‌స్టేషన్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్, టెక్నికల్, ఫైనాన్స్ సభ్యులు, పలువురు నిపుణులు హాజరువుతున్నారని పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలతో పాటు కరెంట్ బిల్లుల హెచ్చు తగ్గులపై వినియోగదారులకు పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

IN THE COURT OF THE HON'BLE IX ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD.
I.A.No.164 OF 2019
in
O.S.No.54 OF 2018

Between:
Manju Sanghi
...Petitioner/Plaintiff
AND
Pradeep Kumar Barasia (Died as per LRs) and others
...Respondents/Defendants

To,
R9.Upasana Goel, W/o Satyanaryan Goel, Aged about: 38 years, Occ: Housewife, R/o 21-2-654, Barfi Sadan, Urdugalli, Patel Market, Hyderabad.

NOTICE

Please take notice that the above named Petitioner/Plaintiff has filed the above said I.A. and you were arrayed as Respondent No. 9 in the above said I.A and you are hereby directed to appear before the above said Hon'ble Court on 17-03-2025 at 10.30 A.M either in person or through your Advocate, failing which the matter will be decided in your absence on the material available on record before the Hon'ble Court.

// BY ORDER OF THE HON'BLE COURT //
Mr.D.KIRAN KUMAR
ADVOCATE
Counsel for the Petitioner
Office at D.No. 13-6-437/A/38/1, Indra Nagar, Flour Mill, Langar Houz Road, Hyderabad.

IN THE COURT OF THE HON-OURABLE PRL.JUNIOR CIVIL JUDGE
AT: WANAPARTHY
I.A.No. 152 OF 2024
IN
O.S.No. 111 OF 2024

Between:
Nigar Sulthana
... Pentitioner/Plaintiff
AND
Marnand Ramakrish Reddy and others
... Respondents/Defendants.

కోర్టు వారి నోటీసు
TO.
2Syeda Shain Fatima W/o Late Hai Sikander Lal Khan, Age: 56 years, Occu: Agriculture, R/o 2-4-335, 111 CLB MATS, Kachiguda, Himayathnagir, Hyderabad.

ఇందుమూలంగా పై వ్యక్తికి తెలియజేయటం ఏమనగా మీపై శ్రీమతి నిగర్ సుల్తానా అనే వ్యక్తి కె.మహేందర్ ద్వారా GPA పై కోర్టులో Cancellation of the Registered Sale Deed vide Document No.1751 of 2022 Dated 08-12-2022 and rectification of entries and perpetual injunction in respect of the land in Sy.137/A-Ee/2 to an extent if Ac.5-06gtd, situated in the limits of Kamaluddinpur Village of Ghanpur Mandal, Wanaparthy District దావా వేచి ఉన్నారు. అట్టి దావాలో మీకు చాలాసార్లు కోర్టు నుండి నోటీస్‌లు పంపించినప్పటికి మీరు వుద్దేశకపూర్వకంగా వాటిని తిరస్కరిస్తున్నారు. కావున ఈ బహిరంగ ప్రకటన ద్వారా సమన్లు /నోటీసులు పంపడమైనది. పై కేసు తేది: 7-03-2025 నాడు వాయిదా వేయబడి ఉన్నది. ఇట్టి వాయిదా తేది రోజున ఉదయం10:30 నిమిషాలకు మీరు గాని మీ అనుమతి పొందిన వ్యక్తి ద్వారా గాని హాజరు కాగలరు. మరియు జవాబు వేయగలరు. లేని పక్షంలో పై దావాలో మీకు వ్యతిరేకంగా తీర్పు నిర్ణయించబడుతుంది.

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

బక్షి చంద్రశేఖర్ రావు
ఎం.డి. మహమూద్
యస్. రవిందర్
యం. కరుణాకర్
యల్. రాముడు
న్యాయవాదులు
రామ్‌నగర్,
వనపర్తి.
సెల్: 9394022382.

IN THE COURT OF THE HON'BLE III ADDL. DISTRICT JUDGE SANGAREDDY DISTRICT : AT SANGAREDDY
OS.NO. 266 OF 2022

BETWEEN:
Shivaiah Gari Naga laxmi and others
...Plaintiffs
AND
Basireddy Mahipal reddy and Others,
.....Defendants

NOTICE

To
R19) Lahari Infrastructure Ltd, Rep by Managing Director G.Hari Babu S/o. Late Raghavaiah, Aged :68 year,occ:business R/o. H.No-8-35/B,Road .No.6, flim nagar, Jubilee hills , Hyderabad. now at: 723/A, road no.36, CBI Colony, Jubilee hills, Hyderabad, Telangana.

Take Notice that the Plaintiff filed the suit for Partition And Separate Possession against the Respondents/Defendants. The above case is posted on 12-03-2025 for your appearance. On that day you may appear before Hon'ble III Addl. District Judge, At: Sangareddy by 10.30 A.M. on 12-03-2025 either in person or through advocate. If you fails to appear on the said date and time before the said court the case will be decided in your absence.

// BY ORDER OF THE COURT //
J.Ram Reddy
P.Vivekanand
Advocates, Sangareddy.
Cell: 7013202031,9908239099

SUIT SUMMONS
IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE MEDCHAL MALKAJGIRI DISTRICT
AT: MEDCHAL
O.S.No.54 of 2023

Between:
Pothapragada sri rama rao
... Plaintiff
And
Pedhapatlori venkat reddy and Ors.
...Defendants

To
1.Sargari Ranga Reddy S/o S Penta Reddy (D2) R/o H No. 4-5, Bowrampet village, Dundigal, Gandimaisamma (M)
...Defendant No. 2

WHEREAS the plaintiff has filed the above suit for Declaration of Title, Recovery of possession and Mandatory Injunction against you and others, and as you are avoiding service of suit Summons addressed to you in the above suit. Therefore, please take summons in suit of O.S.No.54 of 2023 is now stands posted to 28/03/2025 at 10.30 a.m. for your appearance in the above Court. In default thereof, the matter will be decided exparte.

(By order OF THE COURT)
D.GOURISHANKAR
ADVOCATE
OFFICE
A2,2 ND FLOOR,EUREK COURT COMPLEX BESIDE IMAGE HOSPITAL ROAD, AMEERPET-500016

IN THE COURT OF THE HON'BLE IX ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD.
I.A.No.163 OF 2019
in
O.S.NO.54 OF 2018
AND

Between:
Manju Sanghi
...Petitioner/Plaintiff
AND
Pradeep Kumar Barasia (Died as per LRs) and others
...Respondents/Defendants

To,
R9.Upasana Goel, W/o Satyanaryan Goel, Aged about: 38 years, Occ: Housewife, R/o 21-2-654, Barfi Sadan, Urdugalli, Patel Market, Hyderabad.

NOTICE

Please take notice that the above named Petitioner/Plaintiff has filed the above said I.A. and you were arrayed as Respondent No. 9 in the above said I.A and you are hereby directed to appear before the above said Hon'ble Court on 17-03-2025 at 10.30 A.M either in person or through your Advocate, failing which the matter will be decided in your absence on the material available on record before the Hon'ble Court.

// BY ORDER OF THE HON'BLE COURT //
Mr.D.KIRAN KUMAR
ADVOCATE
Counsel for the Petitioner
Office at D.No. 13-6-437/A/38/1, Indra Nagar, Flour Mill, Langar Houz Road, Hyderabad.

IN THE COURT OF THE HON'BLE III ADDL. DISTRICT JUDGE SANGAREDDY DISTRICT :
AT SANGAREDDY
I.A. NO 756 OF 2022
IN
OS.NO. 266 OF 2022

BETWEEN:
Shivaiah Gari Naga laxmi & others
...Plaintiffs
AND
Basireddy Mahipal reddy and Others,
.....Defendants

NOTICE

To
R19) Lahari Infrastructure Ltd,Rep by Managing Director G.Hari Babu S/o. Late Raghavaiah, Aged :68 year, occ:business R/o. H.No-8-35/B, Road .No.6, flim nagar, Jubilee hills, Hyderabad. now at: 723/A, road no.36, CBI Colony, Jubilee hills, Hyderabad, Telangana.

Take Notice that the Plaintiff filed the suit for Partition And Separate Possession against the Respondents/Defendants. The above case is posted on 12-03-2025 for your appearance. On that day you may appear before Hon'ble III Addl. District Judge, At: Sangareddy by 10.30 A.M. on 12-03-2025 either in person or through advocate. If you fails to appear on the said date and time before the said court the case will be decided in your absence.

// BY ORDER OF THE COURT //
J.Ram Reddy
P.Vivekanand
Advocates, Sangareddy.
Cell: 7013202031,9908239099

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM-VIII JUDICIAL MAGISTRATE OF FIRST CLASS:
AT: MEDCHAL ATHEVELLY
O.S.No.419 of 2024

Between:
Shaheda Begum
...Plaintiff
AND
1.G.Prasad
2.Jangam Prabhu Lingam
...Defendants

To,
Jangam Prabhu Lingam S/o J. Rama Lingam, Aged: 50 years, Occ: Employee R/o H.No.4-41-342, Papi Reddy Nagar, Jagadgirigutta, Qutbullapur Mandal, Ranga Reddy District, T.S
...Defendant No.2

Sir,
Please take Notice that the above named plaintiff has filed the above suit for Perpetual against you and another in respect of the Plot No.113, admeasuring 139 Sq. Yards or 116.3 Sq. Meters, forming Part of Survey No.129/B, situated at Dommara Pochampally Village, under Dundigal Municipality, Medchal Mandal, Medchal-Malkajgiri District, Telangana State and the said suit is stands posted to 12-03-2025 at 10:30 AM for your appearance. If you failed to appear on the above said date and time either in person or through an Advocate, the matter will be decided as per law.

(BY ORDER OF THE COURT)
SYED ZAINUL ABEDIN,
VIQAR AHMED,
MOHD.RAHMATH-ALI-FARAZ,
Advocates
H.No.22-7-380/A/2, 2nd Floor, Mir Alam Mandi, Hyderabad-500002
Cell: 9948875311,9394870028

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: AT SIDDIPET
I.A. No. 150 of 2024
In
HM. OP. No. 122 of 2021

Between:
Smt. Kandi @Gudikandula Rani
...Petitioner/Petitioner
AND
Gudikandula Ajay Kumar Chary
... Respondent/Respondent

NOTICE

To.
Gudikandula Ajay Kumar Chary, S/o. Krishna Chary, Aged 30 years, Occ: Private Employee, R/o: H. No. 1-56/A, Pothaipalle village, Mandal Shameerpet, Medchal Malkajigiri District.

Please take notice that, above named petitioner filed the petition under Order IX, Rule 9. R/W 151 C.P.C. for seeking restoration of HM.O.P No. 122 of 2021, the case is posted to 17-03-2025 for your appearance. Hence, I hereby direct you to appear before the Hon'ble Principal Senior Civil Judge Court at Siddipet, Telangana State, at 10-30 A.M. in person or through advocate, failing which the matter will be decided ex-parte in your absence.

// BY THE ORDER OF THE COURT //
Y. RAJEHSWAR REDDY
ADVOCATE - SIDDIPET
Cell: 9440479050

IN THE COURT OF THE HON'BLE XX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT: HYDERABAD
O.S.746 OF 2025

BETWEEN:
Vedkishori Mishra & others
.....Plaintiffs
AND
1.The Thahasildar, Nampally Mandal, Hyderabad District.
2.All Concerned ....Defendants

TO,
ALL CONCERNED

Please take notice that the plaintiff have filed the above suit for declaring them a the legal heir of Pandey Kishan Prasad S/o late Chunni Lal Pandey and late Vidyavathi Pandey W/o late Pandey Kishan Prasad Father and Mother of Plaintiff No.1 to 6 herein, Plaintiffs No.1 to 6 are the legal heirs of late Pandey Kishan Prasad and late Vidyavathi Pandey namely 1.Vedkishori Mishra W/o Ravindra Mishra, D/o late Pandey Kishan Prasad Age:58 Years, Oce: House hold, R/o:14-10-1435, Dhoolpet, Jali HanumanKarwan Sahu, Asif nagar, Hyderabad, T.S., 2.Thakur Vimal Singh W/o Thakur Santhosh Singh, D/o late Pandey Kishan Prasad Age: 57 Years, occ: House Hold R/o: Maruthinagar, Ring Road, Pillar No.84, Golkonda, Hyderabad, T.S., 3.Bejini Vandana kanthW/o B.Ramamkanth D/o Pandey Kishan Prasad, Age:55 Years, Occ: House hold. R/o:13-1-1199, Kummar wadi, Mustaid pura, Asif Nagar, Karwan Sahu, Hyderabad, T.S., 4.Veena Tiwari W/o Shiv Narayan Tiwari, Dio late Pandey Kishan Prasad Age:53 Years, Occ: House hold, R/o:14-10-1435, Inside Chowdary Phatak, Jali Hanuman, DhoolPet, Asif nagar, Hyderabad, T.S., 5.Madhavi Pandey W/o Mukesh Panday D/o late Pandey Kishan Prasad, Age:51 Years, Occ:House hold, No:7-3-114, Dabbu seth Lane. Bellampally, Adilabad. T.S., 6. Bharathi W/o Mohan Dixith D/o late Pundry Kishan Prasad Age:48 Years, Occ: Advocate Rio: 14-10-1435, Jali Hanuman, Dhoolpet Nampally, Hyderabad, T.S. Surviving legal heir.

That if any person(s) is having any objection, claims, rights whatsoever relating to the above said matter, may appear on 24.03.2025 at 10.30 A.M. in person or through a duly appointed advocate, failing which the matter will be heard and decided ex- parte.

(BY ORDER OF THE HONBLE COURT)
G.PUNYAVATHI
ADVOCATE
Office chambers, 16-2-751/11, Manni Nivas, Karan Bagh, Saidabad Colony, Hyd, CELL:9381128371

IN THE COURT OF THE HON-OURABLE PRL.JUNIOR CIVIL JUDGE
AT: WANAPARTHY
O.S.No. 111 OF 2024

Between:
Nigar Sulthana
... Plaintiff
AND
Maryada Ramakrishna Reddy and others.
... Defendants.

కోర్టు వారి నోటీసు
TO.
2Syeda Shain Fatima W/o Late Hai Sikander Lal Khan, Age: 56 years, Occu: Agriculture, R/o 2-4-335, 111 CLB MATS, Kachiguda, Himayathnagir, Hyderabad.

ఇందుమూలంగా పై వ్యక్తికి తెలియజేయటం ఏమనగా మీపై శ్రీమతి నిగర్ సుల్తానా అనే వ్యక్తి కె.మహేందర్ ద్వారా GPA పై కోర్టులో Cancellation of the Registered Sale Deed vide Document No.1751 of 2022 Dated 08-12-2022 and rectification of entries and perpetual injunction in respect of the land in Sy.137/A-Ee/2 to an extent if Ac.5-06gtd, situated in the limits of Kamaluddinpur Village of Ghanpur Mandal, Wanaparthy District దావా వేచి ఉన్నారు. అట్టి దావాలో మీకు చాలాసార్లు కోర్టు నుండి నోటీస్‌లు పంపించినప్పటికి మీరు వుద్దేశకపూర్వకంగా వాటిని తిరస్కరిస్తున్నారు. కావున ఈ బహిరంగ ప్రకటన ద్వారా మీకు సమన్లు /నోటీసులు పంపడమైనది. పై పిటిషన్ తేది: 7-03-2025 నాడు వాయిదా వేయబడి ఉన్నది. కావున పై తేది రోజున ఉదయం 10:30 నిమిషాలకు మీరు గాని మీ అనుమతి పొందిన వ్యక్తి ద్వారా గాని హాజరు కాగలరు. మరియు జవాబు వేయగలరు. లేని పక్షంలో పై దావాలో మీకు వ్యతిరేకంగా తీర్పు నిర్ణయించబడుతుంది.

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

బక్షి చంద్రశేఖర్ రావు
ఎం.డి. మహమూద్
యస్. రవిందర్
యం. కరుణాకర్
యల్. రాముడు
న్యాయవాదులు
రామ్‌నగర్,
వనపర్తి.
సెల్ : 9394022382.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL JUNIOR CIVIL JUDGE: AT BHONGIR
O.S.No.115 OF 2020

Between:
Arige @ Nakkirtha Premalatha and another
... Plaintiffs
AND
Nakkirtha Sathaiah and others
...Defendants

To
5. Kalarikal Balachander, S/o. K. Rama Krishna, R/o. Flat No.001, Vasu Apartments, Kalyan Nagar, Dilsukhnagar, Hyderabad-500 060.
6. D.V. Phanindhar, S/o. D.S. Rama Krishna, R/o. H.No.6-1-43/1, Bonalavari Street, Bhadrachalam, Khammam District-507 111.
7. Maddu Kishore, S/o. Madhusudhana Rao, R/o. Behind Devanam, Sathya Sai Street, Visannapeta, Krishna District 521 215.
8. Sirigiri Sankara Reddy, S/o. Sirigiri Chinnapa Reddy, R/o. H.No. 8-5-2, Muktheshwara Rao Street, Ramaswamypet, Tenali Post, Guntur District.
9. Padmanabhuni Ravi Kumar, S/o. P. Venkateshwara Rao, R/o. H.No. 8-2-66/1, Market Road, Bhadrachalam, Khammam District - 507 111.
10. V. Anuradha, W/o. D. Balagangadhara Rao, R/o. Flat No.205, Pravalika Towers, Nizampet Road, Hydernagar, Kukatpally, Hyderabad - 500 072.
11. Gavara Ratna Sailaja, D/o. G. Nageshwara Rao, R/o. H.No.9-166/3, Jyothi Colony, Balaji Nagar, JJ Nagar Post, Secunderabad - 500 087.

NOTICE

That the above case is filed by the plaintiffs against the defendants for Partition and Separate Possession of their 2/5th share out of the suit schedule property and also to declare the Registered Documents to the extent of the suit schedule property as null and void and not binding on them and said matter is posted on 06-03-2025 for your appearance. If you fail to appear on 06-03-2025 at 10.30AM before the above said Hon'ble Court either in person or through your advocate, the matter will be decided exparte as per law.

(BY ORDER OF THE HON'BLE COURT)
S. SREEKANTH
ADVOCATE: BHONGIR

IN THE COURT OF THE HON'BLE XX JUNIOR CIVIL JUDGE , CITY CIVIL COURT, AT :: HYDERABAD
O.S.NO.468 OF 2024

BETWEEN:
V.NARSING RAO,
........Plaintiff
AND
V. SANDYA @, SANDYA JYOTHI AND ANOTHER
...Respondentts

To,
2.Mrs.krishnavani D/o. Mrs. V. Sandya @ Sandhya Jyothi Aged abt: 25 years, Occ: Private Employee, R/o. Door No. 1-25-180/3/8, Brindavan Nagar Colony, Secunderabad. 500003.
....Defendant 2

Please take notice that the above named petitioner has filed the above said petition for "SUIT FOR RECOVERY". The said O.S is posted to 04-03-2025 for the purpose of your appearance in the matter. Hence you are hereby requested to appear in person on 04.03.2025 at 10.30 A.M. before the above said court, otherwise the matter will be decided in your absence.

// BY ORDER OF THE COURT //
R.K ASSOCIATES
B. GANGADHAR RAO
NOUSHEEN FATHIMA
ADVOCATES
O/O: 1-8-855/4/1, NALLAKUNTA, SRI RAM HYDERABAD,500044.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE MAHBUBNAGAR DISTRICT,
AT: JADCHERLA
I.A.No.41 OF 2025
IN
I.A. No.708 OF 2023
IN
O.S.No. 98 OF 2022

BETWEEN:
Dinesh Tiwari
...PETITIONER/PLAINTIFF
AND
Leelavathi Tiwari & Others
...RESPONDENT/DEFENDANT

TO
Leelavathi Tiwari, W/o. Late. Radhe Shyam Tiwari Aged: 78 years, Occ: House Hold, R/o. H.No. 15-2-675, Kishan Gunj, Gowliguda, Hyderabad.
...Defendant No.1

NOTICE

Please Take notice that the above-named Plaintiff has filed the above Suit for Partition & Separate Possession and to declare the Sale deed bearing Document No.1994 of 2023 dated 02-07-2023 as Null & Void against you and others before the above Honourable Court in respect of the

SCHEDULE PROPERTY:

All that piece and parcel of Agricultural land bearing In Sy.No.54/A/1, Admeasuring Ac.2-0000 Guntas, In Sy. No.54/AA/2/1, Admeasuring Ac. 0-3900 Guntas, In Sy.No.40/EE/1, Admeasuring Ac. 2-0700 Guntas, Total Admeasuring Ac: 5-06 Guntas Situated at Vanamvariguda village, Balnagar Mandal, Mahaboobnagar District and bounded as follows: North : Agriculture Land of Ashok Tiwari, South : Agriculture Land of Sudhakar Reddy, East : Agriculture Land of Janaki Devi Tiwari West : Agriculture Land of Manoj Tiwari and the above case is posted to 04/03/2025, That if any person have any Objections or claims make it convenient to appear before the above Honourable court on 04/03/2025 at 10.30 AM either in person or through Advocate, otherwise, the matter will be heard and decided on merits in your absence.

// By order of the Court //
SRI. A. BIKSHAPATHI
ADVOCATE
Flat No102, Swathi Towers, P&T Colony, Dilsukhnagar, Hyderabad
Cell No.9989926070
COUNSEL FOR PLAINTIFF

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
మంగళవారం | ఫిబ్రవరి 25, 2025 | www.navatelangana.com

గౌతమ్ నగర్‌లో మంచినీటి సమస్యను మెరుగుపరచండి

• జలమండలి అధికారులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలలో మంచినీటి సమస్యను మెరుగుపరచాలని జలమండలి జీఎం అశోక్ రెడ్డికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలం కాబట్టి గౌతమ్ నగర్ పరిధిలోని అన్ని కాలనీలలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, ఇందుకోసం మహేంద్ర హిల్స్‌లో ఉన్న రిజర్వాయర్ నుండి నీటి సరఫరా సామర్థ్యాన్ని పెంచి ఎక్కువసేపు నీళ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని బోర్లకు మరమ్మతులు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం నాయకులు పరశురామ్ రెడ్డి, బైరు అనిల్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని కలెక్టర్, ఎమ్మెల్సీలకు ఆహ్వానం





నవతెలంగాణ-కీసర

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ రావాలని కోరుతూ ఆలయ చైర్మెన్ తటాకం నారాయణ శర్మ, ఈవో సుధాకర్ రెడ్డిలు ఆహ్వాన పత్రిక అందజేశారు. అదేవిధంగా కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని తీన్మార్ మల్లన్నకు కీసర మాజీ ఉప సర్పంచ్ తటాకం లక్ష్మణ్ శర్మ, తటాకం భానుశర్మ, తటాకం అభిలాష్ శర్మ, ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ రెడ్డబోయిన ప్రవీణ్ కుమార్, తీన్మార్ మల్లన్న టీం సభ్యులు భాను, సందీప్‌లు ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఆదిత్య మెడికల్ అకాడమీ ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

ఈసీఐఎల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య మెడికల్ అకాడమీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. మంచిగా కోచింగ్ ఇచ్చి విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయాలని ఆయన అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, భాను గౌడ్, హేమ, రాబిన్సన్, మహేష్ గౌడ్, నవీన్ గౌడ్, జంపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంకుషాపూర్‌లో ఘనంగా బోనాలు



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంకుషాపూర్‌లో శ్రీమల్లికార్జున స్వామి శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీమల్లికార్జునస్వామికి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో బోనాలు చేసి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. ఒగ్గు కళాకారుల డోలు వాయిద్యాల మధ్య శివసత్తులు పూనకాలతో ఊగుతూ బోనాలు నెత్తిపై ఎత్తుకొని చేసిన విన్యాసాలు అందరినీ అలరించాయి. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బోనాల కార్యక్రమంలో పాల్గొని స్వామివారి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఒగ్గు కళాకారుడు అశోక్ బృందం మల్లికార్జున స్వామి, రేణుకల ఎల్లమ్మ ఒగ్గు కథను చెప్పారు. పిట్టల రాజు, మేడబోయిన రాజు, కొత్తకాపు జైపాల్ రెడ్డి, బద్దం కార్తీక్ రెడ్డిలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్‌లోని ఆర్‌కేనగర్‌లో స్ట్రీట్ నెంబర్-3లో రూ.52 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నిధుల లేమితో కొట్టుమిట్టడుతున్న జీహెచ్ఎంసీలో ఎంతో కష్టపడి నిధులు తెస్తున్నామన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ నాణ్యతతో పనులు చేపట్టి సకాలంలో పూర్తి చెయ్యాలన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంతో ఎంతో మంది ప్రయాణికులకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు శివానంద్, మధు, రాంబాబు, హరీష్, డి పెందర్ సింగ్, జయంతి, సందీప్, మురళి కృష, ఏ. ఈ నవీన్, మహేష్,రమేష్, జైశ్రీరామ్ వేణు, నందు యాదవ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

అపోలో డెంటల్‌ను ప్రారంభించిన బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

సైనిక్ పూరి హిల్‌టాప్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో డెంటల్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార రంగంలో రాణించాలని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్ల రాధాకృష్ణ, డాక్టర్ రాహుల్‌రెడ్డి, నవీన్ గౌడ్, మహేష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి ఆలయానికి సౌండ్ సిస్టం అందజేత



నవతెలంగాణ-కాప్రా

కమలానగర్ శ్రీసహస్ర లింగేశ్వర స్వామి ఆలయానికి ధరణి రాక్ డ్రిల్స్ కంపెనీ ప్రొప్రైటర్ పోలేపల్లి కొండల్ రావు కుమారుడు పోలేపల్లి వినయ్ చౌదరి సోమవారం సౌండ్ సిస్టంను మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు చేతుల మీదుగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పెద్ది నాగరాజుకు అందజేశారు. ప్రధాన అర్చకులు సురేష్ శర్మ పంతులు కొండల్ రావుకు తీర్థప్రసాదాలు ఇచ్చి, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఎల్లప్పుడూ ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆశీర్వదించారు. అడిగిన వెంటనే సౌండ్ సిస్టంను డొనేట్ చేసిన కొండల్ రావుకు పెద్ది నాగరాజు స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళి పంతులు, శంకర్ పంతులు, దిలీప్ శర్మ, శివ పంతులు, ఆలయ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కీసరగుట్టలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం





• హాజరైన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి • క్రీడోత్సవాలు ఘనంగా జరుపుకోవాలి • రాష్ట్ర శాప్ చైర్మెన్ శివసేనా రెడ్డి

నవతెలంగాణ-కీసర

తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహశివరాత్రి బ్రహ్మోత్సవాలు వేదపండితుల మంత్రోచ్ఛంణలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం విఘ్నేశ్వర పూజతో వేదపండితులు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయ మండపంలో ఆలయ చైర్మెన్ తటాకం నారాయణ శర్మ దంపతులతో వేద పండితులు పుణ్యాహవచనం, ఋత్విక వరణం, యాగశాల ప్రవేశం, అఖండ జ్యోతి ప్రతిషా పనం, అగ్ని ప్రతిష్టాపన పరిపూణ ధ్వజారోహణ మంత్ర పుష్పం, పరాకస్తవం తీర్థప్రసాద పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పూజలో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

బ్రహ్మోత్సవాలలో భాగంగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి విచ్చేయడంతో ఆలయ చైర్మెన్ తటాకం నారాయణ శర్మ వేదపండితులతో కలిసి పూర్ణకుంభంతో ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం మహామండపంలో స్వామివారి ఆశీర్వచనలను మహప్రసాదాలను వేదపండితులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు నల్ల మధుసూదన్ రెడ్డి, కొకుంట్ల కృష్ణ రెడ్డి, పోచబోయిన రాజు, రెడ్డ బోయిన ప్రవీణ్ కుమార్, మొరుగు ముత్యాలు, దుండిగల ప్రసాద్ గౌడ్, సామల అమరేందర్, నల్లోల కుమార్, కందాడి రాజి రెడ్డి, సిగ్గు అనిత, రాపోలు శంకరయ్య, జూపల్లి సాయిలు, పాముకుంట్ల ప్రభాకర్ గౌడ్ , తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఉత్సహంగా జరుపుకోవాలి

-రాష్ట్ర శాప్ చైర్మెన్ శివసేనా రెడ్డి

కీసరగుట్ట మహశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న జాతర క్రీడాలు ఉత్సహంగా క్రీడాకారులు జరుపుకోవాలని రాష్ట్ర శాప్ చైర్మెన్ శివ సేనా రెడ్డి అన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం కీసరగుట్టలోని జాతర క్రీడా ప్రాంగణంలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కీసరగుట్ట జాతర ఉత్సవాలు వైభవంగా జరిగేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. కేసరిగిరి క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాలల్లో రాణించాలని పేర్కొన్నారు. ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు విద్యార్థి దశలోనే కష్టపడితే చదివితేనే భవిష్యత్తు ఉంటుందన్నారు.

వంశరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం

బ్రహ్మోత్సవాల్లో ప్రతిఏటా భక్తులకు ఉచితంగా అఖిల భారత వంశరాజ్ అన్నదాన సత్రం నిర్వహణ సంక్షేమ సంఘం నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమాన్ని వంశరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశరాజ్ మల్లేష్ ఆధ్వర్యంలో ఎంతో మంది భక్తులకు ఉచితంగా అన్నదాన నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఈ సందర్భంగా వంశరాజ్ మల్లేష్ మాట్లాడుతూ అన్నిదానాల్లోకెల్లా అన్నదానం ఎంతో గొప్పదన్నారు. భక్తులకు, ప్రతిఏటా ఉచితంగా అన్నదానం చేస్తున్నామని తెలిపారు. భక్తుల అభిమానాన్ని మరింతగాపొంది మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి చిటికెల కృష్ణయ్య, వంశరాజ్ సంక్షేమ సంఘం క్రమశిక్షణ కమిటీ సభ్యులు శ్యామల సాయిలు , శ్యామల శంకర్, చిందం నరసింహ, చిందం రాజు, చిందం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వాసవీ ఆర్య వైశ్య నిత్యాన్నదాన సత్రంలో..

రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలోని శ్రీవాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో ప్రతిఏటా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఉచితంగా అన్నదానం నిర్వహిస్తూ భక్తులు, ప్రజల అదరాభిమానాలను చురగొంటున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.







జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



• టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన

• అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ, అర్హులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయనీ, అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారనీ, చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్, హెల్త్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయనీ, కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏండ్ల తరబడి జాప్యం చేస్తున్నాయన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి బెలిదె అశోక్ మాట్లాడుతూ ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రివ్యూ పిటిషన్ వేసి వాదనలు వినిపించి జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చూడాలని కోరారు. లేనిపక్షంలో కొత్త విధానం ద్వారా ఇండ్ల స్థలాలు ఇచ్చేలా ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి రోజారాణి మాట్లాడుతూ మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి సమయంలో రవాణా సదుపాయం కల్పి ంచాలనీ, మహిళా జర్నలిస్టులకు భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పటేల్ నర్సింహులు యాదవ్, కుత్బుల్లా పూర్ అధ్యక్షులు గడ్డమీద అశోక్, మల్కాజిగిరి అధ్యక్షు లు పబ్బు మల్లేష్ గౌడ్, ఉప్పల్ అధ్యక్షులు గంజి కష్ణ, ప్రధాన కార్యదర్శి రామచంద్రమూర్తి, కూకట్‌పల్లి నాయకులు కట్టెల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



మహిళ అదృశ్యం



నవతెలంగాణ - జవహర్ నగర్

భార్యా భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జాటోతి మౌనిక (23) ఉపేందర్ దంపతులు సేవాలాల్ తండా, బాలాజీ నగర్‌లో నివాసముంటున్నారు. గత కొంతకాలంగా భార్యా భర్తలిద్దరూ సంసార విషయంలో గొడవలు పడుతున్నారు. గొడవలతో విసుగు చెంది భర్త ఉపేందర్ తన సొంతూరైన తుంగతుర్తికి వెళ్లిపోయాడు. కాగా సోమవారం ఉదయం 4 గంటలకు మౌనిక ఇంట్లో ఉన్న రూ.26 వేలు తీసుకొని ఇంటి నుండి వెళ్లిపోయింది. ఉదయం మౌనిక తల్లి సైదమ్మ లేచి చూసేసరికి మౌనిక ఇంట్లో కనపడలేదు. ఆమె కోసం చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'గ్రేటర్‌లో దళితులపై దాడులు'



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్‌లో దళితులపై దాడులు జరుగుతున్నాయని తెలంగాణ అంబేద్కర్ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ముస్లింలు, క్రిస్టయన్స్, దళితులపై మతం, కులం, రాజకీయపరంగా దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. త్వరలోనే నూతన కమిటీని ఏర్పాటు చేసి గ్రేటర్ పరిధిలో సదస్సు నిర్వహిస్తామని ప్రకటించారు. అనంతరం వికారాబాద్ జిల్లా అడ్వైజర్ బి.రత్నయ్యకు నియామక పత్రం అందజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి ముత్యాల జంగయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దాసరి మమత, రంగారెడ్డి జిల్లా సభ్యులు బి.సాలయ్య పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎంఈవో రంగాచారి



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఎంఈవో రంగాచారి ముఖ్యఅతిథిగా హాజరై ఫండమెంటల్ లిటరసీ, న్యూమరాసి (ప్రాథమిక స్థాయి విద్యార్థులకు భాషా గణిత సామర్థ్యాల సాధన) ఎఫ్ఎల్ఎన్ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ల్యాబ్ ఉద్దేశం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా పిల్లలకి చదవడం, రాయడం నేర్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల్లో ప్రగతి సాధించడం కోసం ఈ ల్యాబ్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో ఒక్కొక్క జిల్లాకి ఆరు పాఠశాలల చొప్పున ప్రారంభించినట్లుగా తెలిపారు. దానిలో భాగంగానే మేడ్చల్ స్కూల్ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమవుతున్న పందుల కుంట



• కుంట కట్ట పూర్తిగా ధ్వంసం

• పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని పందులకుంట అన్యాక్రాంతమవుతున్న ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తుడు గొంగళ్ళ ప్రభాకర్ రెడ్డి ఆవేదన వెళ్లి బుచ్చారు. ఈ సందర్భంగా సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 384, 385లో 2.8 ఎకరాల్లో పందులకుంట ఉందని తెలిపారు. కాగా పందులకుంటలో కుంటకట్ట తొలగించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు. అయినప్పటికీ ఇరిగేషన్ అధికారులు తూతూ మంత్రంగా సందర్శించి తప్పుడు నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారని ఆరోపించారు. కుంటను అనుకొని వెంచర్ ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు పెద్ద ఎత్తున అందులో మట్టిని పోశారు. అంతేకాకుండా వర్షం నీళ్లు పోయేందుకు పెద్ద డ్రయినేజీ పైపులను ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి పందులకుంట అన్యాక్రాంతంపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కీసరగుట్టకు వచ్చే సందర్శకులకు 'సోలిస్ హాస్పిటల్ గ్రూప్' సహకారం

నవతెలంగాణ-కాప్రా

సోలిస్ హాస్పిటల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మెన్ నందనంపాటి రామాంజనేయులు ఏడేండ్లుగా శివరాత్రి సందర్భంగా కీసర గుట్టకు వచ్చే భక్తులకు పాలు, పండ్లు, మంచినీరు, డ్రై ఫ్రూట్స్, మెడికల్ సేవలు అందిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఆలయ కమిటీ చైర్మెన్ నారాయణ శర్మ, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు ఆధ్వర్యంలో భక్తులకు సేవలు అందించాలని చైర్మెన్ రాము నిర్ణయించారు.

జొన్నలతో...

మనం బలమైన ఆహారం తీసుకోవాలని చూస్తాం. మాంసాహారం, శాఖాహారం, మొలకెత్తిన గింజలు, పండ్లు, పాలు వంటి వాటిని ఆహారంలో చేర్చుకుంటుంటాం. వాటిలో ఇప్పుడు చిరుధాన్యాలకు ప్రాధాన్యం పెరుగుతుంది.

చిరుధాన్యాల్లో జొన్నలు ఒకటి. వీటిలో బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. శరీరాన్ని ఫిట్ గా ఉంచడంలో జొన్నలు సహాయపడతాయి. వీటిలో అనేక రకాల ఫైబర్లు , విటమిన్లు , పోషకాలు లభిస్తాయి. గోధుమల కంటే కూడా జొన్నలు తినడం వలన చాలా లాభాలున్నాయి. బరువు తగ్గించడంతో పాటు.. జీర్ణ క్రియ మెరుగుపరచడంలో కూడా తోడ్పడతాయి. దీనిలో గ్లూటెన్ ఉండదు.. కానీ అధిక మొత్తంలో కాల్షియం లభిస్తుంది. అలాగే ఎముకలు ధృఢంగా మారుతాయి. ఇక వీటిని తీసుకోవడం వలన గుండె సంబంధిత వ్యాధులు కూడా దూరం అవుతాయి. అంతే కాకుండా రక్త ప్రసరణను పెంచడంతో పాటు.. చర్మ వ్యాధులు రాకుండా నివారిస్తాయి. ఇప్పుడు ఎలాగూ జొన్నలతో నోటికి రుచిగా ఉండే రకరకాల ఫుడ్స్‌ను తయారు చేస్తూనే ఉన్నారు. కాబట్టి జొన్నలను రెగ్యులర్ డైట్ లో యాడ్ చేసుకుంటే ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదు.



దూసుకొస్తున్న 'గన్నెట్స్'

కేరళలో ఫస్ట్ ఉమెన్ స్కూబా టీమ్

కేరళ రాష్ట్రం ఇప్పటికే ఎన్నో విషయాల్లో తన ప్రత్యేకతలను చాటుకుంటోంది. దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ముఖ్యంగా మహిళలను సాధికారత దిశగా నడపడంలో ఎప్పుడూ అగ్రభాగంలో ఉంటోంది. ఇప్పుడు మొదటి మహిళా స్కూబా టీమ్‌ను సిద్ధం చేసి మరో సారి ఆ వామపక్ష ప్రభుత్వం తమది మహిళా సాధికారత కోసం కృషి చేసే ప్రభుత్వమని రుజువు చేసుకోంది. 'గన్నెట్స్' పేరుతో కేరళ అగ్నిమాక శాఖ తన ఆల్ ఉమెన్ స్కూబా డైవింగ్ టీమ్‌ను ఏర్పాటు చేసుకుంది. అగ్నిమాపక దళం నుంచి ఎంపిక చేసిన ఈ మహిళా బృందం ఇకపై వరద ప్రమాదాల్లో చిక్కుకున్న ప్రజలను కాపాడేందుకు సిద్ధంగా ఉంది.

పడవలో చేపల వేటకు వెళ్లిన జాలరి అకస్మాత్తుగా ఛాతి నొప్పితో విలవిలలాడిపోయాడు. బాధ భరించలేక అదుపు తప్పి నదిలో పడిపోయాడు. కొంత మంది అతనికి సహాయం చేసేందుకు ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. అగ్నిమాపక, రక్షణ సేవల విభాగానికి చెందిన ఓ మహిళా సహాయక బృందం క్షణాల్లో ఆ ప్రాంతానికి చేరుకుంది. అవసరమైన రక్షణ కవచాలు తీసుకొని వెంటనే నదిలోకి దూకి ఒక్క క్షణం కూడా వృధా చేయకుండా జాలరిని బయటకు తీసుకొచ్చారు. అతనికి అవసరమైన ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు.

రంగంలోకి దిగారు

వారం రోజుల కిందట ఈ మహిళా స్కూబా డైవర్లు చేసిన సాహసం నీటి పరేడ్‌లో జరిగిన ప్రదర్శన తర్వాత ప్రపంచానికి తెలిసింది. ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్రంలోనే కాదు దేశంలోనే 17 మందితో కూడిన ఈ మొట్టమొదటి మహిళా స్కూబా డైవర్లు ఇటీవలనే కేరళ రాష్ట్రంలోని త్రిస్సూర్ ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీసెస్ అకాడమీ నుండి తమ శిక్షణ పూర్తి చేసుకొని రంగంలోకి దిగారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ వారి నీటి పరేడ్‌లో సెల్యూట్ స్వీకరించి వారిని పతకాలతో సత్కరించారు.

సముద్రపు లోతుకు దూసుకెళ్లి

'గన్నెట్స్'... ఇది కేరళ అగ్నిమాక శాఖ, తన ఆల్ ఉమెన్ స్కూబా డైవింగ్ టీమ్‌కు పెట్టిన పేరు. ఉత్తర అట్లాంటిక్ తీరంలో సముద్రపు లోతుకు దూసుకెళ్లి చేపలను నోట కరుచుకుని ఎగిరే పక్షులే గన్నెట్స్. ఇకపై కేరళలో ఏవైనా జల ప్రమాదాలు సంభవిస్తే ఈ గన్నెట్స్ దూసుకొచ్చి సహాయ సహకారాలు అందిస్తారు. వీరి మొత్తం సంఖ్య 17. ఇరవై ఒక్క రోజుల ట్రైనింగ్ ముగించుకొని ఈ టీమ్ ఈ మధ్యనే బాధ్యతల్లోకి వచ్చింది. భారతదేశంలోనే మొదటి మహిళల స్కూబా రక్షణ దళం ఇదే.

వంద మంది నుండి

కేరళలో వానాకాలంలో ఊహించని వరదలు సర్వసాధారణంగా మారాయి. వాయినాడ్ దీనికి ఓ ఉదాహరణ. మనుషులు నీళ్లల్లో చిక్కుకున్నపుడు వారిని రక్షించే సామర్థ్యం ఉన్న స్కూబా డైవర్స్‌ను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావించింది. అయితే వారు ఎందుకు స్త్రీలు కాకూడదు అని ప్రశ్నించుకుంది. అగ్నిమాపక శాఖ నుంచి 2024లో 100 మంది మహిళలను ఎంపిక చేస్తే వారిలో 17 మంది అన్ని విధాలా అర్హులుగా నిలిచి ట్రైనింగ్‌కు ఎంపికయ్యారు. సాహస యాత్రలో వారి ఆసక్తి ఆధారంగా వారిని స్కూబా డైవింగ్ జట్టుకు షార్ట్‌లిస్ట్ చేశారు.

కేరళ ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీసెస్ అకాడెమీలో ఈ మహిళా సభ్యుల శిక్షణ 21 రోజుల పాటు జరిగింది.

కఠినమైన శిక్షణ...



స్కూబా డైవింగ్‌తో పాటు నదులు, చెరువులు, సముద్రాల్లో నీటి స్వభావాన్ని బట్టి ఎలా రక్షణ చర్యలు చేపట్టాలో నేర్పారు. అండర్‌వాటర్ కెమెరాలు వాడటం కూడా ఇందులో ఓ భాగం. వీరికి 30 మీటర్ల లోతుకు వెళ్లి రక్షించడం నేర్పారు. బృంద సభ్యులలో ఒకరైన శ్రుతి పి.రాజు మాట్లాడుతూ 'ట్రైనింగ్ మాకు మొదట్లో కష్టమైంది. శిక్షణ సమయంలో అనేక సవాళ్లు ఎదుర్కొన్నాం. విభాగంలో చేరడానికి మేమందరం ఈత పరీక్షలలో ఉత్తీర్ణులయ్యాము. అయితే ఈత కన్నా డైవింగ్ పూర్తి భిన్నమైన అనుభవం. ఇప్పుడు మేము శిక్షణ పూర్తి చేశాము. అన్ని దశలను దాటగలిగాం. ఇప్పుడు మేము ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. ప్రజల సేవకు సిద్ధంగా ఉన్నాం. అంతేకాదు ఈ ప్రపంచాన్ని ఎదుర్కోగలం అనే నమ్మకం కూడా మాకు వచ్చింది' అన్నారు.

ఆటంకాలను అధిగమించి...

నీటి అడుగుకు వెళ్లే కొద్దీ ఎన్నో భయాలు. లోతు ఎంతవుంటుందో తెలియదు. ఇలాంటి ఎన్నో విషయాలను అర్థం చేసుకొని ఈ మహిళా రక్షణ బృందం తన శిక్షణ పూర్తి చేసింది. తమ చరిత్రను తామే లిఖించుకునేందుకు ఇప్పుడు వీరు సిద్ధమయ్యారు. దీని కోసం ఎన్నో ఆటంకాలను అధిగమించారు. మంచి నీరు, ఉప్పు నీటి వనరులలో 30 మీటర్ల లోతుకు ఈ బృందం డైవ్ చేయగలిగే సామర్థ్యాన్ని పొందింది. 'డిపార్ట్‌మెంట్ ఇటీవల అండర్ వాటర్ కమ్యూనికేషన్ వ్యవస్థను కూడా ప్రవేశపెట్టింది. దీనిని శోధన, రెస్క్యూ కార్యకలాపాల కోసం డైవింగ్ చేసేటప్పుడు ఉపయోగించవచ్చు' అని మరో బృందం సభ్యురాలు అనుశ్రీ పంచుకున్నారు.



అంతర్జాతీయ స్థాయిలో...

అండర్ వాటర్ కెమెరాలను ఎలా ఆపరేట్ చేయాలో కూడా వీరు నేర్చుకున్నారు. ఫోర్ట్ కొచ్చిలోని ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ స్కూబా డైవింగ్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ పి.దిలీపన్ మాట్లాడుతూ... ఈ బృందం శిక్షణ పొందిందని, అధికారులు 21 రోజుల బేసిక్ ఓపెన్ వాటర్ డైవింగ్ కోర్సులో 15 నుండి 10 మీటర్ల లోతు వరకు ప్రయాణించారని, తర్వాత 10 రోజుల అడ్వాన్స్‌డ్ కోర్సులో 25 నుండి 30 మీటర్ల లోతు వరకు డైవ్ చేశారని చెప్పారు. శిక్షణకు సంబంధించిన సిలబస్ అంతర్జాతీయ ప్రమాణాలతో ఉంది.

పురుషులకు ధీటుగా...

మేము ప్రజలను కాపాడేందుకు నీటిలోకి వెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఉన్నాయి. మా అనారోగ్యం, రుతు పరిశుభ్రతతో పాటు అనేక ఇతర సవాళ్లు ఎదురవుతాయి. అయితే సరైన మార్గదర్శకత్వం, అభ్యాసంతో మేము శిక్షణ పూర్తి చేశాము' అని మరొక సభ్యురాలు అన్నారు. వరద రిస్క్యూ బృందం నుండి పర్వత రెస్క్యూ బృందం వరకు, అగ్ని మాపక, రెస్క్యూ సేవల విభాగం వివిధ పరిస్థితుల కోసం వివిధ బృందాలను కేరళ ప్రభుత్వం నిర్వహిస్తుంది. పూర్తిగా మహిళా బృందంగా ఉన్న వీరు డిపార్ట్‌మెంట్ స్క్వాడ్‌లలోని వారి పురుష సహచరులతో కలిసి వారికి ధీటుగా పని చేస్తున్నారు.

- సలీమ

విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జూన్ 26న దేశవ్యాప్త సమ్మె

(మొదటిపేజి తరువాయి)

27 లక్షల మంది విద్యుత్ రంగ కార్మికులు, విద్యుత్ ఇంజనీర్లు ఈ సమ్మెలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. దీనికి తోడు నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేయాలనే కేంద్రం చర్యకు వ్యతిరేకంగా మే నెలలో కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలోనూ విద్యుత్ రంగ ఉద్యోగులు పాల్గొననున్నారు.



ఈ రెండు నిర్ణయాలను సోమవారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల జాతీయ సమావేశంలో తీసుకున్నట్టు భారత విద్యుత్ ఉద్యోగుల సమాఖ్య (ఈఈఎఫ్‌ఐ) విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపింది. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఈఈఎఫ్‌ఐ) విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం. "ప్రభుత్వ విద్యుత్ రంగం, మన దేశ ఇంధన భద్రతపై బహుముఖ దాడులు" గురించి చర్చించిన జాతీయ సమావేశం, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారుల ప్రజాస్వామ్య హక్కులపై "పెరుగుతున్న దాడులను" కూడా ప్రస్తావించింది. "మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం.. అన్ని ప్రభుత్వ విద్యుత్ వినియోగాలను ప్రయివేటీకరించాలని తీవ్రంగా ప్రయత్నించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశం ప్రకారం..కేంద్రపాలిత ప్రాంతమైన చండీగఢ్‌లో ఉన్న విద్యుత్ పరిపాలన, నిర్వహణ సమర్థవంతంగా ఉన్నదని పేర్కొంది. తక్కువ సుంకాలు ఉన్నా అక్కడి విద్యుత్ వినియోగాన్ని ప్రయివేటీకరించింది" అని ప్రకటనలో పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ విద్యుత్ వితరణ్ నిగమ్ లిమిటెడ్ (పీవీవీఎన్ఎల్), దక్షిణాంచల్ విద్యుత్ వితరణ్ నిగమ్ లిమిటెడ్ (డీవీవీఎన్ఎల్)లపై "ప్రయివేటీకరణతో తీరని దాడులను" కూడా (ఈఈఎఫ్‌ఐ) గుర్తించింది, ఇది 27వేల మంది ఉద్యోగులు, ఇంజనీర్లు 50 వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల సేవలను ప్రమాదంలో పడేస్తుందని పేర్కొంది. "యూపీ విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు ఐక్యంగా..యోగి పాలన చేస్తున్న ప్రయివేటీకరణ అడుగులను అడ్డుకోవటానికి శాయశక్తులా పోరాడుతున్నట్టు వివరించింది. 87 రోజులుగా అలుపెరగని పోరాటం" చేస్తున్న ఉద్యోగులను అభినందించింది. "ఉత్పత్తి , బ్యాటరీ నిల్వ ప్రాజెక్టులను" ప్రయివేటీకరించడానికి బిడ్డింగ్ ప్రక్రియను ప్రారంభించిన రాజస్థాన్ ప్రభుత్వాన్ని కూడా ఈఈఎఫ్‌ఐ విమర్శించింది, అలాగే దక్షిణ హైదరాబాద్ సర్కిల్ యొక్క విద్యుత్ పంపిణీ సేవను అదానీ గ్రూప్‌నకు అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. "రాష్ట్ర డిస్కామ్‌లను ప్రయివేటీకరించడానికి కేంద్ర ప్రభుత్వం దుందుడుకుగా వ్యవహరిస్తోంది. ఢిల్లీ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ , ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు , యూటీల్లోని విద్యుత్ రంగంపై ఒక ప్రత్యేకమైన ప్రాంతీయ సమావేశం ఫిబ్రవరి 20న న్యూఢిల్లీలో జరిగింది" అని విద్యుత్ మంత్రిత్వ శాఖ పత్రికా ప్రకటనను ఉటంకిస్తూ అది పేర్కొంది, "పంపిణీ ప్రయివేటీకరణలో రాష్ట్రాలు కేంద్రాన్ని మద్దతు కోసం కోరాయి" .అలాగే "పెట్టుబడి తీసుకురావడానికి యుటిలిటీల జాబితాను రాష్ట్రాలు తీసుకుంటాయి" అని పేర్కొంది. విద్యుత్ ఉద్యోగులు ఐక్యంగా ఉండి ప్రయివేటీకరణ చర్యలను ఎదుర్కోవాలని ఈఈఎఫ్‌ఐ పిలుపునిచ్చింది. ప్రయివేటీకరణ ప్రాజెక్టును సులభతరం చేయడానికి, కేంద్రం మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసిందని తెలిపింది. కేంద్రం తయారు చేస్తున్న విద్యుత్ సవరణ బిల్లు యొక్క కొత్త ముసాయిదా, దానివల్ల కలిగే అనర్థాలను కూడా గుర్తించిందని పేర్కొంది. "కచ్చితంగా, ఇది భారతదేశ ప్రజా విద్యుత్ పంపిణీ రంగంపై దాడికి చివరి మార్గం. ఇది భారీ విద్యుద్దీకరణకు దారితీస్తుంది. మన దేశ ఆహార భద్రత ప్రమాదంలో పడుతుంది. ఇది భారతదేశ సమాఖ్య నిర్మాణంపై దాడి" అని అది పేర్కొంది. జూన్ 25న జరిగిన తమ సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు , కొత్త విద్యుత్ బిల్లును చాలా కాలంగా వ్యతిరేకిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) నుంచి ఇప్పటికే మద్దతు లభించిందని ఈఈఎఫ్‌ఐ తెలిపింది.దేశవ్యాప్తంగా జరిగే రంగాల సమ్మెకు సన్నాహకంగా, ప్రాంతీయ సమావేశాలు , రాష్ట్ర స్థాయి సామూహిక సమావేశాలను నిర్వహిస్తామని ఈఈఎఫ్‌ఐ తెలిపింది. "యూపీ ప్రభుత్వ ప్రయివేటీకరణ ప్రయత్నానికి వ్యతిరేకంగా 2025 మార్చిలో యూపీలో నాలుగు భారీ ర్యాలీలు నిర్వహించబడతాయి" అని అది జోడించింది.

మండే..

(మొదటిపేజీ తరువాయి)

పాయింట్లు లేదా 1.14 శాతం పతనమై 74,454కి దిగజారింది. రోజంతా నష్టాల్లోనే ట్రేడయింది. ఒక దశలో 900 పాయింట్లకు పైగా పడిపోయి 74,387 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ట స్థాయిని తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 242.55 పాయింట్లు లేదా 1.06 శాతం నష్టంతో 22,553 వద్ద ముగిసింది. ఇరు సూచీలు 2025లో ఇప్పటి వరకు 5 శాతం పతనమయ్యాయి. వరుస పతనంతో సెన్సెక్స్ ఎనిమిది నెలల కనిష్టానికి పడిపోయింది. ఒక్క పూటలోనే ఇన్వెస్టర్ల సంపద రూ.4.42 లక్షల కోట్లు ఆవిరై.. బీఎస్ఈ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.422.98 లక్షల కోట్లకు పరిమితమయ్యింది.

"భారత్‌లో ఎన్నికలకు డబ్బులిస్తున్నాం. వారికి అవి అవసరం లేదు. వారు మనల్ని అవకాశంగా తీసుకుంటున్నారు. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో ఇండియా ఒకటి. మనపై 200శాతం సుంకాలు విధిస్తుంది." అని మరోమారు ట్రంప్ భారత్‌పై విరుచుకుపడటం ఇన్వెస్టర్లలో మరింత ఆందోళనలను పెంచింది. రష్యా ఉక్రెయిన్ మధ్య ఆందోళనలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు నెలకొనడంతో భారత మార్కెట్లపై ఆ ప్రభావం పడింది. మరోవైపు దేశీయంగా కార్పొరేట్ సంస్థల డిసెంబరు త్రైమాసిక ఫలితాలు బలహీనంగా ఉండటం, జీడీపీ వృద్ధిపై ఆందోళనలు మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. గడిచిన శుక్రవారం విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.3,449 కోట్లకుపైగా విలువ చేసే షేర్లను విక్రయించారు. ఈ ఫిబ్రవరి నెల మొత్తంలో రూ.23,740 కోట్ల విదేశీ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. బీఎస్ఈలో స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు వరుసగా 1.31 శాతం, 0.78 శాతం చొప్పున నష్టపోయాయి. డాలర్‌తో పోలిస్తే మన దేశ కరెన్సీ రూపాయి విలువ 4 పైసలు కోల్పోయి రూ.86.720 వద్ద ముగిసింది. ఆటో, ఫార్మా, ఎఫ్ఎంసీజీ రంగాలు మినహా దాదాపు అన్ని రంగాలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా ఐటీ, టెలికం, లోహ రంగాల సూచీలు 2 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ సూచీలో విప్రో, హెచ్‌సిఎల్ టెక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ సహా టాటా స్టీల్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా, ఐషర్ మోటార్స్, డాక్టర్ రెడ్డీస్, హీరో మోటార్స్, కొటాక్ మహీంద్రా షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

నర్సిరెడ్డి, అశోక్ కుమార్‌ను ఎమ్మెల్సీలుగా గెలిపించండి

(మొదటిపేజి తరువాయి)

ఎస్ సృజన, జి లివిన్ స్టన్ (బీసీ వెల్ఫేర్), కె విశాలాక్షి, సిహెచ్ లక్ష్మి, ఎం మంజుల (కేజీబీవీ), ఎ వేదాంతచారి, ఎం ప్రసన్న (ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్), పి సత్యం, ఆంజనేయులు (డాక్టర్స్ అసోసియేషన్), ఎస్ శంకర్, ఆర్ లాలు (పీడీ అండ్ పీఈటీ అసోసియేషన్) సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవినీతిపరులకు, అవకాశవాదులకు, రియల్టర్లు, కార్పొరేట్ విద్యావ్యాపారులకు ఉపాధ్యాయ నియోజ కవర్గాల్లో స్థానం లేదని నిరూపించాలని కోరారు. నర్సిరెడ్డి, అశోక్ కుమార్ గెలిస్తేనే ఓటర్ గెలిచినట్లనీ, ఇంకెవరు గెలిచినా వారు వెంటనే అధికార పార్టీలో చేరిపోయే అవకాశవాదులేనని విమర్శించారు. నర్సిరెడ్డి మాత్రమే గత ఆరేండ్లుగా నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

నిత్యం నియోజ కవర్గంలో పర్యటిస్తూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని వివరించారు. నర్సిరెడ్డి చొరవతోనే టెట్ వివాదం పరిష్కారమైందనీ, పండితులు, పీఈటీలు సహా వేలాది మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వచ్చాయని గుర్తు చేశారు. తనకు మంజూరైన నియోజకవర్గ అభివృద్ధి నిధులను వంద శాతం పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి కేటాయించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పేదలకు వైద్య సహాయం కోసం నాలుగున్నర కోట్ల రూపాయలను మంజూరు చేయించారని వివరించారు. గత ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా యూఎస్‌పీసీ, ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉధృతంగా పోరాడామనీ, ఈ ప్రభుత్వం సమస్యలను పరిష్కరి స్తుందనే నమ్మకం ఉందని వారు తెలిపారు. లేదంటే పోరాడటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రతినెలా మొదటి తేదీన వేతనాలు ఇస్తామన్న హామీ మోడల్ స్కూళ్లు, గురుకులాలు, కేజీబీవీల్లో అమలు జరగడం లేదని పేర్కొన్నారు. రెండేండ్లుగా ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులు, సెలవు జీతాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్, జీఎల్ఐ తదితర బకాయిలు ట్రెజరీలో ఆమోదం పొందినప్పటికీ ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రిటైరైన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్ తదతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏడాది కాలంగా విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సర్వీసు నిబంధనలు రూపొందించి డీఈవో, డిప్యూటీ ఈవో, ఎంఈవో, డైట్, బీఈడీ కళాశాల అధ్యాపకుల పదోన్నతులు చేపట్టాలని కోరారు. గురుకులాల పనివేళలను విద్యార్థులు, ఉపాధ్యాయులకు అనుకూలంగా శాస్త్రీయంగా నిర్ణయించాలని సూచించారు. కేజీబీవీ ఉద్యోగులకు పేస్కేలు ఇవ్వాలనీ, కేర్ టేకర్లను నియమించాలని తెలిపారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కృష్ణా నీటివాటాలపై కేఆర్ఎంబీలో చర్చ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణాజలాల్లో వాటాపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సోమవారం చర్చించింది. హైదరాబాద్‌లోని జలసౌధలో బోర్డు చైర్మెన్ అతుల్‌జైన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి ఇరురాష్ట్రాల అధికారులు ఏపీ, తెలంగాణ వాదనలు విన్నారు. ఈ సమావేశానికి తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, తెలంగాణ ఈఎన్సీ జి అనిల్‌కుమార్, ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నీటి వాటాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. కాగా రెండు తెలుగు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ ఛీఫ్(ఈఎన్సీ)లు ప్రత్యేకంగా భేటీ అయ్యేందుకు చైర్మెన్ సమయమిచ్చారు. దాదాపు గంటపాటు జరిగిన సమావేశంలో నాగార్జునసాగర్ సీఈ, ఏపీ సీఈలతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేశారు. మంగళవారం వారిద్దరూ సమావేశం కావాలని సూచించారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద పంటలు ఎంత, నీరు ఎంత కావాలో సీఈలు చర్చించుకుంటారు. వారిద్దరు ఒక అంచనాకు వచ్చిన తర్వాత కేఆర్ఎంబీ దృష్టికి తేనున్నారు. ఈ మేరకు అంగీకారం కుదిరింది. కాగా శ్రీశైలం నీళ్లు తెలంగాణకే దక్కాలనీ తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు పట్టుబట్టారు. తాగునీటి కోసం నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో కనీసం 10 టీఎంసీలు ఉంచాలని తెలంగాణ అధికారులు కేఆర్ఎంబీ దృష్టికి తెచ్చారు. ఇదిలావుండగా నల్లగొండ వెళ్లి ఎన్ఎస్‌పీ సీఈతో సమావేశం కావాలని ఏపీ సీఈకి కేఆర్ఎంబీ ఆదేశించింది. ఇదిలావుండగా బుధవారం కేఆర్ఎంబీ మళ్లీ కావాలని నిర్ణయించింది. వేసవి నేపథ్యంలో సాగు, తాగునీటి అవసరాలకు 119 టీఎంసీలు కేటాయించాలన్న తెలంగాణ విజ్ఞప్తిపై కేఆర్ఎంబీ వెంటనే నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపించడం లేదు. సీఈ, ఈఎన్సీల సమావేశం అనంతరం కేఆర్ఎంబీ చైర్మెన్ అతుల్‌జైన్ మరోసారి రెండు రాష్ట్రాల వాదనలు వింటారు. అనంతరం తెలంగాణ విజ్ఞప్తిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

మయన్మార్ నుంచి హైదరాబాద్‌కు... అమ్మాయిల అక్రమ రవాణా

చాదర్‌ఘాట్‌లో రవాణా ముఠా అరెస్ట్

నవతెలంగాణ - ధూల్ పేట్

మయన్మార్ నుంచి హైదరాబాద్ నగరానికి అమ్మాయిల అక్రమ రవాణా చేస్తున్న ముఠాను పాతబస్తీ చాదర్‌ఘాట్‌లో పోలీసులు అరెస్టు చేశారు. విదేశాల నుంచి అమ్మాయిలను నగరానికి తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం అందుకున్న సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, చాదర్‌ఘాట్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ చాదర్‌ఘాట్ సమీపంలోని మూసా నగర్ కేంద్రంగా మహిళల అక్రమ రవాణా జరుగుతుందని సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో వారు చాదర్ ఘాట్ పోలీసులతో కలిసి ఆకస్మిక దాడులు చేసి ముఠాను పట్టుకున్నారు. ఈ ముఠాలో బంగ్లాదేశ్‌కు చెందిన నలుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అధిక సంపాదనకు ఆశపడిన సభ్యులు మహిళలను అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గుర్తించారు.

మోగిన ఎమ్మెల్సీ ఎన్నికల నగారా

(మొదటిపేజి తరువాయి)

కూడా మార్చి 29తోనే ముగియనున్నది.

షెడ్యూల్

1. నోటిఫికేషన్	మార్చి 3 (సోమవారం)
2. నామినేషన్ దాఖలుకు గడువు	మార్చి 10 (సోమవారం)
3. నామినేషన్ల పరిశీలన	మార్చి 11 (మంగళవారం)
4. నామినేషన్ల ఉపసంహరణకు గడువు	మార్చి 13 (గురువారం)
5. పోలింగ్	మార్చి 20 (గురువారం) (ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు)
6. ఓట్ల లెక్కింపు	మార్చి 20 (గురువారం) సాయంత్రం 5 గంటలకు

అపరిష్కృత సమస్యలు వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్లకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో గల రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయం సమాచార భవన్ వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపారు. బ్యానర్, ప్లకార్డులు ప్రదర్శించా రు. నినాదాలు చేశారు. దాదాపు రెండు గంటలపాటు ఆందోళన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధానకార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేండ్లుగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుండా అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అలస్యం చేయడాన్ని తప్పుబట్టారు. సుప్రీంకోర్టు తీర్పు సాకుతో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం, కొత్త అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇంత వరకు ఇవ్వకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడం దుర్మార్గమని అన్నారు. జర్నలిస్టుల పట్ల గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా చిన్న చూపు చూడొద్దని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. హెల్త్‌కార్డుల్లేక వైద్య సదుపాయాలు అందక రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఐదు వందల మంది జర్నలిస్టులు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇండ్ల స్థలాలు ఇవ్వాలనీ, ఆరోగ్య భీమా పథకం, పెన్షన్ స్కీం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం జరుగుతుండగానే సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ డిఎస్ జగన్ వచ్చి ఫెడరేషన్ నేతలతో సంప్రదింపులు చేశారు. డిమాండ్లను తెలుసుకుని కమీషనర్ ద్వారా జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని హామీ ఇచ్చారు. అనంతరం ఫెడరేషన్ ప్రతినిధి బందం సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్. హరీష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించి సమస్యలను వివరించింది. ఇందుకు స్పందించిన కమిషనర్ త్వరలోనే అక్రిడిటేషన్‌కార్డులు ఇస్తామన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, గుడిగ రఘు, కార్యదర్శులు ఎస్కే సలీమా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, కె. పాండురంగారావు, పి.నాగవాణి, మణిమాల, నాయకులు యర్రమిల్లి రామారావు, శ్రీనివాస్‌గౌడ్, రవికుమార్, సీహెచ్ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల్లో ఆందోళన

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో ఆందోళన జరిగింది. భారీ సంఖ్యలో జర్నలిస్టులు కదిలారు. వారి నినాదాలతో కలెక్టరేట్లు దద్దరిల్లాయి. సమస్యలు పరిష్కరించాలంటూ జర్నలిస్టులు నినాదాలు చేశారు. హైదరాబాద్‌లోని సమాచార భవన్‌తోపాటు హైదరాబాద్ కలెక్టరేట్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, హన్మకొండ, యాదాద్రి-భువనగిరి, ములుగు, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, కోమ్రంభీమ్-ఆసిఫాబాద్, వనపర్తి, జోగులాంబ, వనపర్తి, మహబూబ్‌నగర్, జగిత్యాల, మంచిర్యాల, సిరిసిల్ల, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాల్లో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు విజయవంతమైంది. అన్నీ జిల్లాల్లో బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

అలుగుబెల్లికి ఆదరణ

ఖమ్మం-నల్లగొండ- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఆయన చేసిన సేవలపై ఉద్యోగ, ఉపాధ్యాయుల విశ్లేషణ

ఖమ్మం-వరంగల్-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి.. ఉపాధ్యాయ, అధ్యాపక వర్గంలో ఆదరణ చూరగొంటున్నారు. అవకాశాలు మెరుగయ్యాయి. పదవీకాలంలో ఆయన నిజాయితీగా పనిచేసిన తీరు.. విద్యారంగ సమస్యలపై చట్టసభల లోపల, వెలుపలా పోరాడిన క్రమం ఆయన్ను పతాక స్థాయిలో నిలబెట్టింది. గత ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లకు కొద్దిదూరంలో ఆగి.. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు వంద లెక్కించే సరికి విజయాన్ని ఖరారు చేసుకున్న నర్సిరెడ్డి.. ఈసారి తొలి ప్రాధాన్యతలోనే సత్తా చాటుతారనే అంచనాలు ఊపందుకున్నాయి. ప్రత్యర్థుల మధ్య అనైక్యత.. గెలిపించినా అమ్ముడుపోతారనే చర్చ.. అధ్యాపక, ఉపాధ్యాయ వర్గాల్లో ఉంది. దీనికి భిన్నంగా నర్సిరెడ్డి నిజాయితీకి ఉద్యోగ, ఉపాధ్యాయులు జేజేలు పలుకుతున్నారు.

- ఎమ్మెల్సీగా నిజాయితీగా పనిచేశారని చర్చ
- ఈ సారీ ఆయనవైపే మొగ్గు..
- 12 జిల్లాల్లో విస్తరించిన నియోజకవర్గం..

25,797 మంది ఓటర్లు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

ఖమ్మం-వరంగల్- నల్లగొండ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డి ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మొత్తం 12 జిల్లాల్లో విస్తరించి ఉన్న ఈ నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉన్నారు. క్రితంసారి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లలో విజయానికి కావాల్సినవి 9,014కు గాను 8,976 ఓట్లు నర్సిరెడ్డికి వచ్చాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లలో 38 తక్కువ రావడంతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలో వంద చిల్లర లెక్కించే లోగానే ఆయన విజయం ఖరారైంది. అంటే దాదాపుగా ఆయన మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలిచారు. ఈసారి నర్సిరెడ్డి విజయం సులువేనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీనికి కారణాలు కూడా లేకపోలేదు.

ఇవే అలుగుబెల్లిని నిలబెట్టాయి..

గత ఎన్నికల్లో పోటీ చేసే నాటికి టీఎస్ యూటీఎఫ్ నాయకునిగానే సుపరిచితులైన నర్సిరెడ్డి ఎమ్మెల్సీగా గెలిచాక అందరి అభిమానాన్ని చూరగొన్నారు. ఎమ్మెల్సీగా ఆయన చేసిన పనులే ఆయన్ని పతాక శీర్షికన నిలబెట్టాయి. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యారంగ పరిరక్షణ కోసమే కాక.. పేద, బడుగు, బలహీనవర్గాల కోసం సైతం ఆయన పనిచేశారు. అందరికీ సుపరిచితులుగా మారారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేశారు. ఎమ్మెల్సీగా తనకు లభించిన గౌరవవేతనాన్ని సైతం ఉపాధ్యాయ ఉద్యమాల నిర్వహణకే ఖర్చు చేశారు. రెండు లక్షల కి.మీ పైగా తిరిగి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను సందర్శించారు. నిత్యం ఉపాధ్యాయులతో మమేకం అయ్యారు. చట్టసభలకు ఒక్కరోజు కూడా గైర్హాజరు కాకుండా వెళ్లారు. ప్రతి సమావేశానికీ హాజరై వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలను ప్రస్తావించారు. అనేక సమస్యలను గత సీఎం కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడ్డారు.

మెరుగైన పీఆర్సీ ఫిట్మెంట్ కోసం నిరాహారదీక్ష

30శాతం ఫిట్మెంట్ సాధించటంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పాత్ర ఎనలేనిది. టెట్ వివాదం కారణంగా గత దశాబ్దకాలంగా నిలిచిన పాఠశాల విద్యారంగంలోని ప్రమోషన్లకు నర్సిరెడ్డి కృషితో పరిష్కారం లభించింది. అప్‌గ్రేడ్ అయిన పండిట్, వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు లభించటం కలిసివచ్చే అంశం. రెసిడెన్షియల్, గిరిజన, ఆశ్రమ పాఠశాలల్లో బదిలీలు, ప్రమోషన్లు, మోడల్, కేజీబీవీ విద్యాలయాల్లో బదిలీల విషయంలోనూ నర్సిరెడ్డి విజయమంతమయ్యారు. మిగతా సంఘాల ఉద్యమాలకు, పోరాటాలకు నర్సిరెడ్డి అండగా నిలిచారు.

అలుగుబెల్లికి మద్దతుగా 23కు పైగా సంఘాలు..

గత ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డికి టీఎస్‌యూటీఎఫ్ ఒక్కటే వెన్నుదన్నుగా ఉంది. అటువంటి సమయంలోనే ఆయనకు మొత్తం పోలైన 18,694 ఓట్లలో చెల్లిన 18,026 ఓట్లలో దాదాపు సగం నర్సిరెడ్డి సాధించారు. 8,976 ఓట్లు ఆయనకు లభించాయి. ఈసారి అలుగుబెల్లికి తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్), తెలంగాణ ప్రొగెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్)తో పాటు 23 ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతు ఉంది. నర్సిరెడ్డికి ప్రత్యర్థులుగా పోటీలో ఉన్న నలుగురూ ఒకే సంఘానికి చెందినవారైనా విడివిడిగా పోటీ చేస్తుండటం ప్రధానంగా అలుగుబెల్లికి కలిసివచ్చే అంశం. ఈ నలుగురిలో ఎవరు గెలిచినా ఆ తర్వాత ఓటర్ తీర్పును అభాసుపాలు చేసే అవకాశం లేకపోలేదు. అధికార పార్టీలో చేరి ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలను గాలికి వదిలేస్తారనే చర్చ సాగుతోంది. బీజేపీ అభ్యర్థి బరిలో ఉన్న ఉపాధ్యాయవర్గాల్లో వారి బలం నామమాత్రమే. దీనికితోడు ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రధాన సమస్య అయిన సీపీఎస్‌ను పరిష్కరించేందుకు బీజేపీ సిద్ధంగా లేదు. కార్పొరేట్లకు మించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఆదాయ పన్ను వసూలు చేస్తోంది. ఇవన్నీ నర్సిరెడ్డి విజయానికి తోడ్పడే అంశాలుగా విశ్లేషణలు ఉన్నాయి.

నిజాయితీ అంటే నర్సిరెడ్డి..

నిజాయితీ అంటే అలుగుబెల్లి.. నర్సిరెడ్డి అంటే నిజాయితీ అనేలా ఎమ్మెల్సీగా పనిచేసిన నర్సిరెడ్డికి మరోమారు పట్టం కట్టడం ఉపాధ్యాయుల గురుతర బాధ్యత. భారీగా మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి నర్సిరెడ్డిని గెలిపించాలి. విద్యారంగ సమస్యలపై నికరంగా పోరాడే నర్సిరెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

- షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు
టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు
- ఏవీ నాగేశ్వరరావు, వెంగళరావుటీపీటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

నర్సిరెడ్డి, అశోక్ కుమార్, నరేందర్‌రెడ్డికి టీఎస్‌పీటీఏ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 27న జరగబోతున్న శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్న వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్, పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (టీఎస్‌పీటీఏ) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్ రోహిత్ నాయక్, అసోసియేట్ అధ్యక్షులు ఆర్ మంగా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయుల విశాల ప్రయోజనాల దృష్ట్యా ప్రశ్నించే, పోరాడే నాయకులు నర్సిరెడ్డి, అశోక్ కుమార్, నరేందర్‌రెడ్డిలని తెలిపారు. వారు నిజాయితీగా వ్యవహరిస్తున్నట్టు గుర్తించి తాము మద్దతు ప్రకటించామని పేర్కొన్నారు.



సెమీస్‌కు న్యూజిలాండ్, భారత్

- రచిన్ రవీంద్ర సెంచరీ
- బంగ్లాదేశ్‌పై ఆరు వికెట్ల తేడాతో కివీస్ గెలుపు
- పాకిస్తాన్ ఆశలు ఆవిరి
- ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ

రావల్పిండి: ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఆతిథ్య పాకిస్తాన్ జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించింది. సోమవారం జరిగిన గ్రూప్-ఎ లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు ఆరు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. దీంతో వరుసగా రెండేసి విజయాలతో ఈ గ్రూప్ నుంచి భారత్, న్యూజిలాండ్ జట్లు సెమీస్‌కు చేరగా.. మరో లీగ్ మ్యాచ్ మిగిలి ఉండగానే పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లు నిష్క్రమించాయి. ఇక బంగ్లాదేశ్‌తో సోమవారం జరిగిన గ్రూప్-ఎ రెండో లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ బౌలర్లు అదరగొట్టారు. బ్రాస్‌వెల్(4/36), రూర్కె(2)48)కి తోడు హెన్రీ, జెమిసన్ ఒక్కో వికెట్‌తో చెలరేగారు. దీంతో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 236 పరుగులకే పరిమితమైంది. బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హూస్సేన్ శాంటో(77) టాప్ స్కోరర్‌గా నిలవగా.. జాకర్ అలీ(45), రిషద్ హొస్సేన్(26) రాణించారు. మరో ఓపెనర్ తంజిద్ హొసైన్(24) కూడా ఫర్వాలేదనిపించారు. మెహిదీ హసన్(13), తౌహిద్(7), వికెట్ కీపర్ ముష్ఫికర్(2), మహ్మదుల్లా(4) నిరాశపరిచారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు తస్కిన్(10), ముస్తాఫిజుర్(3) రాణించలేకపోయారు.

రచిన్ రవీంద్ర సెంచరీ..

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ టాపార్డర్ బ్యాటర్లు నిరాశపరిచారు. ఓపెనర్లు యంగ్(0) డకౌట్ కాగా.. కాన్వే(30), విలియమ్సన్(5) రాణించలేకపోయారు. దీంతో న్యూజిలాండ్ జట్టు 72పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో భారత సంతతికి చెందిన కివీస్ మిడిలార్డర్ బ్యాటర్ రచిన్ రవీంద్ర(112) సెంచరీతో మెరిసాడు. 105బంతుల్లో 12ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 112పరుగులు చేసి రిషాద్ హొసైన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత పాకిస్తాన్‌పై సెంచరీతో రాణించిన లాథమ్ మరోసారి అర్ధసెంచరీతో మెరిసాడు. గ్లెన్ ఫిలిప్స్‌తో కలిసి మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించాడు. దీంతో న్యూజిలాండ్ జట్టు 46.1ఓవర్లలో 5వికెట్లు నష్టపోయి 240పరుగులు చేసి విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బ్రాస్‌వెల్‌కు దక్కింది.

సెమీస్‌కు భారత్, న్యూజిలాండ్..

ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లోకి భారత్, న్యూజిలాండ్ జట్లు దూసుకెళ్లాయి. గ్రూప్-ఎలో ఆడిన రెండు మ్యాచుల్లో ఈ జట్లు వరుస విజయాలను నమోదు చేసుకున్నాయి. ఈ క్రమంలో టాప్-2 స్థానాల్లో ఉన్న ఈ జట్లు సెమీస్ బెర్త్‌లను ఖాయం చేసుకోగా.. వరుసగా రెండు ఓటములతో ఆతిథ్య పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లు మరో మ్యాచ్ మిగిలి ఉండగానే లీగ్ దశలోనే నిష్క్రమించాయి.

ఛేజింగ్ కింగ్ విరాట్

ఛేదన 28శతకాల్లో 24మ్యాచుల్లో టీమిండియా గెలుపు



ముంబయి : టీమిండియా రన్ మెషీన్ విరాట్ కోహ్లి పాకిస్తాన్‌పై అజేయ శతకంతో తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. పాకిస్తాన్‌తో మ్యాచ్ అంటే చెలరేగి ఆడే కోహ్లి ఆ మార్క్ ప్రదర్శననే ఛాంపియన్స్ ట్రోఫీలోనూ చూపాడు. టి20 ప్రపంచకప్‌లో పాక్‌పై ఆడిన ఆటను మనం ఇంకా మరువకముందే.. మళ్లీ ఆ జట్టుపైనే మరో చిరస్మరణీయమైన ఆటను ప్రదర్శించి చిరకాలం గుర్తుండులా చేశాడు. ఇక పాకిస్తాన్‌పై కొట్టిన సెంచరీతో విరాట్ వన్డే కెరీర్‌లో 51వ శతకాన్ని పూర్తిచేసుకున్నాడు. ఈ ఫార్మాట్‌లో ఇన్ని శతకాలు కొట్టిన ఏకైక బ్యాటర్ విరాట్ కోహ్లి మాత్రమే. అంతకుముందు ఈ రికార్డు సచిన్ టెండ్యూలర్(49సెంచరీలు) పేరిట ఉండగా.. ఆ రికార్డును కోహ్లి ఎప్పుడో అధిగమించాడు. వన్డే ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు కొట్టిన తొలి ఆటగాడిగా దూసుకెళ్తున్న కోహ్లి చేసిన శతకాలల్లో 28 శతకాలు ఛేదన సందర్భంగా చేసినవే. అందులో కోహ్లి కొట్టిన 24 సెంచరీల్లో భారతజట్టు విజయం సాధించడం మరో విశేషం.

ఫామ్‌లో లేదన్నారు: రిజ్వాన్

ఫామ్ లేమితో తంటాలు పడుతున్న విరాట్ కోహ్లీని పాక్ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ మెచ్చుకున్నాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విరాట్‌ను ఔట్ చేయడానికి ఎంతో ప్రయత్నించామని, కానీ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి మ్యాచ్‌ను తమ నుంచి లాగేసుకున్నాడని పేర్కొన్నాడు. కోహ్లి ఫిట్‌నెస్ లెవల్, అతను కష్టపడిన తీరును కచ్చితంగా మెచ్చుకుంటాను. ఎందుకంటే అతను క్రికెటర్. మేమూ క్రికెటర్లమే. కోహ్లి ఫామ్‌లో లేడని అందరూ అన్నారు. కానీ, పెద్ద మ్యాచ్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడాడు' అని రిజ్వాన్ వివరించాడు.

క్రికెట్ కోహినూరు కోహ్లి: సిద్ధు

పాక్‌పై శతకంతో మెరిసిన కోహ్లిపై ప్రశంసల జల్లు కురుస్తోంది. విరాట్ కోహ్లి మరో రెండు, మూడేళ్ల క్రికెట్ ఆడతాడని మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధు పేర్కొన్నారు. గత కొంతకాలంగా ఫామ్ లేమితో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న విరాట్ కోహ్లి.. ఛాంపియన్స్ ట్రోఫీలో శతకంతో రాణించి వారి విమర్శలకు సమాధానం ఇచ్చాడని తెలిపాడు. విరాట్ ఆటపై మక్కువ కలిగిన ఆటగాడని.. పాక్‌పై సెంచరీ చేసిన విధానాన్ని చూస్తే.. రాబోయే రెండు మూడేళ్లు ఆడతాడని తెలిపాడు. మరో పది, పదిహేను సెంచరీలు సాధిస్తాడని తాను పూర్తిగా నమ్మకంతో చెబుతున్నానని తెలిపాడు. ఎవరైనా కష్ట సమయాలను ఎదుర్కొంటారని.. గత ఆరు నెలల్లో విరాట్ విషయంలో చాలా జరిగిందన్నారు. పాకిస్తాన్‌పై విరాట్ చేసిన సెంచరీ చిరకాలం గుర్తుండి పోతుందన్నారు. విరాట్ కోహ్లి లాంటి క్రికెటర్లు తరానికి ఒకసారి పుడతారని.. అతను కోహినూర్ లాంటివాడని పేర్కొన్నారు.

సెంచరీతో తిరిగి ఫామ్‌లోకి : రోహిత్

'కోహ్లి భారత్‌కు ప్రాతినిధ్యం వహించడాన్ని ఇష్టపడతాడు. ముఖ్యంగా అతను జట్టు కోసం ఆడాలని కోరుకుంటాడు. ఎప్పుడూ తన అత్యుత్తమ ఆటను ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాడు. కీలక సమయంలో తనలోని నైపుణ్యాలను మరింత మెరుగ్గా ప్రదర్శిస్తాడు. పాక్‌పై కోహ్లి భారీ ఇన్నింగ్స్ ఆడటం చూసి డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్నవారిలో ఒక్కరూ కూడా ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే ఎన్నో ఏళ్లుగా జట్టు కోసం అతడేం చేస్తున్నాడో అందరికీ తెలుసు. కోహ్లి తనదైన స్టైల్‌లో మ్యాచ్‌ను ముగించడం బాగుంది' అని భారత కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు.

భారత హాకీజట్లకు నిరాశ

ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు వరుసగా పరాజయాన్ని చవిచూశాయి. సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 2-3గోల్స్ తేడాతో ఇంగ్లండ్ చేతిలో పోరాడి ఓటమిపాలైంది. ఇక మహిళల జట్టు 2-4గోల్స్ తేడాతో పటిష్ట నెదర్లాండ్స్ చేతిలో పరాజయాన్ని చవిచూసింది.



నేడు జరిగే రివర్స్ మ్యాచ్‌లోనూ ఈ రెండుజట్లు మరోసారి తలపడనున్నాయి.

నవచిత్రం



ప్రియదర్శి

నవ్వించే సారంగపాణి

సకుటుంబ సపరివార సమేతంగా చూడదగ్గ వినోదాత్మక చిత్రాలకి పేరొందిన శ్రీదేవి మూవీస్ పతాకంపై మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించిన పూర్తి నిడివి హాస్య చిత్రం 'సారంగపాణి జాతకం'. ఈ సినిమా వేసవి సెలవుల్లో నవ్వులు పంచడానికి సిద్ధంగా ఉంది.

ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించిన ఈ చిత్రం నుండి ఇటీవల విడుదలైన టైటిల్ సాంగ్ 'సారంగో సారంగా', 'సంచారి సంచారీ' పాటలు ట్రెండ్ అవుతుండగా, టీజర్‌లోని మాటలు, హాస్య సన్నివేశాలు అందరి దృష్టిని ఆకర్షించాయి.

'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత భారీ అంచనాల మధ్య మోహనకృష్ణ ఇంద్రగంటి, శ్రీదేవి మూవీస్ కలయికలో మూడో చిత్రంగా విడుదలవ్వనున్న ఈ చిత్రం గురించి నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, 'వేసవి సెలవుల్లో కుటుంబమంతా కలిసి వెళ్ళి చూసే పరిపూర్ణ హాస్యరస చిత్రం మా 'సారంగపాణి జాతకం'. మా దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి అద్భుతంగా తీశారు. ఇటీవల విడుదలైన టీజర్‌లో ప్రేక్షకులకు మా సారంగపాణి ప్రపంచం ఎలా ఉంటుందో పరిచయం చేసాం. సినిమా చిత్రీకరణ, డబ్బింగ్ కార్యక్రమాలు సైతం పూర్తయ్యి, పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. మనిషి భవిష్యత్తు చేతి రేఖల్లో ఉంటుందా?, లేదా చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఇస్తూనే ఇంటిల్లిపాదిని కడుపుబ్బా నవ్వించే వినోదాత్మక చిత్రమిది. ఆద్యంతం కట్టిపడేస్తూనే, వచ్చే ఎండలకి స్వాంతనలా అందరినీ అలరిస్తుందీ సినిమా. ముఖ్యంగా సారంగపాణిగా ప్రియదర్శి నటన సర్‌ప్రైజ్ చేస్తుంది. అలాగే కథానాయిక రూపకొడువాయూర్ పాత్ర సైతం అందర్నీ అలరిస్తుంది.' అని అన్నారు.

నరేష్ విజయకృష్ణ, తనికెళ్ళ భరణి, శ్రీనివాస్ అవసరాల, 'వెన్నెల' కిశోర్, 'వైవా' హర్ష, శివన్నారాయణ, అశోక్ కుమార్, రాజా చెంబోలు, వడ్లమాని శ్రీనివాస్, ప్రదీప్ రుద్ర, రమేష్ రెడ్డి, కల్పలత, రూప లక్ష్మి, హర్షిణి, కె.ఎల్.కె, మణి, 'ఐమ్యాక్స్' వెంకట్ ఈ చిత్రంలో ఇతర ప్రధాన తారాగణం. ఈ చిత్రానికి పాటలు: రామ జోగయ్య శాస్త్రి, స్టంట్స్: వెంకట్ - వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: రవీందర్, ఎడిటర్: మార్తాండ్ కె. వెంకటేష్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: పీజీ విందా, సంగీతం: వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్: విద్య శివలెంక, సహ నిర్మాత: చింతా గోపాలకృష్ణా రెడ్డి, నిర్మాత: శివలెంక కృష్ణప్రసాద్, రచన - దర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి.

ఉగాది కానుకగా రిలీజ్



సుమంత్, కాజల్ చౌదరి, విహార్ష్

సుమంత్ హీరోగా సన్నీ సంజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'అనగనగా'. కాజల్ చౌదరి కథానాయిక. రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రా మదిరెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ తెలుగు సంవత్సరాది కానుకగా ప్రేక్షకులను అలరించనుంది.

తాజాగా మేకర్స్ ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. సుమంత్ ఇందులో చిన్నారులకు ఏ విధంగా పాఠాలు బోధిస్తే అర్థమవుతుందో చెప్పే టీచర్‌గా కనిపించారు. 'నోటితో విసిరి.. చేతులతో ఏరుకునేది ఏంటి' అంటూ సుమంత్ సంధించిన పొడుపు కథ ఆసక్తికరంగా ఉంది. సుమంత్ తన క్లాస్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. కాజల్ చౌదరి, అవసరాల శ్రీనివాస్ ప్రజెన్స్ కూడా ఆసక్తికరంగా ఉంది. డైరెక్టర్ సన్నీ సంజయ్ అందరికీ కనెక్ట్ అయ్యే కథని హార్ట్ టచ్చింగ్‌గా ప్రజెంట్ చేశారని టీజర్ చూస్తే తెలుస్తోంది.

మ్యూజిక్, కెమెరా వర్క్ కథలోని ఎమోషన్‌ని మరింతగా ఎలివేట్ చేశాయి. టీజర్‌తో ఈసినిమాపై అంచనాలు పెరిగాయి. ఈ చిత్రం తెలుగు ఓటీటీ ఈటీవీ విన్‌లో ఉగాది సందర్భంగా స్ట్రీమింగ్ కానుంది అని చిత్ర బృందం తెలిపింది. 'ఇటీవల కాలంలో కథానాయకుడు సుమంత్ చేసిన సినిమాలు, ఆ సినిమాల్లో ఆయన పాత్రలు చాలా వైవిధ్యంగా ఉంటూ ప్రేక్షకుల్ని విశేషంగా అలరించాయి. ఈ సినిమాలో సైతం ఆయన పాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది. గతంలో ఎన్నడూ కనిపించని ఓ పాత్రలో ఆయన ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈసినిమా కచ్చితంగా ఆయనకు మరింత మంచిపేరు తీసుకొస్తుందనే నమ్మకం ఉంది. ఈటీవీ విన్‌లో ఉగాది కానుకగా మా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం' అని మేకర్స్ తెలిపారు.

మాస్టర్ విహార్ష్, అవసరాల శ్రీనివాస్, అను హసన్, రాకేష్ రాచకొండ, రవి, కౌముది నేమాని తదితరులు నటించిన ఈచిత్రానికి రచన, దర్శకత్వం- సన్నీ సంజయ్, నిర్మాతలు: రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రా మదిరెడ్డి, సహ రచయిత - దీప్తి, సినిమాటోగ్రాఫర్ - పవన్ పప్పుల, సంగీతం - చందు రవి, ప్రొడక్షన్ డిజైనర్- ఎల్లోల్ డిజైన్ స్టూడియో అరవింద్ మ్యూల్, చంద్రిక గొర్రెపాటి, సౌండ్ డిజైనర్ - అశ్విన్ ఆర్, ఎడిటర్ - వెంకటేష్ చుండూరు.

'మజాకా'.. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



సందీప్ కిషన్ మోస్ట్ ఎవైటెడ్ 30వ చిత్రం 'మజాకా'. త్రినాధ రావు నక్కిన దర్శకత్వం వహించారు. ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ బ్యానర్స్ పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాత. మేకర్స్ ఈ మూవీ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్‌లో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు చిత్ర యూనిట్ సమాధానాలు ఇచ్చారు.

ట్రైలర్ చాలా హిలేరియస్‌గా ఉంది. థియేటర్స్‌లో ఇంత వినోదం ఇవ్వడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

సందీప్‌కిషన్ : ఈ సినిమా రెండుగంటల పాటు లాఫింగ్ రైడ్‌గా ఉంటుంది. థియేటర్స్‌లో చాలా గట్టి నవ్వులు వినిపిస్తాయి. నా కెరీర్‌లో హయ్యస్ట్ నెంబర్స్ ఈ సినిమా ఇస్తుంది. థియేటర్స్‌లో ఫ్యామిలీస్ అంతా చూసే సినిమా ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. యూనిట్ అంతా మంచి ఎంటర్‌టైనర్ ఇవ్వడానికి కష్టపడి పని చేశాం. ఇందులో పాటలు, ఫైట్లు తప్ప నాకు, రావు రమేష్‌కి ఈక్వెల్ స్క్రీన్ స్పేస్ ఉంటుంది. ఆయన అద్భుతంగా నటించారు. ఆయన వలన కథ మరింతగా పండింది.

ఈ సినిమాలో ఉండే మ్యాజిక్ ఏమిటి?

దర్శకుడు త్రినాథరావు : నేను ప్రతి సీన్‌లో మ్యాజిక్ ఉండాలని నమ్ముతాను. నా ప్రతి సినిమాలో కూడా మ్యాజిక్ జరుగుతుంది. ఇందులో కూడా ఓ మ్యాజిక్ ఉంది. అది జరిగింది. శివరాత్రి రోజు డబుల్ మ్యాజిక్ జరుగుతుంది. ఈ సినిమా డబుల్ బ్లాక్‌బస్టర్ అవుతుంది. ఎందుకంటే ఈ సినిమాలో బ్యూటీఫుల్ ఎమోషన్ ఉంది. ఇద్దరే మగాళ్ళు ఉన్న ఒక ఇంట్లో ఏ రోజుకైనా ఒక ఫ్యామిలీ ఫోటో రావాలని పడే తపనే 'మజాకా'. అందరూ కాసేపు తమ బాధలు మర్చిపోయి ఓ రెండు గంటల పాటు రిలాక్స్ అయి, హాయిగా నవ్వుకునే సినిమా ఇది.

ఇందులో మీరు డ్యాన్సులు చేయడం చాలా కొత్తగా అనిపిస్తోంది.. సోలో సాంగ్ వస్తే చేస్తారా?

రావు రమేష్ : చేస్తాను. సినిమా అవకాశం రావడమే గొప్ప. అలాంటిది సాంగ్‌కి డ్యాన్స్ చేసే అవకాశం వస్తే ఖచ్చితంగా చేస్తాను. ఇందులో ప్రతి సీన్‌ని మజాతో చేశాను. ఇలాంటి సినిమా చేయడం నాకూ కొత్తే. కొత్తగా నవ్వించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. ఇందులో రొమాంటిక్‌గా నటించడం చాలా సవాల్‌గా అనిపించింది(నవ్వుతూ). ఈ సినిమాతో చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇందులో ఒక ఎమోషనల్ సీన్ ఉంది. అది ఐకానిక్ సీన్‌గా నిలిచిపోతుంది. ఆడియన్స్ చాలా బాగా ఎంజాయ్ చేస్తారు.

పవర్‌ఫుల్ కథతో 'శివంగి'

ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలలో తెరకెక్కుతున్న పవర్‌ఫుల్ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'శివంగి'. జాన్ విజయ్, డాక్టర్ కోయ కిషోర్ కీలక పాత్రల్లో నటించారు.

దేవరాజ్ భరణి ధరణ్ దర్శకత్వంలో ఫస్ట్ కాపీ మూవీస్ బ్యానర్ పై నరేష్ బాబు పి. నిర్మించారు. ఇటీవల రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది.

తాజాగా ఆదివారం మేకర్స్ ఈ చిత్ర బోల్డ్ అండ్ సెన్సేషనల్ టీజర్‌ని రిలీజ్ చేశారు.

ఒక క్రైమ్ సీన్‌ని ప్రజెంట్ చేస్తూ ఓపెన్ అయిన టీజర్ ఆద్యంతం గ్రిప్పింగ్‌గా సాగింది. వరలక్ష్మి శరత్‌కుమార్‌కు ఆనందిని విచారించడంతో అసలు కాన్ఫ్లిక్ట్ తెరపైకి వస్తుంది. ఆనంది జీవితంలో జరిగిన రెండు ముఖ్య విషయాలు తనని వెంటాడుతాయి. తర్వాత ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకుందనేది చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. 'వంగేవాళ్ళు ఉన్నంత వరకు..మింగేవాళ్ళు ఉంటారు. నేను వంగే రకం కాదు..మింగే రకం' అని ఆనంది చెప్పిన బోల్డ్ డైలాగ్ టీజర్‌ని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్ళింది. ఆనంది క్యారెక్టర్ పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. వరలక్ష్మిశరత్‌కుమార్ ప్రజెన్స్ కట్టిపడేసింది. దేవరాజ్ భరణి ధరన్ నెవర్ బిఫోర్ స్టోరీతో ప్రేక్షకులని అలరించబోతున్నారని టీజర్ చూస్తే అర్థమవుతోంది. మార్చి 7న రిలీజ్ కానున్న ఈ సినిమాపై ఈ టీజర్ అంచనాలని మరింతగా పెంచింది అని చిత్రయూనిట్ తెలిపింది.



ఆనంది

ఈ చిత్రానికి దర్శకత్వం: దేవరాజ్ భరణి ధరన్, నిర్మాత: నరేష్ బాబు పి, సంగీతం: కాషిఫ్ - ఎబినేజర్ పాల్, డీవోపీ :భరణి కె ధరన్, ఆర్ట్: రఘు కులకర్ణి, సింగర్:సాహితీ చాగంటి, సాహిత్యం: శ్రీనివాస్ కామేపల్లి, దేవరాజ్ భరణి ధరన్.

సామాజిక సందేశంతో 'బంది'

వాతావరణ పరిరక్షణపై సామాజిక సందేశాన్ని ఇస్తూ ఆదిత్య ఓం చేసిన చిత్రం 'బంది'. రఘు తిరుమల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గల్లీ సినిమా బ్యానర్‌పై నిర్మించారు. ఇప్పటికే ఈ చిత్రాన్ని పలు అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించారు. ప్రతిష్టాత్మక చలన చిత్రోత్సవాలలో ఈ చిత్రానికి అనేక ప్రశంసలు దక్కాయి.

భారతదేశపు మొట్టమొదటి పర్యావరణ నేపథ్యంతో కూడిన థ్రిల్లర్‌గా ఈ సినిమా రికార్డు క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో ఆదిత్య ఓం పాత్ర ఎదుర్కొనే పరిస్థితులు, వాతావరణ సమస్యలపై పోరాడే తీరు అద్భుతంగా ఉండబోతోంది. భారతదేశంతో పాటు ఇతర విదేశాల్లోని అనేక అడవుల్లో రియల్ లొకేషన్స్ మధ్య ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

అద్భుతమైన విజువల్స్‌ను ఈ చిత్రంలో చూడబోతున్నాం. పర్యావరణ ప్రేమికులందరినీ కదిలించేలా ఈ చిత్రం ఉండనుంది. ఆదిత్య ఓం ఈ చిత్రంలో ఎన్నో రియల్ స్టంట్స్ చేశారు. అటవీ ప్రాంతాల్లో అనేక ఛాలెంజ్‌లు ఎదుర్కొంటూ అద్భుతంగా నటించారు. ఈ మూవీని ఈనెల 28న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.



ఆదిత్య ఓం

అయితే ముందుగా ఈ చిత్రాన్ని కొన్ని పరిమిత స్క్రీన్స్‌లో రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. ఆ తరువాత ప్రేక్షకుల రెస్పాన్స్‌ను బట్టి స్క్రీన్‌లు, షోలు పెంచుకుంటూ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. నిర్మాతలు వెంకటేశ్వర్ రావు దగ్గు, రఘు తిరుమల ఈ చిత్ర ప్రమోషన్స్ కోసం ఎన్‌జీఓలు, సామాజిక సంస్థలతో కలిసి ప్రమోషన్స్ చేస్తున్నారు. టీజర్, ట్రైలర్‌లకు మంచి ఆదరణ లభించడంతో సినిమా విడుదలపై మరింత ఉత్కంఠ నెలకొంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

రష్యా బలగాలు వైదొలగాలి

ఉక్రెయిన్ తీర్మానంపై ఐక్యరాజ్య సమితిలో ఓటింగ్



ఐక్యరాజ్య సమితి : ఉక్రెయిన్ నుంచి రష్యా బలగాలు తక్షణమే వైదొలగాలని కోరుతున్న తీర్మానంపై ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ఓటింగ్ జరగనుంది. అలాగే యుద్ధం త్వరగా ముగించాలంటూ అమెరికా ప్రతిపాదించిన తీర్మానంపై కూడా జనరల్ అసెంబ్లీ ఓటు వేయనుంది. ఉక్రెయిన్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాల్సిందిగా అమెరికా ఆదివారం కోరింది. అందుకు ఉక్రెయిన్ తిరస్కరించింది. తమ ప్రతిపాదనను ఓటింగ్‌కు పెడతామని స్పష్టం చేసింది. ఈ సమస్యను త్వరగా పరిష్కరించే ఉద్దేశ్యంతో రష్యాతో అకస్మాత్తుగాట్రంప్ చర్చలు జరపడంతో అమెరికా, ఉక్రెయిన్‌ల మధ్య విభేదాలు, ఉద్రిక్తతలు తలెత్తాయి.

మాస్కోతో సంబంధాలపై ట్రంప్ ప్రభుత్వ అసాధారణ రీతిలో వైఖరిని మార్చుకోవడంతో యూరప్ కూటమితో కూడా అమెరికాక సంబంధాలు ఇబ్బందుల్లో పడ్డాయి. గత వారంలో జరిగిన ప్రాథమిక చర్చల్లో తమను, ఉక్రెయిన్‌ను బహిష్కరించారని యురోపియన్ నేతలు భావిస్తున్నారు. కాగా ఉక్రెయిన్‌పై ఐక్యరాజ్య సమితి పెట్టే తీర్మానాన్ని తాము సమర్ధించేది లేదని ట్రంప్ స్పష్టం చేశారు.

కాగా దీనికి పోటీగా చివరి నిముషంలో తమ స్వంత తీర్మానాన్ని ప్రతిపాదించారు. దానికి మద్దతునివ్వాలని తమ మిత్రపక్షాలను కోరుతున్నారు. భద్రతా మండలిలో కూడా తమ ప్రతిపాదనను ఓటింగ్‌కు పెట్టాలని అమెరికా భావిస్తోంది. మరికొద్ది గంటల్లో ఈ ఓటింగ్ జరుగుతుందని భావిస్తున్నారు.

ఉక్రెయిన్‌కు బాసటగా యూరప్ !

పునరుద్ఘాటించిన యురోపియన్ నేతలు • మార్చి 6న 27 ఈయూ దేశాల నేతల భేటీ



కీవ్ : ఉక్రెయిన్‌పై యుద్ధానికి మూడేండ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని యూరప్,కెనడాలకు చెందిన పలువురు నేతలు సోమవారం కీవ్ చేరుకున్నారు. ట్రంప్ అధ్యక్షుడుగా ఎన్నికైన నాటి నుంచి ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా వైఖరి మారుతున్న నేపథ్యంలో ఈ నేతలందరూ కీవ్‌కు మద్దతును పునరుద్ఘాటించేందుకు వచ్చారు. యురోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో సహా 12మందికి పైగా నేతలు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహా, సాయుధ బలగాల చీఫ్ ఆండ్రి యార్మార్క్‌లను కలుసుకుని మాట్లాడారు. "ఉక్రెయిన్ యూరప్‌లో వుంది కాబట్టి ఈనాడు కీవ్‌లో యూరప్ వుంది." అని వాన్ డెర్ లేయన్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "మనుగడ కోసం జరిపే ఈ పోరులో ఇక్కడ పణంగా పెట్టింది కేవలం ఉక్రెయిన్ భవిష్యత్ మాత్రమే కాదు, మొత్తంగా యూరప్ భవితవ్యం కూడా." అని ఆమె వ్యాఖ్యానించారు. కీవ్ వచ్చిన యురోపియన్ నేతల్లో యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటానియో కోస్టా, స్పెయిన్, ఉత్తర యురోపియన్ దేశాల ప్రధానులు వున్నారు. యుద్ధ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు వీరు హాజరయ్యారు. ఉక్రెయిన్‌కు అందించే తోడ్పాటుపై అధ్యక్షుడు జెలెన్స్కీతో వారు చర్చలు జరిపారు. మార్చి 6వ తేదీన బ్రస్సెల్స్‌లో 27 ఇయు దేశాల నేతలు అత్యవసరంగా సమావేశం కానున్నారని యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు కోస్టా ప్రకటించారు. ఈ సమావేశం ఎజెండాలో ఉక్రెయిన్ ప్రధాన అంశంగా వుంటుందన్నారు. ఉక్రెయిన్, యురోపియన్ భద్రతను నిర్వచించాల్సిన తరుణంలో ప్రస్తుతం మనమున్నామని కోస్టా ఎక్స్ పోస్టులో వ్యాఖ్యానించారు.



పుతిన్‌తో జిన్‌పింగ్ హలో ..హలో

చైనా, రష్యాలు పరస్పరం సహకరించుకునే నిజమైన మిత్రులని వ్యాఖ్య

బీజింగ్ : చైనా, రష్యాలు నిజమైన మిత్ర దేశాలని, పరస్పరం మద్దతునిచ్చుకుంటూ సహకరించుకుంటా యని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ప్రభుత్వ మీడియా జిన్హువా వార్తా సంస్థ సోమవారం తెలిపింది. "చైనా, రష్యాలు మంచి ఇరుగు పొరుగు దేశాలని చరిత్రను, వాస్తవాలను చూసినట్లైతే అర్థమవుతుంది. అవి ఏనాడూ దూరం జరిగిపోవు. సుఖ దుంఖాలు పంచుకునే నిజమైన స్నేహితులు, ఒకరికొకరు మద్దతునిచ్చుకుంటూ ఉమ్మడి అభివృద్ధిని సాధిస్తాయి." అని జిన్‌పింగ్ పేర్కొన్నారు. పుతిన్ కోరిక మేరకు సోమవారం ఇరువురు నేతలు ఫోన్ కాల్‌లో మాట్లాడుకున్నారని జిన్హువా తెలిపింది. ఉక్రెయిన్‌కు రష్యా బలగాలను పంపినప్పటి నుండి ఇరు దేశాల మధ్య సైనిక, వాణిజ్య సంబంధాలు బలోపేతమయ్యాయి. చైనా, రష్యా సంబంధాలకు విశిష్టమైన వ్యూహాత్మక విలువ వుందని, తమ సంబంధాలు మరే ఇతర పక్షాన్ని లక్ష్యంగా చేసుకోవని జిన్‌పింగ్ పేర్కొన్నారు. అలాగే తృతీయ పక్షం వల్ల ప్రభావితం కూడా చెందబోవని స్పష్టం చేశారు. చైనా, రష్యా అభివృద్ధి వ్యూహాలు, విదేశాంగ విధానాలు వుంటాయని దీర్ఘకాలికమైనవని ఆయన చెప్పారు.అంతర్జాతీయ పరిస్థితుల్లో ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ రష్యా, చైనా సంబంధాలు సజావుగా ముందుకు సాగుతాయని, ఇవి పరస్పర అభివృద్ధికి, పునరుజ్జీవనానికిసాయపడతాయని చెప్పారు. అలాగే అంతర్జాతీయ సంబంధాల్లో సుస్థిరతను, సానుకూల శక్తిని చొప్పిస్తుందని అన్నారు. ఉక్రెయిన్‌లో సంక్షోభం చెలరేగిన సమయంలో ఆ సమస్యను పరిష్కరించడానికి తాను కొన్ని ప్రతిపాదనలు చేసిన విషయాన్ని జిన్‌పింగ్ గుర్తు చేశారు.



జర్మనీ ఛాన్సలర్‌గా ఫ్రెడరిక్ మెర్జ్ ?

బెర్లిన్ : జర్మనీ ఛాన్సలర్ ఎన్నికల్లో ఫ్రెడరిక్ మెర్జ్ నేతృత్వంలోని సీడీయూ-సీఎస్‌యూ కన్జర్వేటివ్ కూటమి విజయం సాధించింది. ఈ కూటమికి 28.5శాతం ఓట్లు లభించాయి. దీంతో ఫ్రెడరిక్ కొత్త ఛాన్సలర్‌గా ఎన్నికవనున్నారు. మితవాద కూటమికి చెందిన ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ (ఎఎఫ్‌డీ) రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ కూటమికి 20శాతం ఓట్లు వచ్చాయి. జర్మనీ పార్లమెంట్ దిగువ సభ అయిన బుండెస్టాగ్‌కు ఆదివారం ఎన్నికలు జరిగాయి. యూరప్‌లోనే అతిపెద్దదైన జర్మనీ ఆర్థిక వ్యవస్థ ప్రతిష్టంభనకు గురవుతోందన్న ఆందోళనలు, వలసలకు సంబంధించిన అంశాలు, ఉక్రెయిన్‌లో యుద్ధం వంటివి అనిశ్చితిని కలగచేస్తున్న తరుణంలో కీలకమైన ఈ ఎన్నికలు జరిగాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీ పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్నడూ లేని రీతిలో సోషల్ డెమోక్రాట్లు 10శాతం ఓట్లతో మూడవ స్థానానికి పరిమితం కావచ్చునని ఆదివారం ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైంది. దీంతో ఓల్ఫ్ షుల్జ్ ఓటమిని అంగీకరించినట్టు వార్తలు వెలువడ్డాయి.

అన్నాయూనివర్సిటీ లైంగిక వేధింపుల కేసు

నిందితుడు జ్ఞానశేఖర్‌పై చార్జిషీట్ నమోదు



చెన్నై : అన్నాయూనివర్సిటీ లైంగిక వేధింపుల కేసులో నిందితుడు జ్ఞానశేఖర్‌పై చార్జిషీట్ నమోదయింది. ఈ కేసు విచారణ కోసం మద్రాస్ హైకోర్టు ఏర్పాటు చేసిన పూర్తి మహిళా సిబ్బందితో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ చార్జిషీట్‌ను నగరంలోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు సమర్పించింది. గతేడాది డిసెంబరు 23న యూనివర్సిటీ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విద్యార్థినిపై జ్ఞానశేఖర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలిని బెదిరించడం, వీడియోలు రికార్డ్ చేయడం, ఐడీ కార్డు లాక్కోవడం చేశాడు. దీంతో కొట్టూర్పురం నివాసి అయిన జ్ఞానశేఖర్‌పై బీఎన్ఎస్‌లోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదయింది. జ్ఞానశేఖర్‌పై ఇప్పటికై 16 క్రిమినల్ కేసులు ఉండటం గమనార్హం. 2019 నుంచి 2024 మధ్యకాలంలో చెన్నైలోని అనేక ఇండ్ల వద్ద నుంచి కార్లు, ఇతర వాహనాలు దొంగలించినట్టు జ్ఞానశేఖర్ కూడా అంగీకరించాడు.

మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

కుంభమేళాకు వెళుతూ కర్నాటక యాత్రికులు

ఆరుగురు మృతి

బెలగావి (కర్నాటక) : ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు బయలుదేరిన కర్నాటకకు ఆరుగురు యాత్రకులు మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటన సోమవారం జరిగింది. ఫిబ్రవరి 18వ తేదీన కర్నాటక బెలగావి జిల్లా గోకాక్ నుండి ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో పాల్గొనేందుకు ఎనిమిది మంది యాత్రికులు బయలుదేరారు. అయితే సోమవారం మార్గమధ్యలో మధ్యప్రదేశ్ జబల్‌పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ ఎనిమిది మందిలో ఆరుగురు యాత్రికులు మృతి చెందినట్టు బెలగావి పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ముస్తాక్, సదాశివలనే ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతులను బాలచంద్రగౌడ్, సునీల్ షెడషాలే, బసవరాజ్ కుర్పి, బసవరాజ్ దొడ్డమాని, ఈరన్న షెబినకట్టి, విరూపక్ష గుమట్టిగా పోలీసులు గుర్తించారు.

బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం : ఏడుగురు మృతి



పాట్నా : బీహార్‌లో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పాట్నాలోని మసౌర్హిలోని నూరా వంతెనపై ట్రక్కు, టెంపో వాహనాలు రెండు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై మసౌర్హి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డిపిఓ) సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆదివారం రాత్రి నూరా బ్రిడ్జిపై జరిగిన ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించాము. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో టెంపో, ట్రక్కు రెండు వాహనాలు వంతెనపై నుండి పడిపోయాయి. వెంటనే స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో హుటాహుటిన ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు' అని ఆయన అన్నారు.

ఫ్రాన్స్‌లోని రష్యా దౌత్య కార్యాలయంలో పేలుడు

పారిస్ : ఫ్రాన్స్‌లోని మార్సెయిల్ సిటీలోని రష్యా దౌత్య కార్యాలయంలో సోమవారం పేలుడు సంభవించింది. భవనం లోపల పేలుడు జరిగినట్టు రష్యా కాన్సుల్ జనరల్ స్టానిస్లావ్ ఒరాన్స్కి ధృవీకరించారు. రష్యా దౌత్య కార్యాలయంలో పేలుడు వినిపించిందని, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలంలో ఉన్నారని ఫ్రాన్స్ మీడియా వెల్లడించింది. గుర్తుతెలియని దుండగులు దౌత్యకార్యాలయంలోకి రెండు మోలోటోవ్ కాక్టెయిల్‌లను విసిరారని తెలిపింది. ఘటనాస్థలికి సమీపంలో దొంగిలించిన కారు కూడా లభ్యమైనట్లు పేర్కొంది. ప్రాణనష్టం జరగలేదని, పోలీస్ అధికారులు ఆప్రాంతాన్ని చుట్టుముట్టారని తెలిపింది. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక ఆపరేషన్‌కు మూడేళ్లు పూర్తవుతున్న వేళ ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనను ఉగ్రవాద దాడిగా అనుమానిస్తున్నామని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఫ్రాన్స్ అధికారులను కోరింది.

నిలకడగా పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్యం

- హెల్త్ బులెటిన్ విడుదల చేసిన వాటికన్ వర్గాలు

వాటికన్ : పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఆయన గత కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ రోమ్‌లోని జెమెల్లి ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన హెల్త్ బులెటెన్‌ను సోమవారం వాటికన్ వర్గాలు విడుదల చేశాయి. ఆదివారం రాత్రి ప్రశాంతంగా గడిచిందని.. పోప్ విశ్రాంతి తీసుకుంటున్నారని వాటికన్ వర్గాలు తెలిపాయి. ఊపిరితిత్తుల సమస్యలతోపాటు, మూత్రపిండ సమస్యలతో ఆయన బాధపడుతున్నారు. ఆయన ఆరోగ్యం మెరుగుపడాలని ప్రపంచవ్యాప్తంగా క్యాథలిక్కులు, క్రైస్తవులు ప్రార్థనలు చేస్తున్నారు.

అసెంబ్లీలో సమాజ్‌వాదీ పార్టీ నిరసన

యోగి సర్కార్‌పై ఎమ్మెల్యేల ఆగ్రహం



లక్నో : ఉత్తరప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు గత ఐదు రోజులుగా కొనసాగుతున్నాయి. నేడు ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ పరోక్షంగా సమాజ్‌వాదీ పార్టీ నేత ములాయం సింగ్ యాదవ్‌నుద్దేశించి కామెంట్ చేశారు. దాదాపు 11 ఏండ్ల క్రితం ములాయంసింగ్ ఓ ర్యాలీలో లైంగికదాడులపై మాట్లాడారు. అమ్మాయిలపై అఘాయిత్యాలు చేస్తే.. మరణశిక్ష విధించడం తప్పు అని ఆయన వ్యాఖ్యానించారు. 'అబ్బాయి తప్పులు చేస్తారు. అయితే మరణశిక్ష విధిస్తారా? అని ముంబైలో లైంగికదాడి నిందితుల పై విధించిన శిక్షపై స్పందించి ములాయం ఆ సమయంలో కామెంట్ చేశారు. అయితే ములాయం చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యల్ని అప్పుడు బాంబే హై కోర్టు కూడా తప్పు పట్టింది. గతంలో ములాయం చేసిన 'అబ్బాయిలు తప్పు చేస్తారు' అన్న కామెంట్‌ను యూపీ డిప్యూటీ సీఎం ఇపుడు అసెంబ్లీలో ప్రస్తావించారు. బడ్జెట్ సెషన్ సందర్భంగా బ్రజేష్ పాఠక్ మాట్లాడుతూ.. 'మీ నేతాజీ (ములాయం సింగ్ యాదవ్) చెప్పినట్లు మీరు పాటిస్తారు. అనుసరిస్తారు అది సరైనదేనా? గతంలో ములాయం చేసిన 'అబ్బాయిలు తప్పు చేస్తారు' అని ఆయన చేసిన ప్రకటనతో మీరు కూడా ఏకీభవిస్తారా?' అని ఆయన ఎస్పీ ఎమ్మెల్యేలను ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై సమాజ్‌వాది పార్టీ ఎమ్మెల్యేలు ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అసెంబ్లీలనే డిప్యూటీ సీఎం వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసనలకు దిగారు. డిప్యూటీ సిఎం తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకని క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. దీంతో విధాన సభ స్పీకర్ సతీశ్ మహనా జోక్యం చేసుకుని.. ఎస్పీ ఎమ్మెల్యేలను సభ నుంచి బయటకు వెళ్లాల్సిందిగా ఆదేశించారు.

బీజేపీ దళిత వ్యతిరేకి అనడానికి నిదర్శనం ఇదే : అతిశీ



న్యూఢిల్లీ : బీజేపీ దళిత వ్యతిరేక, సిక్కు వ్యతిరేక పార్టీ అని రుజువైందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, అసెంబ్లీ ప్రతిపక్ష నేత అతిశీ వ్యాఖ్యానించారు. అతిషీ సోమవారం ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాతో ఆమె ఛాంబర్‌లో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ఆఫీసు నుంచి డా.అంబేద్కర్, భగత్‌సింగ్ ఫోటోలను తొలగించిందని అన్నారు. బీజేపీ దళిత వ్యతిరేక వైఖరిని అనుసరిస్తోందనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. గత రెండు రోజులుగా ముఖ్యమంత్రిని కలిసేందుకు సమయమివ్వాలని కోరామని, కానీ అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు నిరాకరించారని అన్నారు. తొలి క్యాబినెట్ సమావేశంలోనే మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయ పథకాన్ని అమలు చేయాలని ప్రధాని మోడీ ప్రకటించారని, ఈ హామీని నెరవేర్చడంలో బీజేపీ విఫలమైందని అన్నారు.

గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లిందని బీజేపీ నిరూపించే ప్రయత్నం చేస్తోందని, అయితే అలాంటి ఆరోపణలను తిప్పికొడతామని అతిశీ స్పష్టం చేశారు.

అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

ఢిల్లీ అసెంబ్లీ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా అరవిందర్ సింగ్ లవ్లీ ఎన్నికయ్యారు. రాజ్ నివాస్‌లో అరవిందర్ సింగ్ లవ్లీతో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణ స్వీకారం చేయించారు.

ఇక కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలందరితో ప్రొటెం స్పీకర్.. ప్రమాణం చేయించారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు స్పీకర్ ఎన్నికను నిర్వహించారు. ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా బిజెపి ఎమ్మెల్యే విజేందర్ గుప్తా బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యమంత్రి రేఖాగుప్తా ఆయన పేరును ప్రతిపాదించారు.

రాజకీయ పార్టీని ప్రకటించనున్న విద్యార్థి బృందం



ఢాకా : బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చివేతలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి బృందం నూతన రాజకీయ పార్టీని ప్రకటించనుంది. మరో రెండురోజుల్లో రాజకీయపార్టీ పేరు ప్రకటించనున్నట్టు సంబంధిత వర్గాలు సోమవారం తెలిపాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా స్టూడెంట్స్ ఎగైనెస్ట్ డిస్క్రిమినేషన్ (ఎస్ఏడీ) అధ్యక్షుడు నహిద్ ఇస్లాం నేతృత్వంలో ప్రారంభమైన నిరసనలు దేశవ్యాప్తంగా తిరుగుబాటుగా మారింది. ఆందోళనలతో దేశవ్యాప్తంగా చెలరేగిన హింసాత్మక ఘటనల్లో వెయ్యిమందికి పైగా మరణించారు. దీంతో షేక్ హసీనా గతేడాది ఆగస్టులో భారత్‌కు పారిపోయారు. అనంతరం నోబెల్ బహుమతి గ్రహీత ముహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం కొలువుతీరిన సంగతి తెలిసిందే. నహిద్ ఇస్లాం ఈ ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుగా ఉన్నారు. కొత్తగా ఏర్పడనున్న రాజకీయ పార్టీకి కన్వీనర్‌గా నహిద్ ఇస్లాం బాధ్యతలు చేపట్టనున్నట్లు పేరు వెల్లడించేందుకు ఇష్టపడని వర్గాలు తెలిపాయి. నూతన పార్టీకి నాయకత్వం వహించడంపై దృష్టిసారించేందుకు నహిద్ ఇస్లాం తాత్కాలిక ప్రభుత్వ సలహాదారు పదవికి సైతం రాజీనామా చేయనున్నారని పేర్కొన్నాయి. యువకుల నేతృత్వంలోని పార్టీ దేశ రాజకీయాల్లో గణనీయమార్పులు తీసుకురాగలదని పలువురు రాజకీయ విశ్లేషకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది చివరినాటికి బంగ్లాదేశ్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని ఇటీవల ముహమ్మద్ యూనస్ ప్రకటించారు. అయితే ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు ఆసక్తి లేదని ప్రకటించారు.

రామేశ్వరంలో మత్స్యకారుల నిరవధిక సమ్మె



చెన్నై : తమిళనాడులోని రామేశ్వరంలో మత్స్యకారులు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. శ్రీలంక నేవీ నిర్బంధంలో ఉన్న మత్స్యకారులను, పడవలను వంటనే విడుదల చేయాలని మత్స్యకారుల సంఘం డిమాండ్ చేస్తోంది. 700కిపైగా బోట్‌లను హార్బర్‌లో నిలిపివేయడంతో రామేశ్వరంలోని ఫిషింగ్ హార్బర్ నిర్మానుష్యంగా మారింది.

శ్రీలంక నేవీ నిర్బంధించిన బందీలను వెంటనే విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానం చేసినట్టు రామేశ్వరం మత్స్యకారుల సంఘం కార్యదర్శి సగాయం పేర్కొన్నారు. మత్స్యకారుల బోట్లను వేలం వేయకుండా చూడాలని కోరారు.గత శనివారం రామేశ్వరం నుంచి 440 బోట్లలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లారు. పాల్క్‌బే సముద్ర ప్రాంతంలో చేపల వేట సాగిస్తుండగా, శ్రీలంక నేవీ అధికారులు పెట్రోలింగ్ బోట్‌లో అక్కడికి చేరుకున్నారు. అంతర్జాతీయ సముద్ర సరిహద్దును దాటారంటూ 5 పడవలను, 32 మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకున్నారు. భారతీయ మత్స్యకారులను శ్రీలంక నేవీ అదుపులోకి తీసుకుంటున్న ఘటనలు పెరగడంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం సంయుక్త కార్యవర్గాన్ని (జెడబ్ల్యుజి) సమావేశపరచాలని విదేశాంగమంత్రి జై శంకరకు రాసిన లేఖలో పేర్కొన్నారు.



అసోం పర్యటనలో మోడీ

గౌహతి : రెండు రోజుల పర్యటన కోసం ప్రధాని మోడీ సోమవారం సాయంత్రం అస్సాంకు చేరుకున్నారు. గౌహతిలోని సారుసజై స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో టీ గిరిజన కమ్యూనిటీకి చెందిన దాదాపు 9 వేల మంది కళాకారులు నిర్వహించిన నృత్య ప్రదర్శన 'ఝుమోయిర్ బినందిని'ను వీక్షించారు. అలాగే స్టేడియంలో ప్రత్యేక వాహనంపై విహరిస్తూ ప్రేక్షకులకు అభివాదం చేస్తూ వారిని పలకరించారు. ఈ తరువాత స్టేడియం నుంచి బయలుదేరి నగరంలోని ఖానాపారా ప్రాంతంలోని వెటర్నరీ కాలేజ్ మైదానంలో రెండు గ్యాలరీల్లో 'ప్రైడ్ ఆఫ్ అసోం' అనే ప్రదర్శనలు ప్రారంభించారు. ఇక్కడ ప్రధాని మోడీ దాదాపు 45 నిమిషాల పాటు గడిపారు. కాగా, ప్రధాని మోడీ అసోంలో రెండు రోజు పర్యటనలో అంటే మంగళవారం 'అడ్వాంటేజ్ అసోం 2.0 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'ను మోడీ ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవంలో పారిశ్రామిక వేత్తలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ, అనిల్ అగర్వాల్, ప్రశాంత్ రుయా, సజ్జన్ జిందాల్, ఇతరులు పాల్గొననున్నారు. రెండు రోజుల పాటు ఈ సమ్మిట్ జరగనుంది. బుధవారం జరిగే ముగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రులు ఎస్ జైశంకర్, జ్యోతిరాదిత్య సింధియా, అశ్విని వైష్ణవ్, సర్బానంద సోనోవాల్, పబిత్రా మార్గెరిటా, నితిన్ గడ్కరీ పాల్గొననున్నారు.

అసోంలో 'జుమ్లా' ఫ్యాక్టరీ : కాంగ్రెస్

అసోంలో 'జుమ్లా' (అబద్ధాల) ఫ్యాక్టరీని ప్రధాని మోడీ స్థాపించారని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. దీనికి ప్రధాన సూత్రధారి బీజేపీలో అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అని తెలిపారు. మోడీ అసోం పర్యటన సందర్భంగా ఖర్గే తన 'ఎక్స్' ఖాతాలో ఈ మేరకు పోస్టు చేశారు. 'బీజేపీ భూ మాఫియా యొక్క అవినీతి, విద్వేషం, దుష్పరిపాలన పరిణామాలను అస్సాం అనుభవిస్తోంది' అని ఖర్గే విమర్శించారు. 'అభివృద్ధి, ఆర్థికంతో పాటు అన్ని విషయాల్లోనూ అసోం వెనుకబడి ఉంది. రాష్ట్రంలోని 3.5 కోట్ల మంది ప్రజలు చాలా ఆగ్రహంతో ఉన్నారు. మోడీ అబద్ధాలు వారి ఆగ్రహన్ని చల్లార్చలేవు. అసోం, ఈశాన్య రాష్ట్రాల్లో మార్పు కచ్చితంగా ఉంది' అని ఖర్గే పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ 'ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ రాష్ట్రంలో అవినీతి సామ్రాజ్యాన్ని నిర్మించారు. ఆయనకు అనేక టీ తోటలు, న్యూస్ పోర్టల్స్, మెక్‌డొనాల్డ్స్ అవుట్‌లెట్లు, అంతర్జాతీయ పాఠశాలలు, అనేక స్థలాలు ఉన్నాయి' అని విమర్శించారు.

ఊబకాయంపై పోరాటం

- మోహన్‌లాల్, శ్రేయా ఘోషల్‌ను మోడీ నామినేట్



న్యూఢిల్లీ : దేశంలో ఊబకాయ సమస్య పెరిగిపోతుందని.. దీనిపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ అన్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే.. వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని ఆయన సూచించారు. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి పది మంది ప్రముఖులను నామినేట్ చేశారు. వారిలో ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్, గాయకురాలు శ్రేయోఘోషల్ కూడా ఉన్నారు. ఆదివారం జరిగిన మన్‌కీబాత్ 119వ ఎపిసోడ్ కార్యక్రమంలో మోడీ ఊబకాయ సమస్య గురించి ప్రస్తావించారు. 'గత కొన్నేళ్లుగా దేశంలో ఊబకాయ సమస్య పెరిగిపోతుంది. ముఖ్యంగా చిన్నారుల్లో ఈ సమస్య పెరిగిపోతోంది. ఈ సమస్యను అధిగమించాలంటే తినే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. గత కొన్నేళ్లుగా ఊబకాయం కేసులు రెట్టింపయ్యాయి. ఈ గణాంకాలు ఆందోళన కలిగిస్తోంది. ప్రతి ఎనిమిది మందిలో ఒక్కరైనా ఊబకాయ సమస్యతో బాధపడుతున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే ప్రతినెలా పదిశాతం వంట నూనె వినియోగాన్ని తగ్గించాలి. ఈ చిన్న మార్పు ప్రజారోగ్యంపై పెద్ద ప్రభావం చూపుతుంది. మీ ఆహారపు అలవాట్లు మిమ్మల్ని ఫిట్‌గా ఉంచుతాయి. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు.. ఆరోగ్యవంతమైన దేశాన్ని నిర్మించేందుకు క్యాంపెయిన్ నిర్వహించాలి' అని ఆయన అన్నారు. కాగా, ఈ క్యాంపెయిన్‌కు ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా, జమ్ము కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, యువ షూటర్ మను బాకర్, వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, ప్రముఖ నటులు దినేశ్‌లాల్ యాదవ్, ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్, మాధవన్, గాయకురాలు శ్రేయా ఘోషల్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి అను ప్రధాని మోడీ నామినేట్ చేశారు. ఈ మేరకు వీరి పేర్లను మోడీ ఎక్స్ పోస్టులో వెల్లడించారు.

కులగణన పట్ల హర్షం

- రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు : మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కులగణన చేసి బీసీ కులాల లెక్కలు తేల్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంజన్ కుమార్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద ఆదర్శనగర్‌లో యాదవ సామాజికవర్గ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ మాట ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కులగణన ప్రక్రియ పూర్తి చేశారని చెప్పారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే కాదన్న వారే మళ్లీ కులగణన తప్పులతడక అంటున్నారనీ, వారి మాటలను నమ్మే వారెవరూ లేరని విమర్శించారు.

యాదవులకిస్తే సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గెలిచేది

గత ఎంపీ ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్ సభ సీటు యాదవులకు కేటాయిస్తే కాంగ్రెస్ అభ్యర్థి గెలిచేవారని అంజన్ కుమార్ యాదవ్ చెప్పారు. యాదవులకు టికెట్ ఇవ్వకుండా పార్టీలోని కొందరు అడ్డు తగిలారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి భజనపరులు ఇవ్వలేదని గుర్తు చేశారు. పార్టీలో ఒక సామాజిక వర్గానికి చెందిన వారు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోతే మళ్లీ ఎంపీ టికెట్లు తెచ్చుకుని పోటీ చేస్తున్నారనీ, అదే యాదవులకు మాత్రం మళ్లీ టికెట్లు ఇవ్వడం లేదని తెలిపారు. యాదవ సామాజిక వర్గాన్ని చిన్నచూపు చూసినా, పార్టీలో ప్రాధాన్యత ఇవ్వకపోయినా ఊరుకునేది లేదన్నారు.

తగిన జాగ్రత్తలు తీసుకోలేదు

- అందుకే ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం : మాజీమంత్రి జి.జగదీశ్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోనందునే ఎస్‌-ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్ రెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ లింగయ్య యాదవ్ ,మాజీ ఎమ్మెల్యేలు ఎస్.భాస్కర్ రావు, కె.భూపాల్ రెడ్డి, బీఆర్‌ఎస్ నేత జి .దేవీ ప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డికి కార్మికుల ప్రాణాల కన్నా ఎన్నికల ప్రచారమే ముఖ్యమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులకు ఫొటోలు దిగడంలో ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలపై లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని చెబుతున్నారే తప్ప అసలు వాస్తవాలు వెల్లడించడం లేదని తప్పుపట్టారు. ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టు ఒక కుట్ర అనీ, నల్లగొండ ప్రజలకు కష్టా నీళ్లు రాకుండా చేయాలని సమైక్య పాలకులు చేపట్టిన ప్రాజెక్టు అని విమర్శించారు. నల్లగొండ కాంగ్రెస్ నేతలు నోరు మూసుకోవడం వల్లే ఈ ప్రాజెక్టు మళ్లీ తెరపైకి వచ్చిందని తెలిపారు. జాతీయ ,అంతర్జాతీయ నిపుణులతో మాట్లాడి కార్మికుల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అమానవీయ ప్రవర్తనకుగానూ కార్మికులకు క్షమాపణ చెప్పాలన్నారు.

ప్రజా గొంతుక మొహమ్మద్ ముస్తాక్ అలీ

- మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించండి : ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా గొంతుకగా నిలిచిన మొహమ్మద్ ముస్తాక్ అలీని కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలను విస్మరించి కాంగ్రెస్, బీజేపీలు రెడ్డి సామాజిక వర్గానికే పెద్ద పీట వేయడం దుర్మార్గమని విమర్శించారు. అలీని గెలిపిస్తే శాసనమండలిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం గళమెత్తుతారని సుధాకర్ తెలిపారు.

నేడు లాసెట్ నోటిఫికేషన్ విడుదల


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ నోటిఫికేషన్ మంగళవారం విడుదల కానుంది. ఈ మేరకు లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లాసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తుల సమర్పణకు ఏప్రిల్ 15వ తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. ఆలస్య రుసుంతో మే 25 వరకు దరఖఖాస్తుల సమర్పించేందుకు అవకాశముందని తెలిపారు. జూన్ ఆరో తేదీన లాసెట్ రాతపరీక్షలుంటాయని వివరించారు.

క్యాన్సర్ రోగుల్లో అకాల మరణాలు

ప్రతి ఐదుగురిలో ముగ్గురిది ఇదే పరిస్థితి

- మహిళల్లో వేగంగా పెరుగుతున్న తీరు
- తాజా అధ్యయనం వెల్లడి
- హెచ్చరిస్తున్న వైద్యులు



న్యూఢిల్లీ : భారత్‌ను భయపెట్టిస్తున్న వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. ఇది దేశంలో ఎంతో మందిని పట్టి పీడిస్తున్నది. ఇప్పుడు క్యాన్సర్ బాధితుల్లో అకాల మరణాల కలవరపెడుతున్నాయి. వ్యాధిని గుర్తించిన తర్వాత ప్రతి ఐదుగురిలో ముగ్గురు అకాల మరణం చెందుతున్నారు. తాజా అధ్యయనం ఈ విషయం గురించి హెచ్చరిస్తున్నది. దేశంలోనే అత్యున్నత ఆరోగ్య పరిశోధన ఏజెన్సీ అయిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)లోని శాస్త్రవేత్తలు అధ్యయనాన్ని నిర్వహించారు. గ్లోబల్ క్యాన్సర్ అబ్జర్వేటరీ అంచనాలను ఉపయోగించి విశ్లేషించారు.

వీటి కారణంగానే..

దీని ప్రకారం.. దేశంలో అకాల మరణాల శాతాన్ని 64.8 శాతంగా గుర్తించారు. స్త్రీలు ఎదుర్కొంటున్న అసమాన క్యాన్సర్ మరణాల భారాన్ని కూడా ఈ అధ్యయనం వివరించింది. మహిళల్లో క్యాన్సర్ మరణాలు వేగంగా పెరుగుతున్నాయని హెచ్చరించింది. మహిళల్లో క్యాన్సర్ మరణాలు ఏడాదికి 1.2 శాతం నుంచి 4 శాతం మధ్య ఉంటే.. పురుషుల విషయంలో ఇది 1.2 శాతం నుంచి 2.4 శాతం మధ్య ఉన్నది. వ్యాధిని ఆలస్యంగా గుర్తించటం, సకాలంలో తగిన చికిత్సను పొందటంలో సవాళ్ల వంటి విషయాలను భారత్‌లో ఎక్కువ క్యాన్సర్ మరణాల రేట్లు సంభవించటానికి గల కారణాలుగా వైద్యులు చెప్తున్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ అంకాలజీ అధ్యక్షులు, ఆంకోసర్జన్ రాజేంద్ర తోప్రానీ ఇదే విషయాన్ని వెల్లడించారు. గ్లోబల్ క్యాన్సర్ అబ్జర్వేటరీ సమాచారం ప్రకారం.. భారత్‌లో క్యాన్సర్‌తో అకాల మరణాలు 2000 ఏడాదిలో 4.90 లక్షలుగా ఉంటే.. అది 2022 నాటికి 9.17 లక్షలకు ఎగబాకింది. అంటే, 87 శాతం పెరుగుదల నమోదైంది.

మహిళల్లో రొమ్ము క్యాన్సర్.. పురుషుల్లో ఓరల్ క్యాన్సర్

ఇక మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ఇప్పటికీ ప్రబలంగానే ఉన్నది. అన్ని కొత్త కేసుల్లో దీని వాటా 13.8 శాతంగా ఉన్నది. ఇక ఓరల్ (10.3 శాతం), గర్భాశయ (9.2 శాతం), శ్వాసకోశ (5.8 శాతం), అన్నవాహిక (ఐదు శాతం), పెద్దపేగు (ఐదు శాతం) క్యాన్సర్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక పురుషుల్లో ఓరల్ క్యాన్సర్ అధికంగా ఉన్నది. అన్ని కొత్త కేసులలో దీని వాటా 15.6 శాతంగా ఉన్నది. తర్వాతి స్థానాల్లో శ్వాసకోశ (8.5 శాతం), అన్నవాహిక (6.6 శాతం), పెద్ద పేగు(6.3 శాతం) క్యాన్సర్‌లు ఉన్నాయి.

ఆ రెండింటితో మరణాల రేటు ఎక్కువ

శ్వాసకోశ, అన్నవాహిక క్యాన్సర్ల మరణాల రేటు ఎక్కువగా ఉన్నది. 100 కొత్త రోగ నిర్ధారణలలో దాదాపు 93 మరణాలు వీటి ద్వారా కావటం ఆందోళనకరం. భారత్‌లో పెరుగుతున్న క్యాన్సర్ ముప్పును తగ్గించటానికి లక్షిత జోక్యాలు, వ్యూహాలు అవసరమని అధ్యయనాలు నొక్కి చెప్తున్నాయని అధ్యయనానికి నేతృత్వం వహించిన, ఐసీఎంఆర్‌లో గైనకాలజిస్ట్, ప్రివెంటివ్ ఆంకాలజిస్ట్ అయిన కవిత ధనశేఖరన్ తెలిపారు. అంతర్జాతీయ మెడికల్ జర్నల్ అయిన ది లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్ ఈస్ట్ ఏసియాలో ఈ అధ్యయన సమాచారాన్ని ప్రచురించారు.

చిన్నారుల్లో లుకేమియా

చిన్నారుల్లో లుకేమియా కలవరపె డుతున్నది. వీరిలో 41 శాతం కేసులు దీనికి సంబంధించినవే కావటం గమనార్హం. ఆ తర్వాతి స్థానాల్లో బ్రెయిన్ క్యాన్సర్ (13.6 శాతం), నాన్-హాడ్కిన్స్ లింఫోమా (6.4 శాతం) లు ఉన్నాయి. బాలురలో మరణాలకు లుకేమియా ప్రధాన కారణంగా ఉన్నది. 43 శాతం మరణాలు దీని ద్వారానే కావటం ఆందోళనకరం. ఇక బాలికల్లో ఇది 38 శాతంగా ఉన్నది. తర్వాతి స్థానంలో ఉన్న బ్రెయిన్ క్యాన్సర్ బాలురలో 16 శాతం, బాలికల్లో 17 శాతం మరణాలకు కారణమవుతున్నది. మధ్య వయస్కుల్లో 7.04 లక్షల మంది కొత్త క్యాన్సర్ రోగులుంటే.. మరణాలు 4.84 లక్షలుగా ఉన్నాయి. వృద్ధుల్లో కొత్త క్యాన్సర్ కేసుల సంఖ్య 3.13 లక్షలుంటే.. మరణాలు 2.35 లక్షలు కావటం గమనార్హం. ఇక భారత్‌లో వృద్ధుల సంఖ్య పెరుగనున్న తరుణంలో రాబోయే రెండు దశాబ్దాల్లో క్యాన్సర్ మరణాలు ఏడాదికి రెండు శాతం పాయింట్లు పెరగొచ్చని విశ్లేషణలు చెప్తున్నాయి.



సైలెన్స్ పీరియడ్

నేటి నుంచి నిలిచిపోనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార మైకులు

- బల్క్ ఎస్ఎంఎస్‌లు, ఎగ్జిట్ పోల్స్ కూడా నిషేధమే..!
- పోలింగ్ పూర్తయ్యే వరకూ 144 సెక్షన్
- రెండ్రోజులూ మద్యం, కల్లు దుకాణాలకూ తాళమే..

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

సుమారు నెల రోజులకుపైగా హోరెత్తిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నేటితో ముగియనుంది. ఉమ్మడి కరీంనగర్- ఆదిలాబాద్- మెదక్-నిజామాబాద్ పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ, ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికల ప్రచారం, మోగిన మైక్‌లు, లౌడ్ స్పీకర్లు నేటి ఉదయం నుంచే బంద్ కాబోతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ ప్రచారాన్ని నిలిపివేయాల్సిందిగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో 48గంటలపాటు నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్) కొనసాగనుంది. మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి ఈనెల 27వ తేదీ సాయంత్రం వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు, సమావేశాలకు బ్రేక్ పడింది. మరోవైపు పోలింగ్ పూర్తయ్యే వరకు ఆయా జిల్లాల్లో 144 సెక్షన్ అమలు చేయనున్న అధికారులు.. ఈ 48గంటల్లో ఎలాంటి అభ్యంతరకరమైన, రాజకీయ పరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు పంపకూడదని ఆదేశాలు వచ్చాయి. సెక్షన్ 126(1)(బి) ఆర్పీ యాక్ట్ 1951 ప్రకారం ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ నిషేధాన్ని విధించారు. (బల్క్ ఎస్ఎంఎస్‌లు)గానీ, ఎగ్జిట్‌పోల్స్ ప్రకటన చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు కల్లు దుకాణాలు, మద్యం షాపులు సైతం మూసే యాలని ఎక్సైజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజున ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవును ప్రభుత్వం ప్రకటించింది. ఏడు ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు వర్తించనుంది.

పోలింగ్ రోజున ప్రత్యేక సాధారణ సెలవు

గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్నవారు తమ ఓటు వినియోగించుకునేందుకు ఈ ప్రత్యేక సెలవు వర్తిస్తుందని కరీంనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర అన్ని ప్రయివేటు మేనేజ్‌మెంట్, అథారిటీలలో పని చేస్తూ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు కూడా వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతి, వెసులుబాట్లు ఇవ్వాలని సూచించారు. ప్రయివేటు ఉద్యోగులు, కార్మికులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు షిఫ్టుల సర్దుబాటు, డ్యూటీ గంటల తగ్గింపు, ఆలస్యంగా హాజరు కావడానికి అనుమతి వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

సైలెన్స్ పీరియడ్‌లో నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే విచారణ జరిపి ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తనా నియమావళి 1961 ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఈ సైలెన్స్ పీరియడ్ సమయంలో జిల్లాయేతర వ్యక్తులు ఎవరూ ఆయా జిల్లాల్లో ఉండకూడదు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్‌టి, ఎంసీసీ, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలి. కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జింగ్‌ల్లో విస్తృతంగా తనిఖీ చేపట్టాలి.

బీఆర్‌ఎస్ నిర్లక్ష్యంతోనే ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం

- కాంగ్రెస్ సీనియర్ అధికార ప్రతినిధి దేవని సతీష్ మాదిగ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించినందునే ఎస్‌-ఎల్‌బీసీ ప్రమాదం చోటు చేసుకుందని కాంగ్రెస్ సీనియర్ అధికార ప్రతినిధి దేవని సతీష్ మాదిగ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాజెక్టులను 2014లో అధికారంలోకి వచ్చాక కేసీఆర్ సర్కారు నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. పాత ప్రాజెక్టులను పక్కన పెట్టి పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం తదితర కొత్త ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చారని గుర్తుచేశారు. ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులో 90 శాతం టన్నెల్ పనులను 2014కు ముందే కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందనీ, అయితే మిగిలిన 10 శాతం పనులను కూడా కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేయలేదని వివరించారు. పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో టన్నెల్‌లో నీటి ఊట కారణంగా రాళ్లు లూజ్ అయినట్టు సతీష్ మాదిగ చెప్పారు. ప్రస్తుతం మిగిలిన పనులను ప్రారంభించడంతో లూజైన రాళ్లు కూలి పడి అందులో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ సర్కారు సర్వశక్తులు ఒడ్డి వారి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు.

నేడు ఈసెట్ నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీటెక్, బీఈ, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం నిర్వహించే ఈసెట్ నోటిఫికేషన్ మంగళవారం విడుదల కానుంది. ఈ మేరకు ఈసెట్ కన్వీనర్ పి చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల మూడో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు ఏప్రిల్ 19వ తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. దరఖాస్తు ఫీజు ఎస్సీ,ఎస్టీ, వికలాంగుల అభ్యర్థులు రూ.500, ఇతరులు రూ.900 చెల్లించాలని కోరారు. ఈసెట్ రాతపరీక్ష మే 12న ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.



ఫర్నీచర్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

- పక్క అపార్ట్‌మెంట్‌లోకి వ్యాపించిన మంటలు
- భయంతో పరుగులు తీసిన జనం
- మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది
- రంగారెడ్డి జిల్లా నార్సింగిలో ఘటన

నవతెలంగాణ-గండిపేట్

రంగారెడ్డి జిల్లా నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఫర్నీచర్ గోదాంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గోదాంలోని ఫర్నీచర్ మొత్తం కాలిపోయింది. మంటలు పక్క అపార్ట్‌మెంట్‌లోకి వ్యాపించడంతో ప్రజలు భయంతో బయటకు పరుగులు తీశారు. నార్సింగి సీఐ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ మున్సిపాలిటీ పుపాల్‌గూడలో జనవాసాల మధ్య ఓ బడా వ్యాపారి ఫర్నీచర్ గోదాం నిర్వహిస్తున్నాడు. అందులో ఇతర సామగ్రితో పాటు ఫర్నీచర్‌ను తయారు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు గోదాంలో షార్ట్ సర్క్యూట్ సంభవించి, మంటలు వ్యాపించాయి. దాంతో గోదాంలోని సామగ్రి మొత్తం కాలిపోయింది. పరిసర ప్రాంతం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. మంటలు పక్క అపార్ట్‌మెంట్‌లోకి వ్యాపించాయి. గమనించిన అపార్ట్‌మెంట్‌వాసులు భయంతో బయటకు పరుగులు తీశారు. అపార్ట్‌మెంట్‌లో ఉన్న కార్లు, ఏసీలు, ఫ్రిజ్‌లు, డ్రయినేజీ సిస్టం మొత్తం పగిలిపోయింది. స్థానికులు వెంటనే పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. నార్సింగి సీఐ హరికృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రెండు ఫైర్ ఇంజన్లు మంటలను అదుపు చేశాయి. గోదాంలో ఫర్నిచర్ మొత్తం కాలిపోవడంతో లక్షల్లో ఆస్తి నష్టం జరిగినట్టు గోదాం నిర్వహకులు తెలిపారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫర్నీచర్ గోదాం, వెల్డింగ్ షాపులను తొలగించాలి : స్థానికులు

అపార్ట్‌మెంట్స్ పక్కన ఫర్నీచర్, వెల్డింగ్ షాపులు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేశారని, వాటిని వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఇదే విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. గోదాంలో జరిగే ప్రమాదాలతో తమకు ప్రాణ హాని ఉందన్నారు. ఇలాంటి ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని జనవాసాల్లో ఉన్న గోదాంలను తొలగించాలని స్థానికులు కోరారు.



ప్రతిపక్ష హోదా కోసం..

- గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించిన వైసిపి
- పోడియం ముట్టడి .. నినాదాల హోరు

అమరావతి : తమను ప్రతిపక్ష పార్టీగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గవర్నర్ ప్రసంగం సందర్భంగా వైసిపి సభ్యులు అసెంబ్లీలో ఆందోళనకు దిగారు. 'వుయ్‌వాంట్' జస్టిస్ అంటూ ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. వైసిపి సభ్యుల నినాదాలకు ప్రతిగా అధికారపక్ష సభ్యులూ నినాదాలకు దిగడంతో గవర్నర్ ప్రసంగం కొద్దిసేపు గందరగోళంగా మారింది. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సోమవారం ఉదయం గవర్నర్ మహ్మద్ అబ్దుల్ నజీర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగాన్ని ప్రారంభిం చిన వెంటనే వైసిపి సభ్యులు తమను ప్రతిపక్షంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు ప్రారంభించారు. ప్లకార్డులతో పోడియం వద్దకు వెళ్లారు. జగన్‌మోహన్‌రెడ్డి, బొత్స సత్యనారాయణ మినహా మిగిలిన సభ్యులందరూ పోడియం ముందుకు వెళ్లారు, టిడిపి సభ్యులు కూడా వారికి ప్రతిగా వ్యాఖ్యానాలు చేయడంతోపాటు గవర్నర్ ప్రసంగానికి మద్దతుగా బల్లలు చరచడం మొదలుపెట్టారు. ఒకవైపు నినాదాలు, మరోవైపు అరుపులు కేకలతో సభ గందరగోళంగా తయారైంది. కొద్దిసేపు నినాదాలు చేసిన అనంతరం వైసిపి సభ్యులు సభనుండి బయటకు వెళ్లిపోయారు.

ప్రజల్లోకి వెళ్తాం : బొత్స

గవర్నర్ ప్రసంగాన్ని బాయ్‌కాట్ చేసిన అనంతరం మీడియాతో మాట్లాడిన శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రభుత్వ వైఖరికి నిరసనగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి పోరాడుతామని, ప్రభుత్వ వైఫల్యాలను చొక్కా పట్టుకు నిలదీస్తామని అన్నారు తమకు . ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి ప్రభుత్వం భయపడుతోందని పేర్కొన్నారు.

ఏపిలో తాలిబన్ పాలన : పెద్దిరెడ్డి

కూటమి ప్రభుత్వం వైసిపి లక్ష్యంగా చేసుకుని పెద్దఎత్తున విష ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రంలో టిడిపి తాలిబన్ పాలన చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వంలో విధ్వంసం జరిగిందని చెబుతున్నారే తప్ప ప్రజలకు వారేం చేస్తారో చెప్పడం లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రజల గళాన్ని వినిపిస్తామనే కక్షతోనే తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

ఏపీలో రైతులు కష్టాల్లో లేరట..!

ఉభయసభలనుద్దేశించి చేసిన ప్రసంగంలో గవర్నర్ • జాప్యాలు, నష్టాల వ్యవస్థను మార్చామని ప్రకటన

సమృద్ధి, సమ్మిళితత్వం,సుస్థిరత ద్వారా స్వర్ణాంధ్ర • పి4 తోనే ముందడుగు



అమరావతి : రాష్ట్రంలోనే కాదు... దేశ వ్యాప్తంగా రైతులు ఎలా ఉన్నారో, వారి స్థితి గతులేంటో ప్రజలందరికీ తెలుసు. కానీ, ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దీనికి భిన్నమైన ప్రకటన చేశారు. 'నేడు ఏ రైతు కూడా కష్టాల్లో లేరు.' అని ఆయన చెప్పారు. అంతే కాదు. ఆ విషయం చెప్పడానికి తాము గర్విస్తున్నామని కూడా ఆయన అన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ సభల సభ్యులనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ చేసిన ప్రసంగంలో ఈ అంశం చోటుచేసుకుంది. గత ప్రభుత్వ విధానాలను ఆయన చాలాసార్లు ప్రస్తావించారు. 'గత పాలనా వ్యవస్థ దుష్పరిపాలన కారణంగా విధానాలు ఎంతో మంది రైతులను నిరాశ అంచులకు నెట్టాయి. నేడు, ఏ రైతు కూడా కష్టాల్లో లేరని చెప్పడానికి మేము గర్విస్తున్నాము.' అని ఆయన అన్నారు. 'గత ఐదేళ్ళుగా రైతులను ప్రభావితం చేస్తున్న జాప్యాలు, నష్టాలతో రాష్ట్రంలో వరి సేకరణ గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంది. నేడు మేము, ఈ విధానాలను మార్చాము' అని ఆయన ప్రకటించారు. సమీకృత, సాంకేతిక ఆధారిత చొరవలపై దృష్టి సారించడం ద్వారా ఆర్థికంగా లాభదాయకంగా ఉండేలా చూస్తున్నట్లు తెలిపారు. సమృద్ధి, సమ్మిళితత్వం, సుస్థిరతతో స్వర్ణాంధ్రను సాధించడం తమ ప్రభుత్వ లక్ష్యమని గవర్నర్ చెప్పారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' అనే నినాదంపై దృష్టి సారిస్తూ ఉపాధికల్పనకు బలమైన పునాది వేయడమే తమ ప్రభుత్వ సమగ్ర విధానమని చెప్పారు. ఆత్మగౌరవం ఆర్థిక స్థిరత్వం రెండింటినీ తీసుకొచ్చే వృత్తులకు విలువ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ-ప్రైవేటు- ప్రజల భాగస్వామ్యం అనే ఒక వినూత్న పి-4 విధానానికి నాందిపలుకుతున్నట్లు గవర్నర్ తెలిపారు.అట్టడుగున ఉన్న 20శాతం మందికి మద్దతివ్వడానికి అగ్రస్థాయిలోని 10శాతం మందిని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తులు, కుటుంబాలకు సాధికారిత కల్పించడం ద్వారా రోబోయో కొన్నేళ్లలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం స్వర్ణాంధ్ర లక్ష్యమని గవర్నర్ తెలిపారు. ఎస్‌సిల వర్గీకరణ కోసం, వర్గీకరణ విధి విధానాలను నిర్ణయించడానికి ఏక సభ్య సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు గవర్నర్ తెలిపారు. 4.93లక్షల మంది బలహీన, గిరిజన సమూహాలతో కలుపుకుని 27.39 లక్షల షెడ్యూల్డ్ తెగల సమగ్ర సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పిల్లల చదువులుతల్లులకు భారం కాకూడదనే "తల్లికి వందనం' పథకాన్ని అమలు చేయబోతున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. కానీ ఎప్పటి నుండి అమలుచేస్తారన్నది చెప్పలేదు.

2027 నాటికి పోలవరం:

పోలవరం ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించామని 2027 నాటికి దాని వాస్తవ స్థాయికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని గవర్నర్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం అథారిటీ సలహాలను భేఖాతరు చేస్తూ నిర్మాణం కీలక దశలో ఉన్నప్పుడుఅమలు చేసే ఏజెన్సీని ఆకస్మికంగా మార్చడం వల్ల డయాఫ్రమ్ వాల్ కూలిపోవడానికి దారి తీసి, ప్రాజెక్టు జాప్యం కావడానికి కారణమైందన్నారు. లింక్ కాల్వ ద్వారా గోదావరి నది నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు నీటిని బదిలీ చేస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే రాయలసీమను నీటిసురక్షిత ప్రాంతంగా మార్చుతుందన్నారు. రాష్ట్ర గవర్నర్‌కు అసెంబ్లీ ప్రాంగణంలో మండలి ఛైర్మన్ మోషే, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సిఎం చంద్రబాబునాయుడు స్వాగతం చెప్పారు. గవర్నర్‌కు ఇరువైపులా మండలి ఛైర్మన్, స్పీకర్ కూర్చున్నారు.

బిజినెస్

ఎల్ఐసీకి రూ.57 కోట్ల జీఎస్టీ నోటీసు



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టుగా ఉన్న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)కు జీఎస్టీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆర్థిక సంవత్సరం 2020-21గాను అదనపు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)కి సంబంధించి రూ.57.2 కోట్ల డిమాండ్ నోటీసును ఇచ్చారు. ఇది ఢిల్లీ అసిస్టెంట్ కమీషనర్ నుండి తమకు అందిందని ఎల్ఐసీ సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఇందులో రూ.31.04 కోట్ల జీఎస్టీ, రూ.23.13 కోట్ల వడ్డీ, రూ.3.10 కోట్ల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశాలు అందినట్లు వెల్లడించింది. ఇది తమ ఫైనాన్సియల్, నిర్వహణ, ఇతర కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపబోదని ఎల్ఐసీ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎల్ఐసీ కొత్త వ్యాపార ప్రీమియం 21 శాతం వృద్ధితో రూ.43,075 కోట్లకు చేరింది. సంస్థ నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.11,056 కోట్లుగా నమోదయ్యాయి. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా తగ్గి రూ.2,01,994 కోట్లుగా చోటు చేసుకుంది. సోమవారం బీఎస్ఈలో ఎల్ఐసీ షేర్ 0.69 శాతం తగ్గి రూ.775.90 వద్ద ముగిసింది.

బంధన్ ఎంఎఫ్ నుంచి కొత్త ఫండ్



హైదరాబాద్: బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా బంధన్ క్రిసిల్-ఐబీఎక్స్ 10:90 గిల్ట్ ప్లస్ ఎస్‌డిఎల్ ఇండెక్స్-డిసెంబర్ 2029 ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది ఫిబ్రవరి 25న తెరుబడుతుందని ఆ సంస్థ తెలిపింది. ఇందులోని నిధులను 90 శాతం రాష్ట్ర ప్రభుత్వ రుణాలకు, 10 శాతం ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెట్టనున్నట్టు వెల్లడించింది. ఈ ఎన్‌ఎఫ్ఓను మార్చి 05న మూసివేయనున్నట్టు పేర్కొంది.

ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఈలు వెన్నెముక

- యాక్సిస్ బ్యాంక్ ఈడీ మునీష్ సర్దా



నవతెలంగాణ- హైదరాబాద్

దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఈలు వెన్నెముఖలాంటివని యాక్సిస్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనీష్ సర్దా అన్నారు. హైదరాబాద్‌లో యాక్సిస్ బ్యాంక్ తమ నాలెడ్జ్ షేరింగ్ సెమినార్ 'ఎవాల్వ్' 9వ ఎడిషన్‌ను నిర్వహించింది. ఇందులో మునీష్ మాట్లాడుతూ..జీడీపీలో ఎంఎస్ఎంఈలు దాదాపు మూడో వంతు వాటాను కలిగి ఉండి.. కోట్లాది మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయన్నారు. ఈ సంస్థలకు మద్దతును అందించడం ద్వారా సాధికారత కలిగించాలని తమ బ్యాంక్ నిర్దేశించుకుందన్నారు. చిన్న పరిశ్రమలకు బాసటగా నిలుస్తున్నందుకు, వాటి ఆకాంక్షల సాధనలో తోడ్పాటు అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. దీనికి యాక్సిస్ బ్యాంక్ ఉన్నతాధికారులు విజయ్ శెట్టి, నూతి చక్రవర్తి, సైబల్ సేన్ గుప్తా హాజరయ్యారు. ఎంఎస్ఎంఈలకు చెందిన 100 మంది పైగా ఔత్సాహికవేత్తలు పాల్గొన్నారు.

బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్చలు వేగవంతం

- కేంద్రమంత్రి పీయూశ్ గోయల్

న్యూఢిల్లీ : బ్రిటన్‌తో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై చర్చలను వేగవంతం చేస్తున్నట్టు వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్ అన్నారు. ఇందుకోసం చర్చలను తిరిగి ప్రారంభించాలని భారత్, బ్రిటన్ నిర్ణయించుకున్నాయన్నారు. అమెరికా నుంచి పరస్పర దిగుమతి సుంకాల ముప్పు సహా పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితి మధ్య ద్వైపాక్షిక వాణిజ్య చర్చల పున్ణప్రారంభం చాలా కీలకమని భారత్ భావిస్తోందన్నారు. 2024 సెప్టెంబర్‌తో ముగిసిన 12 నెలల కాలంలో ఇరు దేశాల మధ్య 52 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది.

ఎఫ్ఎంసీజీలో 245 కోట్ల ఉత్పత్తుల సరఫరా : ఉడాన్

న్యూఢిల్లీ : గడిచిన ఏడాదిలో తమ సంస్థ ఎఫ్ఎంసీజీ వ్యాపారంలో ఏకంగా 245 కోట్ల ఉత్పత్తులను సరఫరా చేసినట్టు ఇబి2బి పోర్టల్ ఉడాన్ వెల్లడించింది. అన్ని ఆహార ఉత్పత్తులు కలిపి 7 లక్షల మెట్రిక్ టన్నులు మించి పోయాయని పేర్కొంది. ఈ విభాగంలో 65 శాతం వృద్ధిని సాధించినట్టు తెలిపింది. 2024లో 8.58 కోట్ల ఆర్డర్లను నమోదు చేసినట్టు వెల్లడించింది. బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతాలో అధిక వృద్ధిని సాధించినట్టు తెలిపింది.

అమెజాన్ ప్రైమ్ డెలివరీల్లో 26 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : గతేడాది 2024లో అదే రోజు లేదా తర్వాత రోజు 41 కోట్ల వస్తువులను డెలివరీ చేసినట్లు ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ ఇండియా తెలిపింది. అమెజాన్ ప్రైమ్ సభ్యులు అత్యంత వేగవంతమైన డెలివరీలను పొందారని పేర్కొంది. ఏడాదికేడాదితో పోల్చితే 26 శాతం పెరుగుదల చోటు చేసుకున్నట్లు వెల్లడించింది. ప్రైమ్ సభ్యత్వంతో సగటున రూ.3300 ఆదా చేసుకున్నారని పేర్కొంది. ప్రైమ్ పిన్‌కోడ్స్‌ను 11 శాతం పెంచినట్టు పేర్కొంది.

గ్లోబ్ టెక్స్‌టైల్స్ లాభాల్లో 54 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో తమ సంస్థ నికర లాభాలు 53.7 శాతం పెరిగి రూ.2.91 కోట్లుగా నమోదైనట్టు గ్లోబ్ టెక్స్‌టైల్ ఇండియా లిమిటెడ్ తెలిపింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1.89 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో రూ.103.67 కోట్ల రెవెన్యూ ఆర్జించగా.. గడిచిన క్యూ3లో 46.2 శాతం పెరుగుదలతో రూ.151.59 కోట్ల రెవెన్యూ ప్రకటించింది. తమ వాటాదారులకు దీర్ఘకాలిక విలువను అందించడానికి మరియు లాభాలను పెంచే, స్థిరమైన విజయాన్ని నిర్ధారించే కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని గ్లోబ్ టెక్స్‌టైల్స్ సీఎండీ భావిక్ పారిఖ్ పేర్కొన్నారు.

ఏసీబీకి చిక్కిన బిల్‌కలెక్టర్

- రూ.45వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత
- రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలో ఘటన



నవతెలంగాణ-రాజేంద్రనగర్

ఆస్తి పన్ను విషయంలో రూ.45 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రాజేంద్రనగర్ సర్కిల్ బిల్ కలెక్టర్ మధు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డిన ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లిలోని ఓ కంపెనీ ఆస్తి పన్ను విషయంలో రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీలో బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న మధును కంపెనీ యజమాని కలవగా.. లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. అతను వెంటనే ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం కంపెనీ యజమాని బిల్ కలెక్టర్ మధుకు రూ.45 వేలు ఇస్తుండగా.. అక్కడే కాపు కాసిన ఏసీబీ అధికారులు అతన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతనితోపాటు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మరో వ్యక్తిని కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంలో రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్‌ని కూడా ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. నిందితులను ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సామాజికంగానూ మహిళలు ఎదగాలి

- మహిళా సంక్షేమంలో సీఆర్‌పీల పాత్ర కీలకం
- స్త్రీ, శిశ సంక్షేమ శాఖ మంత్రి సీతక్క





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళలు ఆర్థికంగానే కాదు..సామాజికంగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) స్పష్టం చేశారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్‌డీ సమావేశమందిరంలో సీఆర్‌పీల సమావేశం జరిగింది. సీఆర్‌పీలను ఉద్దేశించి మంత్రి సీతక్క ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. గ్రామ సమాఖ్యల అనుభవాలు తెలుసు కోవడంతోపాటు వారి పనితీరును మెరుగుపరిచేందుకు 15 రోజులపాటు గ్రామాల్లో సీఆర్‌పీలు శిక్షణ ఇవ్వడాన్ని అభినందించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ వికారాబాద్ జిల్లాలకు చెందిన పలు గ్రామాల్లో గ్రామసమాఖ్యల నుంచి సీఆర్‌పీలు సేకరించిన సమాచారం, వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఆర్‌పీలకు దిశానిర్దేశం చేశారు. మహిళా సంఘాల పనితీరు మెరుగుపరిచేందుకు, మహిళలందరినీ కోటీశ్వరులుగా చేయడానికి ముఖ్యమంత్రి తీసుకున్న ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సీఆర్పీలు గ్రామాల్లో పరిశీలించిన అంశాలను సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌కు నివేదించాలని సూచించారు.

మహిళల ఆర్థికమైన అవసరాలే కాకుండా సామాజిక అవసరాలను సీఆర్‌పీలు గుర్తించడాన్ని అభినందించారు. మహిళలందరూ ఒకరికొకరు అండగా, కలిసికట్టుగా ఉండే విధంగా మనం ఎటువంటి చర్యలు తీసుకోవాలో సీఆర్పీలు నివేదించాలన్నారు. ప్రతి మహిళ తన కుటుంబం బాగుతో పాటు సామాజికంగా ఎదిగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు.

క్షేత్రస్థాయిలో సీఆర్‌పీల శిక్షణ

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, వికారాబాద్ జిల్లాలో మొత్తం 205 మంది మహిళా సీఆర్‌పీలు 37 మండలాల్లో 136 గ్రామ సంఘాలను పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల, గ్రామ సంఘం పనితీరును పరిశీలించి అవసరమైన అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు పుస్తక నిర్వహణపై అవగాహన కల్పించారు. ఫిబ్రవరి 7 నుంచి 23వ తారీకు వరకు సీఆర్‌పీలు గ్రామాల్లో బస చేసి మహిళా సంఘాల బలోపేతంపై సలహాలు సూచనలు చేశారు. ఆయా గ్రామాల్లో గ్రామ సంఘాల ఆర్థిక బలోపేతం తో పాటు మహిళా సాధికారత కోసం చేపట్టాల్సిన సామాజిక కార్యక్రమాలు, ఆరోగ్య విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు

రాష్ట్రంతో కలిసి పనిచేస్తాం

- క్వీన్స్‌ల్యాండ్ మంత్రి రోస్‌బేట్స్ : సింగరేణి భవన్‌లో ఆమెతో భేటీ అయిన డిప్యూటీ సీఎం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మైనింగ్ రంగంలో తెలంగాణ రాష్ట్రంతో కలిసి పనిచేస్తామని క్వీన్స్‌ల్యాండ్ (ఆస్ట్రేలియా) ఆర్థిక, వాణిజ్య, ఉపాధి, శిక్షణా శాఖల మంత్రి శ్రీమతి రోస్ బేట్స్ చెప్పారు. ఈ మేరకు ఆమె సింగరేణి కాలరీస్‌తో 11 రకాల కీలక ఖనిజాల ఉత్పత్తికి పరస్పర సహకారం అందించుకొనే ఒప్పందాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో చేసుకున్నారు. సింగరేణి భవన్‌లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. తెలంగాణ-క్వీన్స్‌ల్యాండ్‌ల సంయుక్త మైనింగ్‌కు సింగరేణి నోడల్ ఏజెన్సీ వ్యవహరిస్తుంది. అధికోత్పత్తి, ఆధునిక రక్షణ సాంకేతికత, శిక్షణలో క్వీన్స్ ల్యాండ్ సహకారం అందిస్తుంది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ దేశంలో విద్యుత్ వాహనాలు, సోలార్ విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ సిస్టంలకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆ రంగానికి అవసరమైన వనడియం, కోబాల్ట్, ఇండియం, క్రోమియం, టైటానియం వంటి 11 రకాల కీలక ఖనిజాల ఉత్పత్తి అత్యవసరమని తెలిపారు. ఇప్పటివరకు ఈ ఖనిజాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామనీ, వీటి వెలికితీతలో క్వీన్స్‌ల్యాండ్ ప్రభుత్వానికి విశేష అనుభవం ఉన్నదని వివరించారు. త్వరలోనే పలు అంశాలపై అధ్యయనం, అవగాహన కోసం సింగరేణి బృందాన్ని క్వీన్స్‌ల్యాండ్‌కు పంపుతామన్నారు. క్వీన్స్‌ల్యాండ్ మంత్రి రోస్ బేట్స్ మాట్లాడుతూ మార్చి నెలలో తమవద్ద జరిగే వ్యాపార సదస్సుకు రావాలని ఆహ్వానం పలికారు. సమావేశంలో సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరామ్, క్వీన్స్‌ల్యాండ్ ప్రభుత్వ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మైఖేల్ నెగెర విచ్, వాణిజ్య పెట్టుబడుల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జస్టిన్ మెక్ గోవాన్, సౌత్ ఏషియా పెట్టుబడుల సీనియర్ కమిషనర్ అభినవ్ భాటియా, సౌత్ ఏషియా సీనియర్ డైరెక్టర్ మునిష్ కౌశల్, సింగరేణి డైరెక్టర్లు డీ సత్యనారాయణరావు, ఎల్‌వీ సూర్యనారాయణ, కోల్ మూమెంట్ ఈడీ కే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం

- మెదక్-ఎల్లారెడ్డి రహదారి విస్తరణకు ఓకే
- ములుగు సబ్‌స్టేషన్, పెద్దగట్టు ఎత్తిపోతల పథకాలకు అనుమతి : రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు సమావేశంలో మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వన్య ప్రాణుల సంరక్షణకు తమ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నొక్కి చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు(ఎస్‌బీడబ్ల్యూఎల్) ఎనిమిదో సమావేశం జరిగింది. అటవీ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు, అనుమతులు, తదితర అంశాలపై అందులో చర్చించారు. పోచారం వన్యప్రాణుల అభయారణ్యం నుంచి వెళ్లే మెదక్-ఎల్లారెడ్డి రహదారి విస్తరణ పనులు, ములుగులో 11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు, నాగార్జున సాగర్ డివిజన్‌లో పెద్దగట్టు ఎత్తిపోతల పథకాలకు ఎస్‌బీడబ్ల్యూఎల్ అనుమతులు మంజూరు చేసింది. అటవీప్రాంతాల్లో ఓఎఫ్‌సీ లైన్ల ఏర్పాట్ల ప్రతిపాదనలపై చర్చించింది. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో భారీ వాహనాల రాకపోకలపై నిషేధాన్ని తొలగించే అంశాలను పరిశీలించింది. యానిమల్ పాసేజ్‌ల మార్పుల కోసం 18 ప్రతిపాదనలు, మొబైల్ టవర్ల కోసం 13 ప్రతిపాదనలపై జాతీయ వన్యప్రాణుల బోర్డుకు సమర్పించేందుకు చేయాల్సిన సవరణలపై చర్చ జరిగింది. ఏడో సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై బోర్డు సమీక్షించింది. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడారు. మీ-సేవ ద్వారా యానిమల్-మ్యాన్ కాంఫ్లిక్ట్ బాధితులకు పరిహారం చెల్లించడానికి అవసరమైన కార్పస్ నిధి గురించి అధికారులతో చర్చించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ల నుంచి 1,088 కుటుంబాల పునరావాసం వివరాల పై అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ ఆధారిత ఎకో టూరిజం ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా జంతు ప్రదర్శనశాలలు, జాతీయ పార్కులు, పట్టణ పార్కుల అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక సేంద్రీయ చెట్లను ప్రాధాన్యతగా పెంచి, సహజ అటవీ వ్యవస్థను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ, జీవవైవిధ్య నిర్వహణ మెరుగుపరిచే దిశగా నిపుణుల సూచనలను స్వాగతించారు. జాతీయ వన్యప్రాణుల సంరక్షణ మండలి సమీక్షకు పంపిన రాష్ట్రంలోని ముఖ్య ప్రాజెక్టులపై ఆరా తీశారు. సమావేశంలో ప్రధాన అటవీ సంరక్షణాధికారి డోబ్రియల్ మాట్లాడుతూ 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు ఏర్పాటు తప్పనిసరిగా జరగాల్సిన అంశమని వివరించారు. జీవో నెంబర్ 52 ద్వారా 02.12.2024 నాడు అధికారికంగా ఎస్‌బీడబ్ల్యూఎల్ ఏర్పాటు చేశామని వివరించారు. పలు కీలక సూచనలు చేసిన బోర్డు సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రామ్‌దాస్ నాయక్, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి నదీమ్, పీసీసీఎఫ్ డోబ్రియాల్, అటవీ శాఖ ఉన్నతాధికారులు ఎలు సింగ్, మంత్రి పీఎస్ ఎమ్ఎస్ఎస్. సోమరాజు, ఓఎస్‌డీ ఎన్.సుమంత్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలి

- ఆన్ లైన్ నమోదులో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నెంబర్ వన్ :జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు అధ్యక్షతన న్యారి న్యాయ్ సమ్మేళన్ సమ్మేళన్ సభ్యత్వాలు ఒక లక్షా 4 వేల మంది పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్కాలంబ సభ్యత్వం ఎక్కువగా చేసినందుకు సునీతారావును, మహిళా కాంగ్రెస్, రాష్ట్ర, జిల్లాల నాయకులను అభినందించి సన్మానించారు. ప్రతి జిల్లాలో సభ్యత్వాలను ఎక్కువగా చేసిన వారిని గుర్తించి వారికి నాప్కిన్ శానిటరీ మిషన్లు ఇస్తున్నట్టు తెలిపారు. తద్వారా కొంత మందికి ఉపాధి కల్పిస్తున్నట్టు చెప్పారు. రాబోయే స్థానిక సంస్థ ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే దిశగా పనిచేయాలని అల్కాలంబ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వంలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని చెప్పారు. సునీతారావు టీంకు నామినేటెడ్ పదవులు వచ్చే విధంగా మాట్లాడుతానని చెప్పారు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో 5 లక్షల మంది నమోదు చేసుకోగా, అందులో తెలంగాణ నుంచే ఒక లక్షా 4 వేల మంది రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో మహిళలు కీలక పాత్ర పోషించారనీ, ప్రభుత్వం అధికంలోకి వచ్చాక రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నదనీ, ఇప్పటికే మూడు హామీలు నెరవేర్చగా, నాలుగో హామీ త్వరలోనే అమలవుతుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో తొలి మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటు కానున్నదని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి పోలింగ్ బూతులో ముగ్గురు మహిళలను నియమించడానికి మహిళా కాంగ్రెస్ సిద్ధమవుతోందని తెలిపారు. మహిళా కాంగ్రెస్ ప్రకటించిన పూర్తిస్థాయి కార్యవర్గంలో అన్ని జిల్లా అధ్యక్షులు ఉన్నారని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా మహిళలను ఢిల్లీలో ప్రియాంక గాంధీ సత్కరిస్తారని చెప్పారు. ఇప్పటివరకు తెలంగాణ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు మాత్రమేననీ, కాంగ్రెస్‌లో ఒకరికి ఒక పదవి అనే సిద్ధాంతం ఉందని, పార్టీ, ప్రభుత్వంలో మహిళా కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌తో మాట్లాడుతానని చెప్పారు.

మీసేవా ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించండి

- మూడేండ్లుగా వార్షిక బోనస్ లేదు
- మార్చి ఒకటో తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తాం : మీసేవా ఈఎస్‌డీ కమిషనర్ టి.రవికిరణ్‌కు మీసేవా ఎంప్లాయిస్ యూనియన్ వినతి

8 నెలలుగా పెండింగ్‌లో పీఎఫ్ బకాయిలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మీసేవా ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలని తెలంగాణ మీసేవ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్, అధ్యక్షులు ఆర్.సురేశ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మార్చిఒకటో తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో మీసేవా ఈఎస్‌డీ కమిషనర్ టి.రవికిరణ్‌కు ఆ యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, సురేశ్‌తో పాటు పద్మశ్రీ, కవిత బాలరాజు, ప్రకాశ్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. మీసేవా ఉద్యోగులకు కనీస వేతనాలివ్వాలని కమిషనర్‌ను కోరారు. 8 నెలలుగా పీఎఫ్ బకాయిలు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మూడేండ్లుగా వార్షిక బోనస్ చెల్లించని విషయాన్ని ప్రస్తావించారు. హెల్త్ ఇన్సూరెన్స్ స్కీముకు సంబంధించి విధివిధానాలు రూపొందించడంలో చాలా ఆలస్యం జరుగుతున్నదని వాపోయారు. ఇప్పటికే పలుమార్లు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి సమస్యల్ని తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోవడం, పెరుగుతున్న పని భారంతో మీ-సేవా సిబ్బంది తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారని చెప్పారు. కనీస వేతనం ఇవ్వడంతో పాటు 8 నెలల పీఎఫ్ బకాయిలను క్లియర్ చేయాలని కోరారు. వార్షిక బోనస్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పనిభారం పెరుగుతున్న రీత్యా అదనపు సిబ్బందిని నియమించాలనీ, మీసేవా కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పించాలని విన్నవించారు. రూ.10 లక్షలు హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ వెంటనే అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సెప్టెంబర్‌లో మీ-సేవా ఉద్యోగులకు ఇచ్చిన పే-స్లిప్‌లో పీఎఫ్ (యుఏయన్) నెంబర్ వివరాలు పేర్కొలేదన్నారు. అక్టోబర్ 19న డ్యూటీలో ఉంటూ యాక్సిడెంట్‌కు గురైన సంతోష్ నగర్ మీ-సేవా సెంటర్ మేనేజర్ స్వరూపకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

త్వరలో సెర్ప్‌లో స్థానచలనం

పదేండ్ల తర్వాత బదిలీలు

- ప్రమోషన్లకూ రంగం సిద్ధం
- ఏప్రిల్ నెలలో కొత్త స్థానాల్లో విధులు!
- 3974 మంది సిబ్బందికి లబ్ధిచేకూరే అవకాశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్)లో స్థానచలనానికి రంగం సిద్ధమైంది. బదిలీలు, ప్రమోషన్లతో ఆ సంస్థ సిబ్బంది కల త్వరలో నెరవేరబోతున్నది. ఏప్రిల్ నెలలో కొత్తస్థానాల్లో ఉద్యోగంలో చేరేలా ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఆ దిశగా రాష్ట్ర సర్కారు ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సెర్ప్‌పై రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర సర్కారు కూడా మహిళలు సొంత కాళ్లపై ఎదిగేలా, ఆర్థికంగా నిలదొక్కుకునేలా కార్యక్రమాలు తీసుకుని ముందుకెళ్తున్నది.కానీ, సెర్ప్‌లో సుదీర్ఘకాలంగా ఒకే స్థానంలో 3974 మంది పనిచేస్తున్న కారణంగా సిబ్బందిలో కాస్త స్తబ్దత నెలకొందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఆ దిశలో భాగంగానే సెర్ప్‌ను ప్రక్షాళన చేయాలని నిర్ణయం తీసుకున్నది. పూర్తి స్థాయి బదిలీలతో మరిన్ని మంచి ఫలితాలు సాధించవచ్చనే అంచనాకు వచ్చింది. పదేండ్లుగా తమకు బదిలీలు లేవనీ, ఐదేండ్లుగా తమకు ప్రమోషన్లు లేవని సెర్ప్ ఉద్యోగులు పదేపదే మంత్రి సీతక్క దృష్టికి తీసుకురావడాన్ని పరిగణనలోకి తీసుకున్నది. పదేండ్లు ఒకే చోట అధికారులు పనిచేయడమేంటి? ఎందుకు బదిలీల ప్రక్రియ చేపట్టలేదనే విషయంపై సీతక్క ఉన్నతాధికారుల నుంచి ఆరా తీశారు. బదిలీల ప్రక్రియ మొదలు పెట్టాలని సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే సెర్ప్ ఉన్నతాధికారులు బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. తమకు సబంధించిన వివరాల్లో ఏమైనా తప్పులుంటే గ్రీవెన్స్‌లో అర్జీలు పెట్టుకునే అవకాశాన్ని సెర్ప్ కల్పించింది. ఆ వివరాలతో కూడిన రిపోర్టును మార్చి 15వ తేదీకల్లా ఫైనల్ చేయాలని సీతక్క ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ఆర్థిక సంవత్సరం ఆధారంగా సెర్ప్ ఉద్యోగుల పనివిధానం ఉన్న నేపథ్యంలో ఏప్రిల్ మొదటి వారంలో, లేదంటే రెండో వారానికి కల్లా ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలనే ఆలోచనలో సెర్ప్ ఉన్నతాధికారులున్నారు. ఇదే జరిగితే సెర్ప్‌లో రికార్డు అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, సూపరిండెండెంట్లు, ఎమ్‌పీడీఓలు తమ సీనియారిటీ, విద్యార్హతలను బట్టి పైక్యాడర్ ప్రమోషన్లు పొందే అవకాశముంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ మొదలు కానున్నది. దీనిపై సెర్ప్ ఉద్యోగులు కూడా హర్షం చేస్తున్నారు. 'పదేండ్ల నుంచి ఒకే దగ్గర పనిచేయడం కష్టంతో కూడున్న పనే. బదిలీలు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాం. గత ప్రభుత్వానికి ఎన్నోసార్లు వినతులిచ్చినా పట్టించుకోలేదు. సీతక్క మంత్రి అయ్యాక కూడా పదేపదే కలిసి ఒత్తిడి తెచ్చాం. బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ మొదలు పెట్టడం సంతోషంగా ఉంది' అని సెర్ప్ ఉద్యోగ సంఘాల జేఏసీ నేత కుంట గంగాధర్ సంతోషాన్ని పంచుకున్నారు.

ఎలక్షన్ కోడ్ మాకేనా...మీకు లేదా?

- ఆర్టీసీ యాజమాన్యంపై కార్మిక సంఘాలు ఫైర్
- లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎలక్షన్ కోడ్ ఆర్టీసీ కార్మిక సంఘాలకేనా...యాజమాన్యానికి లేదా అని టీజీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ప్రశ్నించింది. ఔట్‌సోర్సింగ్ పేరుతో నాలుగునెలల కాలానికి డ్రైవర్ల నియామకానికి సంస్థ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ ఎలా ఉత్తర్వులు జారీ చేశారని ప్రశ్నించారు. దానితోపాటే వరంగల్, హైదరాబాద్‌లో బదిలీలు కూడా చేపట్టారనీ, వారికి ఎలక్షన్ కోడ్ ఎందుకు వర్తించలేదని అడిగారు. దీనిపై కార్మిక శాఖ కమిషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ కార్మికుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం జనవరి 27న సమ్మె నోటీసు ఇస్తే, ఫిబ్రవరి 7వ తేదీ కార్మిక శాఖ కమిషనర్ జేఏసీ నేతలతో పాటు యాజమాన్యాన్ని చర్చలకు పిలిచారని తెలిపారు. ఆ చర్చల్లో యాజమాన్యం పాల్గొనకుండా, ఎలక్షన్ కోడ్‌ను సాకుగా చూపిందని గుర్తుచేశారు. దీనిపై ఫిబ్రవరి 10న కార్మికశాఖ అధికారులు తిరిగి ఆర్టీసీ యాజమాన్యంతో చర్చల్ని మార్చి 8 వతేదీకి వాయిదా వేశారని వివరించారు. తాజాగా ఆర్టీసీ యాజమాన్యం ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘించి, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన డ్రైవర్ల నియామకాలు చేపట్టిందనీ, సంస్థలో బదిలీలు కూడా చేపట్టిందన్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఈ చర్యలు ఎలా చేపడతారని ప్రశ్నిస్తూ, కార్మికశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దాన్ని పరిశీలించిన ఆయన ఆర్టీసీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. లేబర్ కమిషనర్‌ను కలిసిని వారిలో జేఏసీ చైర్మెన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మెన్ ఎన్ కమలాకర్‌గౌడ్, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బీడీ రావు, ఎమ్ఏ మాజీద్ తదితరులు ఉన్నారు.

వికలాంగుల హక్కుల పరిరక్షణకు పోరాటం

- స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు సాధించాలి : ఎన్పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్



నవతెలంగాణ-కాప్రా

వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం, స్థానిక సంస్థల ఎన్నికల్లో, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్స్ సాధన కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ఎన్పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం వికలాంగులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎన్పీఆర్డీ 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని భాస్కరరావు భవనం వద్ద సోమవారం జిల్లా అధ్యక్షులు కె.చంద్రమోహన్ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కె.వెంకట్ మాట్లాడుతూ.. ఎన్పీఆర్డీ ఏర్పడినప్పటి నుంచి వికలాంగుల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. మహిళా వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడంలో కేంద్రం నిర్లక్ష్యం చేసిందని, బడ్జెట్‌ను సవరించి 5 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కడలి నాగలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ పరిశ్రమలలో వికలాంగులకు 5శాతం ఉద్యోగాలు కేటాయించాలని కోరారు. ఎన్పీఆర్డీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుల్తాన్ రమేష్, జిల్లా కమిటీ సభ్యులు షైన్ బేగం, జి.బాలయ్య, ఎస్.రమేష్, శివ, నాగరాజు, కృష్ణ, మోజెశ్, శ్రీను, ఈశ్వర్ పాల్గొన్నారు.